
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం
వెల: ₹ 7.00
సంపుటి: 18
సంచిక: 126
SUNDAY Special
ఆదివారం 27-7-2025
SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'మహిళల ముఖాలు కళకళలాడుతూ ఉంటేనే కుటుంబమూ, సమాజమూ బాగుంటాయి '



రూ. 22,845 కోట్లు కొల్లగొట్టారు!

సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయి. నేరగాళ్లు 2024లో భారతీయుల నుంచి రూ.22,845.73 కోట్లు కొల్లగొట్టారు. అంతకుముందు ఏడాదితో పోలిస్తే ఇది దాదాపు మూడు రెట్లు ఎక్కువ.

- వివరాలు 3లో



భారత్ 174/2

ఇంగ్లండ్‌తో నాలుగో టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 2 వికెట్ల నష్టానికి 174 పరుగులు చేసింది. రాహుల్, గిల్ అర్ధ సెంచరీలు సాధించారు. జట్టు మరో 137 పరుగులు వెనుకబడి ఉంది. నేడు మ్యాచ్‌కు చివరి రోజు.

- వివరాలు 12లో



అత్యంత విశ్వసనీయ నేత మోదీ

భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ, విశ్వసనీయత కలిగిన నాయకుడిగా మరోసారి ఘనత సాధించారు.

- వివరాలు 6లో▶



శత్రు పీచమణచే రుద్ర!

మన సైన్యం అత్యాధునిక పూర్తిస్థాయి బ్రిగేడ్‌లను ఏర్పాటు చేసుకోనుంది. ఈ దళాలకు 'రుద్ర'గా నామకరణం చేశారు.

- వివరాలు 6లో▶



కాపాడాల్సిన వారే కర్కశంగా..

అశక్తురాలైన యువతిపై అంబులెన్స్ డ్రైవర్, టెక్నీషియన్.. వాహనంలోనే సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు.

- వివరాలు 6లో▶




భూమి నుంచే శాటిలైట్లపై దాడి!

విదేశీ, శత్రు ఉపగ్రహాలను అంతరిక్షంలోనే తునాతునకలు చేసే శక్తివంతమైన లేజర్ కాంతి ఆయుధాన్ని చైనా అభివృద్ధి చేస్తోంది.

- వివరాలు 6లో▶

అప్పుల్లో ఏపీ టాప్

ఈ ఆర్థిక సంవత్సరం తొలి 3 నెలల్లోనే రూ. 37 వేల కోట్ల అప్పు



- ఏడాది లక్ష్యంలో మొదటి త్రైమాసికంలో 46.40% తీసుకున్న ఏపీ
- ఏ రాష్ట్రం అందుకోలేనంత వేగంగా రుణాల సేకరణ
- రూ.20 వేల కోట్ల పైచిలుకు అప్పులతో తెలంగాణ
- ఏడాది లక్ష్యంలో 37.52 శాతం రుణాల సేకరణ... కాగ్ గణాంకాల వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లో అప్పుల జాతర అప్రతిహతంగా కొనసాగుతోంది. 2025–26 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో దేశంలోని పలు రాష్ట్రాల ఆదాయ, వ్యయాలకు సంబంధించి కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) వెల్లడించిన నివేదికల ప్రకారం బహిరంగ మార్కెట్‌లో రుణాలను ఏపీనే అందరికంటే ఎక్కువగా తీసుకుంటోంది. అప్పుల్లో ఏపీ రూ. 37 వేల కోట్లతో మొదటిస్థానంలో ఉండగా.. రెండో స్థానంలో ఉన్న మధ్యప్రదేశ్ రూ. 26 వేల కోట్లే తీసుకోవడం గమనార్హం. కాగ్ ఇటీవల మిగతా 10వ పేజీలో ▶

ఏపీ ఆర్థిక పరిస్థితి దారుణం



- గతేడాది తొలి త్రైమాసికంతో పోల్చితే మరింత దిగజారుడు
- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆందోళన

10 లో

తెలంగాణలో కొంచెం అటూ ఇటుగా...

తెలంగాణ ఖజానా గత ఆర్థిక సంవత్సరం తరహాలోనే ముందుకెళ్తోంది. గత వార్షిక బడ్జెట్ లక్ష్యంలో తొలి మూడు నెలల్లో 17.80 శాతం నిధులు సమకూరగా, ఈసారి కొంచెం ఎక్కువగా 20.19 శాతం అంటే రూ.57,449 కోట్లు సమకూరాయి. పన్ను ఆదాయంలో గత ఏడాది లక్ష్యంతో పోలిస్తే తొలి మూడు నెలల్లో 16.10 శాతం రాగా, ఈ ఏడాది 35,721.80 కోట్లు (16.20%) వచ్చాయి. జీఎస్టీ, స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, అమ్మకపు పన్ను, ఎక్సైజ్, పన్నేతర ఆదాయం...ఇలా అన్ని పద్దుల్లోనూ కొంచెం అటూ ఇటుగా 2024–25 ఆర్థిక సంవత్సరం మాదిరిగానే నిధులు సమకూరుతున్నాయని కాగ్ గణాంకాలు చెబుతున్నాయి. అయితే, అప్పులు మాత్రం ఈసారి ఒకింత ఎక్కువగానే కనిపిస్తున్నాయి. గత ఏడాది పెట్టుకున్న రుణలక్ష్యంలో తొలి మూడు నెలల్లో 26.74 శాతం సమకూర్చుకోగా, ఈసారి మాత్రం 37.52 శాతం రుణాలను తీసేసుకోవడం గమనార్హం. ఇక, ఆదాయ రాబడులు ఎలా ఉన్నాయో వ్యయ లెక్కలు కూడా అలాగే ఉన్నాయని కాగ్ లెక్కలు చెబుతున్నాయి. అన్ని పద్దుల కింద కలిపి మొత్తం రూ. 57,499. 58 కోట్లు రాగా.. రూ.52,559.96 కోట్లు ఖర్చయ్యాయి. రూ.10,582.85 కోట్లు రెవెన్యూ లోటు నమోదు కాగా, రూ.20,266.09 కోట్ల ద్రవ్య లోటుతో తెలంగాణ ఖజానా ఉందని కాగ్ గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

రైతుకు 2 బస్తాలే..

యూరియా సరఫరాలో రేషన్ విధానం

- ఆధార్‌కార్డు, భూమి పాస్‌బుక్ ఆధారంగా పంపిణీ
- యూరియా కేటాయింపులో కోత పెట్టిన కేంద్రం
- నాలుగు నెలల్లో 2.37 లక్షల టన్నుల కోత
- ఈ నెలలో కూడా 44 వేల మెట్రిక్ టన్నులు కట్
- యూరియా కోసం కేంద్రానికి మంత్రి తుమ్మల మరో లేఖ



సాక్షి, హైదరాబాద్: ఎంతో విరామం తర్వాత కురుస్తున్న వర్షాలను చూసి వ్యవసాయ పనులను వేగవంతం చేయాలని ఆశపడిన రైతులను యూరియా కొరత తీవ్ర నిరాశలోకి నెడుతోంది. యూరియాను రాష్ట్రంలోని అన్ని వ్యవసాయ సహకార సొసైటీ (పీఏసీఎస్)లలో అందుబాటులో ఉంచినప్పటికీ, రైతులకు రేషన్ విధానంలో సరఫరా చేస్తున్నారు. ఆధార్ కార్డు, భూమి పట్టా పాస్ పుస్తకాలను బట్టి ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున పంపిణీ చేస్తున్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సొంత జిల్లా ఖమ్మంలో ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌బుక్‌తో లింకై ఉన్న ఫోన్ నంబర్‌కు ఓటీపీ పంపి నిర్ధారణ చేసుకొని మరీ యూరియా అందజేస్తున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వచ్చింది వచ్చినట్లు సరఫరా..

కేంద్ర ప్రభుత్వం వానాకాలం కోసం రాష్ట్రానికి 9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించింది. ఇందులో ఏప్రిల్ నుంచి జూలై వరకు 6.60 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రావలసి ఉండగా, ఇప్పటివరకు 4.23 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేశారు. అంటే 36 శాతం లోటు ఉంది. ఈ నేపథ్యంలో గోదాములకు వచ్చిన స్టాక్ ఎప్పటికప్పుడు ఊడ్చినట్లు అయిపోతోంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 1.6 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని మార్క్‌ఫెడ్ ఎండీ శ్రీనివాస్ రెడ్డి 'సాక్షి'కి తెలిపారు. ఈ స్టాక్ ప్రస్తుత నెల వరకు కష్టంగా సరిపోయే అవకాశం ఉంది. ఆగస్టులో అత్యధికంగా 3.50 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని వ్యవసాయ శాఖ చెబుతోంది. జూలై కోటాలో లోటుగా ఉన్న 44 వేల మెట్రిక్ టన్నులతోపాటు ఆగస్టులో రావలసిన 1.20 లక్షల మెట్రిక్ టన్నులను వెంటనే విడుదల చేస్తే ఇప్పుడున్న స్టాక్‌తో బొటాబొటిగా సరిపుచ్చుకునే అవకాశం ఉంది. లేదంటే తీవ్ర సమస్యలు ఎదురవుతాయని

మిగతా 3వ పేజీలో ▶

న్యూస్‌రీల్

పంద్రాగస్టున సమరశంఖం



ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 15న సమర శంఖం పూరిస్తామని తెలంగాణ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి (టీఈజేఏసీ) చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు చెప్పారు.

- వివరాలు 2లో▶

కొత్త రేషన్ కార్డులకు ఆరోగ్యశ్రీ



కొత్త రేషన్‌కార్డులు పొందిన వారందరికీ ఆరోగ్యశ్రీ సదుపాయం కల్పించనున్నారు. రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ద్వారా రేషన్ కార్డుల్లో పేరున్న వ్యక్తులందరికీ ఆరోగ్యశ్రీని వర్తింపజేస్తున్న విషయం తెలిసిందే.

- వివరాలు 5లో▶

వెయ్యి స్కూళ్లలో ప్రీ ప్రైమరీ



ప్రభుత్వ పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక (ప్రీ ప్రైమరీ) విద్య అమలుకు మార్గం సుగమమైంది. 210 పాఠశాలల్లో ఇప్పటికే ప్రీ ప్రైమరీ తరగతులను నిర్వహించాలని సూచించగా.. తాజాగా మరో 790 పాఠశాలల్లోనూ తరగతులు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది.

- వివరాలు 14లో▶

భర్తవి కాకుండా ఇతరుల శుక్ర కణాలతో 'సృష్టి'!



భర్త శుక్ర కణాలతో కాకుండా వేరే వ్యక్తి శుక్ర కణాలతో సంతానం కలిగించిన సికింద్రాబాద్‌లోని సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. డాక్టర్ నమ్రతను అదుపులోకి తీసుకున్నారు.

- వివరాలు 14లో▶



ఐసీఎఫ్ఏఐ ఫౌండేషన్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్, కేపిటల్ ఫౌండేషన్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రచయిత, ఆర్థిక నిపుణుడు మోహన్ గురుస్వామికి 'ఎస్.జైపాల్‌రెడ్డి డెమోక్రసీ అవార్డు'ను ప్రదానం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

జైపాల్‌రెడ్డి చొరవతోనే ప్రత్యేక రాష్ట్రం: సీఎం రేవంత్ 2 లో

తెలంగాణలో కుమ్మక్కు రాజకీయం



- అటు సీఎం రేవంత్ బావమరిదికి కేంద్రంలో రూ.1,137 కోట్ల అమృత్ కాంట్రాక్టు
- ఇటు కాంగ్రెస్ ప్రభుత్వంలో బీజేపీ ఎంపీకి రూ.1,660 కోట్ల కాంట్రాక్టు
- సీఎం రేవంత్, సీఎం రమేశ్ కుంభకోణాలపై ఉమ్మడిగా చర్చించేందుకు సిద్ధం

'ఎక్స్' వేదికగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

సాక్షి, హైదరాబాద్ /సాక్షి, అనకాపల్లి: 'దేశంలో ఎక్కడా లేని రీతిలో దిక్కుమాలిన కుమ్మక్కు రాజకీయం తెలంగాణలో జరుగుతోంది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బావమరిదికి రూ.1,137 కోట్ల అమృత్ కాంట్రాక్టు ఇచ్చింది. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బీజేపీ ఎంపీ సీఎం రమేశ్‌కు రూ.1,660 కోట్ల రోడ్డు కాంట్రాక్టు కట్టబెట్టింది. ఇంతకంటే దిగజారుడు రాజకీయం..దౌర్భాగ్యపు దందా మరొకటి ఉండదు. ఎక్కడా లేని ఫ్యూచర్‌సిటీ రోడ్డు కోసం రూ.1,660 కోట్ల కాంట్రాక్టు విడ్డూరం'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఇద్దరూ కలిసి చేసిన దొంగతనం బయటపడటంతో ప్రజల దృష్టిని మళ్లించేందుకు పనికిమాలిన కథలు చెబుతున్నారని 'ఎక్స్'వేదికగా కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములు తాకట్టు పెట్టి రూ.10 వేల కోట్లు దోచుకునే లుచ్చా పనికి మిగతా 3వ పేజీలో ▶

కోర్టును బురిడీ కొట్టించేందుకే బాబు కుట్ర

- చంద్రబాబు ప్రభుత్వ సరికొత్త కుతంత్రం
- ఈ నేపథ్యంలోనే వికాట్ కంపెనీలో సిట్ సోదాల డ్రామా
- లేని కుంభకోణాన్ని ఉన్నట్లు చూపించలేక చేతులెత్తేసిన సిట్
- బెడిసికొడుతున్న ఎల్లో మీడియా కట్టుకథలు
- 3.58 లక్షల జీబీల డేటా ధ్వంసం అంటూ దుష్ప్రచారం
- సమాచార హక్కు చట్టం ద్వారా కూటమి కుట్రలు భగ్నం
- వికాట్ డైరెక్టర్ బాలాజీ గోవిందప్పకు బెయిల్‌కు మార్గం సుగమం... అందుకే సోదాల పేరుతో సరికొత్త పన్నాగం

10 లో



గోవిందప్ప నివాసంలో సిట్ అధికారులు

ఇదండీ సంగతి



ఇప్పుడు ఆ దేశం మీద కూడా సుంకాలు విధిస్తారన్నమాట!



అపురూపాలు.. మళ్లీ మన చెంతకు!

ఇతర దేశాల్లో ఉండిపోయిన మన పురాతన వస్తువులను రప్పించడంలో కేంద్ర ప్రభుత్వం వేగం పెంచింది. వివిధ దేశాలకు తరలి వెళ్లిన ఈ అపురూప కళాఖండాలను.. సాంస్కృతిక వారసత్వాన్ని తిరిగి పొందడం, జాతీయ గౌరవాన్ని పునరుద్ధరించడం లక్ష్యంగా తిరిగి సొంతం చేసుకుంటోంది. వీటిని సంరక్షించడం, అధ్యయనం కోసం అందుబాటులో ఉండేలా చూడటం కూడా ఈ ప్రయత్నాల ముఖ్య ఉద్దేశం.

\- సాక్షి, స్పెషల్ డెస్క్

- సీతా రామ లక్ష్మణుల లోహ విగ్రహాలను 2020లో యూకే నుంచి తెప్పించగలిగాం.
- సంతానలక్ష్మి విగ్రహం... 2021లో అమెరికా నుంచి తిరిగి రప్పించగలిగాం.
- మహిషాసుర మర్దిని విగ్రహాన్ని 2022లో ఆస్ట్రేలియా నుంచి తీసుకురాగలిగాం.
- సూర్య భగవానుడి రాతి శిల్పాన్ని 2023లో యూకే నుంచి సాధించుకున్నాం.

13 మాత్రమే.. 2021 అక్టోబరులో అమెరికా సుమారు 15 మిలియన్ డాలర్ల విలువైన 248 అపురూప దేవీ దేవతా విగ్రహాలు, పురాతన వస్తువులను మనదేశానికి అప్పగించింది. 'ప్రపంచంలోని ఏ మ్యూజియం కూడా అనైతికంగా సంపాదించిన ఏ కళాకృతిని కలిగి ఉండకూడదు. స్వాతంత్ర్యానికి ముందు, తరువాత విగ్రహాలను మన దేశం నుంచి అనైతిక రీతిలో బయటకు తీసుకెళ్లారు. ప్రపంచవ్యాప్తంగా భారత ఖ్యాతి పెరుగుతున్నందున వివిధ దేశాలు మన వారసత్వాన్ని తిరిగి ఇవ్వడం ప్రారంభించాయి' అని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. కేంద్ర ప్రభుత్వ చర్యల ఫలితంగా ఆస్ట్రేలియా, కెనడా, ఇటలీ, థాయ్‌లాండ్, యూకే, యూఎస్ఏ నుంచి భారీ ఎత్తున పురాతన వస్తువులను స్వాధీనం చేసుకుంది. 2014 నుంచి ఇప్పటివరకు మొత్తం 640 పురాతన వస్తువులు భారత్‌కు తిరిగి వచ్చాయి. 1947 నుంచి 2014 మధ్య కేవలం 13 పురాతన వస్తువులను మాత్రమే మన దేశం స్వాధీనం చేసుకోగలిగింది.

సాంస్కృతిక వారసత్వాన్ని తిరిగి పొందడం

వలసవాద కాలంలో భారత్ నుంచి అనేక కళాఖండాలు తరలిపోయాయి. తరువాత ప్రపంచవ్యాప్తంగా ఉన్న మ్యూజియాలు, ప్రైవేట్ సేకరణ సంస్థలకు విక్రయం లేదా బహుమతిగా చేరాయి. ఈ వస్తువులను తిరిగి పొందడం జాతీయ గుర్తింపు, గౌరవంగా భారత్ భావిస్తోంది. అలాగే వలసవాద పాలనలో భారతీయ కళాఖండాలను క్రమబద్ధంగా దోచుకోవడం దేశ చరిత్రపై ఒక మచ్చను మిగిల్చింది. ఈ వస్తువులను తిరిగి పొందడం చారిత్రక అన్యాయాలను సరిదిద్దడానికి, ఎదుర్కొన్న సాంస్కృతిక నష్టాలను గుర్తించడానికి సహాయపడుతుంది.

అక్రమ రవాణాను అరికట్టడం

పురాతన వస్తువుల అక్రమ వ్యాపారాన్ని కొందరు లాభదాయకంగా మల్చుకున్నారు. దొంగిలించిన కళాఖండాలను తిరిగి పొందడం, చట్టపరమైన చట్రాలను బలోపేతం చేయడం ద్వారా భారత్ ఈ వ్యాపారంపై ఉక్కుపాదం మోపేందుకు చురుకుగా పనిచేస్తోంది.

సంరక్షణ-పరిశోధన

రికవరీ తరువాత ఈ కళాఖండాలను మ్యూజియాలు, ఇతర సంస్థలలో భద్రపరుస్తున్నారు. అక్కడ వాటిని సంరక్షణ, అధ్యయనంతోపాటు ప్రజల సందర్శన కోసం అందుబాటులో ఉంచుతున్నారు.

అంతర్జాతీయ సహకారం

దొంగతనానికి గురైన కళాఖండాలను దౌత్య మార్గాలు, ఒప్పందాల ద్వారా స్వదేశానికి తిరిగి రప్పించడానికి భారత్ ఇతర దేశాలతో, ముఖ్యంగా అమెరికాతో చురుగ్గా వ్యవహరిస్తోంది.

2020-24 మధ్య భారత్ స్వాధీనం చేసుకున్న పురాతన వస్తువులు	యూఎస్ఏ	ఆస్ట్రేలియా	యూకే	కెనడా	ఇటలీ	థాయ్‌లాండ్
	559	34	14	1	1	1

ఆధారం: ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా

ఇలా.. 2020–24 మధ్య 610 పురాతన వస్తువులను స్వాధీనం చేసుకున్నట్టు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. వీటిలో అమెరికా నుంచి వెనక్కి వచ్చినవే ఎక్కువ కావడం గమనార్హం. సగం వస్తువులను దౌత్య మార్గాల ద్వారా భారత్ తిరిగి అందుకుంది. ఈ భారతీయ కళాఖండాలు, వాటి పునరుద్ధరణ గురించి అవగాహన పెంచడానికి ప్రభుత్వం పలు కార్యక్రమాలు, ప్రదర్శనలు, వర్క్‌షాప్‌లను నిర్వహిస్తోంది. భారత పురావస్తు శాఖ తన అధికార పరిధిలోని రక్షిత స్మారక చిహ్నాలు, ప్రదేశాలు, మ్యూజియాలలో దొంగతనానికి గురైన వస్తువుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు పొందుపరుస్తోంది.

విదేశాల్లోని పురాతన వస్తువుల రికవరీ
ఇటీవలి కాలంలో వేగం పెంచిన భారత్
1947-2014 మధ్య వచ్చినవి కేవలం 13
2020-24లో 610 వస్తువులు స్వాధీనం



క్లుప్తంగా...

కార్గిల్ హీరోకు సీఎం సత్కారం



జాయ్‌దాస్‌గుప్తాకు జ్ఞాపికను అందజేస్తున్న సీఎం రేవంత్, మల్లు రవి

సాక్షి, హైదరాబాద్: కార్గిల్ దివస్ సందర్భంగా కార్గిల్ యుద్ధ యోధుడు, హైదరాబాద్‌కు చెందిన 18 గ్రెనడియర్స్ కల్నల్ జాయ్ దాస్ గుప్తాను సీఎం రేవంత్ రెడ్డి శనివారం తన నివాసంలో సన్మానించారు. పాకిస్తాన్ శత్రు సైన్యం టోలోలింగ్ హిల్స్‌పై నుంచి భారత సైనిక దళాలపై భీకర ఫైరింగ్ చేస్తున్న సమయంలో వారిపై ముప్పేటదాడి జరిపి టోలోలింగ్ హిల్స్‌ను తిరిగి స్వాధీనం చేసుకున్న 18 గ్రెనడియర్స్ దళంలో కల్నల్ జాయ్ దాస్ గుప్తా ఒకరు. ఆయన అందించిన అసాధారణ సేవలకు గాను కేంద్రం సేన మెడల్‌తో సత్కరించింది. ఈ నేపథ్యంలో తన మాతృమూర్తితో సీఎంను కల్నల్ జాయ్ దాస్ కలిశారు. కార్యక్రమంలో ఎంపీ మల్లు రవి పాల్గొన్నారు.

కేన్సర్ రోగులకు విస్తృత సేవలు

- దేశంలో డే కేర్ కేన్సర్ కేంద్రాల విస్తరణ
- ఏపీలో 14, తెలంగాణలో 26 కేంద్రాలకు ఆమోదం

సాక్షి, న్యూఢిల్లీ: కేన్సర్ మహమ్మారి నుంచి రోగులను రక్షించేందుకు విస్తృత సేవలను అందిస్తున్నట్లు కేంద్రం తెలిపింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి.. దేశంలో దాదాపు 200కి పైగా డే కేర్ కేన్సర్ కేంద్రాల స్థాపనకు కేంద్రం ఆమోదం తెలిపినట్లు పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌లో 14, తెలంగాణలో 26 డే కేర్ కేంద్రాల స్థాపన ప్రతిపాదనలను ఆమోదించినట్లు లోక్‌సభ ప్రశ్నోత్తరాల్లో.. ఆ శాఖ సహాయ మంత్రి ప్రతాపరావు జాదవ్ చెప్పారు.రంగారెడ్డి, నల్లగొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్, నిజామాబాద్, మెదక్, మేడ్చల్, ఆదిలాబాద్, సంగారెడ్డి, సూర్యాపేట, మహబూబాబాద్, కొత్తగూడెం, నాగర్‌కర్నూల్, సిద్దిపేట, కామారెడ్డి, వికారాబాద్, వనపర్తి, గద్వాల, భూపాలపల్లి, వనపర్తి, జనగామ, మంచిర్యాల, నారాయణపేట, కుమురంభీమ్ ఆసిఫాబాద్, ములుగు జిల్లాల్లో ఏర్పాటు చేయనున్నారు.

జైపాల్‌రెడ్డి చొరవతోనే ప్రత్యేక రాష్ట్రం

చర్చ లేకుండా బిల్లు ఆమోదం పొందడంలో కీలక పాత్ర

- దేశంలో ఎన్నో సంస్కరణలకు శ్రీకారం చుట్టిన నేత
- 'జైపాల్‌రెడ్డి డెమోక్రసీ అవార్డు' ప్రదానోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఉత్తమ పార్లమెంటేరియన్‌గా దేశ రాజకీయాల్లో బలమైన ముద్ర వేసిన నాయకుడు మాజీ కేంద్ర మంత్రి జైపాల్‌రెడ్డి అని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ఆయన చూపిన చొరవే కారణమని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొనియాడారు. విద్యార్థి నాయకుడిగా, ఎమ్మెల్యే, ఎంపీ, కేంద్రమంత్రిగా వివిధ హోదాల్లో పనిచేసిన జైపాల్‌రెడ్డి దేశంలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారని గుర్తు చేశారు. ఐసీఎఫ్ఏఐ ఫౌండేషన్ ఫర్ హైయ్యర్ ఎడ్యుకేషన్, కేపిటల్ ఫౌండేషన్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లో.. రచయిత, ఆర్థిక నిపుణులు మోహన్ గురుస్వామికి 'ఎస్.జైపాల్‌రెడ్డి డెమోక్రసీ అవార్డు'ను ప్రదానం చేసిన అనంతరం సీఎం ప్రసంగించారు.

తెలంగాణలో పీవీ తర్వాత జైపాల్‌రెడ్డే..

జైపాల్‌రెడ్డి పాత్ర లేకపోతే ఇవాళ ప్రత్యేక రాష్ట్రం వచ్చేదే కాదని రేవంత్‌రెడ్డి చెప్పారు. చర్చ లేకుండానే పార్లమెంటులో తెలంగాణ బిల్లు ఆమోదం పొందేలా ఆయన ప్రత్యేక పాత్ర పోషించారని, జైపాల్‌రెడ్డి చొరవతోనే తెలంగాణ ఏర్పాటు చేశామని సోనియాగాంధీ కూడా ఒక సందర్భంలో తనతో చెప్పారని తెలిపారు. కాంగ్రెస్‌ను వీడినా, తిరిగి కాంగ్రెస్‌లో చేరినా సైద్ధాంతిక విభేదాలే తప్ప.. పదవుల కోసం ఆయన ఎన్నడూ పార్టీలు మారలేదని చెప్పారు. పెట్రోలియం శాఖ మంత్రిగా దేశానికి ఎంతో సేవ చేశారని, సమాచార శాఖ మంత్రిగా ప్రసార భారతి చట్టాన్ని దేశానికి అందించారని గుర్తు చేశారు. పార్లమెంటులో రాణించిన వాజ్‌పేయి మొదలుకుని అనేకమంది మేధావుల్లో ఎవరితోనూ జైపాల్‌రెడ్డికి వ్యక్తిగత వైరం లేదని, చివరి శ్వాస వరకు ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయన కృషి చేశారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తెలంగాణలో పీవీ నరసింహారావు తర్వాత అంత పేరు తెచ్చుకున్న నాయకుడు జైపాల్‌రెడ్డి మాత్రమేనని అన్నారు. దేశ రాజకీయాల్లో జైపాల్‌రెడ్డి ఒక నిలువెత్తు శిఖరం అని, పీవీ, జైపాల్‌రెడ్డి లాంటి వారి స్ఫూర్తి తెలంగాణ రాజకీయాల్లో ఉండాలని చెప్పారు.

ఇప్పుడంతా స్విగ్గీ పాలిటిక్స్

పరిపాలనలో తీసుకురావాల్సిన మార్పులపైనే జైపాల్‌రెడ్డి ఎక్కువ ఆలోచించేవారని, రాజకీయాలలో ధన ప్రవాహం తగ్గించాలని ప్రయత్నించారని రేవంత్ చెప్పారు. అయితే నాటి ఐడియాలజికల్ పాలిటిక్స్ పోయి ఇవాళ స్విగ్గీ పాలిటిక్స్ వచ్చాయని, దేశ రాజకీయాల్లో సైద్ధాంతిక రాజకీయాలు పోయి మేనేజ్‌మెంట్ పాలిటిక్స్ వచ్చాయని వ్యాఖ్యానించారు. కార్యకర్తలు లేని రాజకీయాలు దేశ భవిష్యత్తుకు ప్రమాదకరమని, యూనివర్సిటీల్లో విద్యార్థి రాజకీయాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ సందర్భంగా 'భారత్‌లో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ముందున్న సవాళ్లు'అనే అంశంపై రాజ్యసభ సభ్యుడు శస్మిత్ పాత్రా ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఐసీఎఫ్ఏఐ ఫౌండేషన్ వీసీ ప్రొఫెసర్ ఎల్.ఎస్.గణేశ్, కేపిటల్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ కె.పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురికి అవార్డులను ప్రదానం చేశారు.

డాక్టర్.. ఏఐ ఏం చెప్పిందంటే..

- ఆరోగ్య సమస్యలపై ఏఐ చాట్‌బాట్లలో వెదుకులాట
- అదే సమాచారంతో వైద్యులతో వాదిస్తున్న రోగులు
- అర్థమయ్యేలా చెప్పలేక తలలు పట్టుకుంటున్న వైద్యులు



సాక్షి, హైదరాబాద్: కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికత అన్నిరంగాల్లోకి వేగంగా విస్తరిస్తోంది. దీంతో చాలామంది తమకు ఉన్న ఆరోగ్య సమస్యలకు పరిష్కారాలు కూడా ఏఐ ద్వారా తెలుసుకోవాలని ఉత్సాహం చూపిస్తున్నారు. వైద్యుల సలహా మేరకు చేయించుకునే మెడికల్ టెస్టులు, ల్యాబ్ రిపోర్టులను వైద్యులకు చూపించటానికి ముందే ఏఐ చాట్‌బాట్‌ల ద్వారా విశ్లేషించుకుంటున్నారు. ఇదే ఇప్పుడు నిజమైన వైద్యులకు తలనొప్పిగా మారిందని చెబుతున్నారు. ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా ఇంటర్నెట్‌లో శోధించి చిట్కాలు తెలుసుకునే వారి ని 'గూగుల్ డాక్టర్లు'గా వ్యవహరిస్తుంటారు. ఇప్పుడు ఏఐ చాట్‌బాట్‌లతో గతంకంటే ఎక్కువ విషయాలే తెలుస్తుండటంతో కొందరు తమకు అంతా తెలుసు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. తమ ఆన్‌లైన్ పరిజ్ఞానం బయట పెడుతూ నిజమైన వైద్యుల బుర్రలు తింటున్నారు. రోగుల మితిమీరిన సందేహాలతో వారిని సంతృప్తి పర్చలేక తమ తల ప్రాణం తోకకు వస్తోందని వైద్యులు వాపోతున్నారు.

మంచీ.. చెడు రెండూ ఉన్నాయి..

జనరేటివ్ ఏఐ, చాట్ జీపీటీలో లభించే సమాచారంతో తమ రిపోర్టుల గురించి చర్చించే కొందరు రోగుల వాదనా పటిమ ఆశ్చర్యపరుస్తోందని ఢిల్లీలోని పీఎస్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ చైర్మన్, ఎయిమ్స్ పల్మనాలజీ విభాగం మాజీ అధిపతి డా.జీసీ ఖిల్నానీ తెలిపారు. తమకు ఉన్న వైద్య సమస్యలపై డాక్టర్లను సంప్రదించడానికి ముందే కొందరు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్న అనియంత్రిత సమాచారం ద్వారా వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. దీని వల్ల చాలామంది ఎంతో ఆందోళనతో తన వద్దకు వచ్చారని, వారికి అర్థమయ్యేలా వివరించేందుకు చాలా సమయం పట్టిందని పేర్కొన్నారు. ఊహించుకునే అవకాశాలు ఉన్నాయని అభిప్రాయపడ్డారు. అదే సమయంలో డాక్టర్లు రోగులకు సరైన చికిత్స అందించేందుకు మొగ్గుచూపుతారని తెలిపారు. ఏఐ చాట్‌బాట్‌లు ఆరోగ్య సంరక్షణపై ఆశాజనకమైన సమాచారం అందిస్తున్నా, ఆ సమాచారాన్ని నిర్ధారించుకోవడానికి మానవ పర్యవేక్షణతోపాటు బాధ్యతాయుతమైన వ్యవస్థల ఆవశ్యకత ఉందని నిపుణులు పేర్కొంటున్నారు.

'జల వివాదాలు ఎప్పటికీ పరిష్కారం కావు'



సాక్షి, హైదరాబాద్: జల వివాదాలు ఎప్పటికీ పరిష్కారం కావని.. దీనికి అనేక కారణాలు లేకపోలేదని జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ మాజీ వైస్ చైర్మన్ డాక్టర్ మర్రి శశిధర్‌రెడ్డి అన్నారు. శనివారం సురవరం ప్రతాప్‌రెడ్డి ఆడిటోరియంలో టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో నిర్వహించిన మీట్ ది ప్రెస్‌లో శశిధర్‌రెడ్డి మాట్లాడారు. ఇరు రాష్ట్రాల మధ్య నీటి వివాదాల పరిష్కారానికి బచావత్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేసినా ఇప్పటి అనేక సమస్యలు అలాగే ఉన్నాయన్నారు. నీటి పరిష్కారానికి చతుర్విధ జల విధానాలే మేలని చెప్పారు. జహీరాబాద్‌లోని గొట్టిగారిపల్లిని ఒక్కసారి సందర్శిస్తే అన్ని తెలుస్తాయన్నారు. ప్రాజెక్టుల పేరుతో ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని, కొడంగల్ ఎత్తిపోతల పథకం పేరుతో దాదాపు రూ.14వేల కోట్లు ఖర్చు చేస్తున్నారని, బనకచర్ల ప్రాజెక్టుకు రూ.1.20 లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నారని తెలిపారు. చతుర్విధ జల విధానాలు వాడాలని మహారాష్ట్ర, ఇతర రాష్ట్రాలకు సూచించామని, వాటి వల్ల అనేక ఫలితాలు వస్తున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విరాహత్‌అలీ, రాంనారాయణ పాల్గొన్నారు.

పంద్రాగస్టున సమర శంఖం

ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి వెల్లడి

- సీఎం చెప్పినట్టుగా పెండింగ్ బిల్లులు క్లియర్ చేయడం లేదు
- ఆరోగ్య కార్డులకు అతీగతీ లేదు.. డీఏల విడుదల లేదు
- సెప్టెంబర్ 1 తర్వాత కార్యాచరణ ప్రకటిస్తామన్న జేఏసీ నేతలు



మీడియాతో మాట్లాడుతున్న మారం జగదీశ్వర్

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 15న సమర శంఖం పూరిస్తామని తెలంగాణ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి (టీఈజేఏసీ) చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై 17 నెలలు గడిచినా ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం లభించకపోవడంపై.. క్షేత్రస్థాయిలో ఉద్యోగులు తీవ్ర అసహనంతో ఉన్నారని తెలిపారు. ఉద్యోగ సంఘాలతో ముఖ్యమంత్రి, మంత్రివర్గ ఉపసంఘం, అధికారుల కమిటీ సుదీర్ఘ చర్చలు జరిపినప్పటికీ పరిష్కారం లభించలేదని అన్నారు. శనివారం నాంపల్లిలోని టీఎన్జీఓ భవన్‌లో తెలంగాణ ఉద్యోగ జేఏసీ సమావేశం జరిగింది. ఈ భేటీలో ఉద్యోగుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం నేతలు మీడియా సమావేశంలో మాట్లాడారు.

సీఎం ఆదేశాలు అమలు కావడం లేదు..

'సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల ప్రకారం పెండింగ్ బిల్లులకు సంబంధించి నెలకు రూ.700 కోట్లు చెల్లించాలి. కానీ గత నెలలో కేవలం రూ.183 కోట్ల మేర మెడికల్ బిల్లులు క్లియర్ చేశారు. ఈ నెలతో కలిపి రూ.1,217 కోట్లు చెల్లించాల్సి ఉండగా తాత్సారం చేస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శికి ఉద్యోగుల గోడును విన్నవించినా...ఆయన పెడచెవిన పెట్టారు. ఈహెచ్ఎస్ పథకంలో భాగంగా ఉద్యోగులకు ఆరోగ్య కార్డులను మంజూరు చేస్తామని చెప్పినప్పటికీ.. వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి ఈహెచ్ఎస్ అమలుకు మోకాలడ్డుతున్నారు.

ఉద్యోగులకు వ్యతిరేకంగా అధికారులు?

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అధికారుల కమిటీకి టీజీఈజేఏసీ ఇచ్చిన 57 డిమాండ్లకు సంబంధించిన నివేదికను బయటపెట్టకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం. కొన్ని శాఖల్లో ఉద్యోగుల ఖాళీలను తగ్గిస్తూ డౌన్‌సైజ్ చేయాలని చూడటం దుర్మార్గం. సీఎం, మంత్రి మండలి ఆదేశాలను గౌరవించాల్సిన అధికారులందరూ ఉద్యోగులకు వ్యతి రేకంగా పనిచేస్తున్నారనే అనుమానం కలుగుతోంది. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం స్పందించి ఆగస్టు 15వ తేదీలోగా తగిన చర్యలు తీసుకోవాలి. లేకుంటే 15వ తేదీ నుంచి నిరసనలు చేపడతాం. పెన్షన్ విద్రోహదినంగా నిర్వహిస్తున్న సెప్టెంబర్ 1వ తేదీ తర్వాత జేఏసీ సమావేశాన్ని నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తాం..'అని జేఏసీ నేతలు వెల్లడించారు.

జేఏసీ ప్రధాన డిమాండ్లు ఇవీ..

- ఉద్యోగుల పెండింగ్ బకాయిలకు సంబంధించి మంత్రివర్గ సమావేశంలో ఆమోదించిన నెలవారీ నిర్దేశిత బడ్జెట్ క్రమం తప్పకుండా విడుదల చేయాలి.
- రెండు నెలలుగా చెల్లించాల్సిన రూ.1,217 కోట్లు ఈ నెలలోనే ఇవ్వాలి.
- ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని (ఉఏ) జూలై నెలాఖరులోపే పూర్తిస్థాయిలో నిబంధనలను రూపొందించి అమలు చేయాలి.
- పెండింగ్‌లో ఉన్న 5 కరువు భత్యాలను తక్షణమే విడుదల చేయాలి.
- సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి.
- ఏకీకృత సర్వీసు నిబంధనలను అమలు చేసేందుకు తక్షణమే అధికారులకు ఆదేశాలు జారీ చేయాలి.
- పీఆర్సీ నివేదికను వెంటనే తెప్పించుకుని 51 శాతం ఫిట్‌మెంట్ అమలు చేయాలి.
- గచ్చిబౌలి స్థలాలను భాగ్యనగర్ టీఎన్జీవోలకు కేటాయించాలి.

'ఉచిత న్యాయ సేవల క్లినిక్' చిరస్మరణీయం

టీఎస్ఎల్ఎస్ఏ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ శామ్‌కోషి



'ఉచిత న్యాయ సేవల క్లినిక్'ను ప్రారంభిస్తున్న జస్టిస్ శామ్‌కోషి. చిత్రంలో రవిగుప్తా, పంచాక్షరి

సాక్షి, హైదరాబాద్: వీర్ పరివార్ సహాయత యోజన 2025 కింద ఉచిత న్యాయ సేవల క్లినిక్‌ను ప్రారంభించడం చిరస్మరణీయ సందర్భమని రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ శామ్‌కోషి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రక్షణ సిబ్బంది, పారామిలటరీ దళాలు, మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులకు అంకితమై ఈ క్లినిక్‌లు సేవలు అందిస్తాయని చెప్పారు. రక్షణ సిబ్బంది, మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులకు దేశవ్యాప్తంగా 'ఉచిత న్యాయ సేవల క్లినిక్'ల ద్వారా సేవలు అందించాలని నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (నల్సా) నిర్ణయించింది. ఈ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి, నల్సా ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ సూర్యకాంత్ వర్చువల్‌గా ప్రారంభించారు. శనివారం సోమాజిగూడలోని సైనిక్ వెల్ఫేర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన క్లినిక్‌ను శామ్‌కోసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సరిహద్దుల్లో పనిచేసే రక్షణ సిబ్బందికి వారి స్వస్థలాల్లో ఇబ్బందులు తెలిసే అవకాశం అంతంత మాత్రమేనని, అలాంటి వారికి చట్టపరమైన అన్ని రకాల సాయాన్ని ఈ క్లినిక్‌లు అందిస్తాయని చెప్పారు. వీలైనంత త్వరగా ఈ క్లినిక్‌లను జిల్లా కేంద్రాల్లోనూ అందుబాటులోకి తీసుకుని వస్తామని వెల్లడించారు. రక్షణ సిబ్బంది, మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యుల సంక్షేమానికి ఇదో కీలక మలుపు అని హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా అభివర్ణించారు. ఈ క్లినిక్‌లకు సంబంధించిన వివరాలను తెలంగాణ లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యకార్యదర్శి సీహెచ్ పంచాక్షరి వివరించారు. లీగల్ సర్వీసెస్ క్లినిక్‌లో ఒక ప్యానల్ న్యాయవాది, ఒక పారా లీగల్ వలంటీర్‌ను నియమిస్తామన్నారు. వీరు ప్రతి 1వ, 4వ శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ క్లినిక్‌లలో అందుబాటులో ఉండి ఉచిత న్యాయ సేవలు అందిస్తారని చెప్పారు.

న్యాయవాదులు ప్రజా హక్కుల రక్షకులు



- న్యాయవాద వృత్తిని ఉపాధిగా మాత్రమే చూడొద్దు
- ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: న్యాయవాద వృత్తిని జీవనోపాధి మార్గంగా మాత్రమే చూడొద్దని, సమాజం పట్ల ఒక బాధ్యతగా భావించాలని యువ న్యాయవాదులకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సూచించారు. చట్టాన్ని తెలుసుకోవడంతో పాటు మార్పులకు అనుగుణంగా సంక్లిష్ట సమస్యలను పరిష్కరించే నేర్పును అలవర్చుకోవాలని అన్నారు. రాజ్యాంగ పీఠికను అనుసరించి సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అందరికీ అందేలా న్యాయవాదులు కృషి చేయాలని సూచించారు. హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ (హెచ్ఐసీసీ)లో లెక్స్ విట్‌నెస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ది గ్రాండ్ మాస్టర్ 2025– హైదరాబాద్ ఎడిషన్'ముగింపు కార్యక్రమానికి మంత్రి శ్రీధర్‌బాబు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తాను న్యాయవాదిగా ప్రస్థానం మొదలుపెట్టి అనుకోని పరిస్థితుల్లో రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. న్యాయవాదుల కోర్టు అధికారులు మాత్రమే కాదని, సమానత్వాన్ని అందించిన వాస్తు శిల్పులు అని పేర్కొన్నారు. ప్రజలకు రాజ్యాంగం ప్రసాదించిన హక్కులకు న్యాయవాదులు సంరక్షకులు అని కొనియాడారు. దేశంలోని వివిధ న్యాయస్థానాల్లో 5.15 కోట్ల కేసులు పెండింగులో ఉండగా, జిల్లా కోర్టుల్లోనే 4.56 కోట్ల కేసులు అపరిష్కృతంగా ఉన్నాయని తెలిపారు. హైదరాబాద్ 'ఎమర్జింగ్ లీగల్ టెక్ హబ్'గా మారుతోందని అన్నారు. హైదరాబాద్‌లో 120కి పైగా స్టార్టప్ కంపెనీలు ఈ–డిస్కవరీ, డిస్ప్యూట్ అనలిటిక్స్, వర్చువల్ ఐపీఆర్ ప్లాట్‌ఫామ్స్ వంటి న్యాయ సంబంధిత రంగాల్లో నూతన ఆవిష్కరణల కోసం పనిచేస్తున్నాయని వెల్లడించారు. కార్యక్రమంలో లెక్స్ విట్ నెస్ ప్రతినిధులు అభిజిత్, శ్రీనివాస్, పలు కంపెనీల న్యాయాధికారులు పాల్గొన్నారు.

తెలంగాణలో 109 మానవ హక్కుల ఉల్లంఘనలు

28, 29 తేదీల్లో హైదరాబాద్‌లో 'ఓపెన్ హియరింగ్'

సాక్షి, న్యూఢిల్లీ: మానవ హక్కులపై అవగాహన కల్పించేందుకు, సమస్యల పరిష్కారానికి హైదరాబాద్‌లో ఓపెన్ హియరింగ్ నిర్వహిస్తున్నట్లు జాతీయ మానవ హక్కుల కమిషన్ పేర్కొంది. తెలంగాణలో 109 మానవ హక్కుల ఉల్లంఘనలు జరిగాయని, ఆ కేసులను విచారించడమే లక్ష్యమని శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈనెల 28, 29 తేదీల్లో హైదరాబాద్ జూబ్లీ హిల్స్‌లో ఉన్న డాక్టర్ మర్రి చెన్నారెడ్డి హెచ్ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహిస్తున్నట్లు చెప్పింది. ఈ కార్యక్రమానికి ఎన్‌హెచ్ఆర్సీ ప్రధాన కార్యదర్శి భరత్ లాల్, డైరెక్టర్ జనరల్ ఆర్పీ మీనా, రిజిస్ట్రార్ జోగిందర్ సింగ్, ఉన్నతాధికారులు హాజరై కేసులను విచారిస్తారని తెలిపింది. మానవ హక్కుల ఉల్లంఘన బాధితులకు అక్కడికక్కడే త్వరితగతిన న్యాయం అందించడమే 'ఓపెన్ హియరింగ్'లక్ష్యమని ఎన్‌హెచ్ఆర్సీ వివరించింది.

భారత్‌లో ఇంటర్నెట్ మారుమూల పల్లెలకూ చేరింది. డిజిటల్ వినియోగం అంతకంతకూ పెరుగుతోంది. ఈ అంశమే ఇప్పుడు సైబర్ నేరస్తులకు ఆయుధంగా మారింది. దీంతో సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయి. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ లెక్కల ప్రకారం సైబర్ నేరగాళ్లు 2024లో భారతీయుల నుంచి రూ.22,845.73 కోట్లు కొల్లగొట్టారు. అంతకుముందు ఏడాదితో పోలిస్తే ఇది దాదాపు మూడు రెట్లు ఎక్కువ కావడం ఆందోళన కలిగిస్తోంది. 2023లో ఆర్థిక సంబంధమైన ఫిర్యాదులు 24.42 లక్షలు వస్తే.. 2024లో ఈ సంఖ్య ఏకంగా 36.36 లక్షలకు పెరిగింది.

రూ.22,845 కోట్లు కొల్లగొట్టారు!



ప్రభుత్వాలు, రిజర్వు బ్యాంకు, బ్యాంకులు, పోలీసు విభాగాలు చేపడుతున్న అవగాహన కార్యక్రమాల పుణ్యమా అని జనంలో సైబర్ నేరాలపట్ల అవగాహన పెరిగినా నేరాలు తగ్గకపోవడం గమనార్హం. సైబర్ మోసాలే కాదు.. బాధితులు పోగొట్టుకుంటున్న మొత్తమూ ఏటా అంచనాలకు మించి నమోదవుతోంది. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టు బాధితులు నష్టం జరిగిపోయాక.. పోలీసు స్టేషన్లు, సైబర్ పోలీస్ స్టేషన్లు, సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టళ్లు, టోల్ ఫ్రీ నంబర్ల వంటివాటిని ఆశ్రయిస్తున్నారు.

-సాక్షి, స్పెషల్ డెస్క్

- 2024లో సైబర్ నేరస్తులు దోచిన మొత్తం ఇదీ
- ఏడాదిలో ఏకంగా మూడింతలు పెరిగిన నష్టం
- రికార్డు స్థాయిలో 36 లక్షలకుపైగా ఫిర్యాదులు
- 10 వేల మందికిపైగా సైబర్ నేరస్తుల అరెస్ట్

లొకేషన్ ఇట్టే పట్టేస్తారు

సైబర్ భద్రతా ప్రయత్నాలకు అనుగుణంగా పోలీసుల కోరిక మేరకు కేంద్ర ప్రభుత్వం 9.42 లక్షలకు పైగా సిమ్ కార్డులు, 2,63,348 ఐఎంఈఐలను బ్లాక్ చేసింది. నేరస్తులు ఉన్న చోటు, వారి కేంద్రాలను గుర్తించి నిఘా వ్యవస్థలకు సమాచారం చేరవేసేందుకు 'ప్రతిబింబ్' మాడ్యూల్‌ను కూడా ఏర్పాటుచేసింది. ఈ మాడ్యూల్ ద్వారా 10,599 మంది నిందితులను అరెస్టు చేయగలిగారు. తద్వారా 26,096 మంది నేరస్తులను గుర్తించగలిగారు. 63,019 సైబర్ దర్యాప్తు సహాయ అభ్యర్థనలను ప్రాసెస్ చేయగలిగారు.

కట్టడికి కలిసికట్టుగా..

న్యూఢిల్లీలోని ఇండియన్ సైబర్‌క్రైమ్ కో–ఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ) కేంద్రంగా సైబర్ నేరాల నియంత్రణ కేంద్రాన్ని (సీఎఫ్ఎంసీ) ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇక్కడ ఉన్న విభిన్న విభాగాలు.. సైబర్ నేరం జరిగినట్టు ఫిర్యాదు అందగానే వెంటనే స్పందించి ఆర్థిక నష్టాన్ని నివారించేందుకు, అలాగే నేరస్తులను పట్టుకునేందుకు కలిసికట్టుగా నిరంతరం శ్రమిస్తున్నాయి. చట్ట వ్యతిరేక కార్యకలాపాల కోసం సమాచారం, డేటా, కమ్యూనికేషన్ లింక్‌ను నేరస్తులు వాడకుండా నిరోధించేందుకు.. ఐటీ సేవల కంపెనీలకు సమాచారం ఇచ్చేందుకు 'సహయోగ్' పోర్టల్‌ను కేంద్రం అందుబాటులోకి తెచ్చింది. ఆన్‌లైన్ ఆర్థిక మోసాలకు చెక్ పెట్టే దిశగా టెలికం శాఖ (డాట్) రూపొందించిన ఫైనాన్షియల్ ఫ్రాడ్ రిస్క్ ఇండికేటర్ (ఎఫ్ఐఆర్) ప్లాట్‌ఫాంను ఉపయోగించుకోవాలని బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు రిజర్వ్ బ్యాంక్ ఇటీవల సూచించింది. మధ్యస్థ, అధిక, అత్యధిక ఆర్థిక మోసాలతో ముడిపడి ఉన్న మొబైల్ నంబర్లను ఇది రియల్ టైమ్‌లో వర్గీకరిస్తుంది. ప్రస్తుతం చెల్లింపులకు యూపీఐ విధానాన్ని విరివిగా ఉపయోగిస్తున్న నేపథ్యంలో సైబర్ మోసాల బారిన పడకుండా కోట్ల మందిని ఈ సాంకేతికత కాపాడగలదని తెలిపింది.



సైబర్ మోసాల వల్ల భారతీయులు గత ఏడాది రూ.22,845.73 కోట్లు కోల్పోయారు. 2023లో ఈ మొత్తం రూ.7,465.18 కోట్లు.

2024లో నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో (ఎన్‌సీఆర్‌పీ) 19.18 లక్షలు, సిటిజన్ ఫైనాన్షియల్ సైబర్ ఫ్రాడ్ రిపోర్టింగ్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (సీఎఫ్‌సీఎఫ్ఆర్ఎంఎస్) ద్వారా 17.18 లక్షల ఫిర్యాదులు.. మొత్తంగా 36.36 లక్షల ఫిర్యాదులు వచ్చాయి. ఈ రెండు వేదికలు 2023లో అందుకున్న ఫిర్యాదుల సంఖ్య 24.42 లక్షలు.

సంవత్సరం	ఆర్థిక సంబంధ ఫిర్యాదులు		పోగొట్టుకున్న మొత్తం (రూ.కోట్లలో)
	ఎన్‌సీఆర్‌పీలో	సీఎఫ్‌సీఎఫ్ ఆర్ఎంఎస్‌లో	
2023	13,10,354	11,32,624	రూ.7,465
2024	19,18,865	17,18,423	రూ.22,845

రూ.10 వేల కోట్లకుపైగా కాపాడారు!

కేంద్ర ప్రభుత్వానికి చెందిన సిటిజన్ ఫైనాన్షియల్ సైబర్ ఫ్రాడ్ రిపోర్టింగ్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (సీఎఫ్‌సీఎఫ్ఆర్ఎంఎస్) ద్వారా వచ్చిన 17.8 లక్షల ఫిర్యాదులకుగాను రూ.5,489 కోట్లకు పైగా డబ్బును ప్రజలు కోల్పోకుండా కాపాడగలిగారు. బ్యాంకుల నుంచి 11 లక్షలకు పైగా అనుమానిత సైబర్ నేరస్తుల రికార్డులు అందాయి. సైబర్ నేరగాళ్లు దోచుకున్న సొమ్మును దాచిన 24 లక్షల లేయర్–1 మ్యూల్ ఖాతాల వివరాలను సస్పెక్ట్ రిజిస్ట్రీ ద్వారా నిఘా సంస్థలకు చేరాయి. తద్వారా రూ.4,631 కోట్లకు పైగా విలువైన మోసాలను నిరోధించగలిగారు.

క్లుప్తంగా...

రాష్ట్ర మంత్రివర్గాన్ని పునర్వ్యవస్థీకరించాలి

- ఎంపీ రఘునందన్‌రావు డిమాండ్



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: రాష్ట్ర మంత్రివర్గాన్ని పునర్వ్యవస్థీకరించాలని మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. 15 మంది మంత్రుల్లో ఏడుగురు అగ్రకులాలకు చెందిన వారే ఉన్నారన్నారు. ఈ మంత్రి వర్గంలో మైనార్టీల్లో ఒక్కరికి కూడా స్థానం కల్పించలేదని, దళితులు, బీసీలకు కూడా తగిన ప్రాతినిధ్యం లేదని విమర్శించారు. శనివారం ఆయన సంగారెడ్డి బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ నేతలు గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని అన్నారు. దేశంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్న మూడు రాష్ట్రాల్లో రెండు రాష్ట్రాల సీఎం పదవులను ఓసీలకే కట్టబెట్టిందన్నారు. కానీ బీజేపీ అధికారంలో ఉన్న 20 రాష్ట్రాల్లో ఐదు చోట్ల బీసీలు ముఖ్యమంత్రులుగా ఉన్నారని, మూడు రాష్ట్రాల్లో గిరిజనులు సీఎం పదవిలో ఉన్నారని వివరించారు. మరో రెండు రాష్ట్రాల్లో మైనార్టీలు ముఖ్యమంత్రులుగా ఉన్నారని తెలిపారు.

డ్రామాలతో ప్రజల్ని మభ్యపెట్టలేరు

- కేటీఆర్‌పై ఎంపీ చామల ధ్వజం



సాక్షి, న్యూఢిల్లీ: మీరు చేస్తున్న డ్రామాలతో ప్రజలను మభ్యపెట్టలేరని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. అధికారాన్ని కోల్పోయి ఏడాది కూడా కాలేదు... కేటీఆర్ తిరిగి అధికారంలోకి వచ్చే కలల్లో మునిగిపోయారు అని ఎద్దేవాచేశారు. శనివారం ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో చామల మీడియాతో మాట్లాడుతూ, బీఆర్ఎస్ హయాంలో అధికార దుర్వినియోగం పరాకాష్టకు చేరిందని ఆరోపించారు. 'ఫోన్ టాపింగ్, మహిళల గోప్యత ఉల్లంఘన, ఓటర్లను బెదిరించడం... ఇవన్నీ ప్రజాస్వామ్యానికి భిన్నంగా జరిగాయి. ఇప్పుడు అదే పార్టీ ప్రజాస్వామ్యం గురించి మాట్లాడడం అన్యాయం కాదా?'అని ప్రశ్నించారు.మూడేళ్లలో అధికారంలోకి వస్తామంటూ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను బెదిరించడం ఏంటని ప్రశ్నించారు. తెలంగాణ సాధనలో త్యాగాలు చేసినవారిని విస్మరించి మీ కుటుంబాలే లాభపడేలా చూశారు. కేటీఆర్, ఇతర బీఆర్ఎస్ నేతలు తమ త్యాగాలతో తెలంగాణ సాధించామని చెప్పడం అవాస్తవమని చామల వ్యాఖ్యానించారు. 1,600 మంది బలిదానాలతో తెలంగాణ వస్తే.. ఐదుగురికి ఉద్యోగాలొచ్చాయి'అని చామల ఆరోపించారు.

కౌశిక్‌రెడ్డి శాసనసభ సభ్యత్వం రద్దు చేయాలి

- కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కవ్వంపల్లి, మేడిపల్లి సత్యం

కరీంనగర్ కార్పొరేషన్: సీఎం రేవంత్‌రెడ్డిపై అసత్య, నిరాధార ఆరోపణలు చేసిన హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని కాంగ్రెస్‌కు చెందిన కరీంనగర్ జిల్లా మానకొండూరు, చొప్పదండి ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం డిమాండ్ చేశారు. కౌశిక్‌రెడ్డి సభ్యత్వం రద్దు చేయాలని అసెంబ్లీ స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఒక వేళ స్పీకర్ రద్దు చేయకపోతే అసెంబ్లీ ముందు గాంధీ విగ్రహం వద్ద నిరాహారదీక్ష చేస్తామన్నారు. రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కౌశిక్‌రెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేసి, చర్యలు తీసుకోవాలని శనివారం వీరు కరీంనగర్ సీపీ గౌస్ ఆలంకు ఫిర్యాదు చేశారు. ఫోన్ ట్యాపింగ్ చేసిందే బీఆర్ఎస్ నేతలని, సినిమావాళ్లు, సొంత భార్యల ఫోన్లు కూడా ట్యాప్ చేసిన నీచ చరిత్ర వారిదని ధ్వజమెత్తారు.

మరో తెలంగాణ ఉద్యమం తప్పదు

- ఏపీ జలదోపిడీ వయా బనకచర్ల
- బీఆర్ఎస్వీ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతుల్లో పీపీటీ ద్వారా వివరించిన హరీశ్‌రావు



పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్న హరీశ్

సాక్షి, హైదరాబాద్/ ఉప్పల్ /కాప్రా: నీళ్ల కోసం మరో తెలంగాణ ఉద్యమం చేస్తామని..బనకచర్ల విషయంలో ఢిల్లీ మెడలు వంచుతామని మాజీమంత్రి హరీశ్‌రావు అన్నారు. శనివారం మల్లాపూర్‌లోని ఓ గార్డెన్‌లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అధ్యక్షతన బీఆర్ఎస్వీ రాష్ట్రస్థాయి సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన హరీశ్‌రావు మాట్లాడుతూ..తన శిష్యుడు రేవంత్‌రెడ్డితోపాటు... ఢిల్లీ కూడా తన చేతిలో ఉందని చంద్రబాబు అనుకుంటున్నారని..రేవంత్, ఢిల్లీ ఒప్పుకున్నా తెలంగాణ సమాజం మాత్రం బనకచర్లకు ఒప్పుకోదని హెచ్చరించారు. తెలంగాణ సమాజం మరో ఉద్యమానికి సిద్ధమవుతుందన్నారు. అవసరమైతే ఉస్మానియా, కాకతీయ, శాతవాహన యూనివర్సిటీలు మళ్లీ ఉద్యమానికి వేదికలై తెలంగాణ హక్కులు కాపాడుతాయని హెచ్చరించారు. బనకచర్ల విషయంలో రేవంత్‌రెడ్డి తలూపి సంతకం పెట్టినా కేసీఆర్ ఊరుకోదని, తెలంగాణ రైతులు ఊరుకునే ప్రసక్తే ఉండదన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గోదావరి జలాలపై విద్యార్థులకు హరీశ్‌రావు అవగాహన కల్పించారు. తెలంగాణ ద్రోహుల లిస్ట్ రాస్తే మొదటి పేరు చంద్రబాబు, రెండో పేరు రేవంత్ రెడ్డిదేనన్నారు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయాలని, ఉద్యమ జ్ఞాపకాలను తుడిచే ప్రయత్నం రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. టీఎస్‌ను టీజీగా మార్చడమే అందుకు నిదర్శనమన్నారు. రేపటితరం నాయకులైన విద్యార్థులే తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణపై కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. ఇంటి దొంగలు తెలంగాణ నీళ్లు తెలంగాణకు దక్కకుండా చేస్తున్నారని చెప్పారు. దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ జై తెలంగాణ అనే నినాదంపై కాంగ్రెస్ ప్రభుత్వం అప్రకటిత నిషేధం కొనసాగిస్తుందని చెప్పారు.

పెద్ద కోవర్ట్ రేవంత్ రెడ్డే: కేటీఆర్



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పెద్ద కోవర్ట్‌గా పనిచేస్తున్నాడని, ఏపీ సీఎం చంద్రబాబు, బీజేపీ ఆటలు తెలంగాణలో సాగవని గ్రహించి గులాబీ పార్టీ లేకుండా కుట్రలు చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. బనకచర్ల పేరిట గోదావరి జలాలను తెలంగాణకు శాశ్వతంగా దూరం చేసే కుట్రలు జరుగుతున్నాయని చెప్పారు. తెలంగాణ జల హక్కులకు పిండం పెట్టే కుట్రలను ఆపేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఉన్నాడనే విషయాన్ని గుర్తుంచుకోవాలని కేటీఆర్ హెచ్చరించారు. బీఆర్ఎస్వీ ముగింపు కార్యక్రమంలో కేటీఆర్ ప్రసంగించారు. 'కేసీఆర్‌తో పాటు నన్ను, పార్టీ నేతలను ఇబ్బంది పెట్టేందుకు కాంగ్రెస్, బీజేపీ కలిసి కట్టుగా కుట్రలు, దాడి చేస్తున్నాయి.

అధికారంలోకి వచ్చి అన్ని లెక్కలు తేలుస్తాం

'ఫోన్ ట్యాపింగ్ తాము కూడా చేస్తున్నామని సీఎం రేవంత్ చెప్పాడు. ఆరు గ్యారంటీలు 420 హామీల అమలు గురించి ప్రజలు అడగకుండా ఉండేందుకు హీరోయిన్ల ఫోన్లు ట్యాప్ అయ్యాయని కల్పిత కథలను సృష్టించారు. విద్యార్థి నాయకుడు గెల్లు శ్రీనివాస్ భార్య మీద హత్యాయత్నం కేసు పెట్టిన పోలీసులు గడ్డి తింటున్నారా. రేవంత్‌రెడ్డి కట్టు బానిసలు లాగా పనిచేస్తున్న కొందరు పోలీసులకు మెదడు ఉందా. అక్రమ కేసులు పెడుతూ, అధికార పార్టీ నేతల అండతో చెలరేగిపోతున్న పోలీసు అధికారుల పేర్లు రాసిపెట్టుకోండి. మళ్లీ అధికారంలోకి వచ్చేది మనమే. మిత్తీతో సహా అన్ని లెక్కలు తేలుస్తాం. కేసులకు భయపడకుండా బీఆర్ఎస్ విద్యార్థి విభాగం కార్యకర్తలు సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా ఉండాలి'అని కేటీఆర్ పిలుపునిచ్చారు.

తెలంగాణలో కుమ్మక్కు రాజకీయం

▶ మొదటి పేజీ తరువాయి

సహకరించినందుకు ఒక రోడ్డును సృష్టించారు. నిబంధనలను అతిక్రమించి కాంట్రాక్టును అనుకున్న వారికి కట్టబెట్టడం రేవంత్‌రెడ్డికి వెన్నతో పెట్టిన విద్య. రూ.10 వేల కోట్ల దోపిడీకి సహకరించినందుకు సీఎం రమేశ్‌కు దక్కిన రిటర్న్ గిఫ్ట్ రూ.1660 కోట్లు. ఈ కుంభకోణాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అనే పసలేని చెత్త అంశాన్ని తెరమీదకు తెస్తున్నారు. తెలంగాణ ప్రజల కోసం పుట్టి ఇక్కడి ప్రజల కోసం పోరాడే పార్టీ ఇప్పటికీ, ఎప్పటికీ ఏ పార్టీలోనూ విలీనమయ్యే ప్రసక్తే లేదని ప్రజలకు తెలుసు. ఇరకాటంలో పడిన ప్రతీసారి కాంగ్రెస్, బీజేపీ విలీనం అంటూ తెలంగాణ ప్రజలను గందరగోళానికి గురి చేసే యత్నాలు చేస్తున్నారు. సీఎం రమేశ్, రేవంత్ ఇద్దరూ కలిసి వస్తే రూ.10 వేల కోట్ల హెచ్‌సీయూ భూముల స్కాం, రూ.1660 కోట్ల రోడ్డు స్కాంపై చర్చించేందుకు సిద్ధం'అని కేటీఆర్ అన్నారు.

అదంతా అవాస్తవం: సీఎం రమేశ్

ఎంపీ సీఎం రమేశ్ అనకాపల్లిలో మీడియాతో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డితో తాను కుమ్మక్కై కాంట్రాక్ట్ పొందాననేది అవాస్తవమన్నారు. అయితే, కేటీఆర్ ప్రశ్నించిన అంశాలకు సమాధానం ఇవ్వడానికి బదులుగా.. బీఆర్ఎస్, కేసీఆర్ కుటుంబంపై వ్యక్తిగత విమర్శలకే రమేశ్ ప్రాధాన్యమిచ్చారు. నాలుగు నెలల క్రితం ఢిల్లీలోని తన ఇంటికి వచ్చి కేటీఆర్ మాట్లాడింది గుర్తుందా అని ప్రశ్నించారు. కావాలంటే తన ఇంటికి వచ్చిన సీసీ ఫుటేజీని మీడియాకు పంపిస్తానన్నారు. తెలంగాణలో గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అవినీతి బయటపడకుండా, తన సోదరి కవితను వదిలేయడానికి ఏర్పాట్లు చేస్తే బీజేపీలోకి బీఆర్ఎస్‌ను కలపడానికి సిద్ధంగా ఉన్నానని కేటీఆర్ చెప్పిన మాటలు గుర్తులేవా అని నిలదీశారు.

నక్కలవాగులో చిక్కుకున్న వ్యవసాయ కూలీలు

- సురక్షితంగా ఒడ్డుకు చేర్చిన రైతులు
- మరో ఘటనలో అడవిలో దారితప్పిన విద్యార్థులు



తాళ్ల సాయంతో బాధితులను ఒడ్డుకు చేర్చుతున్న రైతులు

కాల్వశ్రీరాంపూర్ (పెద్దపల్లి)/వెంకటాపురం(కె): వరినాట్ల కోసం పొలాలకు వెళ్లిన వ్యవసాయ కూలీలు.. సాయంత్రం ఇళ్లకు బయలుదేరే క్రమంలో నక్కలవాగు వరద ఉధృతిలో చిక్కుకున్నారు. ఈ సంఘటన పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం మల్యాల గ్రామంలో చోటుచేసుకుంది. పెద్దపల్లి మండలం గౌరెడ్డిపేట గ్రామానికి చెందిన 15 మంది వ్యవసాయ మహిళా కూలీలు కాల్వశ్రీరాంపూర్ మండలం మల్యాల గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో శనివారం ఉదయం వరినాట్లు వేయడానికి వచ్చారు. సాయంత్రం తిరిగి ఇళ్లకు బయలు దేరారు. నక్కలవాగు దాటుతుండగా ఒక్కసారిగా వరద ఉధృతి పెరిగింది. దీంతో భూలక్ష్మి, భాగ్య, లక్ష్మి, రమ, సుమలత, దేవక్క, తిరుపతక్కతోపాటు మరో ఎనిమిది మంది వాగులో చిక్కుకున్నారు. అదేప్రాంతానికి కొంతదూరంలోని పొలాల్లో ఉన్న రైతులు వెంటనే అప్రమత్తమై వాగులో పైపులు వేయడంతో వాటిని బాధితులు పట్టుకొని కేకలు వేశారు. ప్రాణాలను అరచేతిలో పట్టుకొని సుమారు గంటపాటు అవస్థలు పడ్డారు. అక్కడేఉన్న మరికొందరు రైతులు తాళ్ల సాయంతో కూలీలను ఒడ్డుకు సురక్షితంగా చేర్చారు. గతేడాది కూడా ఇదే వాగులో వరద ఉధృతికి ఓ రైతుకు చెందిన కాడెడ్లు కొట్టుకుపోయాయి.

వాటర్‌ఫాల్స్ వద్ద చిక్కుకున్న విద్యార్థులు

ములుగు జిల్లా వెంకటాపురం మండల పరిధిలోని మహితాపురం వాటర్‌ఫాల్స్‌ను తిలకించేందుకు వరంగల్ నిట్‌కు చెందిన ఏడుగురు ఇంజనీరింగ్ విద్యార్థులు శనివారం వెళ్లి తప్పిపోయారు. తిరుగు ప్రయాణంలో రాత్రి కావడంతో అడవిలో దారి తప్పారు. దీంతో వారు డయల్ 100కు ఫోన్‌చేసి విషయం చెప్పడంతో అప్రమత్తమైన పోలీసులు అటవీ శాఖ అధికారులు.. విద్యార్థులను అడవినుంచి సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు.

బీసీలను దగా చేసిన చరిత్ర కాంగ్రెస్‌దే..

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు. చిత్రంలో డీకే అరుణ

సాక్షి ప్రతినిధి మహబూబ్‌నగర్: 'బీసీ రిజర్వేషన్'పై ఈ రోజు కాంగ్రెస్ నేతలు మాట్లాడుతున్నారు.. కాంగ్రెస్ చేసిన కులగణనలో 46 శాతం బీసీలు ఉంటే.. ఇందులో 42 శాతానికి కుదించి రిజర్వేషన్ ఇస్తానని చెప్పారు. దీంట్లో 10 శాతం మైనార్టీలకు ఇస్తే బీసీలకు 36 శాతమే కదా.. ఇది బీసీలను దగా చేయడం కాదా అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు ప్రశ్నించారు. శనివారం మహబూబ్‌నగర్‌లోని ఓ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన బీజేపీ కార్యకర్తల సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. 1942 నుంచి ఇప్పటి వరకు కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి రాష్ట్రంలో ఎంత మంది బీసీలను ముఖ్యమంత్రి చేసిందని ప్రశ్నించారు. కేంద్ర కేబినెట్‌లో బీసీలు 27 మంది మంత్రులుగా ఉంటే.. రాష్ట్రంలోని కాంగ్రెస్ కేబినెట్‌లో బీసీలు కేవలం ఇద్దరే ఉన్నారన్నారు. ఇలాంటి మీరా బీసీల గురించి మాట్లాడేదని ధ్వజమెత్తారు. బీసీ కమిషన్ పెట్టిందే బీజేపీ అని తెలుసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే మతపరమైన రిజర్వేషన్ తొలగిస్తామన్నారు. రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే పాలమూరు–రంగారెడ్డిపై దృష్టిపెడతానని చెప్పారని.. ఇప్పటివరకు 19 నెలల కాలం గడిచినా ఎలాంటి పురోగతి లేదన్నారు.

పాత డిజైన్ ప్రకారం పాలమూరు పూర్తి చేయాలి: డీకే అరుణ

రాష్ట్రంలో కాంగ్రెస్ ఇచ్చిన తప్పుడు హామీలను ప్రజల దగ్గర ఎండగట్టాలని, 6 గ్యారంటీల్లో ఏ ఒక్కటి కూడా సక్రమంగా అమలు చేయలేదనే విషయాన్ని ప్రజలకు తెలియజెప్పాలని.. ఎక్కడికక్కడ ఆందోళనలు చేయాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ పిలుపునిచ్చారు. పాలమూరు–రంగారెడ్డి పాత డిజైన్ ప్రకారం ప్రాజెక్టు నిర్మించి ఏడు నియోజకవర్గాలకు సాగునీరు ఇవ్వాలని చెప్పారు.

శాంతికుమార్ గోబ్యాక్..

సమ్మేళనం ప్రారంభానికి ముందు సమావేశంలో గందరగోళ పరిస్థితి నెలకొంది. కార్యకర్తలతో పాటు కిందనే ఉన్న పార్టీ రాష్ట్ర కోశాధికారి బండారి శాంతికుమార్‌ను పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి వేదికపైకి రావాల్సిందిగా ఆహ్వానించారు. ఈ క్రమంలో శాంతికుమార్ గో బ్యాక్ అంటూ డీకే అరుణ అనుచరులు నినాదాలు చేయడంతో సమావేశంలో రసాభాస నెలకొంది. బీసీ నేతను అవమానించడం తగదని పార్టీలో చర్చ జరుగుతోంది.

'సిగాచీ'పై న్యాయపోరాటం

హైకోర్టులో పిల్ దాఖలు చేసిన రిటైర్డ్ సైంటిస్ట్

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: సిగాచీ పరిశ్రమ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుతూ హైకోర్టులో ప్రజాప్రయోజనాల వ్యాజ్యం (పిల్) దాఖలైంది. హైదరాబాద్‌లోని నాచారం ప్రాంతానికి చెందిన రిటైర్డ్ సైంటిస్ట్ కలపాల బాబూరావు ఈ పిల్‌ను దాఖలు చేశారు. ఈ దుర్ఘటనలో మరణించిన 54 మంది (ఆచూకీ లేకుండా పోయినవారితో కలిపి) కార్మికుల కుటుంబాలకు, గాయపడిన వారికి ప్రభుత్వం ప్రకటించిన మేరకు పూర్తి పరిహారం వెంటనే చెల్లించాలని హైకోర్టును కోరారు. భానూరు పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసును సిట్‌కు బదిలీ చేయాలన్నారు.

మావోల కీలక నేత హిడ్మా ఊరికి రహదారి

ఎలమగూడ నుంచి సిలిగేరు మీదుగా పువ్వర్తికి నిర్మాణం

చర్ల: మావోయిస్టు కీలక నేత, ప్రభుత్వానికి మోస్ట్ వాంటెడ్‌గా ఉన్న మడావి హిడ్మా స్వగ్రామమైన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా పువ్వర్తి గ్రామానికి రహదారి నిర్మాణం చివరి దశకు చేరింది. హిడ్మా ప్రస్తుతం కేంద్ర కమిటీ సభ్యుడిగానే కాక పీఎల్‌జీఏ మొదటి బెటాలియన్‌కు నేతృత్వం వహిస్తున్నారు. ఆయన స్వగ్రామం పువ్వర్తి.. బాజీపూర–సుక్మా జిల్లాల సరిహద్దుల్లో.. తెలంగాణ సరిహద్దుకు సుమారు 30 కి.మీ. దూరాన ఉంటుంది. ఈ గ్రామానికే కాకుండా సుక్మా, బీజాపూర్, దంతెవాడ జిల్లాల్లోనూ పలు గ్రామాలకు రహదారులు లేవు. ఈ నేపథ్యంలో రెండేళ్లుగా మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పోలీసు క్యాంపులు ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వం రహదారులు నిర్మించడమే కాక సెల్‌ఫోన్ టవర్లు ఏర్పాటు చేస్తోంది. ఇందులో భాగంగానే సుక్మా జిల్లాలోని ఎలమగొండ నుంచి సిలిగేరు మీదుగా 10–12 గ్రామాలను కలుపుతూ పువ్వర్తి వరకు 51 కి.మీ. రహదారికి రూ.53 కోట్లు కేటాయించారు. రహదారి నిర్మాణం చివరిదశకు చేరగా, మధ్యలో వాగులపై ఇనుప వంతెనలు నిర్మించారు. దీంతో ఎలమగొండ నుంచి పువ్వర్తికి రహదారి ఏర్పడినట్లయింది. మావోయిస్టుల వల్ల అభివృద్ధి కుంటుపడగా, పోలీసులు, ప్రభుత్వాలతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రజలకు అవగాహన కల్పించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ రహదారి, వంతెనల నిర్మాణ పనులు చివరి దశకు చేరడంతో ఆదివాసీలు రాకపోకలు సాగిస్తున్నారు.

విపత్తు నివారణకు జిల్లాకు రూ.కోటి

- నిధులు విడుదల చేసిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నెలకొన్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో విపత్తు నివారణ నిధి కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.33 కోట్లు విడుదల చేసింది. ఈ మేరకు రాష్ట్రంలోని 33 జిల్లాలకు గాను ప్రతి జిల్లాకు రూ.కోటి చొప్పున విడుదల చేస్తూ విపత్తు నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధులను కలెక్టర్ల ఖాతాల్లో జమ చేస్తూ వర్షాలు పడుతున్న నేపథ్యంలో విపత్తుల సమయంలో ప్రజలను ఆదుకోవడానికి, వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా అవసరమైన సామగ్రి కొనుగోలు చేసుకునేందుకు, వానాకాలంలో జరిగే నష్టాన్ని తక్కువ చేసేందుకు ఉపయోగించుకోవాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. స్టేట్ డిజాస్టర్ రిలీఫ్ ఫండ్ మార్గదర్శకాలకు అనుకూలంగా ఈ నిధులు వినియోగించుకోవాలని సూచించారు. కేరళలో ఉన్న ఈ విధానాన్ని అధ్యయనం చేసిన అనంతరం ఇక్కడ కూడా ప్రకృతి విపత్తు నివారణ కింద నిధులు కలెక్టర్ల దగ్గర ఉంచాలన్న నిర్ణయం మేరకు ఈ నిధులు విడుదల చేసినట్లు అర్వింద్‌కుమార్ పేర్కొన్నారు.

ఎక్కడా యూరియా కొరత లేదు

- మార్క్‌ఫెడ్ ఎండీ శ్రీనివాస్‌రెడ్డి

తిప్పర్తి: రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడా యూరియా కొరత లేదని, ఎరువులు కూడా రైతులకు అందుబాటులో ఉన్నాయని మార్క్‌ఫెడ్ ఎండీ శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. శనివారం ఆయన నల్లగొండ జిల్లా తిప్పర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని జిల్లాలకు సరిపడా యూరియా ఉందని, ఇప్పటి వరకు 6 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందించామని చెప్పారు. ఇంకా లక్షా75 వేల మెట్రిక్ టన్నుల యూరియా స్టాక్ ఉందన్నారు. యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలించకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఆయన వెంట నల్లగొండ జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్, మార్క్‌ఫెడ్ డీఎం జ్యోతి, డీసీఓ పాత్యానాయక్ తదితరులు ఉన్నారు.

రైతుకు 2 బస్తాలే..

▶ మొదటి పేజీ తరువాయి

వ్యవసాయ శాఖ అధికారులు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో యూరియా కోసం శనివారం మరోసారి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కేంద్ర మంత్రి జేపీ నడ్డాకు లేఖ రాశారు.

ఎంత పొలం ఉన్నా రెండు బస్తాలే



ఖమ్మం జిల్లాకు 7,500 మెట్రిక్ టన్నుల యూరియా ప్రభుత్వం సరఫరా చేయాల్సి ఉండగా 4,500 మెట్రిక్ టన్నులే అందించారు. ఒక రైతుకు ఎన్ని ఎకరాల పొలం ఉన్నా రెండు బస్తాలే ఇస్తున్నారు. ఒక ఎకరం ఉంటే ఒక బస్తానే ఇస్తున్నారు.

– బొంతు రాంబాబు, రైతు సంఘం నాయకుడు

యూరియా లభ్యతను బట్టి రైతులకు పంపిణీ



సొసైటీకి వచ్చే యూరియా లోడ్‌ను బట్టి రైతులకు సరఫరా చేస్తున్నాం. ఆధార్ కార్డు ఆధారంగా ఒక రైతుకు రెండు బస్తాల చొప్పున పంట కాలంలో మూడు సార్లు ఇస్తాం. రైతుకు రెండు ఎకరాల కన్నా ఎక్కువ భూమి ఉంటే ఉన్న స్టాక్ ఆధారంగా పంపిణీ చేస్తున్నాం. రైతులు అర్థం చేసుకుంటున్నారు. – జూపల్లి సందీప్‌రావు, పీఏసీఎస్ చైర్మన్, గర్రెపల్లి, పెద్దపల్లి జిల్లా



అంతట చీకటికంటె వెలుగు ఎంత ప్రయోజనకరమో
బుద్ధిహీనతకంటె జ్ఞానము అంత ప్రయోజనకరమని నేను తెలిసికొంటిని.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు శ్రావణ మాసం, **తిథి:** శు.తదియ రా.11.18 వరకు తదుపరి చవితి, **నక్షత్రం:** మఖ సా.5.59 వరకు, తదుపరి పుబ్బ, **వర్జ్యం:** ఉ.5.43 నుండి 7.21 వరకు, తదుపరి రా.2.20 నుండి 4.00 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.50 నుండి 5.42 వరకు, **అమృత ఘడియలు:** ప.3.34 నుండి 5.13 వరకు.

సూర్యోదయం : 5.40
సూర్యాస్తమయం : 6.32
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

సుందర్ పిచాయ్ (గూగుల్ సీఈవో)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

అదృష్ట సూచిక నిన్న ఉన్నట్లుగా నేడు ఉండదు. నేడు ఉన్నట్లుగా రేపు ఉండదు. కానీ, నిన్న – నేడు – రేపు కూడా మనం ఒకేలా ఉండాలి! ఒక అదృశ్య సూచికలా, ఒక నిశ్శబ్ద వీచికలా.

కష్టకాలాన్ని ఎలాగైనా దాటుకుని వెళ్లొచ్చు. గొప్ప వైభోగాన్ని పట్టించి, ధనరాశులను దట్టించి, కీర్తి ప్రతిష్ఠల్లో ఊరేగిస్తున్న కాలాన్ని తట్టుకుని నిలబడటానికే మనిషికి శక్తి కావాలి. తలపై కిరీటం ఉన్నా లేకున్నా తల ఎప్పుడూ తలలా ఉండాలి. కిరీటంలా ఉండకూడదు.

బ్లూమ్‌బర్గ్ ఇండెక్స్‌లో నేను బిలియనీర్‌ని అయ్యానని తెలియగానే, 'ఇంప్రెసివ్' అని ట్వీట్ చేశారు ఎలాన్ మస్క్!

ముకుళిత హస్తాల సింగిల్ ఎమోజీతో నేనూ వెంటనే ఆయనకు ధన్యవాదాలను ట్వీట్ చేశాను. మితభాషణ మనుమల్ని మరింతగా దగ్గర చేస్తుంది.

బ్లూమ్‌బర్గ్ ఇండెక్స్‌లో నా బిలియనీర్ స్టేటస్ మారుతూ ఉంటుంది. కానీ, ఎప్పటికీ మారని స్టేటస్ సుందర్ పిచాయ్ అనే నా ఐడీ.



సక్సెస్ మీట్‌లో ఉన్నాం కంపెనీ స్టాఫ్ అందరం. నేను వేదిక మీద ఉన్నాను.

"స్టేటస్‌లో ఒక్కోసారి కిందికి జారిపోతాం. ఆ ఫెయిల్యూర్‌ను కూడా చొక్కా జేబుకు ధరించదగిన గౌరవప్రదమైన బ్యాడ్జిలానే భావించాలి' అన్నాన్నేను.

"బట్, మిస్టర్ పిచాయ్... ఫెయిల్యూర్ అన్నది సంతోషించ తగిన విషయమైతే కాదు కదా? ఎలా ధరించగలం ఆ బ్యాడ్జిని?" అని, టీమ్‌లోకి కొత్తగా వచ్చిన అబ్బాయిలు, అమ్మాయిలు!

వాళ్లనేది నిజమే.

కానీ, ఒక వ్యక్తి సంతోషంగా ఉండటం అంటే ఆ వ్యక్తి జీవితంలో ప్రతిదీ సరిగ్గా ఉందని అర్థం కాదు. జీవితంలో ప్రతిదాని పట్ల ఆ వ్యక్తి వైఖరి సరైనదిగా ఉందని. ఆ మాటే చెబుతూ, "సంతోషం మనం చూసేది కాదు, మనకు కనిపించేది" అన్నాను.

"అర్థం కాలేదు మిస్టర్ పిచాయ్" అంటూ ఆడియెన్స్‌లోంచి ఓ గర్ల్ ఇంటర్న్!

ఒక్కసారిగా నవ్వాన్నేను. ఆ అమ్మాయి మాటలకు నాకు అంజలి గుర్తొచ్చింది.

కాలేజ్‌లో అంజలి సరిగ్గా ఇలానే అంటుండేది... "అర్థం కాలేదు సుందీ..." అని!

అర్థం కాకపోవటానికి అంతగా నేను అర్థం కాకుండా ఏం మాట్లాడేవాడినో నాకు అర్థం అయ్యేది కాదు.

"మీ మాటల్ని కూడా తమరు నా చేతే మాట్లాడించే వారు కదా. అందుకే తమర్ని మళ్లీ మళ్లీ మాట్లాడించటం కోసం 'అర్థం కాలేదు సుందీ' అంటుండేదాన్ని అని మా పెళ్లయ్యాక ఆ రహస్యాన్ని విప్పింది అంజలి!

ఖరగ్‌పూర్ ఐఐటిలో మా ఇద్దరిదీ సేమ్ బ్యాచ్. నాది మెటలర్జికల్ ఇంజినీరింగ్. తనది కెమికల్ ఇంజినీరింగ్. నేనుండేది నెహ్రూ హాల్. తనుండేది ఆల్ గర్ల్స్ హాస్టల్.

తనకు తెలియకుండా నేను తనను చూస్తుండే వాడిని. తర్వాత తెలిసింది నాకే తెలియకుండా నేను తనని ప్రేమిస్తున్నానని.

క్యాంపస్‌లో ఒక రోజు తనకి పట్టుబడిపోయాను. "ఏంటి చూస్తున్నావ్? హా!" అంది అంజలి నా ముందుకొచ్చి, నా ముఖం లోకి వచ్చి!!

తననే చూస్తూ ఉండిపోయాను. "ఓయ్ సుందీ, మాటలొచ్చా?" అంది కోపంగా చూస్తూ.

నా క్లాస్‌మేట్స్ నన్నలాగే పిలుస్తారు... 'సుందీ' అని. తను కూడా నన్ను 'సుందీ' అంటోందంటే? ఎస్, అర్థమైంది నాకు! కోపంగా నా వైపు చూస్తున్న అంజలిలో ఆ చూపు నిజం, ఆ కోపం అబద్ధం.

'మిస్టర్ పిచాయ్, మీటింగ్ హాల్ బయట మిసెస్ అంజలీ మీ కోసం వేచి ఉన్నారు, పూలగుచ్ఛంతో" అన్నారు థామస్ కురియన్, వేదిక మీదకు వచ్చి నా చెవికి దగ్గరగా! కురియన్ గూగుల్ క్లౌడ్ సీఈవో.

బయటికి వెళ్లేందుకు వేదిక దిగబోతూ, ఆ గర్ల్ ఇంటెర్న్‌తో మళ్లీ అదే మాట చెప్పాను... "సంతోషం మనం చూసేది కాదు గ్రేస్, మనకు కనిపించేది" అని నవ్వుతూ చెప్పాను.

రెండు కోహినూర్ కథలు!



జనతంత్రం

వర్ధెల్లి మురళి



నలభై యాభయ్యేళ్ల కిందటి దాకా తెలుగు నాటకరంగం బతికే ఉండేది. సినిమా, టీవీలు దాన్ని పూర్తిగా మింగేయకముందు నాటి సంగతి. 1970లలో సాంఘిక ఇతివృత్తంతో కూడిన నాటకాలు, నాటికలను విరివిగా ప్రదర్శించేవాళ్లు. ఆ రోజుల్లో వచ్చిన ఒక నాటిక పేరు 'కోహినూర్ కావాలి'. రాజకీయాలపై అదొక సెటైర్. ఒక రాజకీయ నిరుద్యోగి తన గుర్తింపు కోసం చేసే ప్రయత్నం. కథ సరిగ్గా గుర్తులేదు కానీ, సింగిల్ లైన్‌లో దాని సారాంశాన్ని చెప్పొచ్చు. సదరు నిరుద్యోగి బాగా ఆలోచించి లండన్‌లో ఉన్న కోహినూర్ వజ్రాన్ని తీసుకురావాలని విద్యార్థులను రెచ్చగొట్టి ఉద్యమం చేస్తాడు. కోహినూర్ రాదు కానీ, ఆ నిరుద్యోగి కోరిక మాత్రం తీరుతుంది. విద్యార్థులు పావులుగా మిగిలిపోతారు.

ఇప్పుడున్న మన రాజకీయ నాయకులకు ఇటువంటి సెటైర్లను పేల్చకుండా రోజులు గడవని పరిస్థితి ఏర్పడింది. ఏపీలోని మన అగ్ర నాయకులు ఈ వారం తాజాగా పేల్చిన ఓ రెండు సెటైర్లను ఒకసారి పరిశీలిద్దాం. ముందుగా సీనియర్ మోస్ట్ నాయకుడైన చంద్రబాబు వంతు. ఆయన తనకు ప్రీతిపాత్రమైన సింగపూర్ యాత్రకు శనివారం బయల్దేరారు. అమరావతి స్టార్టప్ ఏరియా డెవలప్‌మెంట్ కోసం మరోసారి సింగపూర్‌ను ఒప్పించడం ఆయన ఉద్దేశం. తప్పేమీ లేదు. పట్టు వదలని విక్రమార్కుడు చెట్టు వద్దకు తిరిగి వెళ్లాడనుకోవచ్చు. కానీ, ఆయనకో డౌటు కూడా ఉన్నది. ఈసారి సింగపూర్ వాళ్లు ఒప్పుకుంటారో లేదోననే గుంజాటన వ్యక్తం చేశారు. కుదరక పోతే, ''... అద్దంకి వెళ్లనూ వెళ్లాడు, రానూ వచ్చాడనే'' సామెత మనకు ఉండనే ఉన్నది.

సింగపూర్ స్పందనపై ఆయన అనుమానానికి చెప్పిన కారణమే ఒక పెద్ద బుకాయింపు. తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కుదిరిన స్టార్టప్ ఏరియా ఒప్పందాన్ని జగన్ సర్కార్ రద్దు చేయడమే గాక వారిని వేధించడం వల్లనే వెనకాడు తున్నారని చంద్రబాబు చెప్పారు. కానీ అసలు సంగతి దాచేస్తే దాగేది కాదు. అప్పటి స్టార్టప్ ఏరియా ఒప్పందంలో సింగపూర్ తరఫున మంత్రి ఈశ్వరన్ కీలక భూమిక పోషించారు. ఆయనతో చంద్రబాబుకు చిరకాల స్నేహముందనేది బహిరంగ రహస్యం. అవినీతి ఆరోపణలపై ఈశ్వరన్‌ను మంత్రివర్గం నుంచి తొలగించడమే గాకుండా సింగపూర్ ప్రభుత్వం ఆయనను జైలుకు కూడా పంపించింది. ఈమధ్యనే ఆయన విడుదలయ్యారు. అమరావతి స్టార్టప్ ఏరియా ప్రాజెక్టులో భాగస్వామ్యం పట్ల సింగపూర్‌కు అభ్యంతరాలు ఏమైనా ఉంటే ఈశ్వరన్ పాత్ర కారణంగా ఉండాలి.

ముందుగానే మధ్యవర్తుల ద్వారా ఒక అవగాహన కుదరకుండా ఏ ప్రభుత్వాధినేతా విదేశాలకు వెళ్లి బేరం మొదలు పెట్టడు. చేతి నుంచి పైసా పెట్టుబడి పెట్టకుండా కేవలం బ్రాండ్ వాడుకునేందుకు భాగస్వామిగా ఉండి వేలకోట్లు సంపాదించే అవకాశాన్ని సింగపూర్ వాళ్లు కాదనకపోవచ్చు. ఇంతకు ముందు కుదిరిన స్టార్టప్ ఏరియా అభివృద్ధి ఒప్పందాన్ని పరిశీలిస్తే దాని లోగుట్టు బోధపడుతుంది. ఒకవేళ ముందస్తు అవగాహనంటూ ఏదీ లేకపోతే ఆయన పర్యటన అసలు కారణం ఇంకేదైనా ఉండవచ్చు. రాష్ట్ర ప్రభుత్వాధినేత కనుక సింగపూర్ ప్రభుత్వ పెద్దలతో మర్యాద పూర్వక భేటీలు జరగవచ్చు. జగన్ నిర్వాకం కారణంగా భాగస్వామ్యానికి వాళ్లు ఒప్పుకోలేదని వచ్చిన తర్వాత బురద చల్లవచ్చు. ముందస్తు అవగాహన ప్రకారమే ఒప్పందం కుదిరితే చంద్రబాబు వెళ్లాడు గనుక వాళ్లు దిగొచ్చారని, సింగపూర్ బ్రాండ్ మనకు కోహినూర్ డైమండ్ కంటే విలువైనదని భాజా మోగించుకోవచ్చు. ఇలా ఉభయతారకంగా ఉండాలనే జగన్‌పై ఓ కామెంట్ విసిరి ఆయన సింగపూర్ వెళ్ళారు.

గతంలో కుదిరిన స్టార్టప్ ఒప్పందం ఒక దోపిడీ పథకమని దాన్ని పరిశీలిస్తే ఎవరికైనా అర్థమవుతుంది. రాజధాని ప్రాంతం కోర్ ఏరియాలో 1,691 ఎకరాల భూమిని సింగపూర్ కంపెనీల కన్సార్టియానికి అప్పగించారు. వారితో నామమాత్రపు భాగస్వామిగా కేపిటల్ సిటీ డెవలప్‌మెంట్ కంపెనీ (సీసీడీఎంసీ) ఉంటుంది. ఈ భాగస్వాములతో కలిసి 'అమరావతి డెవలప్‌మెంట్ పార్ట్‌నర్స్' పేరుతో వ్యవహారం నడుపుతారు. ఈ భూమిలో 250 ఎకరాలు ఉచితంగా సింగపూర్ కన్సార్టియానికి బహుమతిగా లభిస్తుంది. ఇక మిగిలిన 1,070 ఎకరాలను అభివృద్ధి చేసి అంతర్జాతీయ స్థాయి మార్కెటింగ్‌తో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడమే కన్సార్టియం పని. అభివృద్ధి చేయడానికయ్యే 5,500 కోట్ల రూపాయల ఖర్చును కూడా రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుంది. స్నేహితుడైన ఈశ్వరన్ నేతృత్వంలో వచ్చిన సింగపూర్ కన్సార్టియానికి ఇలా దోచిపెట్టే ఒప్పందాన్ని స్కామ్ అనకుండా ఉండగలమా? గతంలో కూడా సింగపూర్ ప్రభుత్వంతో ఒప్పందమని ప్రచారం చేశారు కానీ, జరిగింది మాత్రం కంపెనీలతోనే! ఇప్పుడేం జరుగుతుందో చూడాలి.

ఇక రెండో కోహినూర్ కథలో నిజంగానే కోహినూర్ డైమండ్ వృత్తాంతం ఇమిడి ఉన్నది. ఇది ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు సంబంధించిన వ్యవహారం. ప్రాథమికంగా పవన్ కల్యాణ్ సినిమా నటుడు. కేవలం నటుడు అంటే సరిపోదు. పుష్కలంగా అభిమానగణం ఉన్న పాపులర్ హీరో. ఆయన కొత్త సినిమా హరిహర వీరమల్లు మొన్ననే విడుదలైంది. విడుదలతోపాటు వివాదాలను కూడా మోసుకొచ్చింది. రాజకీయ పదవుల్లో ఉన్నవాళ్లు సినిమాల్లో నటించకూడదన్న నియమం ఏమీ లేదు కాబట్టి ఆయన నటించడం మీద పేచీ ఏమీ లేదు. కాకపోతే ఉన్నతమైన ప్రభుత్వ బాధ్యతలో ఉన్న వ్యక్తి కనుక తను నటిస్తున్న సినిమా ఇతివృత్తం విషయంలోనూ, ఆ సినిమా విడుదలకు సంబంధించిన ఇతరత్రా విషయాల్లోనూ ఆదర్శంగా ఉంటారని ఎవరైనా ఆశిస్తారు.

విడుదలైన తొలి వారం పది రోజుల్లో టికెట్ రేట్లు పెంచుకునే విషయంపై గత కొంతకాలంగా రెండు రాష్ట్రాల్లో చర్చలు జరుగుతున్నాయి. ఈ అంశంపై ఫిలిం ఛాంబర్ ద్వారా మాత్రమే ఏ సినిమా నిర్మాతైనా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయాలని, తన సినిమాలకైనా ఇది వర్తిస్తుందని కొద్దికాలం కిందనే పవన్ కల్యాణ్ చెప్పారు. కానీ కేవలం నిర్మాత విజ్ఞప్తి మేరకే టికెట్ రేట్లు పెంచుకునే అవకాశం కల్పిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది. ఇంత చిన్న విషయంపై కూడా పవన్ తన మాట మీద నిలబడలేకపోయారు. విడుదలకు ముందురోజు హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన కొన్ని విషయాలు చెప్పారు. మొఘల్ కాలంలో జరిగిన అక్రమాల గురించి మన చరిత్రలో చెప్పలేదనీ, విజయనగర సామ్రాజ్యం గొప్పతనం గురించి కూడా చెప్పలేదనీ ఆయన ఆరోపించారు. ఇది పూర్తిగా సత్యదూరం.

విజయనగర సామ్రాజ్య కాలాన్ని స్వర్ణయుగంతో పోలుస్తూ కావల్సినన్ని చరిత్ర వ్యాఖ్యానాలు అందుబాటులో ఉన్నాయి. కృష్ణదేవరాయల దండయాత్రల గురించీ, ఆయన కళా సాహితీ రంగాల పోషణ గురించీ, సాహితీ సమరాంగణాన చక్రవర్తిగా ఆయన వాసికెక్కడం గురించీ బోలెడన్ని కథలూ, గాథలూ వ్యాప్తిలో ఉన్నాయి. ఈ అంశాలన్నీ చరిత్ర పాఠాల్లో కూడా ఉన్నాయి. విజయనగర వీధుల్లో రతనాలను రాశులుగా పోసి అమ్మేవారని కూడా చదువుకున్నాము. అశోకుడు చెట్లు నాటించెను, బాటలు వేయించెను, బావులు తవ్వించెను అనే పాఠం చదవకుండా ఎవరైనా ప్రాథమిక విద్యను పూర్తి చేస్తారా? ఔరంగజేబు సింహాసనాన్ని అధిష్ఠించడం కోసం తనకంటే పెద్దవాడైన దారా షికోను హత్య చేయించాడని, తండ్రిని చెరసాలలో పెట్టించాడనే అంశాలు కూడా మన చరిత్రలో లేవని పవన్ ఆరోపణ. అది కూడా నిజం కాదు. ఆ సాహిత్యం పుష్కలంగా అందుబాటులో ఉన్నది.

కోహినూర్ వజ్రానికి చరిత్రలో ఒక ప్రత్యేక స్థానమున్నది. దానిది అంతర్జాతీయ ఖ్యాతి. కృష్ణా తీరంలో లభించిందని ప్రతీతి. అక్కడినుంచి కాకతీయుల రాజధాని ఓరుగల్లుకు, అల్లావుద్దీన్ ఖిల్జీ ద్వారా ఢిల్లీకి, నాదిర్‌షా ద్వారా పర్షియాకు, మహారాజా రంజిత్‌సింగ్ వశమై లాహోర్‌కు, అక్కడి నుంచి బ్రిటిష్ వారితో లండన్‌కు ప్రయాణం చేసిన వజ్ర రాజం. ఆరొందల సంవత్సరాల ట్రావెలాగ్ కోహినూర్‌ది. అట్లాగే ఔరంగజేబు. 17వ శతాబ్దంలో భారతదేశాన్ని శాసించిన మొఘల్ చక్రవర్తి. ఈ చారిత్రక అంశాల మధ్య వీరమల్లు అనే కల్పిత పాత్రను ప్రవేశపెట్టి ఈ సినిమా తీశారట! ఈ కల్పిత వీరమల్లు ఔరంగజేబుతో పోరాడి గోల్కొండకు వజ్రాన్ని ఎలా తీసుకువస్తాడనేది సినిమా కథగా చెబుతున్నారు. చారిత్రకాంశాలతో ఫాంటసీలు తీయొద్దని ఎవరూ చెప్పలేరు. సృజనాత్మక కళలపై ఆంక్షలు పెట్టడం, లక్ష్మణ రేఖలు గీయడం కూడా వాంఛనీయం కాదు. కాకపోతే ఫాంటసీ పేరుతో చరిత్రను వక్రీకరించడాన్ని, ఆ వక్రీకరణ ద్వారా సమాజంలో విద్వేషాలను రెచ్చగొట్టాలని ఉద్దేశించడాన్ని మాత్రం సహించలేము.

తనది సనాతన ధర్మ పథమని ఈమధ్యనే పవన్ కల్యాణ్ ప్రకటించుకున్న విషయం విదితమే. తన ధర్మపథ ప్రచారానికి తద్వారా తన రాజకీయ భవిష్యత్ ఉన్నతికి దోహదపడే ప్రచార చిత్రంగా దీన్ని ఉపయోగించుకోవాలని ఆయన భావించి ఉండ వచ్చు. ఈ కారణంగా కొంత భాగాన్ని డైరెక్ట్ చేసిన క్రిష్ అర్ధాంతరంగా తప్పుకున్నారనే ప్రచారం కూడా ఉన్నది. అదెంతవరకు వాస్తవమో తెలియదు. ప్రచార చిత్రంగా వాడుకున్నా ఫరవా లేదు. కానీ, మొఘల్ చక్రవర్తుల కాలంలో అన్నీ అక్రమాలు, అకృత్యాలే జరిగాయా? ఇంకే గొప్పతనం లేదా?... వివిధ చారిత్రక దశల్లో ఆర్థిక వ్యవస్థల తీరుతెన్నులపై అధ్యయనం చేసిన నిపుణుల సమాచారం ప్రకారం క్రీస్తుశకం 16, 17 శతాబ్దాల్లో భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచ జీడీపీలో 25 శాతం వాటాగా ఉన్నది. కొద్ది తేడాతో చైనా తర్వాత రెండో స్థానం. భారత ఉపఖండంలో విశాల భూభాగాన్ని ఐక్యం చేసి శాంతి, సుస్థిరతలను సాధించినందు వలన అక్బర్ చక్రవర్తి కాలంలో వ్యవసాయం, వస్త్ర పరిశ్రమలు, వాణిజ్యం అభివృద్ధి చెంది, బ్రిటిష్ వలస దోపిడీ మొదలయ్యేంతవరకూ భారత ఆర్థిక వ్యవస్థ బలంగానే ఉన్నది.

అశోక చక్రవర్తి కాలంలో జరిగిన సామ్రాజ్య విస్తరణ, శాంతి – సుస్థిరత స్థాపనల ఫలితంగా, ఆ కాలంలో విరాజిల్లిన బౌద్ధమతం వెలుగులో వ్యవసాయ వాణిజ్యాలతోపాటు శాస్త్ర సాంకేతిక పరిశోధనల్లో కూడా ముందంజ వేసింది. అనంతర కాలంలో రెండు మూడు శతాబ్దాల పాటు భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచ జీడీపీలో 35 శాతం వాటాను సొంతం చేసుకొని ఆర్థిక సూపర్ పవర్‌గా వెలుగొందిందని అంచనా వేశారు. అశోకా ది గ్రేట్, అక్బర్ ది గ్రేట్ అని ఊరికే అనలేదు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన భారత నేత పనివాళ్ల వేళ్లను విరగ్గొట్టిందీ, భారత వ్యవసాయాన్ని ధ్వంసం చేసిందీ, భారతదేశ సంపదను కొల్లగొట్టి తమ దేశానికి తరలించుకుపోయిందీ బ్రిటిష్‌వాళ్లే కాని, మొఘల్స్ కాదు. బాబర్ సెంట్రల్ ఏసియా నుంచి వచ్చి ఉండ వచ్చు. అనంతర మొఘల్సందరూ ఇక్కడే పుట్టారు. ఇక్కడే చనిపోయారు. ఈ దేశ చరిత్ర మీద తాజ్‌మహల్ వంటి సంతకాలను చేశారు. బ్రిటిష్ వలసదారులకు వ్యతిరేకంగా ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామానికి నాయకత్వం వహించింది ఆఖరి మొఘల్ చక్రవర్తి బహదూర్ షా జాఫర్ కాదా? బ్రిటిష్ వాళ్ళు ఆయన్ను పట్టుకొని బర్మాలో ప్రవాస ఖైదు విధిస్తే, తాను చనిపోయాక తన జన్మభూమి భారత్‌లో అంత్యక్రియలు చేయాలని చివరి రోజుల్లో ఆయన కోరుకున్న విషయం చరిత్రే కదా! బాధ్యత గల వ్యక్తులు చారిత్రకాంశాలతో కూడిన సినిమాలు తీసినప్పుడు ఇటువంటి అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకోవడం అవసరం.

vardhelli1959@gmail.com

సింగపూర్ స్పందనపై ఆయన అనుమానానికి చెప్పిన కారణమే ఒక పెద్ద బుకాయింపు. తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కుదిరిన స్టార్టప్ ఏరియా ఒప్పందాన్ని జగన్ సర్కార్ రద్దు చేయడమే గాక వారిని వేధించడం వల్లనే వెనకాడుతున్నారని చంద్రబాబు చెప్పారు. కానీ అసలు సంగతి దాచేస్తే దాగేది కాదు. అప్పటి స్టార్టప్ ఏరియా ఒప్పందంలో సింగపూర్ తరఫున మంత్రి ఈశ్వరన్ కీలక భూమిక పోషించారు. ఆయనతో చంద్రబాబుకు చిరకాల స్నేహముందనేది బహిరంగ రహస్యం. అవినీతి ఆరోపణలపై ఈశ్వరన్‌ను మంత్రివర్గం నుంచి తొలగించడమే గాకుండా సింగపూర్ ప్రభుత్వం ఆయనను జైలుకు కూడా పంపించింది. ఈమధ్యనే ఆయన విడుదలయ్యారు. అమరావతి స్టార్టప్ ఏరియా ప్రాజెక్టులో భాగస్వామ్యం పట్ల సింగపూర్‌కు అభ్యంతరాలు ఏమైనా ఉంటే ఈశ్వరన్ పాత్ర కారణంగా ఉండాలి. ఇంతకు ముందు కుదిరిన స్టార్టప్ ఏరియా అభివృద్ధి ఒప్పందాన్ని పరిశీలిస్తే దాని లోగుట్టు బోధపడుతుంది.

చరిత్ర సృష్టించిన కుట్ర కేసు!

1969 డిసెంబర్ 19వ తేదీన మద్రాసులోని అన్నా నగర్‌లోని ఒక ఇంటిలో ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్ట్ విప్లవ కారుల రాష్ట్ర కమిటీ సమావేశం రహస్యంగా జరుగుతున్న మొదటి రోజున పోలీసులు దాడిచేసి కొందరు నాయకులను అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో దేవులపల్లి వెంకటేశ్వరరావు (డీవీ), తరిమెల నాగిరెడ్డి (టీఎస్) తదితరులు ఉన్నారు. చంద్ర పుల్లారెడ్డి అనుకున్న సమయానికి రాని కారణంగా అరెస్టు కాలేదు. సమావేశానికి హాజరైన నాయకులతో పాటు మరి కొంతమంది ముఖ్య నాయకులను కలిపి మొత్తం 68 మందిపై ఆనాడు కాసు బ్రహ్మానంద రెడ్డి ప్రభుత్వం స్వతంత్ర భారత చరిత్రలో రాజకీయ ప్రేరేపితమైన తొలి కుట్ర కేసును బనాయించింది. దానికి ప్రభుత్వం పెట్టిన పేరు 'హైదరాబాదు కుట్ర కేసు'. అయితే అది జనంలో 'నాగిరెడ్డి కుట్ర కేసు'గా బహుళ ప్రచారం పొందింది. దీనికి ముఖ్య కారణం వీరిపై పెట్టిన కేసును డీవీ, టీఎస్‌లు స్వయంగా వాదించి సంచలనం సృష్టించడం.


1969 ఏప్రిల్ నెలలో కృష్ణా జిల్లా అట్లప్రగడలో రహస్యంగా జరిగిన రాష్ట్ర ప్లీనంలో ఆమోదించిన 'తక్షణ కార్యక్రమం' డాక్యుమెంట్ ఆధారంగా ప్రభుత్వం ఈ కేసును బనాయించింది. జనతా ప్రజాతంత్ర విప్లవ దశలో కమ్యూనిస్టు విప్లవ కారుల వ్యూహం – ఎత్తుగడల స్థూల రూపమే ఈ తక్షణ కార్యక్రమం. ఆనాటి రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ విప్లవ కమ్యూనిస్టు కమిటీ ప్రకటించిన 'తక్షణ కార్యక్రమం' ఆధారంగా ఈ ప్రభుత్వాన్ని కూల్చటానికి వీరు కుట్ర పన్నినట్లు పేర్కొంది. 1970 జూన్‌లో ఈ కేసు విచారణ హైదరాబాద్ అదనపు సెషన్స్ జడ్జి కోర్టులో జరిగిన సందర్భంలో– డీవీ, టీఎస్‌లు ఈ 'తక్షణ కార్యక్రమా'న్ని పూర్తిగా సమర్థిస్తూ తమ వాదనలను దృఢంగా వినిపించారు. ఈ కేసులో తమకు తీవ్రమైన శిక్షలు పడతాయని తెలిసి కూడా పార్టీ విధానాలను సమర్థించాలనే నిర్ణయం తీసుకుని కమ్యూనిస్టుల విప్లవ సంప్రదాయాలకు పట్టం కట్టారు. కోర్టులో 48 మంది ముద్దాయిలను విచారించి 18 మందికి నాలుగు సంవత్సరాల మూడు నెలల కఠిన కారాగార శిక్ష విధించారు. హైకోర్టు కూడా ఈ శిక్షలను నిర్ధారించింది. 1972 మే నెలలో కఠోరమైన బెయిల్ కండిషన్స్‌పై జైలులో ఉన్న నాయకులు బయటకు వచ్చారు. 1975 జూన్ 25వ తేదీన ఇందిరాగాంధీ దేశంలో అత్యవసర పరిస్థితి ప్రకటించడంతో డీవీ, టీఎస్‌లతో సహా కుట్రకేసులో ఉన్న ముఖ్య నాయకులంతా రహస్య జీవితానికి వెళ్లిపోయారు.

డీవీ, టీఎస్ ఈ కుట్రకేసులో జైల్లో ఉన్న కాలంలో జైలును ఒక అధ్యయన కేంద్రంగా మార్చుకున్నారు. 'కమ్యూనిస్టు విప్లవకారుల వ్యూహం – ఎత్తుగడలు' అన్న స్టేట్మెంట్‌ను కేసులో ఉన్న అందరి తరఫున తయారుచేసి, విచారణ సందర్భంగా డీవీ వివరించారు. ఈ ప్రకటన 'డీవీ స్టేట్మెంట్'గా ప్రచారం పొందింది. జైలు జీవితంలో ఉన్న టీఎస్ 'తాకట్టులో భారతదేశం' పేరుతో తగిన గణాంక వివరాలతో సమకాలీన ఆర్థిక రాజకీయ పరిణామాలను 'తక్షణ కార్యక్రమా'నికి అన్వయించి రాసి... స్టేట్మెంట్ రూపంలో కోర్టులో రెండు గంటలపాటు ఎంతో శక్తిమంతంగా వివరించారు.

డీవీ, టీఎస్ కోర్టును తమ రాజకీయాల ప్రచార వేదికగా చేసుకున్న ఫలితంగా ఈ స్టేట్మెంట్లు కొత్త ఒరవడిని సృష్టించాయి.



టీఎస్



డీవీ

వారు ఇచ్చిన స్టేట్మెంట్లలో ముఖ్యమైనవి: 'సాయుధ పోరాటాలు జరగకుండా ప్రజాస్వామిక పద్ధతుల్లో భూ సంస్కరణలు అమలు జరగటం అసంభవం', 'వర్గ పోరాటం, ప్రజల సాయుధ విప్లవం ద్వారా పాలకవర్గాన్ని కూలదోయటం తప్పనిసరిగా జరుగుతాయి', 'కమ్యూనిస్టు విప్లవకారులమైన మేము ప్రజాయుద్ధ సిద్ధాంతాన్ని నమ్ముతున్నాం', 'మా విప్లవ పంథా రివిజనిస్టుల పార్లమెంటరీ పంథాకు పూర్తిగా భిన్నమైనది, మా పంథాను గురించి మా తక్షణ కార్యక్రమంలో ప్రకటించాం.' ప్రభుత్వం కుట్ర కేసు ద్వారా విప్లవకారులపై ఏవైతే ఆరోపణలు చేసిందో... వాటిని అంగీకరిస్తూ కోర్టులో స్టేట్‌మెంట్లు ఇచ్చి విప్లవకారుల ప్రతిష్ఠను ఎవరెస్ట్ శిఖరం అంత ఎత్తుకు పెంచారు వీరు.

డీవీ 1984 జూలై 12న చనిపోగా, టీఎస్ ఎమర్జెన్సీ కాలంలో రహస్యంగా ఉంటూ అనారోగ్యంతో హైదరాబాదు ఉస్మానియా ఆసుపత్రిలో 1976 జూలై 28న చనిపోయారు. అలా వీరు జూలై మాసంలోనే అమరులవ్వడం యాదృచ్ఛికమే అయినా ఆసక్తిదాయకం. వారికి విప్లవాభివందనాలు.

– ముప్పాళ్ళ భార్గవ శ్రీ । సీపీఐ ఎంఎల్ నాయకులు
(రేపు కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి వర్ధంతి)

ఇదేనా ఆధునిక నాగరికత?



హిందూ పురాణాలు, భారతీయుల నమ్మకం ప్రకారం... జ్ఞాన దేవత అయిన సరస్వతీ దేవిని పుస్తక రూపంగా భావిస్తారు. పుస్తకం జీవన దీపికగా, నిత్యం మనకు సత్యా–అసత్యాల వాస్తవ మార్గాన్ని చూపిస్తూ, అజ్ఞానం నుండి జ్ఞానం వైపు తీసుకెళ్లే దారిగా నిలుస్తుంది. సంస్కృతంలో ప్రసిద్ధమైన మాట 'పుస్తకం హస్త భూషణం'. అంటే పుస్తకం చేతికి అలంకారమని అర్థం. పుస్తకం ఉత్తమ మిత్రుడు, గురువు, తత్వవేత్త కూడా. 'అపరిమితంగా చదివినవాడే గొప్ప వాగ్ధాటి గల వక్త కాగలడు' అన్న మాట పుస్తక పఠనానికి ఉన్న ప్రాముఖ్యాన్ని సూచిస్తుంది. నిస్సందేహంగా, ఈ రోజు మనం జీవిస్తున్న ప్రపంచాన్ని తీర్చిదిద్దడంలో పుస్తకాల పాత్ర అమోఘం. రాతియుగం నుండి నేటి జనరేటివ్ ఏఐ యుగం వరకు మనల్ని నడిపించింది పుస్తకం. ఇది మన నాగరికత, శాస్త్రీయ పురోగతికి పునాది వేసినది.

అయితే నేడు పుస్తకాలు అత్యంత నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. పుస్తకాలను నగరాల్లోని ప్రధాన రహదారుల ఫుట్‌పాత్‌లపై అమ్మడం తెలిసిందే. కానీ పాదరక్షలను ఎయిర్ కండిషన్డ్ షోరూమ్‌లలో ఉంచి అమ్ముతున్నారు. ఇది చేదు వాస్తవం అయినప్పటికీ, ఎవ్వరూ ఖండించలేని పచ్చి నిజం. విద్యాసంస్థలు దేవాలయాలు అయితే, గ్రంథాలయాలు సాక్షాత్తూ గర్భగుడులే. గర్భగుడిలో ఎవరు ఉంటారో మనందరికీ తెలుసు. అందువల్ల పుస్తకాలను గౌరవంగా ప్రార్థన గదిలో కాకపోయినా, పవిత్ర స్థలంలో ఉంచడం ద్వారా గౌరవించాలి.

ఈ మార్పు ఎలా జరిగింది అనే దానిపై మనం లోతుగా ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది. ఇది నాగరికతా? సంస్కృతా? ఆధునికీకరణ పేరుతో, మనం స్నానపు గదిలో వంట చేయలేము; వంట గదిలో స్నానం చేయలేము అనే కఠినమైన వాస్తవికతను అర్థం చేసుకోవాలి. ఈ కార్యకలాపాలన్నీ ఇంట్లో వాటికి కేటాయించిన ప్రదేశాలలో జరగాలి. విలాసాలు, వినోదాల కోసం వేల రూపాయలు ఖర్చు చేయడానికి వెనుకాడటం లేదు కానీ వంద రూపాయలు ఖర్చుచేసి ఒక పుస్తకం కొనడానికి సంకోచిస్తున్నాడు మనిషి. పుస్తకాలకు (జ్ఞానానికి) మళ్ళీ తగిన స్థానం కల్పించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామి కావాలి. లేదంటే భవిష్యత్తు తరాలు మనల్ని 'విద్యావంతులైన మూర్ఖులు'గా చరిత్ర పుటల్లో గుర్తుంచుకుంటాయి.

– రెడ్డి శేఖర్ రెడ్డి గుడిశ, ఇంగ్లిష్ అసోసియేట్ ప్రొఫెసర్, క్రైస్ట్ యూనివర్సిటీ, బెంగళూరు

శ్రీరాముని వైరాగ్యం

జ్యోతిర్మయం

శ్రీరామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులు గురువు వశిష్ఠుని వద్ద విద్యాభ్యాసం పూర్తి చేశారు. గురుకులం నుంచి తిరిగి వచ్చిన తర్వాత రాముడు తండ్రి అనుమతితో తమ్ముళ్లను వెంట బెట్టుకుని తీర్థయాత్రలకు వెళ్ళాడు. అనేక మున్యాశ్రమాలు, పుణ్య నదులు, దేవా లయాలు దర్శించి అయోధ్యకు చేరు కున్నాడు. ఆ తర్వాత శ్రీరామునిలో గొప్ప మార్పు వచ్చింది. తోటి బాలురతో ఆడటం మానేశాడు. ఎవరితోనూ మాట్లాడడు. ఎప్పుడూ పద్మాసనంలో కూర్చుని, ఏదో దీర్ఘాలోచనలో ఉండేవాడు.

అలా ఉండటానికి కారణం ఏమిటని తండ్రి దశరథుడు అనునయంగా ఎన్నిసార్లు అడిగినా సమాధానం చెప్పడు. దశరథుడు, వశిష్ఠునితో చర్చించాడు. ఆయన రాముని 'ఈ విచిత్ర ప్రవర్తనకు కారణం ఏదో ఉండే ఉంటుంది. నెమ్మదిగా తెలుసుకోవాలి' అంటాడు.

ఆ సమయంలోనే విశ్వామిత్రుడు తన యజ్ఞ రక్షణకు రాముని పంపమని దశరథుని అడగటానికి వచ్చాడు. అప్పుడు రాముడు విశ్వామిత్రునితో సంభాషిస్తూ... తీర్థయాత్రల నుంచి వచ్చిన దగ్గర నుంచి తనలో ఒక విచారణ ఉత్పన్నమైనదనీ, ప్రాపంచిక విషయాల పట్ల తనలో అనాసక్తి ఏర్పడిందనీ, ధనాదులు, సంపదలు శాశ్వతానందాన్ని ఇవ్వక పోగా ఇంకా అజ్ఞానారణ్యం లోకి తోసి వేస్తున్నాయనీ చెబుతాడు. తామరాకు మీద నీటి బొట్టులా నిర్లిప్తంగా ఉండే మార్గం ఏదీ? అని అడుగుతాడు. శ్రీరామునిలో ఈ వైరాగ్యాన్ని చూసి అతడికి ఆత్మ విచారణ తత్వాన్ని బోధించమని వశిష్ఠునితో చెబుతాడు విశ్వామిత్రుడు.

అప్పుడు ఒక సభా వేదికను ఏర్పాటు చేసి, వశిష్ఠుడు జ్ఞానయుక్త వైరాగ్యంతో కర్మ వైముఖ్యం పొందిన శ్రీరామునికి జ్ఞాన, కర్మలు రెండూ వేరు కావనీ, ఒకే పక్షికున్న రెండు రెక్కల వంటివనీ బోధించి కర్తవ్యోన్ముఖుని చేయటానికి ప్రేరణాత్మక కథలనూ, ఆత్మ విచారణ తత్వాన్నీ బోధించాడు. ఈ కథల సారమే యోగవాశిష్ఠంగా ప్రఖ్యాతమైంది.

– డా॥ చెంగల్వ రామలక్ష్మి

స్వయం ఉపాధి సాంకేతిక కోర్సుల్లో ఉచిత శిక్షణ

భూదాన్ పోచంపల్లి: యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం జలాల్‌పురంలోని స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి సాంకేతిక కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ చైర్మన్ ఎస్.కిశోర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2 నెలల వ్యవధి కలిగిన బేసిక్ కంప్యూటర్ కోర్సుకు ఇంటర్ పాసై ఉండాలని పేర్కొన్నారు. అలాగే మూడున్నర నెలల వ్యవధి కలిగిన సోలార్‌సిస్టమ్ ఇన్‌స్టాలేషన్ అండ్ సర్వీస్ కోర్సుకు పదో తరగతి లేదా ఐటీఐ విద్యార్హత కలిగిన వారికి ప్రాధాన్యం ఇస్తామన్నారు. అభ్యర్థులు 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయసు కలిగి ఉండాలని, శిక్షణా కాలంలో ఉచిత భోజనంతో కూడిన హాస్టల్ వసతి కల్పిస్తామని వెల్లడించారు. శిక్షణ పూర్తి చేసుకొన్న అభ్యర్థులకు ఉద్యోగం కల్పిస్తామని, ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో సంస్థలో నేరుగా హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు 9133908000, 9133908111 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

కొత్త రేషన్ కార్డులకు ఆరోగ్యశ్రీ

ఆరోగ్యశ్రీ ట్రస్ట్ పోర్టల్‌లోకి కొత్తవారి పేర్లు

- ప్రస్తుతం పోర్టల్‌లో 2.81 కోట్ల మంది అటాచ్
- కొత్తగా సుమారు 30 లక్షల మంది వివరాలు
- 2023 నుంచి 10.72 లక్షల మందికి ఆరోగ్యశ్రీ సేవలు
- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

సాక్షి, హైదరాబాద్: కొత్త రేషన్‌కార్డులు పొందిన వారందరికీ ఆరోగ్యశ్రీ సదుపాయం కల్పించేందుకు వైద్య,ఆరోగ్య శాఖ ప్రయత్నాలు ప్రారంభించింది. రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ద్వారా రేషన్ కార్డుల్లో పేరున్న వ్యక్తులందరికీ ఆరోగ్యశ్రీని వర్తింపజేస్తున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది జనవరి ఒకటో తేదీ నాటికి రాష్ట్రంలో 89,95,282 రేషన్ కార్డులు ఉండగా, వాటిలో సభ్యులుగా 2.81 కోట్ల మంది ఉన్నారు. వీరందరు ఆరోగ్యశ్రీ పోర్టల్‌తో అనుసంధానమై ఉన్నారు. వీరికి ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో నిబంధనల మేరకు చికిత్సలకు అవకాశం ఉంటుంది.

కొత్తగా 30 లక్షల మంది

జనవరి 26 నుంచి రాష్ట్రంలో కొత్తగా రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ మొదలైంది. కొత్తగా సుమారు 6 లక్షలకు పైగా రేషన్‌కార్డులు జారీ చేశారు. దీంతో రాష్ట్రంలో మొత్తం కార్డుల సంఖ్య 95,56,625కు పెరిగింది. వీటిల్లో 3.10 కోట్ల మంది లబ్ధిదారులుగా నమోదయ్యారు. కొత్తగా కార్డుల్లో చేరిన 30 లక్షల మంది వివరాలు ఆరోగ్యశ్రీ పోర్టల్‌లోకి ఎక్కిస్తున్నారు. ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలతో కొత్త కార్డుదారుల వివరాలను కూడా ఆరోగ్యశ్రీ పోర్టల్‌లో ఎక్కించాలని ఆదేశించటంతో అధికారులు ఆ మేరకు చర్యలు చేపట్టారు.

2023 నుంచి 10.72 లక్షల మందికి ఆరోగ్యశ్రీ సేవలు: మంత్రి దామోదర

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన డిసెంబర్, 2023 నుంచి ఇప్పటివరకు 10.72 లక్షల మందికి ఆరోగ్యశ్రీ సేవలు అందించినట్లు మంత్రి దామోదర తెలిపారు. వైద్య సేవల బిల్లుల కింద ప్రభుత్వం నెట్‌వర్క్ ఆస్పత్రులకు రూ.1,590 కోట్లకుపైగా చెల్లించింది. సగటున 22 శాతం మేర చికిత్స చార్జీలు పెరగడంతోపాటు ప్రతి నెలా ఆస్పత్రులకు బిల్లుల కింద రూ.100 కోట్ల వర కు చెల్లిస్తుండటంతో ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్‌లో చేరేందుకు ప్రైవేటు ఆస్పత్రులు ఆసక్తి చూపిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ప్రస్తుతం 461 ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు అందుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్నిరకాల మందులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

ఘోర ప్రమాదం.. ఇద్దరు ఏపీ డీఎస్పీల దుర్మరణం

- ఏఎస్పీ, హెడ్‌కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు
- ముందు వెళ్తున్న వాహనం సడన్ బ్రేక్ వేయడం వల్లే ప్రమాదం
- అదుపు తప్పిన స్కార్పియో.. డివైడర్‌ను ఢీకొట్టి అవతలి రోడ్డుపై పల్టీలు
- అదే సమయంలో వేగంగా వెళ్తున్న సిమెంట్ ట్యాంకర్ ఢీకొట్టిన వైనం


రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న స్కార్పియో


శాంతారావు


చక్రధర్‌రావు

చౌటుప్పల్ (తెలంగాణ): యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఖైతాపురం వద్ద హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఏపీ ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ విభాగానికి చెందిన ఇద్దరు డీఎస్పీలు దుర్మరణం పాలయ్యారు. అదే విభాగానికి చెందిన చెందిన అడిషనల్ ఎస్పీ, కారు నడుపుతున్న హెడ్ కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. ఏపీ ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ అడిషనల్ ఎస్పీ, రాజమండ్రికి చెందిన కోకా దుర్గా మల్లేశ్వర రామప్రసాద్ (58), అదే వింగ్ డీఎస్పీలు, పశ్చిమ గోదావరి జిల్లా పాల కొల్లుకు చెందిన మేక చక్రధర్‌రావు (57), శ్రీకాకుళం జిల్లా పోలాకి మండలం డోలకు చెందిన జల్లు శాంతారావు (54) ముగ్గురి కుటుంబాలు హైదరాబాద్‌లోనే నివాసం ఉంటున్నాయి.

చంద్రబాబు బందోబస్తు కోసం వస్తూ..

ఏపీ సీఎం చంద్రబాబు సింగపూర్ వెళ్లేందుకు హైదరాబాద్ రావడంతో విధి నిర్వహణలో భాగంగా దుర్గా మల్లేశ్వరరామప్రసాద్, శాంతా రావు, చక్రధర్ రావు కారులో విజయవాడ నుంచి హైదరాబాద్‌కు శుక్రవారం రాత్రి 9.30 గంటలకు బయలుదేరారు. మార్గంమధ్యలో కొర్లపహాడ్ టోల్‌ప్లాజా సమీపంలో వారి కారు మరమ్మతులకు గురైంది. దీంతో వారు విషయాన్ని హైదరాబాద్‌లోని తమ శాఖ కార్యాలయానికి తెలియజేశారు. అధికారులు మరో స్కార్పియో కారును సమకూర్చి డ్రైవర్‌గా హైదరాబాద్ బొల్లారంలో నివాసం ఉండే కడప జిల్లా రాజంపేటకు చెందిన హెడ్ కానిస్టేబుల్ రెడ్డిచర్ల నర్సింహరాజును పంపించారు. హైదరాబాద్ నుంచి వచ్చిన స్కార్పియోలో ఏఎస్పీ, డీఎస్పీలు బయలుదేరారు. శనివారం తెల్లవారుజామున 4.45 గంటలకు ఖైతాపురం వద్దకు చేరుకోగానే ముందున్న గుర్తు తెలియని వాహనం సడన్ బ్రేక్ వేయడంతో డివైడర్ పక్కగా వెళ్తున్న స్కార్పియోను ప్రమాదం నుంచి తప్పించేందుకు డ్రైవర్ యత్నించారు. అయితే ఒక్కసారిగా స్కార్పియో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. అంతటితో ఆగక డివైడర్ మీదికి ఎక్కి 50 మీటర్ల దూరం ముందుకు దూసుకెళ్లింది. ఆ తర్వాత విజయవాడ మార్గంలోకి వెళ్లి పల్టీలు కొట్టింది. అదే సమయంలో విజయవాడ వైపు వేగంగా వెళ్తున్న సిమెంట్ ట్యాంకర్ పోలీసుల కారును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు డీఎస్పీలు మేక చక్రధర్‌రావు, జల్లు శాంతారావు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. ముందు సీట్లో కూర్చున్న అడిషనల్ ఎస్పీ కోకా దుర్గా మల్లేశ్వర రామప్రసాద్, కారు నడుపుతున్న హెడ్ కానిస్టేబుల్ రెడ్డిచర్ల నర్సింహరాజు తీవ్రంగా గాయపడ్డారు.

మమ్మల్ని కాపాడండి ప్లీజ్...

- బైక్‌ను ఢీకొట్టిన ట్యాంకర్.. చక్రాల కింద పడ్డ తండ్రీకుమార్తె..
- సాయం కోసం అర్థించిన వైనం.. ఫోన్ పాస్‌వర్డ్ చెబుతూ కూతురు.. ఫోన్ నంబర్ చెబుతూ తండ్రి మృత్యువాత
- షాద్‌నగర్ పట్టణంలో ఘటన


లారీ వెనక టైర్ల కింద పడిన మైత్రి


మశ్చేందర్ మృతదేహం

షాద్‌నగర్: ట్యాంకర్ లారీ రూపంలో దూసుకొచ్చిన మృత్యువు తండ్రీకూతుళ్ల ప్రాణాలను బలితీసుకుంది. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలో శనివారం ఉదయం చోటుచేసుకుంది. శంషాబాద్ పరిధిలోని పెద్ద షాపూర్‌కు చెందిన మశ్చేందర్ (42), లావణ్య దంపతులకు మైత్రి (20) ఏకైక సంతానం. వీరు ఎనిమిదేళ్ల క్రితం షాద్‌నగర్ వచ్చి శ్రీనివాస కాలనీలో ఉంటున్నారు. మశ్చేందర్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. మైత్రి నాగర్‌గూడ శివారు వర్ధమాన్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతోంది. రోజు మాదిరిగానే ఆమెను బస్టాప్‌లో దింపేందుకు మశ్చేందర్ బైక్‌పై బయల్దేరాడు. షాద్‌నగర్ చౌరస్తాలో బస్టాండ్‌వైపు వెళ్తుండగా అతివేగంతో వెనక నుంచి దూసుకొచ్చిన పెట్రోల్ ట్యాంకర్ లారీ వీరిని ఢీకొట్టింది. బైక్ రోడ్డు పక్కన పడిపోగా లారీ ముందు టైర్ కింద తండ్రి, వెనక టైర్ల కింద కూతురు పడటంతో శరీర భాగాలు నుజ్జునుజ్జయ్యాయి.

కాపాడండి ప్లీజ్..

ప్రమాదం జరిగిన స్థలానికి సమీపంలో ఉన్న ప్రత్యక్ష సాక్షి తయ్యబ్ అక్కడికి వెళ్లగా.. తీవ్ర గాయాలపాలైన మశ్చేందర్ తన కూతురును కాపాడమంటూ వేడుకున్నాడు. మరోవైపు తమ వారికి సమాచారం ఇవ్వండి అంటూ మైత్రి ఆర్తనాదాలు చేసింది. మృత్యువు కబళిస్తున్నా మైత్రి తన జేబులోని మొబైల్‌ను తీసి తయ్యబ్‌కు అందించి, కుటుంబ సభ్యులకు ఫోన్ చేయమని కోరింది. పాస్‌వర్డ్ చెప్పేలోపే ప్రాణం వదిలింది. దీంతో లారీ ముందు టైర్ కింద పడి కొనఊపిరితో ఉన్న మశ్చేందర్ వద్దకు వెళ్లిన తయ్యబ్ కుటుంబ సభ్యుల ఫోన్ నంబర్ చెప్పమని అడగగా.. అతికష్టంగా తొమ్మిది నంబర్లు చెప్పిన ఆయన మరో నంబర్ చెప్పేలోపే కన్నుమూశాడు. అదే సమయంలో మైత్రి ఫోన్‌కు స్నేహితురాలి నుంచి కాల్ వచ్చింది. దీంతో తయ్యబ్ ప్రమాదం విషయాన్ని చెప్పడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందింది.

లారీడ్రైవర్ అదుపులోకి..

ప్రమాదం విషయాన్ని తెలుసుకున్న సీఐ విజయ్‌కుమార్, ఎస్‌ఐ సుశీల సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. తండ్రీకూతురు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

నా చావుకు కారణం కరప్షన్, పొల్యూషన్

- మణికొండలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ బలవన్మరణం
- నాలుగు పేజీల సూసైడ్ నోట్ లభ్యం


వేణుగోపాల్

గచ్చిబౌలి (హైదరాబాద్): 'ఎక్కడ చూసినా కరప్షన్, పొల్యూషన్. నేను భూమి మీద ఉండి ఉద్ధరించేది ఏం లేదు. అందుకే ఆత్మహత్యకు పాల్పడుతున్నా' అంటూ ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ నాలుగు పేజీల సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వెంకన్న తెలిపిన వివరాలు.. ఆంధ్రప్రదేశ్ రాజమహేంద్రవరానికి చెందిన గుత్తుల వేణుగోపాల్ (26) రాయదుర్గంలోని ఓ ఐటీ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. తన అన్నా వదినలతో కలిసి మణికొండలోని షిరిడి సాయినగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 23న అన్న, వదినలతో కలిసి రాజమహేంద్రవరానికి వెళ్లారు. అదే రోజు రాత్రి వేణుగోపాల్ తిరిగి మణికొండకు వచ్చాడు. 24న తల్లిదండ్రులతో ఫోన్ మాట్లాడగా, 25న ఫోన్ స్విచ్చాఫ్ చేసి ఉంది. దీంతో కుటుంబ సభ్యులు శుక్రవారం ఉదయం వాచ్‌మెన్‌కు ఫోన్ చేశారు. వాచ్‌మన్ వెళ్లి కిటికీలోంచి చూడగా వేణుగోపాల్ సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని కనిపించాడు. దీంతో కుటుంబ సభ్యులకు వీడియో కాల్ చేసి చూపించాడు. దీనిపై రాయదుర్గం పోలీసులకు సమాచారం అందించారు. శనివారం పోస్టుమార్టం అనంతరం పోలీసులు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భూమి మీద నుంచే శాటిలైట్లపై దాడి!

అత్యాధునిక ఆయుధ తయారీలో నిమగ్నమైన చైనా

- శక్తివంతమైన క్రిస్టల్‌ను తయారుచేసిన డ్రాగన్ దేశం
- పరారుణ కాంతి పుంజాన్ని వెలువర్చనున్న అసాధారణ కృత్రిమ స్ఫటికం
- ప్రపంచంలోనే అతిపెద్ద బీజీసీఈ స్ఫటికమిది

ఎలక్ట్రానిక్స్, టెక్స్‌టైల్స్, ఆటోమొబైల్స్‌సహా ఎన్నో రంగాల్లో ప్రపంచ అగ్రగామిగా వెలుగొందుతున్న చైనా ఇప్పుడు మరో అసాధారణ, శక్తివంతమైన ఆయుధ తయారీలో తలమునకలైంది. అగ్రరాజ్యం అమెరికాను తలదన్నేలా ఎన్నెన్నో ఆవిష్కరణలు చేసిన చైనా ఇప్పుడు దేశ భద్రత, రక్షణే పరమావధిగా కీలక ఆయుధాన్ని సృష్టిస్తోంది. తమ వైమానిక, అణు స్థావరాలు, వ్యూహాత్మక ప్రాంతాల గుట్టుమట్టు చెప్పే విదేశీ, శత్రు ఉపగ్రహాలను అంతరిక్షంలోనే తునాతునకలు చేసే లేజర్ కాంతి ఆయుధాన్ని అభివృద్ధిచేస్తోంది. కాంతి సాధారణ స్థాయిలోకాకుండా ప్రత్యేకమైన స్ఫటికాల గుండా ప్రసరించినప్పుడు మరింత శక్తివంతంగా మారుతుంది. అత్యంత తీక్షణతో ప్రసరిస్తూ ఆ లేజర్ కాంతి ఎంతటి కఠినమైన పదార్థాన్నైనా సునాయాసంగా కోసేస్తుంది. భవిష్యత్తులో పనికిరాకుండా సర్వనాశనంచేసేస్తుంది. లేజర్ కాంతి ఎంతటి శక్తివంతమైందో ఇప్పటికే పరిశ్రమ రంగంలో చూస్తూనే ఉన్నాం. ఇప్పుడీ లేజర్ కాంతిని అంతరిక్షంలో చక్కర్లు కొట్టే శత్రుదేశాల ఉపగ్రహాలపైకి చైనా ప్రయోగించనుంది. భూమి నుంచి ఎన్నో కిలోమీటర్ల ఎత్తులో పరిభ్రమించే ఉపగ్రహాలను నేలమీద నుంచే గురిచేసి కొట్టడం అంత తేలికైనపని కాదు. అందుకే బేరియం గాలియం సెలినైడ్(బీజీసీఈ) కృత్రిమ స్ఫటికాన్ని చైనా అభివృద్ధి చేసింది. ఇది ప్రపంచంలోనే అతి పెద్ద క్రిస్టల్ అని సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ తన కథనంలో పేర్కొంది. ఎంత పెద్ద ఇనుపగుండుతో దెబ్బ కొడితే అంతగా బీభత్సం స్థాయికి పెరుగుతుంది. అలాగే బీజీసీఈ క్రిస్టల్ నుంచి వెలువడే లేజర్ కాంతి సృష్టించే వినాశనం కూడా అంతే భారీ స్థాయిలో ఉంటుంది.

సూక్ష్మం నుంచే సర్వనాశనం..

బీజీఈసీతో తయారైన లేజర్ కాంతి పుంజం వ్యాసం కేవలం 6 సెంటీమీటర్లు మాత్రమే. ఒక్క మాటలో చెప్పాలంటే ఇది ఒక ఖడ్గం అంచుకు ఉండే పదునులాంటిది. కత్తి అంచును ఎంత సానబడితే అంత పదునెక్కుతుంది. అలాగే ఈ స్ఫటికం ఎంత పారదర్శకంగా ఉంటే అందులోంచి వెలువడే లేజర్ కాంతి అంత ప్రాణాంతకంగా మారుతుంది. ఇది ఆకాశంలో చాలా కిలోమీటర్ల దూరం వరకు తీవ్రత ఏమాత్రం తగ్గకుండా అదే తీక్షణతతో దూసుకెళ్తుంది. అలా అది ఏకంగా ఉపగ్రహాలను సైతం ముక్కలుగా కోసేస్తుంది. స్వల్పశ్రేణి పరారుణకాంతి పుంజాలను అత్యంత సుదూరమైన లేజర్ కాంతి పుంజాలుగా, మారణాయుధాలుగా మార్చేందుకు బీజీఈసీ స్ఫటికం అక్కరకొస్తుంది. ''చదరపు సెంటీమీటర్ల విస్తీర్ణంలో ఏకంగా 550 మెగావాట్ల లేజర్ కాంతిని ఈ స్ఫటికం ప్రసరింపజేస్తుంది. ఇంతటి తీక్షణత ధాటికి ఎంతటి కఠినమైన మూలకంతో తయారైన ఉపగ్రహ ఉపరితల పొరనైనా ముక్కలవడం ఖాయం. వందల కిలోమీటర్ల ఎత్తు నుంచి తమపై నిఘా పెట్టిన శత్రు ఉపగ్రహాలను ఉన్నచోటులోనే ఉన్నపళంగా నిర్వీర్యంచేసే శక్తి ఈ క్రిస్టల్ పరారుణ కాంతి ఆయుధానికి ఉంది''అని ప్రొఫెసర్ వూ హైక్సిన్ అన్నారు. ఈయన సింథటిక్ క్రిస్టల్ జర్నల్‌లో ప్రచురించబడిన పరిశోధనా పత్రానికి ముఖ్యరచయితగా వ్యవహరించారు.



లేజర్ క్రిస్టల్

అత్యంత సురక్షితం, అతి సామర్థ్యం..

ఇంతటి తీక్షణమైన కాంతి పుంజాన్ని వెదజల్లేటప్పుడు ఈ ఆయుధవ్యవస్థ బాగా వేడెక్కుతుంది. అలాంటప్పుడు వేడికి అదే కాలిపోతుంది. అలాంటి పరిస్థితులురాకుండా దీనిని తయారుచేస్తున్నారు. గతంలో అమెరికా అచ్చం ఇలాంటి ప్రయోగమే చేసి చేతులుకాల్చుకుంది. 1997లో అమెరికా నావికాదళం మిడ్ ఇన్‌ఫ్రారెడ్ అడ్వాన్స్‌డ్ కెమికల్ లేజర్(మిరాకిల్) పేరిట ఒక ప్రయోగంచేసింది. సొంత ఉపగ్రహాన్నే పలుమార్లు పరారుణకాంతితో కరిగించేందుకు ప్రయత్నించి విజయవంతమైంది. కానీ ఆ లేజర్‌బీమ్‌ను వెదజల్లే వ్యవస్థ సైతం కరిగిపోయింది. ఈ పరిస్థితి తలెత్తకుండా చైనా పలు జాగ్రత్తలు తీసుకుంటోంది. బేరియం గాలియం సెలినైడ్(బీజీసీఈ) కృత్రిమ స్ఫటికాన్ని చైనా శాస్త్రవేత్తలే తొలిసారిగా 2010లో అభివృద్ధిచేశారు. వెంటనే దీనిని తమ ఆయుధవ్యవస్థల్లో అమర్చుకునేందుకు పలు దేశాల రక్షణశాఖలు ప్రయత్నించినా అది ఎందుకో సఫలంకాలేదు.

– సాక్షి, నేషనల్ డెస్క్

శత్రు పీచమణచే రుద్ర!

సరికొత్త స్పెషల్ ఫోర్స్ బ్రిగేడ్


- భైరవ్ బెటాలియన్ సైతం..
- అతి శక్తిమంతమైన సైనిక విభాగాలు
- కేంద్రం పచ్చజెండా: ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది ప్రకటన

ద్రాస్(కార్గిల్): మన సైన్యం మరింత శక్తిసామర్థ్యాలు సంతరించుకోబోతోంది. బహుముఖ అవసరాలను తీర్చేలా అత్యాధునిక పూర్తిస్థాయి సాయుధ దళా (బ్రిగేడ్) లను ఏర్పాటు చేసుకోనుంది. ఈ స్పెషల్ ఫోర్స్ యూనిట్లకు 'రుద్ర'గా నామకరణం చేసినట్టు ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది వెల్లడించారు. అలాగే సరిహద్దుల వద్ద శత్రువులకు కోలుకోలేని షాకిచ్చే 'భైరవ్'లైట్ కమెండో బెటాలియన్లు కూడా రానున్నట్టు తెలిపారు. కార్గిల్ యుద్ధంలో పాక్ పీచమణచిన చరిత్రాత్మక ఘట్టానికి గుర్తుగా జరుపుకుంటున్న విజయ్ దివస్‌కు 26 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం ద్రాస్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ మేరకు ప్రకటించారు. ''భావి అవసరాలకు దీటుగా ఎదిగే తిరుగులేని శక్తిగా సైన్యం బలోపేతం అవుతోంది. రుద్ర బ్రిగేడ్ల ఏర్పాటు అందులో భాగమే''అని తెలిపారు. ఇందుకు శుక్రవారమే కేంద్రం నుంచి అనుమతులు లభించినట్టు వెల్లడించారు. ''అలాగే ప్రతి పదాతి బెటాలియన్‌లోనూ డ్రోన్ ప్లటూన్లు ఏర్పాటు కానున్నాయి. ఆర్టిలరీ విభాగాల విధ్వంసక శక్తిని 'దివ్యాస్త్ర', లాయిటర్ మ్యునిషన్ బ్యాటరీలతో మరింతగా బలోపేతం చేశాం. పూర్తిగా దేశీయంగా తయారు చేసిన గగనతల రక్షణ వ్యవస్థలతో వాయుసేనను దుర్నిరీక్ష్యంగా తీర్చిదిద్దుతున్నాం. ఇది మన సైనిక పాటవాన్ని చెప్పలేనంతగా పెంచేస్తోంది''అని పేర్కొన్నారు. 1999లో కిరాయి మూకల ముసుగులో పాక్ సైన్యం కశ్మీర్‌లో సరిహద్దుల గుండా చొచ్చుకొచ్చి మన భూభాగంలో పాగా వేయడం తెలిసిందే. మంచుకొండల్లోని తోలోలింగ్, టైగర్ హిల్స్ వంటి శిఖరాలపై అత్యంత ప్రతికూల పరిస్థితుల్లో మూడు నెలల పాటు జరిపిన ముమ్మర పోరులో పాక్ మూకలను మన సైన్యం తిప్పికొట్టడం తెలిసిందే. అందుకు గుర్తుగా ఏటా జూలై 26న విజయ్ దివస్ జరుపుకుంటూ వస్తున్నాం.

ఏమిటీ 'రుద్ర'?

ఆర్మీ చీఫ్ ప్రకటించిన రుద్ర బ్రిగేడ్ అత్యాధునిక యుద్ధ విభాగం (బ్రిగేడ్). దీని విశేషాలు అన్నీ ఇన్నీ కావు...

- ఇది త్రివిధ దళాలతో కూడిన బ్రిగేడ్
- ఇందులో పదాతి, సాయుధ విభాగాలు, ఆర్టిలరీ, స్పెషల్ ఫోర్సెస్, మానవ రహిత యుద్ధ విమాన వ్యవస్థలు తదితరాలు ఉంటాయి.
- ప్రత్యేకంగా తీర్చిదిద్దిన సాయుధ, మద్దతు వ్యవస్థలు వీటికి వెన్నుదన్నుగా నిలుస్తాయి.
- రెండు సైనిక పదాతి దళ విభాగాలను ఇప్పటికే రుద్ర బ్రిగేడ్లుగా ఆధునీకరించారు. మరిన్ని బ్రిగేడ్ల ఏర్పాటు పనులు చురుగ్గా సాగుతున్నాయి.
- ఇప్పటిదాకా సైనిక బ్రిగేడ్లు ఏక తరహా వ్యక్తిగత ఆయుధాలతో కూడినవిగా మాత్రమే ఉన్నాయి.



కార్గిల్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఆర్మీ చీఫ్ జనరల్ ద్వివేది

కార్గిల్ వీరగాథలు విన్పించే 'ఇ-శ్రద్ధాంజలి' యాప్

బతాలిక్ సెక్టర్‌లో ఇండస్ వ్యూ పాయింట్ ● కార్గిల్ వీరుల గౌరవార్థం మూడు ప్రాజెక్టులు

కార్గిల్ యుద్ధ అమరవీరులను గౌరవార్థం మూడు కొత్త ప్రాజెక్టులను ఆర్మీ చీఫ్ ప్రకటించారు. 'ఇ-శ్రద్ధాంజలి'పేరుతో డిజిటల్ ప్లాట్‌ఫాంను ఏర్పాటు చేశారు. దీని ద్వారా కార్గిల్ వీరులకు పౌరులు శ్రద్ధాంజలి తెలపవచ్చు. అలాగే ఓ ఈ క్యూఆర్ ఆధారిత ఆడియో గేట్‌వే యాప్ కూడా రూపొందించారు. ఇది కార్గిల్ యుద్ధానికి సంబంధించిన రోమాంచిత గాథలను వినిపిస్తుంది. దీన్ని అమరవీరులకు అంకితమిచ్చారు. అలాగే నియంత్రణ రేఖ సమీపంలోని బతాలిక్ సెక్టర్‌ను సందర్శించే వారి కోసం వ్యూ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. ఇది కార్గిల్, ఇండస్ లేహ్, బల్టిస్తాన్ మధ్య భాగంలో 10 వేల అడుగుల ఎత్తున ఉండే కీలక వ్యూహాత్మక పాయింట్. అక్కడ విధులు నిర్వహించే సైనికుల జీవితం ఎలా ఉంటుందో ప్రత్యక్షంగా చూసి అర్థం చేసుకునేందుకు ఈ వ్యూ పాయింట్ వీలు కల్పిస్తుంది. ''ఇది మ్యూజియంల వంటి కాన్సెప్ట్. ఇయర్‌ఫోన్స్ ద్వారా ఆడియో ద్వారా కార్గిల్ యుద్ధ విశేషాలను వినవచ్చు. మన సైనికుల శౌర్యం, ధైర్యసైర్యాలు, త్యాగాలను తెలుసుకుని పొంగిపోవచ్చు''అని సైనికాధికారి ఒకరు వివరించారు.

ఉగ్ర భూతాన్ని సహించేదే లేదు

'సిందూర్'తో పాక్‌కు హెచ్చరిక ● దాయాదికి ఆర్మీ చీఫ్ చురకలు

''ఉగ్ర భూతానికి దన్నుగా నిలిచే దుష్టశక్తులను భారత్ ఏ మాత్రమూ సహించే ప్రసక్తే లేదు. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా మన త్రివిధ దళాలు తిరుగులేని సమన్వయంతో జరిపిన పెను దాడులు పాకిస్తాన్‌కు పంపిన తిరుగులేని హెచ్చరిక సంకేతాలవే. అంత మాత్రమే కాదు, దేశం హృదయానికి తీరని గాయం చేసిన పహల్గాం ఉగ్ర దాడికి మన సమష్టి ప్రతిస్పందన కూడా. గత ఉగ్ర దాడుల మాదిరిగా ఈసారి మన దేశం కేవలం శోకించి సరిపెట్టుకోలేదు. అలాంటి ఘాతుకాలకు మన స్పందన నిర్ణయాత్మకంగా, ప్రత్యర్థి కోలుకోలేని రీతిలో ఉంటుందని నిరూపించాం. తద్వారా అలాంటి మతిలేని ఉగ్రోన్మాదానికి, దానికి దన్నుగా నిలిచే ధూర్త దేశాలకు మన స్పందన విషయంలో సరికొత్త ప్రమాణాన్ని నిర్దేశించాం'' అని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది అన్నారు. 1999లో కార్గిల్ యుద్ధంలో పాక్‌పై మన విజయానికి ప్రతీకగా జరుపుకుంటున్న విజయ్ దివస్‌కు శనివారంతో 26 ఏళ్లు నిండాయి. ఈ సందర్భంగా జమ్మూకశ్మీర్‌లోని ద్రాస్‌లో కార్గిల్ యుద్ధ స్మారకాన్ని ఆయన సందర్శించారు. అక్కడి సైనిక సిబ్బంది తదితరులను ఉద్దేశించి మాట్లాడారు. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో మే 7న పర్యాటకులపై పాక్ ప్రేరేపిత జైషే ఉగ్ర సంస్థకు చెందిన ముష్కరులు విచక్షణారహిత కాల్పులకు తెగబడి 26 మంది అమాయకులను పొట్టన పెట్టుకోవడం తెలిసిందే. అందుకు ప్రతిగా ఆపరేషన్ సైన్యంపై దేశ ప్రజలు చూపిన తిరుగులేని విశ్వాసం, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పూర్తి స్వేచ్ఛ వల్లే ఉన్మాదానికి తిరుగులేని రీతిలో సమాధానం చెప్పగలిగాం. మన దేశ ఐక్యత, సమగ్రత, సార్వభౌమత్వానికి, ప్రజలకు హాని తలపెట్టే ముష్కర శక్తులకు తగిన సమాధానం ఇస్తామని నిరూపించాం ''అని ప్రకటించారు. సిందూర్ ఆపరేషన్‌లో పాక్ గడ్డపై స్వేచ్ఛగా చెలరేగుతున్న 9 మంది అత్యున్నత స్థాయి ఉగ్రవాదులను మట్టుబెట్టిందని గుర్తు చేశారు. మనకు అణుమాత్రం కూడా నష్టం కలగకుండా పని పూర్తి చేశామన్నారు. ''పీఓకే, పాక్‌లోని ఉగ్ర స్థావరాలను అత్యంత కచ్చితత్వంతో నేలమట్టం చేశాం. తద్వారా దాయాదిపై నిర్ణాయక విజయం సాధించాం. వాటిపై మన బాంబు, క్షిపణి దాడులను అడ్డుకునేందుకు పాక్ చేసిన ప్రయత్నాలను పూర్తిస్థాయిలో అడ్డుకున్నాం. ప్రతిగా మే 8, 9 తేదీల్లో పాక్ సైన్యం మన సైనిక స్థావరాలు, పౌర ఆవాసాలపై తలపెట్టిన దాడులకు మర్చిపోలేని రీతిలో బదులిచ్చాం. ఇరుదేశాల మధ్య శాంతి నెలకొనేలా చూసేందుకు ప్రయత్నం చేశాం. కానీ పాక్ మాత్రం ఎప్పట్లాగే ఉగ్ర మూకలను ప్రేరేపించడం ద్వారా మరోసారి పిరికిపంద చర్యకు దిగింది. మన గగనతల రక్షణ వ్యవస్థ దుర్భేద్యమైన కవచంలా నిలిచి కాపాడింది. ఒక్క క్షిపణి, డ్రోన్ కూడా సరిహద్దులు దాటి చొచ్చుకురాకుండా అడ్డుకుంది''అని ఆర్మీ చీఫ్ గుర్తు చేశారు. భారత సైన్యం ప్రపంచంలోనే తిరుగులేని శక్తిగా ఎదుగుతోందన్నారు.

విశ్వసనీయ నేత మోదీ

- 'మార్నింగ్ కన్సల్ట్'సర్వేలో వెల్లడి
- రెండో స్థానంలో దక్షిణ కొరియా అధ్యక్షుడు
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు ఎనిమిదో ర్యాంకు

న్యూఢిల్లీ: భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ, విశ్వసనీయత కలిగిన నాయకుడిగా మరోసారి ఘనత సాధించారు. అమెరికాకు చెందిన ఇంటెలిజెన్స్ సంస్థ 'మార్నింగ్ కన్సల్ట్'నిర్వహించిన గ్లోబల్ లీడర్ అప్రూవల్ ట్రాకర్ సర్వేలో ఈ విషయం వెల్లడయ్యింది. మోదీకి ఏకంగా 75 శాతం అప్రూవల్ రేటింగ్ లభించడం విశేషం. అంటే సర్వేలో పాల్గొన్న వారిలో 75 శాతం మంది మోదీని ప్రజాస్వామ్య ప్రపంచ నేతగా ఆమోదించారు. 18 శాతం మంది మోదీ వైపు మొగ్గు చూపలేదు. మిగతా 7 శాతం మంది ఏదీ చెప్పలేకపోయారు. ఈ సర్వే వివరాలను 'మార్నింగ్ కన్సల్ట్' విడుదల చేసింది. అత్యంత విశ్వసనీయ ప్రపంచ నాయకుల్లో మోదీ మొదటి స్థానంలో ఉండగా, దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యూంగ్ రెండో స్థానంలో, అర్జెంటీనా అధినేత జేవియర్ మిలీ మూడో స్థానంలో నిలిచారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కేవలం 44 శాతం అప్రూవల్ రేటింగ్‌తో ఎనిమిదో స్థానానికి పరిమితం కావడం గమనార్హం. ఈ నెల 4 నుంచి 10వ తేదీ దాకా ఈ సర్వే నిర్వహించారు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు అన్ని దేశాల్లో ప్రజాభిప్రాయం సేకరించారు. డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న వివాదాస్పద నిర్ణయాల కారణంగానే ఆయనకు ప్రపంచవ్యాప్తంగా ప్రజాదరణ తగ్గుతున్నట్లు తెలుస్తోంది.

అత్యంత విశ్వసనీయ నేతలు

ర్యాంక్	నేత	దేశం	అప్రూవల్ రేటింగ్
1	నరేంద్ర మోదీ	ఇండియా	75
2	జే ఈ మ్యూంగ్	దక్షిణ కొరియా	59
3	జేవియర్ మిలీ	అర్జెంటీనా	57
4	మార్క్ కార్నీ	కెనడా	56
5	ఆంథోనీ అల్బనీస్	ఆస్ట్రేలియా	54
6	క్లాడియా షీన్‌బామ్	మెక్సికో	53
7	కరీన్ కెల్లర్ సట్టర్	స్విట్జర్లాండ్	48
8	డొనాల్డ్ ట్రంప్	అమెరికా	44

మాల్దీవుల అభివృద్ధికి భారత్ సహకారం

ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టీకరణ

మాలె: మాల్దీవులతో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకొనేందుకు కట్టుబడి ఉన్నామని భారత ప్రధాని నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను కొత్త శిఖరాలకు చేర్చడానికి కృషి చేస్తున్నామని చెప్పారు. మాల్దీవుల సర్వతోముఖాభివృద్ధికి సహకారం కొనసాగిస్తామని ప్రకటించారు. ఇక్కడి ప్రజల ఆకాంక్షల సాకారానికి తమ మద్దతు ఎప్పటికీ ఉంటుందని హామీ ఇచ్చారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ శనివారం మాల్దీవుల ఉపాధ్యక్షుడు ఉజ్ హుస్సేన్ మొహమ్మద్ లతీఫ్‌తోపాటు పలువురు ముఖ్య నాయకులను కలుసుకున్నారు. మౌలిక సదుపాయాలు, టెక్నాలజీ, ఇంధనం, వాతావరణ మార్పుల నియంత్రణ సహా పలు కీలక రంగాల్లో పరస్పర సహకారంపై లతీఫ్‌తో చర్చించారు.

మాల్దీవుల స్వాతంత్య్ర దినోత్సవంలో మోదీ

ప్రధాని మోదీ మాల్దీవుల 60వ స్వాతంత్య్ర దినోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రిపబ్లిక్ స్క్వేర్‌లో 50 నిమిషాలపాటు ఈ వేడుకలు జరిగాయి. మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జుతో పాటు భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, విదేశాంగ మంత్రి విక్రమ్ మిస్రీ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మిలటరీ పరేడ్, సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి.

ఎఫ్‌టీఏతో బహుళ ప్రయోజనాలు

- యువత, రైతులు, మత్స్యకారులు, పరిశ్రమలకు లబ్ధి
- ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడి
- తమిళనాడులో రూ.4,900 కోట్ల విలువైన ప్రాజెక్టులు ప్రారంభం

సాక్షి, చెన్నై: యునైటెడ్ కింగ్‌డమ్(యూకే)తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టీఏ) కుదుర్చుకోవడం చరిత్రాత్మకమని, దీనివల్ల మన దేశానికి బహుళ ప్రయోజనాలు ఉంటాయని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. భారత్ పట్ల ప్రపంచదేశాలకు పెరుగుతున్న విశ్వాసానికి, గౌరవానికి ఈ ఒప్పందమే ఒక నిదర్శనమని వివరించారు. ఎఫ్‌టీఏతో వికసిత్ భారత్, వికసిత్ తమిళనాడుకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని వివరించారు. ప్రధాని మోదీ శనివారం తమిళనాడులోని తూత్తుకుడిలో పర్యటించారు. ఎయిర్‌పోర్ట్, రహదారులు, రైల్వే, విద్యుత్‌కు సంబంధించిన రూ.4,900 కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రారంభించి, జాతికి అంకితం ఇచ్చారు. మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు. తమిళనాడు సంప్రదాయ వస్త్రాలు ధరించి, ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ప్రకారం మన దేశానికి సంబంధించిన 99 శాతం ఉత్పత్తులపై బ్రిటన్‌లో ఇక పన్నులు ఉండవని అన్నారు. ఇండియా ఉత్పత్తుల ధరలు తగ్గితే సహజంగానే డిమాండ్ పెరుగుతుందని, దానివల్ల మన దేశంలో వాటి ఉత్పత్తిని పెంచాల్సి వస్తుందని వెల్లడించారు. ఫలితంగా మన యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాల లభిస్తాయని, రైతులు, మత్స్యకారులతోపాటు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు, స్టార్టప్‌లకు లబ్ధి చేకూరుతుందని వివరించారు. విదేశీ పర్యటన ముగించుకొని నేరుగా తమిళనాడులో అడుగుపెట్టడం ఆశీర్వాదంగా భావిస్తున్నట్లు చెప్పారు. ఏ రాష్ట్ర అభివృద్ధికైనా మౌలిక సదుపాయాలు, ఇంధనం చాలా ముఖ్యమని చెప్పారు. గత 11 ఏళ్లుగా ఈ రెండు అంశాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టామని ఉద్ఘాటించారు. తమిళనాడు అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని స్పష్టంచేశారు.



పంచెకట్టులో మోదీ

మన ఆయుధాలతో ఉగ్రవాదుల భరతం పట్టాం

'మేక్ ఇన్ ఇండియా'ఆయుధాలు ఆపరేషన్ సిందూర్‌లో కీలక పాత్ర పోషించాయని, శత్రు శిబిరాలను ధ్వంసం చేశాయని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు. మన స్వదేశీ ఆయుధాలతో ఉగ్రవాదుల భరతం పట్టామని, వారికి నిద్రలేకుండా చేశామని అన్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. దేశవ్యాప్తంగా ఎన్నో వంతెనలు, సొరంగాలు నిర్మించామని, దీనివల్ల వేలాది ఉద్యోగాల సృష్టి జరిగిందని, యువత లబ్ధి పొందారని స్పష్టంచేశారు. చెన్నైలోని ప్రఖ్యాత వళ్లువర్ కోట్టం రథం నమూనాను తమిళనాడు ఆర్థిక మంత్రి తంగం తెన్నరసు ప్రధాని మోదీకి బహూకరించారు.

పామును కొరికి చంపిన పిల్లాడు

బిహార్‌లో అరుదైన ఘటన

- విషం కారణంగా ఆస్పత్రిపాలైన పిల్లాడు
- ప్రస్తుతం కోలుకుంటున్న చిన్నారి



పట్నా: బతికే రాత ఉంటే ఆకాశం నుంచి పడినా ఏమీ కాదని కొందరంటారు. విషం చిమ్మే తాచుపామును కొరికి కూడా ఏడాది వయసు పిల్లాడు బతికి బట్టకట్టిన అరుదైన ఘటన బిహార్‌లో చోటుచేసుకుంది. బొమ్మ అనుకుని పామును పట్టుకోవడం, అది చేతికి చుట్టుకోవడం, తర్వాత దానిని నోటితో కొరికి చంపడం, స్వల్ప విష ప్రభావంతో పిల్లాడు ఆస్పత్రిపాలై చివరకు ప్రాణాలతో బయటపడటం అంతా నమ్మశక్యంకాని రీతిలో జరిగాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం వెస్ట్‌చంపారన్ జిల్లాలోని మొహఛీ బంకాత్వా గ్రామంలో గోవింద్ కుమార్ అనే ఏడాది వయసు పిల్లాడిని తల్లి ఇంటి వరండాలో వదిలేసి సమీపంలో వంటచెరకు సేకరిస్తోంది. అదే సమయంలో పిల్లాడి వైపు ఒక తాచుపాము వచ్చింది. దీనిని బొమ్మగా భావించిన పిల్లాడు పక్కన ఉన్న వస్తువుతో కొట్టాడు. దాంతో అది పిల్లాడి అరచేతికి చుట్టుకుంది. మెత్తగా ఉండటంతో పిల్లాడు అదేదో తినే వస్తువును అనుకుని వెంటనే నోట్లో పెట్టుకుని పరపరా నమిలేశాడు. దీంతో పాము సెకన్లలో చనిపోయింది. అదే సమయానికి అటుగా వచ్చిన పిల్లాడి అమ్మమ్మ మాతేశ్వరీ దేవి .. పిల్లాడి చేతిలో పామును చూసి హుతాశురాలైంది. వెంటనే పిల్లాడిని, పామును వేరుచేసింది. అయితే అప్పుడు హుషారుగా కనిపించిన పిల్లాడు సమయం గడిచేకొద్దీ నీరసించిపోయాడు. తర్వాత స్పృహకోల్పోయాడు. విషయం తెల్సుకుని పరుగున వచ్చిన పిల్లాడి తల్లి, కుటుంబ సభ్యులు వెంటనే పిల్లాడిని దగ్గర్లోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో చేర్పించారు. అయితే పిల్లాడి పరిస్థితి మరింత విషమించడంతో వెంటనే బేతియా పట్టణంలోని ప్రభుత్వ వైద్య బోధనాస్పత్రికి తరలించారు. హుటాహుటిన పిల్లాడికి అత్యయిక వైద్యం మొదలెట్టి పిల్లాడి ప్రాణాలు కాపాడారు. ప్రస్తుతం పిల్లాడు కోలుకుంటున్నాడని, పాము అతడిని కాటువేయలేదని, నోట్లో పెట్టుకుని కొరకడం వల్ల విషం కొంత పాకి నోట్లోకి వెళ్లి ఉంటుందని ఆస్పత్రి సూపరింటెండెంట్ దువాకాంత్ మిశ్రా చెప్పారు.

కాపాడాల్సిన వారే కర్కశంగా..

అశక్తురాలిపై అంబులెన్సులో సామూహిక అత్యాచారం

- అంబులెన్సు డ్రైవర్, టెక్నీషియన్ల అరెస్ట్
- బిహార్‌లోని గయా పట్టణంలో ఘోరం

గయా: ఆపత్కాలంలో మెరుపువేగంతో దూసుకొచ్చి వెంటనే ఆస్పత్రిలో చేర్పించే అంబులెన్సు అన్నా అందులోని సిబ్బంది అన్నా అందరికీ గౌరవం. వేగంగా ఆస్పత్రికి చేర్చి పరోక్షంగా అంబులెన్స్ సిబ్బంది సైతం రోగుల ప్రాణాలు కాపాడతారు. అంతటి బాధ్యతాయుతమైన వృత్తిలో ఉండికూడా అశక్తురాలైన యువతి పట్ల ఒక అంబులెన్సు డ్రైవర్, అందులోని టెక్నీషియన్ అత్యంత దారుణంగా ప్రవర్తించారు. హోంగార్డ్ ఉద్యోగం కోసం గ్రౌండ్‌లో అలసిపోయేలా పరుగెత్తి సొమ్మసిల్లిన యువతిని వీరిద్దరూ అత్యాచారంచేసిన ఘటన బిహార్‌లో చోటుచేసుకుంది. నిందితులు ఇద్దరినీ పోలీసులు అరెస్ట్‌చేశారు. జూలై 24వ తేదీన జరిగిన ఈ అత్యాచారఘటన తాలూకు వివరాలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. గయా పట్టణ ఎస్పీ రమానంద్ కుమార్ కౌశల్ తెలిపిన వివరాల ప్రకారం గయా పట్టణంలో మిలటరీ పోలీస్‌గ్రౌండ్‌లో మహిళా హోంగార్డ్‌ల నియామక ప్రక్రియ మొదలెట్టారు. ఇందులోభాగంగా కొందరు అమ్మాయిలు పోలీసు ఉన్నతాధికారుల సమక్షంలో పరుగుపందెంలో పాల్గొన్నారు. ఒక అమ్మాయి పరుగెత్తుతూ స్పృహతప్పి పడిపోయింది. వెంటనే ఆమెను అక్కడే ఉన్న అంబులెన్సులో సమీప అనురాగ్ నారాయణ్ వైద్య బోధనాస్పత్రికి తరలించారు. అయితే సత్తువ కోల్పోయి, స్పృహలోలేని ఆమెను మార్గమధ్యంలో అంబులెన్స్ డ్రైవర్, టెక్నీషియన్‌లు రేప్‌చేశారు. తర్వాత స్పృహలోకి వచ్చిన అమ్మాయి తనకు జరిగిన ఘోరాన్ని వెంటనే పోలీసు అధికారులకు తెలిపింది. దీంతో అంబులెన్స్ డ్రైవర్ వినయ్ కుమార్, టెక్నీషియన్ అజిత్ కుమార్‌లను పోలీసు ఉన్నతాధికారులు పిలిపించి ఆరా తీయగా పొంతన లేని సమాధానాలు చెప్పారు. దీంతో ఆ ఇద్దరినీ పోలీసులు వెంటనే అరెస్ట్‌చేశారు. భారతీయ న్యాయ సంహిత సెక్షన్ల కింద కేసు నమోదుచేసి దర్యాప్తు మొదలెట్టారు. బాధితురాలిని వైద్య పరీక్షల కోసం ఆస్పత్రికి తరలించామని, నివేదికల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని ఎస్పీ రమానంద్ చెప్పారు.

హెచ్-1బీ, పౌరసత్వం గగన కుసుమమే!

వాషింగ్టన్: నిపుణులైన విదేశీ ఉద్యోగుల కోసం ఉద్దేశించిన హెచ్-1బీ వీసాల జారీ ప్రక్రియను ట్రంప్ సర్కారు సమూలంగా ప్రక్షాళన చేయనుంది. అమెరికా పౌరసత్వ పరీక్షలను అత్యంత కఠినతరం చేయనుంది. న్యూయార్క్ టైమ్స్ వార్తా సంస్థకు ఇచ్చిన తాజా ఇంటర్వ్యూలో యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ డైరెక్టర్ జోసెఫ్ పలు అంశాలపై మాట్లాడారు. ఇకపై దేశీ ఉద్యోగులకు అత్యధిక వేతానాలిచ్చే అమెరికా కంపెనీలను మాత్రమే పూర్తిస్థాయిలో ప్రోత్సహిస్తామన్నారు. పలు అమెరికా కంపెనీలు విదేశీ ఉద్యోగులను హెచ్-1బీ వీసాలపై రప్పించుకుని అల్ప వేతనాలకు నియమించుకుంటూ స్థానికుల ఉపాధికి గండి కొడుతున్నాయంటూ అధికార రిపబ్లికన్ పార్టీ ప్రజా ప్రతినిధులు చాలాకాలంగా గగ్గోలు పెడుతుండటం తెలిసిందే. ఈ ఆందోళనలకు ట్రంప్ సర్కారు తాజా నిర్ణయాలు చెక్ పెడతాయని భావిస్తున్నారు. అయితే వ్యాపార వర్గాలు, కంపెనీలకు మాత్రం ఇది మింగుడు పడకపోవచ్చని అమెరికా మీడియా కోడై కూస్తోంది. విదేశీయుల కోసం అనుసరిస్తున్న పౌరసత్వ పరీక్ష మరీ సులభతరంగా ఉందని జోసెఫ్ ఆక్షేపించారు. ''పరీక్షలో తేలికపాటి ప్రశ్నలున్నాయి. ఇది చట్టస్ఫూర్తికి పూర్తిగా విరుద్ధమన్నది నా వ్యక్తిగత అభిప్రాయం. ఇకపై కఠిన ప్రశ్నలతో పరీక్షను మరింత పకడ్బందీగా మారుస్తాం''అని స్పష్టం చేశారు.

ఈసీ పక్షపాత అంపైరింగ్: రాహుల్

ఆనంద్: ఎన్నికల సంఘం పక్షపాత వైఖరి ప్రదర్శిస్తోందని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. పక్షపాత ఎంపైర్‌గా పనిచేస్తోందని క్రికెట్ పరిభాషలో మండిపడ్డారు. 2017లో గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోవడానికి ఎన్నికల సంఘమే కారణమని విమర్శించారు. అప్పట్లో తప్పుడు ఓటర్ల జాబితాను ఈసీ రూపొందించిందని ఆక్షేపించారు. క్రికెట్‌లో మనం తప్పులు చేయకపోయినా పదేపదే ఔట్ అవుతున్నామంటే అందుకు అంపైర్ పక్షపాత వైఖరే కారణమవుతుందని చెప్పారు. శనివారం గుజరాత్‌లోని ఆనంద్ పట్టణంలో 'సంఘటన్ సుజన్ అభియాన్'లో రాహుల్ పాల్గొన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల శిక్షణా కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. దేశాన్ని ఒక దేవాలయంగా అభివర్ణించారు. అక్కడికి ఎవరైనా వచ్చి ప్రార్థనలు, పూజలు చేసుకోవచ్చని చెప్పారు. కానీ, ప్రసాదం ఎవరికి దక్కాలన్నది బీజేపీ-ఆర్ఎస్ఎస్ నిర్ణయిస్తున్నాయని ఆక్షేపించారు. గుజరాత్‌లో అధికార బీజేపీని కచ్చితంగా ఓడించాలని, అందుకోసం ఇప్పటి నుంచే కృషి చేయాలని కాంగ్రెస్ నాయకులకు పిలుపునిచ్చారు. గుజరాత్‌లో ఆ పార్టీని మట్టికరిపిస్తే కాంగ్రెస్‌కు ఇక తిరుగుండదని తేల్చిచెప్పారు. బీజేపీని గుజరాత్‌లో ఓడిస్తే ఎక్కడైనా ఓడించడం సులభమేనని సూచించారు. 'మిషన్ 2027'రోడ్‌మ్యాప్‌పై ఈ కార్యక్రమంలో చర్చించారు.

సాక్షి కరీంనగర్

ఆదివారం | 27 | జూలై | 2025



రాజన్న ఆదాయం రూ.5.52కోట్లు

వేములవాడ: రాజన్నకు ఆషాఢమాసంలో రూ.5.52 కోట్ల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు శనివారం తెలిపారు. ఆదాయం భారీగా వచ్చినట్లు పేర్కొన్నారు.



స్థానిక ఎన్నికల్లో నోటా

పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ నోటా ప్రవేశపెట్టాలని కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. జిల్లాలో త్వరలో జరిగే ఎన్నికల్లో అమలు చేయనున్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
30.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

పబ్లిసిటీ కోసమే చిల్లర మాటలు

- కౌశిక్‌రెడ్డిపై కాంగ్రెస్ ఎమ్మెల్యేల ధ్వజం



మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు కవ్వంపల్లి, మేడిపల్లి

కరీంనగర్ కార్పొరేషన్: హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పబ్లిసిటీ కోసమే వీధిరౌడీలా మాట్లాడుతున్నాడని డీసీసీ అధ్యక్షుడు, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ధ్వజమెత్తారు. శనివారం నగరంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డిపై కౌశిక్‌రెడ్డి చేసిన అసత్య ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడింది, తెలంగాణకు ట్యాపింగ్‌ను పరిచయం చేసిందే బీఆర్ఎస్ ప్రభుత్వమన్నారు. మంత్రులు, రాజకీయనాయకులు, సినీనటులు, కాంట్రాక్టర్లు, హైకోర్టు న్యాయమూర్తులు, చివరకు సొంత భార్యల ఫోన్లు కూడా ట్యాప్ చేసిన నీచచరిత్ర బీఆర్ఎస్ నాయకులదన్నారు. మూడేళ్లలో మళ్లీ అధికారంలోకి వస్తామనే పగటి కలలు కంటున్నారని, ఇక బీఆర్ఎస్‌కు తెలంగాణలో చోటు లేదన్నారు. రాజకీయాలు హుందాగా ఉండాలన్న కేసీఆర్ ఇప్పుడు కౌశిక్‌రెడ్డిపై ఎలాంటి చర్య తీసుకుంటారన్నారు. కౌశిక్‌రెడ్డి శాసనసభ సభ్యత్వం రద్దు చేయాలని స్పీకర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఆకారపు భాస్కర్‌రెడ్డి, కర్ర రాజశేఖర్, కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, పులి ఆంజనేయులు, బోనాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

భవన నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి



బాలసదన్ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్

కరీంనగర్‌కార్పొరేషన్: నగరంలో నిర్మిస్తున్న బాలసదన్ భవనం, కశ్మీర్‌గడ్డ సమీకృత మార్కెట్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని నగరపాలకసంస్థ కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్ ఆదేశించారు. స్మార్ట్‌సిటీలో భాగంగా రూ.10 కోట్లతో కశ్మీర్‌గడ్డలో నిర్మిస్తున్న సమీకృత భవన నిర్మాణం, రూ.2 కోట్లతో క్రిస్టియన్‌కాలనీలో చేపట్టిన బాలసదన భవన నిర్మాణ పనులను శనివారం పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని సూచించారు. బాల సదనం భవన నిర్మాణం పనులు చివరి దశలో ఉన్నాయన్నారు. పదిహేను రోజుల్లో పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంచాలన్నారు. డీఈలు వెంకటేశ్వర్లు, అయాబ్ ఖాన్, ఏఈ సతీశ్ పాల్గొన్నారు.

కమాండ్ కంట్రోల్ సెంటర్ సందర్శన



సెంటర్‌ను సందర్శిస్తున్న సీపీ గౌస్ ఆలం

కరీంనగర్‌క్రైం: కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను శనివారం సీపీ గౌస్ ఆలం సందర్శించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. వర్షాలతో నగరంలోని కొన్ని ప్రాంతాల్లో కాలువలు ఉప్పొంగి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోందని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలకు అసౌకర్యం కలగకుండా కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా రోడ్లపై పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఎక్కడ సమస్య తలెత్తినా వెంటనే ట్రాఫిక్ సిబ్బంది ఆ ప్రదేశానికి చేరుకుని తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి నూతన హెల్మెట్లు అందజేశారు. ట్రాఫిక్ ఏసీపీ యాదగిరి స్వామి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కరీముల్లాఖాన్, కంట్రోల్ రూం ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్ పాల్గొన్నారు.

30 లోపు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి

సప్తగిరికాలనీ(కరీంనగర్): 2025– 26 విద్యా సంవత్సరానికి గానూ ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం ఈ నెల 30లోపు ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని షెడ్యూల్ కులాల అభివృద్ధిశాఖ అధికారి నాగ్లేశ్వర్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, తదితర విభాగాల విద్యార్థులు ఫ్రెష్, రెన్యువల్ కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.



అలుగు పారుతున్న రామకృష్ణాపూర్ చెక్‌డ్యాం

జల సవ్వడి

వీణవంక: నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వీణవంక మండలంలోని చెక్‌డ్యామ్‌లు పరవళ్లు తొక్కుతున్నాయి. వ్యవసాయ బావులు నిండుకుండగా మారాయి. వారం క్రితం చెక్‌డ్యాంలు, బావుల్లో నీరు లేక వరినాటు ఆలస్యమైంది. ప్రస్తుతం వర్షాలు దంచికొడుతుండటంతో మండలంలోని రామకృష్ణాపూర్, లస్మక్కపల్లి, పోతిరెడ్డిపల్లి, మల్లారెడ్డిపల్లి, కోర్కల్, కొండపాక చెక్‌డ్యామ్‌లు జలసవ్వడిని సంతరించుకుని అలుగుపారుతున్నాయి. వానాకాలం పంటకు ఢోకా లేదని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని 28వేల ఎకరాల్లో పంటలు సాగులోకి రానున్నాయి.



రైల్వేగేటు వద్ద బురదమయంగా రోడ్డు

వర్షంతో చిత్తడి

కరీంనగర్‌రూరల్: కరీంనగర్– చొప్పదండి రోడ్డులో తీగలగుట్టపల్లి వద్ద చేపట్టిన రైల్వే ఓవర్‌బ్రిడ్జి నిర్మాణంతో వాహనదారులు పాట్లు పడుతున్నారు. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో మట్టిరోడ్డు బురదమయంగా మారింది. పెద్ద పెద్ద గుంతల్లో ద్విచక్రవాహనదారులు పడిపోతున్నారు. గుంతలను తప్పించేందుకు కార్లు, ఆటో డ్రైవర్లు చేస్తున్న ప్రయత్నాలతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్వోబీ నిర్మాణ సంస్థ నిర్లక్ష్యంతోనే పనులు పూర్తికావడం లేదని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గజ్జెల లక్ష్మణ్, యూత్ అధ్యక్షుడు దీకొండ కుమారస్వామి, ఉపాధ్యక్షుడు అంబాల రాజు, దీకొండ రాజబాబు ఆరోపించారు.

భూ కబ్జాపై కొరడా

- కదిలిన బల్దియా యంత్రాంగం
- సీతారాంపూర్‌లో సర్వే షురూ
- సర్వేనంబర్ 71లో ఆక్రమణలపై చర్యలు

కరీంనగర్ కార్పొరేషన్:

నగరపరిధిలోని సీతారాంపూర్ మేలకుంట శిఖం భూ కబ్జాపై అధికార యంత్రాంగం కదలింది. బల్దియా ఆధ్వర్యంలో రెవెన్యూ, సర్వే, ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారుల సంయుక్త ఆపరేషన్ మొదలైంది. సర్వే నంబర్ 71లోని శిఖం భూమి కబ్జా అయిందంటూ ఏళ్లకాలంగా ఫిర్యాదులు వస్తుండడం తెలిసిందే. ప్రతి వర్షాకాలం ఆర్టీసీ వర్క్‌షాప్, వీ పార్క్ హోటల్ వద్ద ముంపునకు ఈ కబ్జాలు కారణమవుతుండడం విదితమే. ఇప్పటివరకు చర్యలకు దూరంగా ఉండగా.. నగరపాలకసంస్థ కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్ ఆదేశాలతో శనివారం బల్దియా అధికారులు రంగంలోకి దిగారు.

శిఖం కబ్జా

సీతారాంపూర్‌లో ఉన్న మేలకుంట శిఖంభూమి కబ్జాకు గురైంది. ఏళ్లక్రితం కుంట శిఖం భూమిని ఆక్రమించి పలువురు ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. ఫలితంగా వర్షాలు కురిసిన ప్రతిసారి ఈ ప్రాంతం ముంపునకు గురవుతోంది. శిఖం భూమి కబ్జాపై ఈ ప్రాంత వాసులు చాలా మంది, పోరాటం చేస్తున్నా, ఇప్పటివరకు ఫలితం కనిపించలేదు. విచారణలో కబ్జాలు నిజమని తేలినా చర్యలు తీసుకోలేదు.

సర్వే షురూ

సర్వే నెంబర్ 71లో మేలకుంట శిఖం భూమిని కాపాడేందుకు అధికారులు రంగంలోకి దిగారు. నగరపాలకసంస్థ కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్ చొరవతో శనివారం నగరపాలకసంస్థ ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళికతో పాటుగా రెవెన్యూ, సర్వే విభాగాల అధికారులు చర్యలు చేపట్టారు. ముందుగా శిఖం భూమి ఎంత వరకు ఉందని సర్వే చేశారు. అనంతరం జేసీబీతో హద్దులకు గుర్తుగా కందకం కొట్టారు. ఆక్రమణలను తొలగించారు. శిఖంభూమిలో ఉన్న ఓ ఫంక్షన్‌హాల్ వెనుకభాగం గోడను కూల్చివేశారు. వర్షం పడుతుండడంతో, చర్యలకు ఆటంకం ఏర్పడగా, తిరిగి కొనసాగించనున్నట్లు అధికారులు తెలిపారు.



ప్రహరీ కూల్చివేస్తున్న బల్దియా యంత్రం



భూ హద్దులుగా కందకం తీస్తున్న జేసీబీ

ఒత్తిడికి తలొగ్గుతారా?

మేలకుంట శిఖంభూమి కబ్జాలో బడాబాబులు ఉండడంతో ఈ సర్వే, ఆక్రమణల తొలగింపు కొనసాగుతుందా లేదా అనే అనుమానాలు స్థానికంగా వ్యక్తమవుతున్నాయి. సర్వే మొదలు కాగానే, అధికారులపై ఒత్తిడి పెంచేందుకు సదరు పెద్దలు సిద్ధమవుతున్నట్లు సమాచారం. అధికారులు ఒత్తిడికి తలొగ్గుతారా, లేక హైదరాబాద్ హైడ్రా తరహాలో ఆక్రమణలు తొలగించి ఆదర్శంగా నిలుస్తారా వేచి చూడాలి.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు



చిగురుమామిడిలో మహిళా సంఘాలకు స్టీల్‌బ్యాంకు పంపిణీ చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

- రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

చిగురుమామిడి: ప్రజా పాలనలో అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామని, చిగురుమామిడి మండలంలో 1,727 కుటుంబాలకు కొత్త రేషన్‌కార్డులు జారీచేశామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. చిగురుమామిడి మండలపరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్మించిన ఇందిరమ్మ మోడల్ హౌజ్‌ను శనివారం సాయంత్రం ప్రారంభించారు. స్థానికంగా ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. 62 మందికి రూ.21.35లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు, ఏడుగురికి కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. మండలంలోని 46హోటళ్ల నిర్వాహకులకు ఒక్కొక్కరికి 100 చొప్పున గ్లాసులు అందించారు. మహిళా సంఘాలకు 20 యూనిట్ల స్టీల్ బ్యాంకు పంపిణీ చేశారు. మరో 17 యూనిట్లు పంపిణీ చేస్తామని తెలిపారు. వడ్డీలేని రుణాల కింద రూ.1.26 కోట్ల చెక్కులను మహిళా సంఘాలకు అందించారు. 50మంది గౌడ్‌లకు కాటమయ్య కిట్లు ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ప్రభుత్వం పదేళ్లలో ఒక్క రేషన్‌కార్డు ఇవ్వలేదని, తాము అధికారంలోకి వచ్చాక మండలంలో 3,988 మంది రేషన్‌కార్డుల్లో పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో 1,224 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా, 400 ఇల్లు మాత్రమే నిర్మించుకున్నారని, లబ్ధిదారులకు డబ్బుల విషయంలో ఇబ్బందులుంటే మహిళా సంఘాల నుంచి రూ.లక్ష రుణం తీసుకునే వీలుందన్నారు. ప్రతీ ఇంటికి 8ట్రాక్టర్ల ఇసుక ఉచితంగా ఇస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం రేకొండ నుంచి బండారుపల్లి వరకు రూ.98లక్షలతో నిర్మించనున్న బీటీరోడ్డుకు, సుందరగిరి నుంచి కొండాపూర్ వెళ్లే మట్టిరోడ్డుకు శంకుస్థాపన చేశారు. అదనపు కలెక్టర్లు అశ్వినీతానాజీ వాకడే, లక్ష్మీకిరణ్, హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, ఆర్డీవో మహేశ్వర్, ఎంపీడీవో మధుసూధన్, తహసీల్దార్ ఎం.రమేశ్ పాల్గొన్నారు.

రోడ్లు బాగు చేయించండి

- కేంద్ర మంత్రికి బీజేపీ నేతల విజ్ఞప్తి



కొత్తపల్లిలో రోడ్డును పరిశీలిస్తున్న కేంద్రమంత్రి సంజయ్‌కుమార్

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లిలో రోడ్ల అధ్వానంగా మారాయి. బస్టాండ్ నుంచి కొక్కెరకుంట వెళ్లే ఆర్అండ్‌బీ మార్గం పూర్తిగా దెబ్బతిని గుంతలు ఏర్పడ్డాయి. నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో రోడ్లు గుంతలయమంగా మారి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులకు విన్నవించినప్పటికీ ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. శనివారం కొత్తపల్లికి వచ్చిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు మాజీ ఎంపీపీ వాసాల రమేశ్ రోడ్ల దుస్థితిని వివరించారు. బండి సంజయ్ గుంతలు పడిన రోడ్లను పరిశీలించారు. తక్షణమే కలెక్టర్‌తో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

అనుమతి లేని కళాశాలలపై చర్యలు తీసుకోవాలి



కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్‌లో అనుమతి లేకుండా నడుస్తున్న కళాశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో శనివారం జిల్లా ఇంటర్మీడియట్ కార్యాలయంలో ఏవో సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, నాయకులు కసిరెడ్డి సందీప్, సాయికృష్ణ తదితరులున్నారు.

సండే స్పెషల్



చల్లూరు జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటుచేసిన ఇంగ్లిష్ క్లబ్‌లో మాట్లాడుతున్న విద్యార్థిని

చల్లూరు టాక్స్



‘నమస్కారం.. వార్తలు చదువుతున్నది సాయి దీక్షణ.. ముందుగా ముఖ్యాంశాలు’.. అంటూ విద్యార్థులే న్యూస్ రీడర్‌గా మారి.. తమ గ్రామంలో జరుగుతున్న సంఘటనలను పాఠశాల యూట్యూబ్ చానల్ ద్వారా ప్రసారం చేస్తున్నారు. అరచేతిలో సెల్‌ఫోన్ ఉంది కదా అని యూట్యూబ్.. ఫేస్‌బుక్.. ఇన్‌స్టాలో రీల్స్ చూస్తూ.. సోషల్ మీడియాలో టైంపాస్ చేయడం కాదు.. దాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలో నేర్పిస్తున్నారు కరీంనగర్ జిల్లా వీణవంక మండలం చల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు. సొంతంగా ‘చల్లూరు టాక్స్’ పేరిట యూట్యూబ్ చానల్ ప్రారంభించారు. గ్రామంలో జరిగిన సంఘటనలను సేకరించి, చానల్ ద్వారా ప్రజలకు వివరిస్తున్నారు. జిల్లాలో యూట్యూబ్ చానల్ ప్రారంభించిన తొలి పాఠశాల ఇదీ.. ప్రధానోపాధ్యాయుడు సంపత్ కుమార్ ఆధ్వర్యంలో వార్తల సేకరణ నుంచి.. ప్రసారణ వరకు విద్యార్థులు.. ఉపాధ్యాయులే చూసుకుంటారు. ఇటీవల కలెక్టర్ పమేలా సత్పతి పాఠశాలను సందర్శించి విద్యార్థులు.. ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు.. జిల్లా మొత్తం ఈ పద్ధతిని అవలంబించాలని సూచించారు.

- జెడ్పీ పాఠశాలలో యూట్యూబ్ చానల్
- స్కూల్ హెచ్ఎం, ఉపాధ్యాయుల వినూత్న ఆలోచన
- విద్యార్థులే ఎడిటర్లు, జర్నలిస్టులు
- అభినందించిన కలెక్టర్ పమేలా సత్పతి
- అన్ని పాఠశాలల్లో అమలుకు ఆదేశం

హుజూరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పిస్తే చదువు ఏం చెబుతారు అన్న స్థాయి నుంచి.. పాఠశాల అంటే ఇలా ఉండాలంటూ ఆదర్శంగా నిలుస్తోంది వీణవంక మండలం చల్లూరు జిల్లా పరిషత్ పాఠశాల. జిల్లాలోనే తొలి యూట్యూబ్ పాఠశాలగా పేరు తెచ్చుకుంది. విద్యార్థుల్లో ఇంగ్లిష్ భయం పోగొట్టి, అనర్గళంగా మాట్లాడేందుకు గతేడాది పాఠశాలలో కలెక్టర్ పమేలా సత్పతి ఇంగ్లిష్ క్లబ్ ప్రారంభించారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం క్లబ్‌ను సమర్థవంతంగా నిర్వహిస్తూ సత్ఫలితాలు సాధిస్తున్నారు.


కమ్యూనికేషన్ స్కిల్స్

పాఠశాలలో క్లబ్ నిర్వహణకు హెచ్ఎం సంపత్ కుమార్ ఆధ్వర్యంలో చల్లూరు టాక్స్ పేరిట యూట్యూబ్ చానల్ ప్రారంభించారు. క్లబ్ ద్వారా విద్యార్థులు మెరుగైన నైపుణ్యాలు పెంచుకుంటున్నారు. రోజూ స్టోరీ టెల్లింగ్, రీడింగ్ సర్కిల్స్, పద సంబంధ ఆటలు, న్యూస్ రీడింగ్ చేస్తున్నారు. డైలీ న్యూస్ చానల్‌లో యాంకర్లు న్యూస్ చదివిన విధంగానే విద్యార్థులు వార్తలు చదువుతుండడంతో వారిలో ఇంగ్లిష్‌పై పట్టు పెరుగుతోంది. నెలవారీ కార్యక్రమాల్లో భాగంగా బృంద చర్చలు, ఉపన్యాస పోటీలు, రూల్ ప్లే స్కిట్స్, సృజనాత్మక రచన, క్విజ్, మూవీ స్క్రీనింగ్ వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు.

క్లబ్ నిర్వహణ ఇలా..

క్లబ్‌లో ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్, సెక్రటరీగా విద్యార్థులు ఉంటారు. ప్రతీ తరగతికి ఇద్దరు ప్రతినిధులు ఉండగా, ఉపాధ్యాయుల సాయంతో నెలలో రెండుమూడుసార్లు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు. కాగా, పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థి ఎలకపల్లి విష్ణు అంతర్జాతీయస్థాయిలో ఇంగ్లిష్ భాషకు సంబంధించి టెడ్ టాక్‌లో ఉపన్యాసం ఇచ్చాడు. ఇటీవల జిల్లా స్థాయి స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించగా పాఠశాల నుంచి 20 మంది విద్యార్థులు ఎంపిక కావడంపై కలెక్టర్ పమేలా సత్పతి ప్రత్యేకంగా అభినందించారు.


భయం పోయింది



చల్లూరు టాక్స్ యూట్యూబ్ చానల్‌లో రోజూ పాఠశాలలో జరిగే కార్యక్రమాలు, వివరాలను ఇంగ్లిష్‌లో న్యూస్ రీడ్ చేయడం వల్ల ఆ భాషపై భయం పోయింది. ఇంగ్లిష్ లాంగ్వేజ్‌పై స్కిల్స్ పెంపొందించుకునేందుకు ఉపాధ్యాయులు సూచనలిస్తున్నారు.

– సాయిదీక్షణ, 9వ తరగతి

విద్యార్థుల్లో ఆసక్తి



ఇంగ్లిష్ క్లబ్‌లో భాగంగా విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించేందుకు యూట్యూబ్ చానల్ ప్రారంభించాం. పాఠశాలలో జరిగే కార్యక్రమాలను విద్యార్థులు ఇంగ్లిష్‌లో చదవడం, ఆ వీడియోను విద్యార్థులు చూస్తుండటంతో చూసేవారిలో సైతం చదవాలనే ఆసక్తి పెరుగుతోంది.

– ఉమారెడ్డి, ఇంగ్లిష్ టీచర్

మంచి పేరు వచ్చింది



విద్యార్థుల్లో ఆంగ్లంపై భయం పోయేలా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇంగ్లిష్ క్లబ్ ఏర్పాటు చేశాం. క్లబ్ ద్వారా విద్యార్థుల్లో ఇంగ్లిష్‌పై పట్టు పెరుగుతోంది. క్లబ్‌ను యూట్యూబ్ ద్వారా నిర్వహించడంతో మంచి పేరు వచ్చింది.

– డింగిరి సంపత్‌కుమార్‌చార్యులు, హెచ్ఎం, జెడ్పీహెచ్ఎస్, చల్లూరు

ఇంగ్లిష్ క్లబ్ బాగుంది



ఈ ఏడాది స్కూల్లో ఇంగ్లిష్ క్లబ్ పేరుతో మంచి కార్యక్రమం చేపట్టారు. వివిధ అంశాలపై విద్యార్థులు ఇంగ్లిష్‌లో మాట్లాడడం బాగుంది. ఇలాంటి మంచి కార్యక్రమం చేపట్టినందుకు ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు.

– అఖిల్‌పాషా, విద్యార్థి తండ్రి, చల్లూరు

అందుబాటులోకి క్రిటికల్ కేర్

- ప్రభుత్వాసుపత్రి ఆవరణలో నేడు ప్రారంభం
- హాజరు కానున్న కేంద్ర, రాష్ట్రమంత్రులు

కరీంనగర్‌టౌన్: రోడ్డు ప్రమాదాల్లో గాయపడ్డ వారిని, పలు కారణాలతో ఆత్మహత్యకు యత్నించిన వారిని కాపాడేందుకు కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన క్రిటికల్ కేర్ విభాగం ఆదివారం నుంచి అందుబాటులోకి రానుంది. ఉదయం 10 గంటలకు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్, రాష్ట్ర వ్యవసాయ, జిల్లా ఇన్‌చార్జిమంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా ప్రారంభించనున్నారు.



ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన క్రిటికల్ కేర్ నూతన భవనం

రూ.2.3 కోట్లతో భవనం

2023 మార్చి 8న అప్పటి రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. రూ.2.3కోట్లతో పనులు చేపట్టారు. క్రిటికల్ కేర్ ప్రారంభిస్తే ఉత్తర తెలంగాణ జిల్లాలకు కేంద్ర బిందువుగా ఉన్న కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి అత్యవసర చికిత్స బాధితులకు వరంగా మారనుంది.

ఇన్నాళ్లు ఇబ్బందులు

కరీంనగర్‌కు రైల్వేలైన్‌తో పోలిస్తే హైవే రోడ్డు కనెక్టివిటీనే ఎక్కువగా ఉంది. నిత్యం వివిధ ప్రమాదాల్లో పదుల సంఖ్యలో గాయపడి, ఆసుపత్రుల పాలవుతున్నారు. వీరే కాకుండా జీవితంపై విరక్తితో ఆత్మహత్యాయత్నం చేస్తున్న వారిసంఖ్య పెరుగుతోంది. అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు వైద్యం అందించేందుకు ఇన్నాళ్లు కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో క్రిటికల్ కేర్ విభాగం లేదు. దీంతో పేషెంట్లను వరంగల్ ఎంజీఎం, హైదరాబాద్ గాంధీ, ఉస్మానియా, నిమ్స్‌కు తరలించేవారు. క్రిటికల్ కేర్ ప్రారంభిస్తే ప్రమాద బాధితులకు వరంగా మారనుంది.

క్లుప్తంగా

లారీకి విద్యుత్ తీగలు తగిలి కూలి మృతి


రమేశ్ మృతదేహం

మల్యాల: మండలంలోని రాంపూర్‌లో కట్టెల లోడ్‌తో వెళ్తున్న లారీకి 11 కేవీ విద్యుత్ తీగలు తగలడంతో షాక్ కొట్టి పారకొండ రమేశ్ (52) అనే కూలీ మృతి చెందాడు. డ్రైవర్ కిందకు దూకడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. ఎస్సై నరేశ్ కుమార్ కథనం ప్రకారం.. రాంపూర్‌కు చెందిన రమేశ్ వ్యవసాయ కూలి. కట్టెలు కొట్టేందుకు వెళ్తుంటాడు. శనివారం లారీలో కట్టెలు లోడ్ చేసేందుకు వెళ్లాడు. లోడ్ పూర్తయ్యాక లారీ క్యాబిన్‌లో డ్రైవర్ ఫైజల్‌తోపాటు రమేశ్ వస్తున్నారు. రాంపూర్ శివారులోకి రాగానే విద్యుత్‌తీగలను డ్రైవర్ గమనించకపోవడంతో కట్టెలు తీగలకు తాకి లారీకి విద్యుత్ ప్రసరించింది. డ్రైవర్ కిందికి దూకి ప్రాణాలతో బయటపడ్డారు. రమేశ్ మాత్రం షాక్‌కు గురై మృతి చెందాడు. రమేశ్ భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌ఫైజల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు. రమేశ్‌కు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుడి అరెస్టు

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్‌లో గంజాయి విక్రయిస్తున్న యువకుడిని శనివారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై చిందం గణేశ్ తెలిపారు. ముస్తాబాద్‌కు చెందిన మందాటి చందు(22), మనోజ్ అనే స్నేహితుడి వద్ద గంజాయి కొనుగోలు చేశాడు. కొంత తాగిన చందు.. మిగిలిన గంజాయిని విక్రయించేందుకు వెళ్లాడు. సమాచారంతో పోలీసులు దాడి చేసి చందు నుంచి 102 గ్రాముల గంజాయిని, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. మరో నిందితుడు మనోజ్ పరారీలో ఉన్నాడు.

గంజాయి పట్టివేత

మేడిపల్లి: భీమారం శివారులో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా.. 60 గ్రాముల గంజాయి దొరికినట్లు మేడిపల్లి ఎస్సై శ్రీధర్ రెడ్డి తెలిపారు. నిందితులు బీహార్‌కు చెందిన బలరాం, దిల్‌కుష్‌గా గుర్తించి కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

గోదావరిలో మొసలి


ధర్మపురి గోదావరిలో ప్రత్యక్షమైన మొసలి

ధర్మపురి: జగిత్యాల జిల్లా ధర్మపురి వద్ద గల గోదావరిలో స్నానాలఘట్టం వద్ద మొసలి కనిపించింది. దీంతో భక్తులు పరుగులు తీశారు. శ్రావణమాసం మొదటి శనివారం సందర్భంగా గోదావరిలో స్నానాలు చేసేందుకు భక్తులు సత్యవతి గుండం కింది భాగానికి వెళ్లారు. అక్కడ మొసలి బండరాళ్లపై పాకుతూ వెళ్లడంతో భక్తులందరూ భయాందోళనతో పరుగులు తీశారు. అటవీశాఖ అధికారులు మొసలిని పట్టుకుని ఇతరప్రాంతాలకు తరలించాలని భక్తులు కోరుతున్నారు.

డాక్టర్లూ.. రిమ్‌జిమ్

- జిమ్ బాట పడుతున్న మహిళా వైద్యులు
- వ్యాయామంతో ఆరోగ్యం.. ప్రశాంతత
- ఆరోగ్యంపై డాక్టర్ల ప్రత్యేక శ్రద్ధ
- ఇతరులకు ఆదర్శం

వేములవాడ: ఆరోగ్యం.. ఆనందం.. రెండూ కావాలంటే శరీరానికి శ్రమ తప్పదంటున్నారు వైద్యులు. ఇటీవల వచ్చిన ఆహారపు అలవాట్లు, జీవన విధానాలతో ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. నిత్యం చురుకుగా ఉండాలంటే జిమ్‌బాట పట్టాల్సిందేనంటున్నారు వేములవాడలోని మహిళా వైద్యులు. నిత్యం జిమ్‌కు వెళ్తూ గంటలకొద్దీ శ్రమటోడ్చుతున్నారు. జిమ్‌కు వెళ్దాం.. ఆరోగ్యంగా ఉందాం.. ఆనందంగా గడుపుదామంటున్నారు. మహిళా వైద్యుల రిమ్‌జిమ్ బాటపై సండే స్పెషల్.

మారుతున్న జీవన విధానంతో..

ప్రస్తుతం అందరూ తినే ఆహారంలో కొవ్వు పదార్థాలు, తీపి పదార్థాలు ఎక్కువగా ఉంటున్నాయి. అంతేకాకుండా హోటల్ ఫుడ్‌కు అలవాటు పడడంతో శరీరం మనసు మాట వినడం లేదు. ఈ సమయంలోనే శరీరానికి శ్రమ అవసరమంటున్నారు వేములవాడలోని మహిళా వైద్యులు. నిత్యం కనీసం ఒక గంట శ్రమిస్తే శరీరంలోని ఎక్స్‌ట్రా కొలస్ట్రాల్ కరిగిపోతుందంటున్నారు. విధుల్లో చురుకుగా వ్యవహరించాలన్నా.. చలాకీగా జీవించాలన్నా జిమ్‌లో కసరత్తులు చేయాల్సిందేనంటున్నారు. వేములవాడ పట్టణం బైపాస్‌రోడ్డులోని జిమ్‌లో మహిళా వైద్యులు నిత్యం కసరత్తులు చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు.


వేములవాడ బైపాస్‌రోడ్డులోని జిమ్‌లో ఎక్సర్‌సైజు చేస్తున్న మహిళా డాక్టర్లు

రోజూ గంట జిమ్‌లోనే..



ఆరోగ్యంగా ఉండాలని కోరుకునే ప్రతీ ఒక్కరు నిత్యం కొంత సమయాన్ని వ్యాయామానికి కేటాయించాలి. నేను ప్రతీ రోజు మా ఆయన అనిల్‌తో కలిసి జిమ్‌కు వస్తాను. మహిళలకు వ్యాయామం తప్పనిసరి. వ్యాయామం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఒబిసిటీ, డయాబెటిక్ దరిచేరకుండా ఆరోగ్యంగా జీవించవచ్చు. వారంలో ఐదు రోజులైనా వ్యాయామం చేయాలి. – డాక్టర్ దీప్తి, వేములవాడ

మానసిక ప్రశాంతత



ఆహార నియమాలు, నిత్య వ్యాయామం, రోగ నివారణ, శారీరక శ్రమతోపాటు ఆరోగ్యంగా ఉండేందుకు అవసరమైన ఆహార నియమాలు పాటించాలి. వ్యాయామంతో శారీరక దారుఢ్యంతోపాటు మానసికోల్లాసం సొంతమవుతోంది. ఒత్తిడి తగ్గి ప్రశాంతత చేకూరుతుంది. నిత్యం వ్యాయామం చేయాల్సిందే. – డాక్టర్ వర్ష, వేములవాడ

గర్భిణీలూ వ్యాయామం చేయొచ్చు



రోజుకు 30 నిమిషాల నడక, సైక్లింగ్, జిమ్‌లో సాధన ద్వారా రక్తపోటు, డయాబెటీస్, స్థూలత్వాన్ని దూరం చేసుకోవచ్చు. గర్భిణీలు సైతం వ్యాయామం చేయవచ్చు. దీని ద్వారా నార్మల్ డెలివరీకి అవకాశాలు ఉంటాయి. డెలివరీ అనంతరం కూడా వారి శరీరం యథాస్థితికి చేరుకుంటుంది.

– డాక్టర్ అనిత, వేములవాడ

వ్యాధులకు చెక్



ఆహార నియమాలు పాటిస్తూ నిత్యం వ్యాయామం చేస్తే వ్యాధులకు చెక్ పెట్టేయవచ్చు. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు జిమ్‌కు వస్తున్నాం. మనం ఇంట్లో పనిచేస్తున్నా, బయట పనిచేస్తున్నా శరీరం పనిచేస్తేనే మనిషి బతుకుతాడు.

– డాక్టర్ పద్మలత, ఐఎంఏ మాజీ అధ్యక్షురాలు

మహిళలకు ప్రత్యేక శిక్షణ



మా జిమ్‌లో మహిళలకు ప్రత్యేక శిక్షణ ఇస్తుంటాం. ప్రతీ మహిళ తన ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి. జిమ్‌లో వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

– షబ్బీర్, జిమ్ నిర్వాహకుడు

రేషన్ కార్డులకు ఐటీ సెగ

- అనర్హుల ఏరివేతకు కేంద్రం ఆదేశాలు
- రేషన్ కార్డులు రద్దయ్యే అవకాశం

కరీంనగర్ అర్బన్: రేషన్ కార్డులకు ఇన్‌కమ్ టాక్స్ (ఐటీ) సెగ తాకింది. పాత, కొత్త రేషన్‌కార్డుదారులకు ఇది చేదువార్తే. ఆదాయపు పన్ను చెల్లిస్తూ రేషన్ పొందుతుంటే రేషన్ కార్డు రద్దవడం దాదాపు ఖాయమని తెలుస్తోంది. కేంద్రం నూతనంగా రూపొందించిన మార్గదర్శకాలే అందుకు నిదర్శనం. ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన (పీఎంజీకేఏవై) కింద లబ్ధిపొందుతున్న వారిలో అనర్హులను ఏరివేయడానికి కేంద్రం కసరత్తు చేపట్టింది. ఆదాయపు పన్నుశాఖ కేంద్ర ఆహారశాఖకు సహకారం అందించనుండగా లబ్ధిదారుల ఆదాయ వివరాలను వినియోగదారుల వ్యవహార మంత్రిత్వశాఖలోని ఫుడ్ అండ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ (డీఎఫ్‌పీడీ) విభాగానికి ఐటీ శాఖ సమకూర్చనున్నట్లు కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో లబ్ధిదారుల ఆధార్ నంబర్, లేదా పాన్ వివరాలను ఆదాయపు పన్ను శాఖకు డీఎఫ్‌పీడీ ఇవ్వనుండగా దీని ఆధారంగా లబ్ధిదారుని ఆర్థికస్థాయిని ఆదాయపు పన్నుశాఖ నిర్ధారించి తిరిగి వివరాలను ఆహార శాఖకు అందించనుందని అధికారులు చెబుతున్నారు.

రుణాలకు ఐటీనే కదా ఆధారం

ప్రస్తుతం రుణం లేకుండా ఏ పనులూ సాగడం లేదు. పేద నుంచి మధ్యతరగతి వరకు రుణాలతోనే కాలం వెళ్లదీస్తున్నారు. సదరు కుటుంబాలు ఇంటి నిర్మాణ రుణం తీసుకున్నా, ఇతర అవసరాల కోసం బ్యాంకులు, ప్రైవేటు సంస్థల ద్వారా రుణం పొందాలన్నా ఆదాయపు పన్ను చెల్లించి ఉండాల్సిందే. అది కూడా మూడేళ్లు వరుసగా ఆదాయపు పన్ను వివరాలు పరిశీలించాకే సంస్థలు రుణం మంజూరు చేస్తున్నాయి. ప్రతి చిన్నదానికి ఆధార్ ఇవ్వాల్సిందే దానికి అనుసంధానంగా పాన్‌కార్డు కూడా ఇవ్వాల్సి ఉంటుంది. క్రమంలో సదరు నిబంధన పరిధిలోకి వేల కుటుంబాలు వచ్చే అవకాశముంది. దీంతో తెల్ల రేషన్ కార్డులుండి ఆదాయపు పన్ను చెల్లిస్తూ గృహ, వాహన, ఇతర అవసరాల కోసం రుణాలు తీసుకున్న కుటుంబాలు వేలల్లో ఉన్నాయి. వారందరికీ ఈ నిబంధన పూర్తి స్థాయిలో అమలైతే మాత్రం తెల్ల రేషన్ కార్డును కోల్పోతారు. తద్వారా ఉచిత రేషన్ కూడా రద్దవనుంది. ఆరోగ్యశ్రీ ఇతర సంక్షేమ పథకాలకు దూరం కానున్నారు.

నిబంధనలను మార్చాల్సిందే

కేంద్ర ఆదేశాలపై కార్డుదారుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రేషన్ కార్డు అనుభవిస్తున్న వారిలో సంపన్నులు ఎవరూ లేరని, రుణం కోసం ఐటీ చెల్లించినట్లుగా చూపి రుణాలు తీసుకుంటున్నామని వాపోతున్నారు. కేంద్ర నిర్ణయం పిచ్చుకపై బ్రహ్మాస్త్రంలా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సదరు నిబంధనను సవరించాలని కార్డుదారులు డిమాండ్ చేస్తున్నారు.

పంట పొలంలోనే ప్రాణం పోయింది

- విద్యుదాఘాతంతో రైతు మృతి


పంట పొలంలో కొమురయ్య మృతదేహం


దండిగ కొమురయ్య (ఫైల్)


మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

మంథనిరూరల్: నాలుగు రోజుల క్రితం వరినాటు వేసిన రైతు.. పొలానికి నీళ్లు పారుతున్నాయా అని చూసేందుకు వెళ్లి విద్యుదాఘాతానికి గురయ్యాడు. పంట పొలంలోనే ప్రాణాలు విడిచాడు. ఈఘటన పెద్దపల్లి జిల్లా మంథని మండలం ఎగ్లాస్‌పూర్ గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఎగ్లాస్‌పూర్ గ్రామానికి చెందిన దండిగ కొమురయ్య(65) శనివారం వేకువజామున తన వరిపొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లాడు. ఉదయం తొమ్మిది గంటలైనా ఇంటికి రాలేదు. దీంతో ఆయన కుమారుడు, మరొకరు పొలం వద్దకు వెళ్లి చూడగా విగత జీవుడై కన్పించాడు. బోరు మోటారు కోసం ఏర్పాటు చేసుకున్న విద్యుత్ స్తంభం సపోర్ట్ వైరుకు విద్యుత్ సరఫరా అయి కొమురయ్య షాక్‌తో మృతి చెందినట్లు కుటుంసభ్యులు తెలిపి కన్నీటిపర్యంతమయ్యారు. పోలీసులు నమోదు చేశారు.

నిర్లక్ష్యం ఎవరిదీ?

రైతు కొమురయ్య మృతికి ఎవరి నిర్లక్ష్యం కారణమనేది అంతుచిక్కడంలేదు. సాధారణంగా విద్యుత్ స్తంభాల సపోర్ట్ వైర్లు ఏర్పాటు చేసి.. వాటికి గైఇన్స్ లెటర్‌లు అమర్చాలి. అవి విద్యుత్ సరఫరాను నియంత్రిస్తాయి. అయితే రైతు కొమురయ్య తన పొలంలో విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసినా.. గైఇన్స్ లెటర్లు అమర్చలేదని అంటున్నారు. దీంతోనే బోర్ మోటార్ సర్వీస్‌వైర్ రాపిడికి గురై తెగి ఉంటుందని, దాంతో సపోర్ట్ వైర్‌కు తగిలి విద్యుత్ సరఫరా కావడం, దానిని ముట్టుకున్న కొమురయ్య షాక్‌తో మృతి చెందాడని అంటున్నారు. విద్యుత్ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సపోర్ట్ వైర్ పరిశీలించ విద్యుత్ సరఫరా అవుతున్నట్లు తేలింది. కాగా, మృతుడి కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పరామర్శించారు.

ధర్మపురిలో ఉచిత అన్నదానం పెంపు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయం ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఉచిత అన్నదానంలో భాగంగా మరింత మంది భక్తులకు పెంచారు. ఇప్పటివరకు సోమ, బుధ, గురు, శుక్రవారం 200 మందికి, మంగళ, శని, ఆదివారాల్లో 300 మందికి అన్నదానం చేస్తున్నారు. తాజాగా సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆదేశాల మేరకు మంగళ, శని, ఆదివారాల్లో 500మందికి అన్నదానం చేయనున్నారు. సోమ, బుధ, గురు, శుక్రవారాల్లో 300కి అన్నదానం చేయాలని సంకల్పించారు. శనివారం 500 మంది భక్తులకు అన్నదానం చేశారు. అలాగే భక్తుల కోసం ఆలయం ముందు ప్రత్యేక విచారణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వీఐపీలు, ఇతర ముఖ్యమైన భక్తులు ఈ కేంద్రాన్ని సంప్రదిస్తే తొందరగా దర్శనం కల్పించే అవకాశం ఉందని ఆలయ సిబ్బంది తెలిపారు. అన్నదాన కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాస్, చైర్మన్ జక్కు రవీందర్, అర్చకులు, సిబ్బంది తదితరులున్నారు.


భక్తులకు అన్నప్రసాదం అందిస్తున్న ఆలయ సిబ్బంది

‘స్థానిక’ ఎన్నికల్లోనూ నోటా

- తెలుపు రంగులో జెడ్పీటీసీ, గులాబీ రంగులో ఎంపీటీసీ బ్యాలెట్
- ఓటరు జాబితా ప్రక్షాళనకు కసరత్తు మరూ.. అనర్హుల ఏరివేత



కరీంనగర్ అర్బన్: ఓటింగ్ వ్యవస్థను సరళీకృతం చేసేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఉపయోగించినట్లే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ నోటా వినియోగించాలని ఆదేశించింది. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లోనూ నోటా అమలు కానుంది. ఈ ఎన్నికలు బ్యాలెట్ ద్వారా నిర్వహిస్తుండగా ఇందులో ‘నోటా’ ముద్రించేలా ఎన్నికల సంఘం ఆదేశించింది. ఇప్పటికే జిల్లాస్థాయి అధికారులు ఎన్నికల ప్రక్రియ పూర్తిచేసే పనిలో నిమగ్నమయ్యారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు ఒకేసారి నిర్వహిస్తున్న క్రమంలో తెలుపు రంగులో జెడ్పీటీసీ, గులాబీ రంగులో ఎంపీటీసీ సభ్యుల బ్యాలెట్ ఉండేలా ముద్రణకు ఏర్పాట్లు చేశారు. పోలింగ్ బాక్సులు, సిబ్బంది నియామకం కొలిక్కివచ్చాయి. జెడ్పీటీసీ, ఎంపీటీసీస్థానాలపై స్పష్టత రాగా, వాటి నియోజకవర్గాల వారీగా ఓటర్ల విభజన పూర్తి చేసిన అధికారులు పోలింగ్ కేంద్రంలో ప్రిసైడింగ్ అధికారితోపాటు నలుగురు సిబ్బందిని నియమిస్తూ వారికి శిక్షణ ఇచ్చే ప్రక్రియ మొదలైంది. ఓటరు ముందుగా ఎంపీటీసీ అభ్యర్థికి ఓటు వేసేలా బ్యాలెట్ ఇవ్వడం, ఆ తర్వాత అదే గదిలో ఓటువేసేందుకు బ్యాలెట్ పత్రం అందజేస్తారు. ఇలా వరుసగా రెండు ఓట్లు వేశాకే ఓటరు పోలింగ్ కేంద్రం నుంచి బయటకు వెళ్లాల్సి ఉంటుంది.

ఖాతా తెరవాల్సిందే

ఎన్నికల్లో పోటీచేసే వ్యక్తులు 21 ఏళ్లు నిండి ఉండాలి. పోటీకి కనీసం ఒకరోజు ముందే బ్యాంకు ఖాతా తెరవాల్సి ఉంటుంది. ఆ ఖాతా నుంచే ఎన్నికల వ్యయం చేస్తున్నట్లు రిటర్నింగ్ అధికారికి నామినేషన్ సందర్భంగా రాతపూర్వకంగా తెలపాలి. 2018 పంచాయతీరాజ్ చట్టం 243(3) ప్రకారం ఒక అభ్యర్థి ఎంపీటీసీ లేదా జెడ్పీటీసీకి పోటీ చేస్తున్న స్థానాలు ఒకటి కంటే ఎక్కువ ఉండరాదు. రెండుచోట్ల పోటీ చేస్తు న్నట్లు గుర్తిస్తే నామినేషన్లు రెండుచోట్ల తిరస్కరించే అవకాశం ఉంటుంది.

ఓటరు జాబితా ప్రక్షాళన వేగవంతం

ప్రతి 20 నుంచి 25 ఏళ్లకు ఒకసారి చేపట్టే ఎస్ఐఆర్ సర్వే ఇటీవలే బిహార్‌లో పూర్తి కాగా త్వరలోనే అన్ని రాష్ట్రాల్లో చేపట్టేందుకు చర్యలు చేపడుతున్నారు. జిల్లాలో ఇప్పటికే ఆ దిశగా కసరత్తు జరుగుతోంది. జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 20వేలకు పైగా అనర్హుల ఓట్లు ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఒక్కో నియోజకవర్గంలో 5 వేలకు పైగానే డబుల్ ఓట్లు, ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి ఓట్లు, మరణించిన వారి ఓట్లు సైతం ఉన్నట్లు రాజకీయ పార్టీల ప్రతినిధులు అంచనా వేస్తున్నారు. బీఎల్వోలు తమ పరిధిలోని ప్రతి ఓటరు వద్దకు వెళ్లి ఎన్నికల సంఘం నిర్దేశించిన ఏదో ఒక పత్రంతో ధ్రువీకరిస్తారు. అందుబాటులో లేని ఓటర్లను జాబితా నుంచి తొలగించేందుకు సిఫారసు చేస్తారు. ఓటరు జాబితా సవరణలో కీలకంగా వ్యవహరించే బీఎల్వోలకు ప్రత్యేక గుర్తింపు కార్డులు అందించాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. మరోవైపు ఎస్ఐఆర్ సర్వే నేపథ్యంలో అన్ని నియోజకవర్గాల్లో ఈనెల 3 నుంచి 17 వరకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణలో భాగంగా బీఎల్వోలకు యాప్స్‌పై అవగాహన కల్పించారు.

గంజాయి విక్రేత పట్టివేత

జగిత్యాలక్రైం: జగిత్యాల శివారులోని ఎస్‌కేఎన్ఆర్ డిగ్రీ కళాశాల వద్ద శనివారం పట్టణ ఎస్సై రవికిరణ్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా.. సయ్యద్ యూసఫ్ అనే వ్యక్తి గంజాయి తరలిస్తూ పట్టుబడ్డాడు. అతడి నుంచి 150 గ్రాముల గంజాయి లభ్యమైంది. పట్టణంలోని ఉప్పరిపేటకు చెందిన సయ్యద్ యూసఫ్ తన జేబులో గంజాయి పెట్టుకుని విక్రయించే ప్రయత్నం చేస్తుండగా పట్టుకున్నామని పేర్కొన్నారు. గంజాయి స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఫీజు తగ్గించి ఎన్నికలు నిర్వహించాలి

- పద్మశాలీ సంఘం సభ్యులు చిమ్మని ప్రకాశ్

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల పట్టణ పద్మశాలీ సంఘం ఎన్నికలు నామినేషన్ ఫీజు తగ్గించి, బైలా ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని పద్మశాలీ సంఘం సభ్యుడు చిమ్మని ప్రకాశ్ కోరారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం న్యాయవాదులు సంగీతం సత్యసాయిరాం, భరత్‌కుమార్‌లతో కలిసి మాట్లాడారు. సిరిసిల్ల పద్మశాలీ సంఘం ఎన్నికల నోటిఫికేషన్‌పై అభ్యంతరం వ్యక్తం చేశారు. బై లాకు వ్యతిరేకంగా ఎన్నికలు నిర్వహించారని కోడం రవి జిల్లా కోర్టును ఆశ్రయించారన్నారు. న్యాయస్థానంలో మధ్యతరగతి పద్మశాలీలకు అనుకూలంగా తీర్పు వచ్చిందని పేర్కొన్నారు. కోర్టు తీర్పుపై పద్మశాలీలు హర్షం వ్యక్తం చేశారన్నారు. ఇప్పటికైనా పెద్దలు ఎన్నికల గురించి ఆలోచించి, సామాన్యులు పోటీ చేసేలా నామినేషన్ ఫీజులు తగ్గించి, బై లా ప్రకారం నిర్వహించాలని కోరారు. పద్మశాలీ సంఘం నాయకులు కోడం రవి, రిక్కుమల్ల మనోజ్‌కుమార్, కొండ ప్రతాప్, గుజ్జె శివరాం, నాగుల శ్రీనివాస్, గజ్జెల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చిమ్మని ప్రకాశ్, నాయకులు

ఉరేసుకొని వ్యక్తి మృతి

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ జిల్లా కేంద్రంలోని మారుతినగర్‌లో నివసిస్తున్న సంతోష్ ఉరేసుకొని మృతి చెందినట్లు త్రీటౌన్ సీఐ జాన్‌రెడ్డి తెలిపారు. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల కేంద్రానికి చెందిన తొడుపునూరి సంతోష్(23) మూడేళ్ల క్రితం వివాహం చేసుకొని కరీంనగర్‌లోని ఒక ప్రైవేటు సెక్యూరిటీ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ తన భార్యతో మారుతినగర్‌లో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. భార్యభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. శుక్రవారం రాత్రి కూడా గొడవ జరగడంతో భార్య పుట్టింటికి వెళ్లి తిరిగి వచ్చేసరికి ఉరేసుకొని కనిపించాడు. స్థానికుల సాయంతో 108 ద్వారా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సంతోష్ మృతిపై అనుమానాలున్నాయని అతని తండ్రి లక్ష్మణ్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు చేయడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కొండపల్కలలో ఒకరు..

మానకొండూర్: మండలంలోని కొండపల్కల గ్రామానికి చెందిన కరివేద సంపత్‌రెడ్డి(49) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ సంజీవ్ తెలిపిన వివరాలు. సంపత్ రెడ్డి నాలుగు నెలల క్రితం కూతురు అక్షిత పెళ్లి చేయగా అప్పులపాలయ్యాడు. అప్పుల బాధ భరించలేక శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కొడుకు రమణారెడ్డి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ వివరించారు.

పద్మశాలి సంఘం ఎన్నికలకు బ్రేక్

- యథాతథ స్థితి కొనసాగించాలని కోర్టు స్టే ఆర్డర్
- నామినేషన్ ఫీజులు భారీగా పెంచడంపై వెల్లువెత్తిన నిరసన
- కోర్టును ఆశ్రయించడంతో నిలిచిపోయిన ఎన్నికల ప్రక్రియ

సిరిసిల్లకల్చరల్: జిల్లా కేంద్రంలో అత్యధిక జనాభా గల సామాజికవర్గం పద్మశాలీ సంఘం ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయింది. ఎన్నికల ప్రక్రియ అవకతవకలపై వచ్చిన ఫిర్యాదుపై స్పందించిన జిల్లా కోర్టు స్టే ఆర్డర్ ఇచ్చింది. యథాతథస్థితి కొనసాగించాలని ఆదేశిస్తూనే అడ్‌హక్ కమిటీలోని ఏడుగురితోపాటు ఎన్నికల అధికారిని ప్రతివాదులుగా ఆగస్టు 4 వరకు కౌంటర్ దాఖలుకు అవకాశం కల్పించింది. తిరిగి విచారణ చేపడతామని స్పష్టం చేసింది. దీంతో ఆదివారం జరగాల్సిన ఎన్నికలు వాయిదా పడ్డాయి.

ఆరేళ్ల తర్వాత ఎన్నికలకు అడుగులు

పట్టణ పద్మశాలి సంఘానికి ఎన్నికలు జరిగి ఆరేళ్లు గడిచాయి. తాజాగా ఎన్నికలు నిర్వహించాలని భావించిన సంఘం నూతన సభ్యత్వాలు స్వీకరించింది. సంఘంలో ప్రస్తుతం 9,600 మంది సభ్యులు ఉన్నారు.



నిబంధనలకు విరుద్ధం

సంఘం బైలా నిబంధనలు అమలు చేయకుండా, అడ్‌హక్ కమిటీ రూపొందించిన నియమాలనే ఎన్నికల అధికారి అనుసరించారని మెజారిటీ సభ్యుల అభిప్రాయపడ్డారు. ఈ అంశాలపై చిమ్మని ప్రకాశ్, కోడం రవి కోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. కమిటీ సభ్యులు యెల్లె లక్ష్మీనారాయణ, జిందం చక్రపాణి, గోలి వెంకటరమణ, మండల సత్యం, గూడూరి ప్రవీణ్, మంచె శ్రీనివాస్, ఎన్నికల నిర్వహణాధికారి మామిడాల భూపతిని ప్రతివాదులుగా చేర్చారు. పిటీషన్‌ను పరిశీలించిన కోర్టు యథాతథస్థితిని కొనసాగించాలని ఆదేశించింది. కోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో ఎన్నికలు నిలిచిపోవడంతో సంఘం పెద్దలు తర్జనభర్జన పడుతున్నారు.


సామాన్యుల వైపే న్యాయం



మెజారిటీ సభ్యుల మనోభావాలను లెక్కలోకి తీసుకోకుండా ఎన్నికలు నిర్వహించాలనుకున్న వారికిది గుణపాఠం. కుటుంబంలా ఉండాల్సిన సంఘాన్ని ఏకపక్ష నిర్ణయాలతో సామాన్యులకు దూరం చేయాలనుకున్నారు. సామాన్య సభ్యులకు న్యాయం జరిగేలా కోర్టు ఉత్తర్వులు జారీ చేయడం సంతోషం.

– చిమ్మని ప్రకాశ్, దావా వేసిన సంఘం సభ్యుడు

నామినేషన్ పత్రాన్ని స్వీకరించలేదు



ఎన్నికల్లో పోటీ చేసే ఉద్దేశంతో నిబంధనలు పాటించి అందించిన నామినేషన్‌ను అకారణంగా తిరస్కరించారు. గడువు లోపు సమర్పించినా దౌర్జన్యంగా బయటకు పంపేందుకు ప్రయత్నించారు. సంఘాన్ని తమ గుప్పిట్లో ఉంచుకోవాలని భావించిన కొంతమంది కోసం అన్ని నిబంధనలనూ కాలరాశారు. ఎన్నికల ప్రక్రియను అపహాస్యం చేశారు.

– గజ్జెల్లి సత్యనారాయణ

క్లుప్తంగా

బాధ్యతలు చేపట్టిన హెల్త్ అసిస్టెంట్

కరీంనగర్ కార్పొరేషన్: నగరపాలకసంస్థలో హెల్త్ అసిస్టెంట్‌గా వెంకటరామ్ శనివారం బాధ్యతలు చేపట్టారు. రామడుగు మండలం నుంచి డిప్యూటేషన్‌పై ఆయన బల్దియాకు వచ్చారు.

రవిచంద్రకు పైడి జయరాజ్ స్మారక పురస్కారం

కరీంనగర్‌కల్చరల్: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ కళోత్సవం–2025లో కరీంనగర్ చెందిన పొన్నం రవిచంద్రను పైడిజయరాజ్ స్మారక పురస్కారానికి ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కాగా ఆదివారం రవీంద్రభారతి ఈ పురస్కారం అందజేయనున్నట్లు ప్రకటించారు.

డివిజన్ సమస్యలు పరిష్కరించాలి

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని 39వ డివిజన్ వరసిద్ధికాలనీ, శ్రీరామకాలనీ, పార్వతినగర్ కాలనీల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని బీజేపీ నాయకుడు మాసం గణేశ్ డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం నగరపాలకసంస్థ డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ, స్ట్రీట్‌లైట్లు, ట్యాప్ కనెక్షన్‌లు సక్రమంగా లేవన్నారు. ప్రస్తుత వర్షాలతో రోడ్లు అధ్వానంగా మారాయని, చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉచిత కుట్టు శిక్షణ తరగతులు ప్రారంభం



కుట్టు శిక్షణ పొందే మహిళలతో సంస్థ ప్రతినిధులు

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం నాగులమల్యాలకు చెందిన పలువురు మహిళలకు శనివారం అభయ స్వచ్ఛంద సంస్థల వ్యవస్థాపకుడు స్వామి సుంకు బాలచంద్ర ఆధ్వర్యంలో చింతకుంట శాంతినగర్‌లో ఉచిత టూల్ కిట్స్‌ను అందజేసి కుట్టుశిక్షణ తరగతులను మాజీ కార్పొరేటర్ బొప్పరి జయశ్రీ ప్రారంభించారు. అదేవిధంగా మూడు నెలల పాటు కుట్టు శిక్షణ పొందిన మహిళలకు టూల్ కిట్స్‌తో పాటు 22 మంది మహిళలకు రాయితీపై కుట్టు మిషన్లు అందజేసినట్లు బాలచంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకురాలు రమాదేవి, అభయ డైరెక్టర్ కృష్ణవేణిరావు, గజ్వేల్ వెంకటేష్, కో ఆర్డినేటర్ అరుణ ప్రభంజన్, ట్రైనర్ స్వప్న, మహిళలు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలను సందర్శించిన వైద్యాధికారి



వంటగదిని పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి

హుజూరాబాద్: పట్టణ శివారు బోర్నపల్లిలోని మహాత్మా జ్యోతిరావుపూలే బాలుర గురుకుల పాఠశాలను శనివారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి వెంకటరమణ సిబ్బందితో కలిసి సందర్శించారు. వంటగది, బాత్‌రూంలు, హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. వంట సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. విద్యార్థులను ఎలుకలు కొరికిన నేపథ్యంలో హాస్టల్‌లో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎలుకలు, పాముల బారి నుంచి విద్యార్థులను కాపాడాలని, తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ రాణికి సూచించారు. వెంట జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ పంజాల ప్రతాప్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్యామ్ పాల్గొన్నారు.

వైద్య శిబిరం

బాలురను ఎలుకలు కొరికిన సంఘటన నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు పాఠశాలలో వైద్యశిబిరం నిర్వహించారు. విద్యార్థులకు పలు పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో డాక్టర్లు కృష్ణారావు, మీనాక్షి, సూపర్‌వైజర్ రమేశ్ పాల్గొన్నారు.

వర్షాలతో చిరు బతుకులు ఆగం

- వ్యాపారాలు సాగక ఇబ్బంది
- మరో మూడు రోజులు ఇదే పరిస్థితి



వర్షంలో అమ్మకాలు సాగక ఆందోళన చెందుతున్న కూరగాయల వ్యాపారులు

విద్యానగర్(కరీంనగర్): రోజూ అమ్మకాలు సాఫీగా సాగితేనే సాగే బతుకులు వారివి. కూలీ పని దొరికితేనే రోజు గడిచేది. కూరగాయల అమ్మకాలతో పూటగడిచేది. చిరువ్యాపారంతోనే నాలుగు మెతుకులు నోటికెళ్లేది. నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు తోడు మరో రెండుమూడు రోజులు భారీ వర్షాలు ఉండడంతో రోజువారి బతుకులు ఆగమవుతున్నాయి. నిర్మాణ పనులు పూర్తిగా బంద్ కావడంతో ఆ పనులతోనే పొట్టపోసుకునే కూలీలు, వానలతో వ్యాపారాలు సాగాక చిరువ్యాపారులు, కూరగాయల, పండ్ల వ్యాపారులు ఆవేదన చెందుతున్నారు. కరీంనగర్ చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి ప్రతిరోజూ వచ్చే వందలాది కూలీలు పనుల కోసం తెల్లవారు జామున అడ్డాలపై నిలబడి ఎదురుచూస్తున్నారు. తోపుడు బండ్ల చిరు వ్యాపారులు, గల్లీల్లో తిరుగుతూ అమ్మకాలు సాగించే వారికి వర్షాలతో ఉపాధి లేకుండా పోయిందని వాపోతున్నారు. మరో రెండు మూడు రోజులు వర్షాలు ఇలాగే ఉంటే తమ బతుకుల ఎలా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



హెడ్‌పోస్టాఫీస్ అడ్డా వద్ద పని కోసం ఎదురుచూస్తున్న రోజూ వారి కూలీలు

తిండికి కష్టమే..



వానలతో ఎవరూ బయటికి రావడం లేదు. తెచ్చిన కూరగాయలు అమ్మకాలు లేక మురిగిపోతున్నాయి. వర్షాల వల్ల ఆకుకూరలు మధ్యాహ్నానికే మురిగి పాడైపోతున్నాయి. పెట్టిన పెట్టుబడి అంటుంచితే ఎదురు నష్టం అవుతుంది. ఇలాగే వానలు ఉంటే తిండికి కష్టమే.

– ఓదమ్మ, కూరగాయల వ్యాపారి, కరీంనగర్

కూలీ దొరుకుతనే..



కూలీ దొరుకుతనే రోజు గడిచేది. వర్షాకాలం పనులు అంతంత మాత్రమే. వారం రోజులుగా వర్షాలతో సిమెంట్ పనులు జరగడం లేదు. పని కోసం అడ్డామీదికి రావడం, పని దొరకక తిరిగిపోవడం అయితుంది. మరో రెండుమూడు రోజులు వానలు ఇలాగే ఉంటాయంటున్నారు. ఇప్పటికి వారం రోజులు అవుతుంది. పని లేక రోజు గడవడం కష్టంగా ఉంది.

– వినోద్‌కుమార్, రోజు వారి అడ్డా కూలీ, కరీంనగర్

పండ్లన్నీ మురిగిపోతాయి



చేసేదే వేయి, పదిహేను వందల వ్యాపారం. రోజూ హోల్‌సెల్‌లో పండ్లు తెచ్చుకుని అమ్ముకుంటాం. రాత్రి వరకు రెండు మూడు వందలు చేతికి వస్తాయి. వర్షాలతో అవి కూడా రావడం లేదు. మరో రెండు రోజులు వర్షాలు అంటున్నారు. పండ్లన్నీ మురిగిపోతాయి. ఆందోళనగా ఉంది.

– ఇక్బాల్, పండ్ల వ్యాపారి. కరీంనగర్

అమ్మకాలు లేవు



మొన్నటివరకు ఆషాఢం శుభకార్యాలు లేవు. అమ్మకాలు అంతంత మాత్రమే జరిగాయి. శ్రావణంలో శుభకార్యాలున్నాయి. అమ్మకాలు బాగుంటాయి అనుకుంటే నాలుగు రోజులుగా వానలు పడుతున్నాయి. మరో నాలుగైదు రోజులు ఉంటాయి అంటున్నారు. వర్షం ఇలాగే ఉంటే వ్యాపారం లేక ఇబ్బంది పడాల్సి వస్తుంది.

– వాసాల శ్రీనివాస్, ఎస్‌వీ హైండ్లుమ్స్, సాయినగర్, కరీంనగర్

సర్టిఫికెట్లు ప్రదానం



సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో నరేందర్ రెడ్డి

కొత్తపల్లి: కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈటెక్నో స్కూల్ ప్రాంగణంలో ఇటీవల ఎన్‌సీసీ అధికారులతో నిర్వహించిన ఏ సర్టిఫికెట్ పరీక్షలో ప్రతిభ కనబర్చిన 46 మంది విద్యార్థులకు శనివారం అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశభక్తి పెరగడానికి ఎన్‌సీసీ దోహదపడుతుందని, ప్రాథమిక దశ నుంచే విద్యార్థుల్లో దేశభక్తి పెంచేందుకు ఎన్‌సీసీలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టార్పాలిన్లు అందజేత



టార్పాలిన్, రెయిన్‌కవర్‌లు అందజేస్తున్న చంద్రమౌళి

కరీంనగర్ కార్పొరేషన్: వరుసగా కురుస్తున్న వర్షాలతో నగరంలోని 55వ డివిజన్ కాశ్మీర్‌గడ్డలో దెబ్బతిన్న పాత ఇళ్లకు మాజీ కార్పొరేటర్ శ్రీదేవి చంద్రమౌళి శనివారం టార్పాలిన్లు అందజేశారు. రెడ్‌క్రాస్ చైర్మన్ కేశవరెడ్డి సహకారంతో టార్పాలిన్‌లు, రెయిన్‌కవర్‌లు అందచేసినట్లు తెలిపారు.

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు



పారమిత పాఠశాలలో కార్గిల్ అమరవీరులకు నివాళి అర్పిస్తూ విద్యార్థుల నృత్యం

సప్తగిరికాలనీ(కరీంనగర్): నగరంలోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం మైభారత్ కరీంనగర్, యువశక్తి యూత్ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించారు. విద్యార్థుల్లో జాతీయ భావం పెంచేందుకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కళాశాల చైర్మన్ గోవిందరం కృష్ణ, యువజన సంఘాల నాయకులు తొర్తి శ్రీనివాస్, సాగర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారమిత హెరిటేజ్ పాఠశాలలో..

కొత్తపల్లి: పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాలలో శనివారం కార్గిల్ విజయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మాజీ ఆర్మీ కెప్టెన్ నరెడ్డి ఇంద్రాకర్ రెడ్డి హాజరై జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యార్థులు దేశభక్తిని ప్రతిబింబించే నృత్యాలు, గీతాలు ఆలపించారు. పారమిత విద్యాసంస్థల చైర్మన్ ఇ.ప్రసాద్ రావు కార్గిల్ యుద్ధ వీరులకు నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు ప్రసూన, రష్మిత, అనూకర్‌రావు, టీఎస్‌వీ.రమణ, వినోద్ రావు, హన్మంతరావు, ప్రధానోపాధ్యాయుడు గోపీకృష్ణ, కోఆర్డినేటర్లు నాగరాజు, రాము, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మాజీ సైనికులను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి

మాజీ సైనికులకు సన్మానం

కొత్తపల్లి: కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా శనివారం కొత్తపల్లిలో రాజరాజేశ్వరి లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ ఆధ్వర్యంలో మాజీ సైనికులు నారెడ్డి ఇంద్రాకర్‌రెడ్డి, ద్యావనపల్లి అనిల్, మందల అమరేందర్‌రెడ్డి, మావిశెట్టి రమేశ్, యాళ్ల మహేందర్ రెడ్డిలను ఘనంగా సన్మానించారు, క్లబ్ అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించిన వీర సైనికులను స్మరించుకుంటూ వారి స్ఫూర్తితో దేశ రక్షణకు ప్రతి పౌరుడు కంకణబద్ధులు కావాలని అన్నారు. కార్యదర్శి బండ కిషన్‌రెడ్డి, బీవోడీ సభ్యులు బండ గోపాల్‌రెడ్డి, గుండేటి రామచంద్రం, లంబు రాజిరెడ్డి పాల్గొన్నారు.



కరీంనగర్ కార్పొరేషన్: కరీంనగర్–సిరిసిల్ల ప్రధాన రహదారి నుంచి బావుపేటకు వెళ్లే మెయిన్‌రోడ్డు పూర్తిగా జలమయమైంది. వరుసగా కురుస్తున్న వర్షాలతో రోడ్డుపైనే వరదనీళ్లు నిలుస్తున్నాయి. దీంతో గ్రామంలోనికి వెళ్లాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వాహనాలు నీళ్లల్లో దెబ్బతింటున్నాయి. రోజుల తరబడి ఈ సమస్య నెలకొన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా రోడ్డుపై నిలిచిపోతున్న వరదనీటిని తొలగించేలా, మళ్లీ సమస్య ఉత్పన్నం కాకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలి.



– దాసరి విద్యాసాగర్‌రావు, బావుపేట

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
కన్యాకుమారి, కార్యదర్శి, బావుపేట, సెల్ నం.96769 43451

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 94400 77555

ఎడతెరిపిలేని వాన

- ఊపందుకున్న వరినాట్లు



ప్రవహిస్తున్న ఇరుకుల్లవాగు

కరీంనగర్‌రూరల్: ప్రస్తుతం ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో సాగు పనులు జోరుగా సాగుతున్నాయి. 45రోజులపాటు నెలకొన్న వర్షభావ పరిస్థితులతో ఆందోళన చెందిన రైతులు ఐదురోజులుగా కురుస్తున్న వర్షాలతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇరుకుల్లవాగు ప్రవహిస్తుండగా పలు గ్రామాల్లోని చెరువులు, కుంటల్లోకి వరదనీళ్లు చేరుతున్నాయి. పంటల సాగుకు అవసరమైన నీళ్లందడంతో వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి.

10వేల ఎకరాల్లో వరినాట్లు

కరీంనగర్‌మండలంలో వానాకాలం సీజన్‌లో 12,700 ఎకరాల్లో ప్రధానంగా వరిపంటను సాగు చేస్తారని వ్యవసాయశాఖ అంచనా వేసింది. అయితే వానాకాలం సీజన్ ఆరంభంలో కురిసిన వర్షాలతో సంబురపడిన కొందరు రైతులు ముందస్తు సాగు పనులు చేపట్టారు. అనంతరం నెలరోజులకు పైగా వరుణుడు కరుణించక పోవడంతో ఆందోళన చెందిన రైతులు పంటలను కాపాడుకునేందుకు పడరానీపాట్లు పడ్డారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో పలువురు రైతులు వరినాట్లేస్తున్నారు. పలు గ్రామాల్లో మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్, ఉత్తరప్రదేశ్‌లకు చెందిన వలస కూలీలు నాట్లేస్తున్నారు. ఇప్పటివరకు సుమారుగా 10వేల ఎకరాల్లో వరినాట్లు వేసినట్లు ఏవో సత్యం తెలిపారు. ఆగస్టు మొదటివారం వరకు వరినాట్లేసేందుకు అవకాశం ఉండటంతో వరిసాగు విస్తీర్ణం పెరుగుతుందని పేర్కొన్నారు.

చదువుపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న కవిత

చిగురుమామిడి: విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ జెండర్ స్పెషలిస్టులు కవిత, శైలజ సూచించారు. శనివారం మండలంలోని బొమ్మనపల్లి జెడ్పీపాఠశాలలో విద్యార్థులకు బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. లక్ష్యసాధన కోసం కష్టపడి చదువుతూ ఉన్నత శిఖరాలు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.లక్ష్మణ్‌రావు, ఉపాధ్యాయులు జోత్స్న, బి. శంకర్, చంద్రశేఖర్, బాల్‌రెడ్డి, రమాదేవి, షర్మిల, కవిత, జ్యోతి, సీపీ దేశిని జ్యోతి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

హుజూరాబాద్: పట్టణానికి చెందిన విద్యార్థులు కాశిరెడ్డి గౌతమ్, మేకల ప్రభాత్ విష్ణువర్ధన్, వేల్పుల రమ్య జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారని కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ సారయ్య ప్రకటనలో తెలిపారు. చండీఘడ్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారని అన్నారు.

ఏసీపీ మాధవి కుటుంబానికి పరామర్శ





ఏసీపీ మాధవిని పరామర్శిస్తున్న బండి సంజయ్‌కుమార్, పొన్నం ప్రభాకర్

కరీంనగర్‌టౌన్: హుజురాబాద్ ఏసీపీ మాధవి భర్త డీఎస్పీ మహేశ్ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాన్ని కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ శనివారం పరామర్శించారు. కరీంనగర్‌లోని మాధవి ఇంటికి వెళ్లి మహేశ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మహేశ్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. సంజయ్‌ను చూడగానే విలపించిన మాధవిని ధైర్యంగా ఉండాలంటూ ఓదార్చారు. అదే విధంగా బాగా చదువుకుని తండ్రి ఆశయాలను నెరవేర్చాలని మాధవి–మహేశ్ కుమారులకు సూచించారు. మంత్రి వెంట ఆకాంక్షించారు. మాజీ మేయర్ సునీల్ రావు ఉన్నారు. అలాగే చెర్లభూత్కూర్‌కు చెందిన బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి రమణారెడ్డి తల్లి ఇటీవల మృతిచెందగా శనివారం కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ పరామర్శించారు.ఆయన వెంట మాజీ మేయర్ సునీల్‌రావు, బీజేపీ నాయకులు సంతోష్,శ్రవణ్, రమేశ్, అమరేందర్, నాగభూషణం, శ్రీనివాస్, మనోజ్, లక్ష్మణ్ తదితరులున్నారు.

మంత్రి 'పొన్నం' పరామర్శ

కరీంనగర్‌కార్పొరేషన్: ఏసీపీ మాధవిని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొ న్నం ప్రభాకర్ పరామర్శించారు. శనివారం నగరంలోని ఆమె నివాసానికి వెళ్లి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మహేశ్ చిత్రపటానికి పూలువేసి నివాళి అర్పించారు. ఆయన వెంట డీసీసీ అధ్యక్షుడు, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, నాయకులు భాస్కర్‌రెడ్డి, కర్ర రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి కిరణ్‌కుమార్

సైదాపూర్: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని హుజూరాబాద్ సివిల్ జడ్జి కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం సైదాపూర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడారు. వివిధ నేరాలకు సంబంధించిన సెక్షన్లు, శిక్షల గూర్చి వివరించారు. సదస్సులో హుజూరాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుకుమార్, అడ్వకేట్ తిరుపతి, ఎస్‌ఐ తిరుపతి, ప్రిన్సిపాల్ మహేందర్‌కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రాజశేఖర్, అధ్యాపకులు మహేందర్, రాజు, రవి, భాస్కర్, కృష్ణప్రసాద్, రాజశేఖర్, రమేశ్, విజయ్, శివాజీ, వినయ్ పాల్గొన్నారు.

నియామకం

హుజూరాబాద్: పట్టణానికి చెందిన కాశెట్టి కుమార్‌ను మున్నూరుకాపు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమిస్తూ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తమరావు పటేల్ నియామక ఉత్తర్వులు అందజేశారు. వేములవాడలో మున్నూరుకాపు సమావేశంలో నియామకం జరిగింది. నియామకం పట్ల బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్‌లోని ప్రగతి ఉన్నత పాఠశాల 2000 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు శనివారం కెమిస్ట్ భవన్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఉపాధ్యాయులను సన్మానించి నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం వారు చేస్తున్న ఉద్యోగాలు, కుటుంబ వివరాలు ఒకరికొకరు తెలుసుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పెర్సీ నిర్మల, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రవీందర్, సంధ్యారాణి, ఉష, సరస్వతి, సుమతి, ప్రణీత, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.






నమో వేంకటేశా

కరీంనగర్‌కల్చరల్: శ్రావణ మాసం పురస్కరించుకొని మార్కెట్ రోడ్డు వేంకటేశ్వరాలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. ఇంటిల్లిపాది పేర్ల మీద అర్చనలు, అభిషేకాలు, దీపరాధనలు చేశారు. స్వామి వారిని భక్తితో కొలిచారు. ఈ కార్యక్రమంలో ఈవో సుధాకర్, ధర్మకర్తల చకిలం గంగాధర్, చకిలం శ్రీనివాస్, సిబ్బంది, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

అలుగుపారుతున్న చెరువులు



గన్నేరువరం: మండలంలోని వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు, కుంటలు నిండుకుంటున్నాయి. శనివారం పారువెల్ల పెద్ద చెరువులోకి భారీగా వరద నీరురావడంతో అలుగు పారింది. ఏటా పారువెల్ల చెరువు మొదటగా అలుగు పారుతుందని, నీరంతా గన్నేరువరం పెద్ద చెరువులోకి చేరుతుందని, వానాకాలం సాగుకు ఇబ్బంది ఉండదని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కోర్టును బురిడీ కొట్టించేందుకే
బాబు కుట్ర

చంద్రబాబు ప్రభుత్వ సరికొత్త కుతంత్రం

ఈ నేపథ్యంలోనే వికాట్ కంపెనీలో సిట్ సోదాల డ్రామా

సాక్షి, అమరావతి: చంద్రబాబు ప్రభుత్వం రెడ్‌బుక్ కుట్రలతో మరింతగా రెచ్చిపోతోంది. ఎన్నికల మేనిఫెస్టో అమలులో వైఫల్యాన్ని కప్పిపుచ్చేందుకు అక్రమ కేసులతో తెగబడుతూ రాద్ధాంతం చేస్తోంది. ఈ క్రమంలో ఏకంగా న్యాయస్థానాలనే తప్పుదారి పట్టించేందుకు బరితెగిస్తోంది. ఆ పక్కా పన్నాగంతోనే... వికాట్ కంపెనీ డైరెక్టర్ బాలాజీ గోవిందప్ప బెయిల్‌ను అడ్డుకోవడమే లక్ష్యంగా కోర్టును బురిడీ కొట్టించేందుకు హైదరాబాద్‌లో సోదాల పేరుతో శనివారం కొత్త కుట్రకు తెరతీసింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పారదర్శకంగా అమలు చేసిన మద్యం విధానంపై నమోదు చేసింది అక్రమ కేసేనని సిట్ దర్యాప్తు తీరే స్పష్టం చేస్తోంది. అందుకనే... టీడీపీ బాస్‌లకు అన్నింట్లోనూ 'ఎస్'అనే పోలీస్ అధికారులతో ఏర్పాటైన సిట్ దర్యాప్తులో ఒక్క ఆధారాన్నీ సేకరించలేకపోయింది. బెదిరింపులు, వేధింపులు, అబద్ధపు వాంగ్మూలాలు, తప్పుడు సాక్ష్యాలు తప్ప సాధించినదేమీ లేదన్నది తేటతెల్లమైంది. ఎల్లో మీడియా ద్వారా సాగిస్తున్న దుష్ప్రచార కుతంత్రమూ బెడిసికొడుతోంది. అసలు లేని కుంభకోణాన్ని ఉన్నట్టుగా చూపించేందుకు పన్నిన పన్నాగం బెడిసి కొడుతుండడంతో చంద్రబాబు ప్రభుత్వం బెంబేలెత్తుతోంది. దర్యాప్తు పేరిట సిట్ చేస్తున్న హడావుడి... ఇదంతా అక్రమ కేసేనని స్పష్టం చేస్తోంది. దీంతో మరో కుతంత్రం రచించింది. హైదరాబాద్‌లో సోదాల డ్రామాను సృష్టించింది.

బాలాజీ గోవిందప్పను అక్రమంగా అరెస్టు చేసి 75 రోజులైంది. ఎలాంటి ఆధారాలు లేకుండా నెలల పాటు దర్యాప్తు రిమాండ్‌లో ఉంచడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధం. దీంతో బెయిల్ ఇవ్వాలని ఆయన కోర్టులో పిటిషన్ వేశారు. బాలాజీ గోవిందప్ప తదితరులకు త్వరలో బెయిల్ ఖాయమని న్యాయ నిపుణులు సైతం స్పష్టం చేస్తున్నారు. మరోవైపు కేసు దర్యాప్తు ఎంతవరకు వచ్చిందని సిట్ అధికారులను కోర్టు నిలదీస్తోంది. ఇటీవల సమర్పించిన ప్రాథమిక చార్జ్‌షీట్‌లో బాలాజీ గోవిందప్ప, రిటైర్డ్ ఐఏఎస్ ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి తదితరుల పేర్లను ప్రస్తావించలేదు. అందుకని సాంకేతిక అంశాలతో కోర్టును తప్పుదారి పట్టించేందుకు సిట్ కొత్త ఎత్తుగడ వేసింది. ఈ క్రమంలోనే బాలాజీ గోవిందప్ప బెయిల్‌ను అడ్డుకునేందుకు సిట్ పన్నాగం పన్నింది. హఠాత్తుగా సోదాల డ్రామాకు తెరతీసింది. కోర్టు అనుమతి లేకుండానే 20 మందితో కూడిన సిట్ బృందం సోదాలు అంటూ హంగామా చేసింది. సోదాలపై కోర్టు అనుమతి పత్రం చూపించాలన్న వికాట్ ఉద్యోగులతో సిట్ అధికారులు దురుసుగా ప్రవర్తించారు. బలవంతంగా కార్యాలయంలోకి చొచ్చుకెళ్లారు. పోలీస్ మార్క్ గూండాగిరితో భయపెట్టేందుకు ప్రయత్నించారు.

కుంభకోణం జరిగితేనే కదా?

లేని కుంభకోణం ఉన్నట్టు చూపించాలన్న సీఎం చంద్రబాబు కుట్ర క్షేత్రస్థాయిలో బెడిసికొడుతోంది. ఈ పరిణామాలన్నీ సిట్ దర్యాప్తు డొల్లతనాన్ని బట్టబయలు చేస్తున్నాయి. దాంతో బాలాజీ గోవిందప్ప బెయిల్ ను అడ్డుకునేందుకు సిట్ సోదాలకు దిగింది. తద్వారా ఈ కేసు ఇంకా దర్యాప్తు చేయాల్సి ఉందని చెబుతూ కోర్టును తప్పుదారి పట్టించాలన్నది సిట్ పన్నాగం. ఆ నెపంతో బాలాజీ గోవిందప్ప బెయిల్‌ను అడ్డుకోవాలన్నది లక్ష్యం.

బాలాజీ గోవిందప్ప డైరెక్టర్‌గా ఉన్న వికాట్ కంపెనీ కార్యాలయంలో సిట్ సోదాలు పక్కా పన్నాగమే. ఎందుకంటే, మే 13న అక్రమంగా అరెస్టు చేసే సమయంలోనూ ఇదే రీతిలో ఆయన నివాసంలో సిట్ అధికారులు రోజంతా సోదాలు చేశారు. ఎలాంటి ఆధారాలు దొరక్కపోవడంతో బాలాజీ గోవిందప్ప కుమారుడి ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్లను జప్తు చేసి సిట్ తన దిగజారుడుతనాన్ని ప్రదర్శించింది. ఆ వస్తువులు తనవి కావని బాలాజీ గోవిందప్ప కోర్టులో పిటిషన్ కూడా వేశారు. సీజ్ చేసిన వస్తువును తిరిగి అప్పగించాలని, సంబంధిత వ్యక్తులకు ఇచ్చేస్తామని కోరారు. ఇక ఆయన నివాసంలో గానీ, జప్తు చేసినట్టు ప్రకటించిన ఎలక్ట్రానిక్ పరికరాల్లో గానీ సిట్ ఆధారాలు చూపలేకపోయింది. దాంతో సిట్ పన్నాగం ఫలించలేదు. 75 రోజులు రిమాండ్‌లో ఉన్నా సరే దర్యాప్తులో కనీస పురోగతి సాధించలేదు.

చెదిరిపోతున్న చంద్రబాబు కుట్రలు

3.58 లక్షల జీబీల డేటా ధ్వంసం అంటూ ఈనాడు దుష్ప్రచారం

రాష్ట్ర బెవరేజస్ కార్పొరేషన్‌లో 3.58 లక్షల జీబీల డేటాను వైఎస్సార్‌సీపీ వర్గీయులు నాశనం చేశారని... 375 పేజీల డేటాను డిలీట్ చేశారని ఈనాడు సహా ఎల్లో మీడియా పెద్ద ఎత్తున దుష్ప్రచారం చేసింది. దీనిపై ఓ సామాజిక కార్యకర్త సమాచార హక్కు చట్టం కింద బెవరేజస్ కార్పొరేషన్‌కు దరఖాస్తు చేశారు. ''అసలు మా వద్ద అలాంటి డేటానే ఏనాడూ లేదు. మేం ఎలాంటి డేటాను డిలీట్ చేయలేదు''అంటూ స్వయంగా టీడీపీ కూటమి ప్రభుత్వంలోని బెవరేజస్ కార్పొరేషనే లిఖితపూర్వకంగా తెలిపింది. అంటే, అక్రమ కేసుపై ఎల్లో మీడియా చేస్తున్నదంతా దుష్ప్రచారమేనని నిర్ధారణ అయింది. చంద్రబాబు, లోకేశ్ సిట్‌ను అడ్డుపెట్టుకుని కట్టుకథలు అల్లుతూ... వందల కొద్దీ ఎల్లో యూట్యూబ్ చానళ్లను సృష్టించి, టీడీపీ పెయిడ్ ఆర్టిస్టులను నిపుణులు, పాత్రికేయులుగా నమ్మిస్తూ భారీగా డబ్బులు ఎరవేసి విష ప్రచారం సాగిస్తున్నారని స్పష్టమైంది.

హైదరాబాద్‌లోని బాలాజీ గోవిందప్ప నివాసంలో సిట్ సోదాలు

- వికాట్, భారతీ సిమెంట్స్ కార్యాలయాల్లో కూడా!
- 2 ప్రత్యేక బృందాలతో ఐదున్నర గంటల పాటు సోదాలు



హైదరాబాద్‌లోని బాలాజీ గోవిందప్ప నివాసంలో సిట్ సోదాలు

సాక్షి, హైదరాబాద్: మద్యం అక్రమ కేసులో సిట్ అధికారులు ఏఎస్పీ స్నేహిత నేతృత్వంలో హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని వికాట్ గ్రూప్ డైరెక్టర్ బాలాజీ గోవిందప్ప నివాసంలో శనివారం సోదాలు నిర్వహించారు. సిట్ గతంలోనూ సుదీర్ఘంగా సోదాలు చేసినా.. ఆయనకు వ్యతిరేకంగా ఒక్క ఆధారమూ కోర్టులో ప్రవేశ పెట్టలేకపోయింది. మరోవైపు ఏసీబీ కోర్టులో బాలాజీ గోవిందప్ప వేసిన బెయిల్ పిటిషన్ ఈ నెల 29న విచారణకు రానుందని, దానిని అడ్డుకునేందుకే సోదాల పేరుతో సిట్ అధికారులు కొత్త నాటకానికి తెరలేపారని గోవిందప్ప న్యాయవాదులు అంటున్నారు. బంజారాహిల్స్‌లోని వికాట్, భారతీ సిమెంట్స్ ప్రధాన కార్యాలయంలోనూ సిట్ సోదాలు నిర్వహించింది. డీఎస్పీ శ్రీనివాస్, ఆరుగురు పోలీసుల బృందంతో కలిసి సుమారు ఐదున్నర గంటలు సోదాల్లో పాల్గొన్నారు. బాలాజీ గోవిందప్ప చాంబర్లు, పరిసర ప్రాంతాలను సోదా చేసినట్లు ఆయన తెలిపారు. కొన్ని డిజిటల్ డివైజ్‌లను సీజ్ చేశామని, వాటిలో ఏముందనేది విచారణలో తేలుస్తామని చెప్పారు. కాగా, సోదాలు నిర్వహించేందుకు వస్తున్నామని సిట్ అధికారులు స్థానిక పోలీసు స్టేషన్‌లో ముందస్తు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. అయితే, ఎవరు సోదాలు నిర్వహిస్తున్నారనేది బంజారాహిల్స్ ఠాణా రికార్డులో పేర్కొనలేదని తెలిసింది. కేవలం ఇద్దరు డీఎస్పీ స్థాయి అధికారులు మాత్రమే... బాలాజీ గోవిందప్ప, భారతీ సిమెంట్స్ కార్యాలయంలో సోదాకు వస్తున్నట్లు రికార్డులో పేర్కొన్నట్లు సమాచారం.

ఏపీ ఆర్థిక పరిస్థితి దారుణం

- గతేడాది తొలి త్రైమాసికంతో పోల్చితే మరింత దిగజారుడు
- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ఆందోళన



సాక్షి, అమరావతి: టీడీపీ కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మరింతగా దిగజారిందంటూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. గత ఆర్థిక సంవత్సరం (2024–25) మొదటి త్రైమాసికంతో పోల్చితే.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) మొదటి త్రైమాసికంలో రాష్ట్ర ప్రభుత్వ పన్ను, పన్నేతర ఆదాయాలు భారీగా తగ్గాయని ఎత్తిచూపారు. రాష్ట్రంలో అవినీతి విశృంఖలత్వం వల్ల ఖజానాకు రావాల్సిన ఆదాయం రాకుండా పోతోందని మండిపడ్డారు. ప్రతి మంగళవారాన్ని అప్పులవారంగా మార్చుకున్న చంద్రబాబు.. గత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంతో పోల్చితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో 15.61 శాతం అధికంగా అప్పులు చేశారంటూ దెప్పి పొడిచారు. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) విడుదల చేసిన కీలకమైన ఆర్థిక సూచీ (ఇండికేటర్)లను ఉటంకిస్తూ చంద్రబాబు సర్కారు ఆర్థిక విధానాలను కడిగిపారేశారు. ఈ మేరకు శనివారం ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఆ పోస్టులో వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

తగ్గిపోయిన ప్రజల కొనుగోలు శక్తి

- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) తొలి త్రైమాసికంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మరింతగా దిగజారింది. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) విడుదల చేసిన నెలవారీ కీలక ఆర్థిక సూచీల ప్రకారం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రమాదకర పరిస్థితుల్లో ఉంది. విభజన అనంతరం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దారుణంగా మారి, ఒక సవాలుగా నిల్చింది. సంక్షేమం, అభివృద్ధి.. రెండింటికి ఎప్పుడైతే ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చి.. ఆ దిశగా వ్యయం చేస్తుందో, అప్పుడు ప్రజల కొనుగోలు శక్తి పెరిగి, పెట్టుబడులు కూడా పెరుగుతాయి. ఇది అన్ని రంగాల్లో రాష్ట్ర అభివృద్ధికి దోహదం చేస్తుంది.
- కానీ.. అంతులేని అవినీతి వల్ల రాష్ట్ర ఆదాయం దారుణంగా పడిపోతోంది. మరోవైపు అన్ని రంగాల్లో వృద్ధి పూర్తిగా తిరోగమనం కావడం కనిపిస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరం 2025–26లో తొలి 3 నెలలకు సంబంధించి చూస్తే పన్ను, పన్నేతర ఆదాయాలు కూడా పూర్తిగా తగ్గిపోయాయి.
- రాష్ట్ర ప్రభుత్వ ఆదాయాలు కొన్ని విభాగాల్లో అతి తక్కువ వృద్ధి ఉంటే.. మరికొన్ని విభాగాల్లో వృద్ధి తగ్గింది. ఇది రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం కోల్పోతోందనడానికి నిదర్శనం.
- గత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంతో పోల్చితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో వస్తు సేవల పన్ను (జీఎస్టీ), అమ్మకం పన్నుల ఆదాయం ఏస్థాయిలో తగ్గిందనేది ఇప్పుడు కాగ్ విడుదల చేసిన నివేదిక చూపుతోంది.
- గత ఆర్థిక సంవత్సర తొలి త్రైమాసికంతో పోల్చితే ప్రస్తుత ఆర్థిక సంవత్సం తొలి త్రైమాసికం రాష్ట్ర సొంత ఆదాయంలో కేవలం 3.47 శాతం, ఇతర ఆదాయాలు, కేంద్రం నుంచి వచ్చిన నిధులు అన్నీ కలిపి చూస్తే ప్రభుత్వ ఆదాయంలో మొత్తం 6.14 శాతం వృద్ధి మాత్రమే ఉంది. కానీ, ఇదే సమయంలో రాష్ట్ర అప్పులు ఏకంగా 15.61 శాతం పెరగడం దారుణం. అంటే.. రాష్ట్ర ప్రభుత్వం తన ఖర్చుల కోసం ఆదాయం పెంచుకునే మార్గాలపై కాకుండా, పూర్తిగా అప్పులపైనే ఆధార పడుతోందన్న విషయం స్పష్టమవుతోంది. ఇది ఆందోళనకరంగా ఉన్న రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి అద్దం పడుతోంది.

అప్పుల్లో ఏపీ టాప్

▶ మొదటి పేజీ తరువాయి

వెల్లడించిన నివేదికల ప్రకారం ఏపీపభుత్వం గత మూడు నెలల (2025 ఏప్రిల్, మే, జూన్) కాలంలో రూ.37,093 కోట్ల అప్పులను సేకరించింది. ఏపీతో పోలిస్తే తెలంగాణ ఒకింత తక్కువే అయినా రూ. 20 వేల కోట్ల అప్పుల చిట్టా ను దాటిపోయింది. తెలంగాణతో కొంచెం అటూ ఇటుగా కేరళ, రాజస్తాన్, తమిళనాడు రాష్ట్రాలుండగా, మధ్యప్రదేశ్ మాత్రం తెలంగాణ కంటే ఎక్కువగానే అప్పులు తీసుకుంది. ఇక, దక్షిణాది రాష్ట్రాల పరంగా చూస్తే ఏపీ ఎవరికీ చిక్కనంత దూరంలో నిలిచింది. జాబితాలో ఏపీ తర్వాత తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాలున్నాయి.

సగానికి చేరువగా...!

వాస్తవానికి, ప్రతి రాష్ట్ర ప్రభుత్వం ఏటా ఇంత మొత్తంలో రుణాలు తీసుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంటాయి. ఈ మేరకు వార్షిక బడ్జెట్ అంచనాల్లో ప్రతిపాదించి అసెంబ్లీ ఆమోదం తీసుకుని ఏడాదిపాటు ఆ రుణాలను క్రమంగా తీసుకుంటాయి. కానీ ఏపీ మాత్రం కేవలం మూడు నెలల కాలంలోనే ఏడాది మొత్తం లక్ష్యంగా పెట్టుకున్న అప్పుల్లో దాదాపు సగం అప్పుడే తీసేసుకున్నట్లు కాగ్ లెక్కలు చెబుతున్నాయి. ఈ లెక్కల ప్రకారం రూ.79,926.89 కోట్లను 2025–26 ఆర్థిక సంవత్సరంలో అప్పుల పద్దు కింద సమకూర్చుకోవాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించగా, అందులో 46.40 శాతం అంటే రూ. 37,093.98 కోట్లను అప్పుడే తీసేసుకుంది. ఇక, తెలంగాణ రూ. 54,009.74 కోట్ల రుణ సేకరణ లక్ష్యంగా పెట్టుకుని తొలి మూడు నెలల కాలంలో 37.52 శాతం అంటే రూ. 20,266.09 కోట్లను సమకూర్చుకుంది.

2025-26 తొలి త్రైమాసికంలో టాప్-10 రాష్ట్రాల అప్పులు ఇలా... (రూ. కోట్లలో)

రాష్ట్రం	ఏడాది లక్ష్యం	తీసుకున్నది
ఆంధ్రప్రదేశ్	79,926.89	37,093.98
మధ్యప్రదేశ్	78,902.09	26,163.94
తెలంగాణ	54,009.74	20,266.09
తమిళనాడు	1,06,963.22	19,377.20
కేరళ	45,042.54	17,888.17
రాజస్తాన్	84,643.63	17,175.70
పంజాబ్	34,201.11	9,365.25
ఛత్తీస్‌గఢ్	54,004.02	3,866.60
గుజరాత్	58,397.41	3,499.58
కర్ణాటక	90,428.23	3,368.78

బీజాపూర్ జిల్లాలో ఎదురుకాల్పులు

- నలుగురు మావోయిస్టుల మృతి
- అధునాతన ఆయుధాల స్వాధీనం

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో శనివారం సాయంత్రం మరోమారు తుపాకుల మోత మోగింది. బీజాపూర్ జిల్లా బాసగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారన్న నిఘా వర్గాల సమాచారంతో.. డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, కోబ్రా బలగాలు కూంబింగ్ చేపట్టాయి. అక్కడ తారసపడిన మావోయిస్టులు భద్రతా బలగాల పైకి కాల్పులు జరిపాయి. భద్రతా బలగాలు కూడా ఎదురుకాల్పులకు దిగడంతో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. కాగా, మృతులను ఇంకా గుర్తించలేదు. సంఘటన స్థలంలో ఇన్సాస్, ఎస్ఎల్ఆర్ రైఫిల్స్ తదితర అధునాతన ఆయుధాలు లభించడంతో మృతులు మావోయిస్టు ముఖ్య నేతలుగానే అనుమానిస్తున్నారు. ఘటనాస్థలి నుంచి పలువురు మావోయిస్టులు తప్పించుకున్నట్లు తెలుస్తుండగా.. అక్కడ కూంబింగ్‌ను ముమ్మరం చేసేందుకు అదనపు బలగాలను తరలిస్తున్నారు. కాగా, ఎన్‌కౌంటర్ ఘటనను శనివారం రాత్రి వరకు పోలీసు ఉన్నతాధికారులు అధికారికంగా ధ్రువీకరించలేదు.

'చేనేత' ఎన్నికలెప్పుడో!

- పదవీకాలం ముగిసి ఏడేళ్లు
- కుంటుపడుతున్న సొసైటీల అభివృద్ధి
- ఎన్నికలు నిర్వహించాలంటున్న కార్మికులు



చెన్నూర్ సొసైటీలో వస్త్రాలు నేస్తున్న కార్మికులు

చెన్నూర్: రాష్ట్రప్రభుత్వం చేనేతకు చేయూతనిచ్చేందుకు ఎన్నో పథకాలు అందిస్తోంది. అయితే సొసైటీల పాలకవర్గాల పదవీకాలం ముగిసి ఏడేళ్లవుతున్నా ఇప్పటికీ ఎన్నికలు ఊసేలేకుండా పోయింది. దీంతో సొసైటీల అభివృద్ధి కుంటుపడుతోంది. గత ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకపోవడంతో పర్సన్ ఇన్‌చార్జీలతోనే కాలం వెళ్లదీస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2013 ఫిబ్రవరి 11న చేనేత జౌళిశాఖ ఆధ్వర్యంలో చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. 2018 ఫిబ్రవరి 11న పదవీ కాలం ముగిసింది. పాలకవర్గం పదవీ కాలం ముగిసిన తర్వాత అప్పటి ప్రభుత్వం జీవో 568 ద్వారా సొసైటీలకు పాత అధ్యక్షులను పర్సన్ ఇన్‌చార్జీలుగా నియమించింది. ఏడేళ్లుగా ఎన్నికలు నిర్వహించకుండా వారితోనే కొనసాగిస్తోంది.

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో బెజ్జూర్, చెన్నూర్ చేనేత సొసైటీలు ఉన్నాయి. ఈ సొసైటీల్లో సుమారు 200ల మంది కార్మికులు ఉన్నారు. వీటి పరిధిలో ముడి సరుకులు తీసుకెళ్లి ఇంటి వద్ద వస్త్రం తయారు చేసే కార్మికులు మరో 50 మంది ఉన్నారు.

ఎన్నికలు నిర్వహించే సంఘాలివే..

గతంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పది చేనేత సొసైటీలు ఉండగా నేడు ఆదిలాబాద్, నిర్మల్, లక్సెట్టిపేట, కాగజ్‌నగర్, మంచిర్యాల, బెల్లంపల్లి, దండేపల్లి సొసైటీలు లేకుండా పోయాయి. ప్రస్తుతం కుమురం భీం జిల్లా బెజ్జూర్, మంచిర్యాల జిల్లా చెన్నూర్ సొసైటీలకు మాత్రమే పర్సన్ ఇన్‌చార్జీలు ఉన్నారు. ఆసిఫాబాద్‌లో చేనేత కార్మికులు ఉన్నప్పటికి సొసైటీ లేకపోవడంతో అధికారులే పర్సన్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు.

ఎన్నికలు నిర్వహించాలి



పదవీ కాలం ముగిసి ఏడేళ్లవుతోంది. గత ప్రభుత్వం జీవో 568తో పర్సన్ ఇన్‌చార్జీలుగా వ్యవహరిస్తున్నాం. ఎన్నికలు నిర్వహించి సొసైటీలను బలోపేతం చేయాలి.

– ఇప్పులపల్లి కిష్టయ్య, పర్సన్ ఇన్‌చార్జి, చెన్నూర్

విద్యార్థుల కోసం కలిసి పనిచేస్తాం

- త్వరలోనే వర్సిటీలో శాతవాహన విగ్రహం ఏర్పాటు
- రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- ఎస్‌యూలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శాతవాహనలో అంతర్గత నీటిసరఫరా పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొన్నం, పాల్గొన్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, వీసీ ప్రొఫెసర్ ఉమేశ్‌కుమార్

సాక్షిప్రతినిధి,కరీంనగర్/కరీంనగర్‌క్రైం: శాతవాహన యూనివర్సిటీ, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేస్తామని, ఉమ్మడి జిల్లా ఎంపీలు, ఎమ్మెల్యేలందరితో కలిసి పనిచేయడానికి సిద్ధమని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం శాతవాహన యూనివర్సిటీలోని పరిపాలన భవన మొదటి అంతస్తులో పరీక్షల విభాగం భవనాన్ని ప్రారంభించారు. యూనివర్సిటీలో రూ.2.10 కోట్ల వ్యయంతో అంతర్గత నీటి సరఫరా పైప్‌లైన్ ఏర్పాటు పనులకు శంకుస్థాపన చేశారు. సెమినార్‌హాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఎస్‌యూ పరిధిలో హుస్నాబాద్‌లో ఇంజినీరింగ్ కాలేజీ, కరీంనగర్‌లో న్యాయ కళాశాల, ఫార్మసీ కళాశాల్లో ఎంఫార్మసీ కోర్సు తెచ్చుకున్నామన్నారు. అధికారములో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా జిల్లాను విద్యారంగంలో ముందుంచడానికి ప్రయత్నం చేస్తానన్నారు. శాతవాహనులు పరిపాలించినందుకు విశ్వవిద్యాలయంలో వారి విగ్రహాన్ని ఆవిష్కరణ చేసుకుందామని తెలిపారు.

సామాజిక వర్గాల చాంపియన్ కాంగ్రెస్

ఈ దేశంలో సామాజిక వర్గాల చాంపియన్ కాంగ్రెస్ పార్టీ అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బీసీలపై బీజేపీకి ప్రేమఉంటే.. కిషన్‌రెడ్డి మంత్రి పదవికి రాజీనామాచేసి, ఆ పదవిని బీసీ ఎంపీలైన ఈటల రాజేందర్ లేదా అర్వింద్‌కు ఇస్తారా? అని ప్రశ్నించారు. బలహీన వర్గాల నుంచి పార్టీ అధ్యక్షుడిగా ఉన్న బండి సంజయ్‌ని తొలగించి.. వేరే వాళ్లను నియమించారన్నారు. ఇటీవల ఐదు శాసన మండలి ఖాళీలకు సామాజిక న్యాయం జరిగేలా తమ పార్టీలో బడుగు బలహీన వర్గాలకు కేటాయించామన్నారు. ముగ్గురికి మంత్రి పదవుల కేటాయింపులో సామాజిక న్యాయం పాటించామని తెలిపారు. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా పోరాడిన రామచంద్రరావును బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా చేశారన్నారు. కోర్టు చెప్పిన విధంగా సెప్టెంబర్ 30లోపు స్థానిక ఎన్నికలు నిర్వహించడానికి సహకరించాలని మంత్రి కోరారు. వీసీ ప్రొఫెసర్ ఉమేశ్‌కుమార్ మాట్లాడుతూ త్వరలో రూ.18కోట్లతో న్యాయ కళాశాలను నిర్మిస్తామని తెలిపారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సూరెపల్లి సుజాత మాట్లాడుతూ యూనివర్సిటీ ఏర్పాటులో మంత్రి పొన్నం ప్రభాకర్‌ది కీలకపాత్ర అన్నారు. చొప్పదండి, మానకొండూర్ ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, ఎస్‌యూ రిజిస్ట్రార్ జాస్తీ రవికుమార్, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ పాల్గొన్నారు.

సమసిన వివాదం

- అంత్యక్రియలకు మార్గం సుగమం
- కట్నం డబ్బుల విషయంలో కుదిరిన రాజీ
- ఏరియా ఆసుపత్రిలోనే రెండ్రోజులు మృతదేహం



లావణ్య(ఫైల్)



ఏరియా ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న లావణ్య కుటుంబసభ్యులు

రామకృష్ణాపూర్: మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్‌లో మహిళ అంత్యక్రియల విషయంలో అనిశ్చితి ఏర్పడింది. ప్రమాదంలో గాయపడి మృతిచెందగా.. కట్నం డబ్బుల విషయమై తలెత్తిన వివాదం అందుకు కారణమైంది. శుక్ర, శనివారాల్లో మృతదేహం ఏరియా ఆస్పత్రిలోనే ఉంచాల్సి వచ్చింది. పోలీసుల రంగప్రవేశం, పెద్దల పంచాయితీతో వివాదం సమసిపోయింది. వివరాలిలా ఉన్నాయి. రామకృష్ణాపూర్ పట్టణంలోని శివాజీనగర్‌కు చెందిన సింగరేణి కార్మికుడు గాండ్ల సత్యం, ఆయన కూతురు ముద్దసాని లావణ్య ఇటీవల పెద్దపల్లిలో రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. సత్యం అక్కడికక్కడే మృతిచెందగా.. తీవ్రంగా గాయపడిన లావణ్య (29) హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి చనిపోయింది. మృతదేహాన్ని శుక్రవారం ఇక్కడికి తరలించగా.. అంత్యక్రియల సమయంలో అనిశ్చితి నెలకొంది. కాగా, లావణ్యకు రామకృష్ణాపూర్‌లోని భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన ముద్దసాని సురేష్‌తో ఐదేళ్ల క్రితం వివాహమైంది. కొన్నేళ్లుగా వీరి మధ్య కుటుంబ కలహాలతో లావణ్య తల్లిగారింటి వద్ద ఉంటుంది.

కట్నం డబ్బుల విషయమై..

లావణ్య తల్లిగారింటి వద్దే ఉంటుండడంతో ఆమె కుటుంబ సభ్యులు సురేష్‌కు ఇచ్చిన కట్నం డబ్బులు ఇవ్వాలని గతంలో నుంచే డిమాండ్ చేస్తూ వస్తున్నారు. లావణ్య, ఆమె తండ్రి ఇద్దరు మరణించడంతో పెళ్లి సమయంలో ఇచ్చిన కట్నం రూ.50లక్షలు, బంగారం ఇస్తేనే అంత్యక్రియలు నిర్వహిస్తామని, లేదంటే అత్తారింటి ఎదుట మృతదేహంతో బైఠాయిస్తామని చెప్పడంతో వివాదం తలెత్తింది. మృతదేహాన్ని తమ ఇంటి వద్దకు తీసుకువచ్చే అవకాశం ఉందని గ్రహించిన సురేష్ తండ్రి ముందే సమాచారం ఇవ్వడంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. మృతదేహాన్ని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించి అంబులెన్స్‌లోని ఫ్రీజర్‌లో భద్రపర్చారు. శుక్రవారం నుంచి శనివారం వరకు ఈ ప్రతిష్టంభన కొనసాగింది. పెద్ద మనుషులు జోక్యం చేసుకుని ఇరువర్గాల మధ్య రాజీ కుదిర్చారు. రూ.50 లక్షల కట్నంలో రూ.20 లక్షలు తిరిగి ఇవ్వడానికి అంగీకారం కుదరడంతో వివాదం సమసిపోయింది. అనంతరం లావణ్య బంధువులు ఆమె మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

యూరప్‌లో ఎత్తయిన శిఖరం అధిరోహించనున్న తండ్రీకొడుకులు

- కలెక్టరేట్‌లో 'సే నో టూ డ్రగ్స్' పోస్టర్ ఆవిష్కరణ



తండ్రీకొడుకులతో కలిసి పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష తదితరులు

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని రామగిరి మండలం సెంటినరీకాలనీకి చెందిన తండ్రీకొడుకులు యూరప్ ఖండంలో అత్యంత ఎత్తయిన మౌంట్ ఎల్బ్రోస్ శిఖరాన్ని (18,150 అడుగుల ఎత్తు) అధిరోహించనున్నట్లు కలెక్టర్ శ్రీహర్ష తెలిపారు. కలెక్టరేట్‌లో శనివారం సెంటినరీకాలనీకి చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి వివేకానందరెడ్డి, ఆయన తండ్రి(మాజీ సైనికుడు) మహిపాల్‌రెడ్డి ఈనెల 28న యూరప్‌లోని అత్యంత శిఖరం మౌంట్ ఎల్బ్రోస్ పర్వతాహోరణకు బయలుదేరుతారని పేర్కొన్నారు. దాదాపు 10రోజుల పాటు సాగే ఈ ప్రయాణంలో పర్వతాన్ని అధిరోహించి దానిపై 'సే నోటు డ్రగ్స్' అనే జిల్లా అధికార యంత్రాంగం రూపొందించిన లోగోతో కలిగిన త్రివర్ణపతాకం కలిగిన బ్యానర్‌ను ప్రదర్శిస్తారని వివరించారు. విద్యార్థి వివేకానందరెడ్డి, తన తండ్రి లెంకల మహిపాల్‌రెడ్డి ఇంటర్నేషనల్ మౌంట్ నియర్ గిన్నిస్ వరల్డ్ రికార్డ్ హోల్డర్ వద్ద వివేకానందరెడ్డి శిక్షణ పొందారని పేర్కొన్నారు. తండ్రి ఆధ్వర్యంలోనే పర్వతాన్ని విజయవంతంగా అధిరోహించి జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తెస్తామని వివేకానందరెడ్డి తెలిపారు.

చిక్కిన డెవిల్ ఫిష్



ముదిమాణిక్యం వాగులో లభ్యమైన డెవిల్‌ఫిష్

చిగురుమామిడి: కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ముదిమాణిక్యం గ్రామం సమీపంలో ఉన్న మోయతుమ్మెద వాగు రెండురోజులుగా కురుస్తున్న వర్షాలతో అలుగు పడుతోంది. శనివారం సాయంత్రం వాగుకు వెళ్లిన గ్రామానికి చెందిన వంశీధర్‌రెడ్డి చేతికి డెవిల్‌ఫిష్ చిక్కింది. ఈ చేపను చూసిన గ్రామస్తులు ఈ చేప సముద్రంలోనే ఉంటుందని, వాగులో చూడడం మొదటిసారి అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

సాక్షి ఫ్యామిలీ
11
కరీంనగర్
ఆదివారం ॥ 27-7-2025



● నేడు సి.ఆర్.పి.ఎఫ్.డే



అశోక చక్ర కమలేష్ కుమారి

2001 డిసెంబర్ 13న దేశం ఉలిక్కిపడింది.
కారణం? పార్లమెంట్ మీద ఉగ్రదాడి జరిగింది.
రక్షణగా ఉన్న సి.ఆర్.పి.ఎఫ్ దళాలు ఉగ్రవాదులతో పోరాడాయి.
ఆ సి.ఆర్.పి.ఎఫ్‌లోనే కమలేష్ కుమారి అనే ఆడపులి కూడా ఉంది.
ఆమె ఉగ్రవాదులను అడ్డుకుంటూ దేశం కోసం తన ప్రాణాలు బలి ఇచ్చింది.
మరణానంతరం అశోకచక్రను పొందిన కమలేష్‌ను స్మరించుకుందాం.

దేశంలో అంతర్గత భద్రతకు 85 ఏళ్ల క్రితం జూలై 27, 1939లో 'క్రౌన్ రిప్రెజెంటేటివ్స్ పోలీస్'గా ఏర్పడి ఆ తర్వాత 1949 నుంచి 'సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్'గా సేవలు అందిస్తున్న సి.ఆర్.పి.ఎఫ్‌లో ఇప్పటి వరకూ ఒకే ఒక మహిళ 'అశోక చక్ర' పొందింది. ఆమె కమలేష్ కుమారి. దేశం కోసం సి.ఆర్.పి.ఎఫ్ నుంచి ఎందరో ప్రాణత్యాగం ఇచ్చినా వారిలో కమలేష్ కుమారిది మాత్రం ఎప్పటికీ స్ఫూర్తినిచ్చే పేరే. అందుకంటే పార్లమెంట్ మీద అటాక్ అయిన సందర్భంలో ఆమె తన ప్రాణాలు అర్పించి మొత్తం హౌస్‌నే కాపాడటంలో కీలకపాత్ర పోషించింది.

ఉత్తర ప్రదేశ్ మహిళ

కమలేష్ కుమారిది ఉత్తర ప్రదేశ్‌లోని కన్నౌజ్. సి.ఆర్.పి.ఎఫ్‌లో 1994లో చేరి కొంతకాలం '104 రాపిడ్ యాక్షన్ ఫోర్స్'లో అలహాబాద్‌లో పని చేసింది. ఆ తర్వాత '88 విమెన్స్ బెటాలియన్'లోకి మారింది. 2001 జూలై నుంచి ఆమె ఢిల్లీలో విధులు నిర్వహిస్తోంది. పార్లమెంట్ సమావేశాలు జరిగినప్పుడు విమెన్స్ బెటాలియన్ సభ్యులు సెక్యూరిటీ విధులు నిర్వర్తించడం ఆనవాయితీ. ఆ విధంగా డిసెంబర్ 13న ఆమెకు పార్లమెంట్ డ్యూటీ పడింది. ఆ రోజునే పార్లమెంట్ మీద ఉగ్రదాడి జరిగింది. అప్పటికి కమలేష్ కుమారికి వివాహమై ఇద్దరు ఆడపిల్లలు. పెద్దమ్మాయి వయసు 9 ఏళ్లు, రెండో అమ్మాయి వయసు ఒకటిన్నర సంవత్సరాలు.

ఆ రోజున

డిసెంబర్ 13, 2001న ఉదయం 11.40 గంటలకు ఒక తెల్ల అంబాసిడర్ కారు పార్లమెంట్ భవనంలోకి దూసుకు వచ్చింది. ఆ సమయాన లోపల అద్వానీ, సుష్మా స్వరాజ్ తదితరులతో పాటు 200 మంది పార్లమెంట్ సభ్యులు ఉన్నారు. ఆ సమయానికి కమలేష్ కుమారి గేట్ నంబర్ 11 వద్ద ఐరన్ గేట్ 1 దగ్గర విధులు నిర్వహిస్తోంది. ఆ రోజుల్లో మహిళా సి.ఆర్.పి.ఎఫ్ సభ్యులకు ఆయుధాలు ఇచ్చే ఆనవాయితీ లేదు. ఆమె వద్ద కేవలం వాకీటాకీ ఉంది. కారు దూసుకురావడంతో మొదట అందరూ అది కాన్వాయ్ కారు అనుకున్నారు. కాని కమలేష్ కుమారి అది అనుమతి లేని కారు అని గ్రహించి పక్కనే ఉన్న మరో గార్డ్‌ను అలెర్ట్ చేసి పెద్దగా అరిచి కారు వెనుక పరిగెత్తింది. అప్పటికే అందులో ఉన్న ఐదుగురు ఉగ్రవాదులు కారులో నుంచి జంప్ చేసి కారును పేల్చేయాలని పథకం పన్నారు. కాని కమలేష్ కుమారి పరిగెత్తుకుని రావడంతో కారు అదుపు తప్పి పక్కనే ఉన్న లాన్‌లోకి దూసుకుపోయింది. కారు పేల్చే ప్లాన్ కుదరక అందులో ఉన్న ఐదుగురు దిగి కాల్పులు మొదలెట్టారు. అప్పటికే వాకీటాకీ ద్వారా అందరినీ అప్రమత్తం చేసిన కమలేష్ కుమారి ఒక నిందితుడు పేలుడు పదార్థాలతో పార్లమెంట్ వైపు దూసుకు వెళ్లడాన్ని చూసి వాకీటాకీ ద్వారా దళాన్ని హెచ్చరించింది. ఇంకొన్ని సెకన్లలో అతడు లోపలికి వెళతాడనగా డోర్లు మూసేయగలిగారు. గేటు వైపు నుంచి ఒకరు, లాన్ వైపు నుంచి మరొకరు ఆ ఉగ్రవాదిపై బుల్లెట్ల వర్షం కురిపించారు. లేకుంటే అతడు లోపలికి వెళ్లి మొత్తం సభ్యులను ఏం చేసేవాడో ఊహించడమే కష్టం. అయితే తమ రాకను అలెర్ట్ చేసి అంతా ఛిన్నాభిన్నం చేసిన కమలేష్ కుమారిని ఉగ్రవాదులు వదల్లేదు. బుల్లెట్లు కురిపించారు. మొత్తం 11 బుల్లెట్లు ఆమె శరీరంలో దూసుకుపోయాయి. ఆమె ప్రాణాలు పోయినా దేశ గౌరవాన్ని కాపాడగలిగింది.

అశోక చక్ర

పార్లమెంట్‌పై జరిగిన ఉగ్రదాడిలో మొత్తం 9 మంది అమరులయ్యారు. వీరిలో కమలేష్ కుమారి ఒక్కరే మహిళ. 2002లో ఆమెకు మరణానంతర 'అశోక చక్ర' ప్రకటించారు. నాటి ప్రధాని ఆమెకు అంజలి ఘటించారు. అశోకచక్ర అందుకున్న ఏకైక మహిళగా నిలిచింది కమలేష్ కుమారి.

● స్వయంకృషి

జీవిత పట్టా కుట్టుకుంది

ఆమె తన కుల వృత్తి అయిన చెప్పులు కుడుతూనే... పుస్తకాలు పట్టుకుని జీవితంలోని చిరుగులను కుట్టుకుంది. అమ్మకు ఆసరాగా బీడీలు చుడుతూనే... తెలంగాణ యూనివర్సిటీలో ఇంటిగ్రేటెడ్ కోర్సులతో డిగ్రీ, పీజీ చదివింది. విద్యార్థి నాయకురాలిగానూ అనేక ఉద్యమాల్లో పాల్గొంది. బీఈడీ అయ్యాక బీడీ కార్మికుల బతుకులపై పీహెచ్‌డీ చేసి ఇటీవల తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా పట్టా అందుకుని ఎందరికో ఆదర్శంగా నిలిచింది. ఆమే కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన సిద్ధలక్ష్మి.



● తెలంగాణ రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టా అందుకుంటున్న సిద్ధలక్ష్మి



కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన మోచి వెంకటయ్య, నాగమణి దంపతులకు ఇద్దరు పిల్లలు. పిల్లలిద్దరు చిన్న వయసులో ఉన్నపుడే తండ్రి మరణించాడు. తల్లి నాగమణి ఓ వైపు బీడీలు చుడుతూ మరోవైపు చెప్పులు కుడుతూ పిల్లల్ని చదివించింది. కూతురు సిద్ధలక్ష్మి ఎల్లారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు, అక్కడే ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ పూర్తి చేసింది. చదువుకునే సమయంలో సిద్ధలక్ష్మి బీడీలు చుట్టడంతో పాటు కుల వృత్తి కూడా చేసేది. పొద్దున, సాయంత్రం చెప్పుల దుకాణంలో తల్లితోపాటు కూర్చునేది. చెప్పులు కుట్టడం, అమ్మడంలో సాయపడేది. ఇంటర్ పూర్తయిన తరువాత తెలంగాణ యూనివర్సిటీలో ఐదేళ్ల డిగ్రీ, పీజీ (ఇంటిగ్రేటెడ్) కోర్సుకు సంబంధించిన ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణురాలై సీటు సాధించింది.

దీంతో యూనివర్సిటీలో అడుగు పెట్టిన సిద్ధలక్ష్మి చదువుకుంటూనే విద్యార్థి ఉద్యమాల్లో పాల్గొంది. పీడీఎస్‌యూలో క్రియాశీలకంగా పనిచేసింది. తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమంలోనూ చురుకుగా పాల్గొంది.

ఉద్యమాల్లో పాల్గొంటూనే సిద్ధలక్ష్మి డిగ్రీ, పీజీ పూర్తి చేసింది. బీఈడీ చదువు కోసం మహబూబ్‌నగర్ వెళ్లింది. తరువాత ఉద్యమ సహచరుడు కన్నయ్యను వివాహమాడింది. ఆమెకు ముగ్గురు కుమారులు.

బీడీ కార్మికుల బతుకులపై పరిశోధన...

తెలంగాణ ప్రాంతంలో ముఖ్యంగా ఉత్తర తెలంగాణలో వ్యవసాయం తరువాత ఎక్కువ మంది ఆధారపడే బీడీ రంగంలో కార్మికుల ఆదాయం.. ఖర్చులు అన్న అంశంపై సిద్ధలక్ష్మి పరిశోధన పత్రం సమర్పించింది. ఇటీవల తెలంగాణ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా అందుకుంది. కాగా ఫెలోషిప్ ద్వారా తనకు నెల నెలా అందిన డబ్బులను పొదుపు చేసి ఎల్లారెడ్డిలో ఇల్లు నిర్మించుకుంది. బాన్సువాడలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో గెస్ట్ ఫ్యాకల్టీగా పని చేసింది. కష్టపడి పరిశోధన చేసి పీహెచ్‌డీ పట్టా అందుకుంది. అందరికీ ఆదర్శంగా నిలిచింది.

కష్టాలను దిగమింగాను...

మాది పేద కుటుంబం. అమ్మ ఎంతో కష్టపడి చదివించింది. మా మేనత్త చదువుకోమని ప్రోత్సహించింది. అమ్మకు ఆసరాగా చెప్పులు కుట్టడం, బీడీలు చుట్టడం చేస్తూనే చదువుకు కూడా సమయం కేటాయించేదాన్ని. యూనివర్సిటీలో చాలా మంది ప్రోత్సహించారు. చిన్నప్పుడు బీడీ కార్మికుల కష్టాలను స్వయంగా చూశాను కాబట్టి బీడీ కార్మికులనే సబ్జెక్టుగా తీసుకుని పీహెచ్‌డీ చేశాను. డాక్టర్ పాత నాగరాజు సార్ నా పీహెచ్‌డీకి గైడ్‌గా ఎంతో ప్రోత్సహించి నా పరిశోధనకు సహకరించారు. కష్టాలున్నాయని కుమిలిపోతే ఇక్కడిదాకా రాకపోయేదాన్ని, కష్టాలను ఎదుర్కొనడంలోనే సక్సెస్ ఉంటుందని స్వయంగా తెలుసుకున్నాను. - డాక్టర్ సిద్ధలక్ష్మి, ఎల్లారెడ్డి

– ఎస్.వేణుగోపాలాచారి, సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

బులియన్
(బంగారం 10 గ్రా.: వెండి కిలో) జూలై 26న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	98,260	1,01,240	99,930	1,01,240	98,600	99,920
బంగారం (22 క్యారెట్లు)	90,072	91,600	91,600	94,350	90,710	91,600
వెండి	1,13,370	1,16,400	1,26,000	1,16,400	1,15,800	1,26,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

హెల్త్ ● కెరోటిడ్ ఆర్టరీ డిసీజ్ అంటే..?

ఇటీవల ప్రముఖ నటుడు దర్శకుడు... అలాగే బాలీవుడ్ స్టార్ హృతిక్ రోషన్ తండ్రి రాకేష్ రోషన్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన ఓ పోస్ట్ చాలా మందిని కలతపెట్టడమే కాదు... కనువిప్పుగానూ నిలిచింది. తాను రొటీన్ ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నప్పుడు తన డాక్టర్ తనను... "ఎందుకైనా మంచిది... ఓసారి 'కెరోటిడ్ ఆర్టరీ'ల చెకప్ కూడా చేయించుకో"మ్మని చెప్పాడు. ఆయన చెప్పినట్టుగా ఆ పరీక్షలు చేయించుకున్న తర్వాత తెలిసివచ్చిన విషయం రాకేశ్‌రోషన్‌ను అబ్బురపరచింది. మెదడుకు రక్తాన్ని చేరవేసే ఈ రెండు రక్తనాళాలూ 75 శాతం కంటే ఎక్కువగానే పూడికతో మూసుకుపోయాయి. ఆశ్చర్యమేమిటంటే... ఆయనకు ఎలాంటి లక్షణాలూ లేవు. అలాగే విస్మరించి ఉంటే కొద్దిరోజుల్లోనే కనిపించేందుకు అవకాశమున్న పరిస్థితి ఏమిటంటే... మౌనంగా వచ్చే పక్షవాతంతో ప్రాణాలనూ కోల్పోయే అవకాశమున్న పెనుముప్పు! లేదా నిశ్శబ్దంగా కాళ్లూ చేతులూ పడిపోవడం. కానీ కెరోటిడ్ రక్తనాళాల పరీక్షతో ఆ ప్రాణాపాయం లేదా శాశ్వతంగా అచేతనమయ్యేందుకు అవకాశాలు తొలగాయి. ఆ అనుభవం నుంచి అందరూ నేర్చుకోవాల్సిన పాఠమేమిటో చెప్పే అవగాహన కథనమిది.

సైలెంట్ 'బ్లాక్' వయొలెంట్ స్ట్రోక్





డాక్టర్ ఎం.ఎస్.ఎస్. ముఖర్జీ
సీనియర్ కార్డియాలజిస్ట్

అసలు ముందుగా ఆ కెరోటిడ్ రక్తనాళాలంటే ఏమిటో చూద్దాం. మన మెడకు ఇరువైపులా రెండు రక్తనాళాలు వెళ్తుంటాయి. వీటికే గుండె నుంచి మంచి రక్తాన్ని మెదడుకు చేరవేసే హై-వే అనుకోవచ్చు. వీటినే కెరోటిడ్ ఆర్టరీస్ అని పేరు. ఆ కెరోటిడ్ రక్తనాళాల్లో ఎలాంటి పూడికాలేకుండా ఉంటేనే ఆక్సిజన్, పోషకాలతో కూడిన రక్తం సాఫీగా మెదడుకు అందుతుంది. దాదాపు అరవై కిలోల దేహపు బరువులో మెదడు బరువు కేవలం 1.5 కిలోలే అయినప్పటికీ దేహం మొత్తం వినియోగించే ఆక్సిజన్‌లో దాదాపు 20 శాతం అదే వినియోగించుకుంటుంది. ఒకవేళ ఏదైనా కారణాల వల్ల అలా అందాల్సిన ఆక్సిజన్ అందకపోతే...? అంతటి కీలకమైన శరీర జీవక్రియలను నిర్వహించే మెదడు అచేతనమవుతుంది. అదే జరిగితే తీవ్రమైన పక్షవాతం (స్ట్రోక్) కారణంగా ప్రాణాపాయానికి అవకాశాలెక్కువ.

కరోటిడ్ రక్తనాళాల్లో పూడిక ఎలా చేరుతుందంటే...?

ఓ చిన్నారి పుట్టినప్పుడు ఈ రక్తనాళాలన్నీ ఎలాంటి అంతరాయాలూ, పూడికా లేకుండా స్వచ్ఛంగా ఉంటాయి. కానీ కాలం కడుస్తున్న కొద్దీ వాటిల్లో పూడిక చేరుతుంది. అనేక అంశాలు ఈ పూడికకు కారణమవుతుంటాయి. ఉదాహరణకు దేహంలోని చిన్న చిన్న కొవ్వు పార్టికిల్స్ రక్తనాళాల్లో చేరి నిలిచిపోవడం, అవి అడ్డంగా ఉండటంతో మరికొన్ని కొవ్వు పార్టికిల్స్ ముందుకు ప్రవహించలేక అక్కడే ఉండిపోవడం... దాంతో ఆ కొవ్వు ఉండల పరిమాణం పెరుగుతూ పోవడం, కేవలం కొవ్వులు మాత్రమే కాకుండా కొలెస్ట్రాల్, క్యాల్షియమ్ ముక్కలూ అలా పేరుకుపోవడంతో రక్తప్రవాహానికి అడ్డంగా నిలిచిపోతుంటాయి.

ఇలా జరగడాన్ని వైద్య పరిభాషలో 'అథెరోస్క్లెరోసిస్' అంటారు. రక్తనాళాలన్నింటిలోనూ ఈ ప్రక్రియ జరుగుతూ ఉన్నప్పటికీ ఒక్క క్షణం కూడా నిలవకుండా విధులు నిర్వహించాల్సిన గుండెకూ, మెదడుకూ రక్తం అందకుండా నిలిచిపోయే పరిస్థితి వస్తే అది తీవ్రమైన ముప్పుగా పరిణమించే ప్రమాదముంది. అంటే కొవ్వు తాలూకు ప్లాక్ మీద రక్తం గడ్డకట్టినప్పుడు అది రక్తప్రవాహానికి కలిగించే అవకాశం పెరుగుతుంది. ఈ అథెరోస్క్లెరోసిస్ ప్రక్రియ వయసుపరంగా తమ 30, 40ల నుంచి మొదలై కాలం గడుస్తున్నకొద్దీ పెరుగుతూ పోవచ్చు. కొన్ని అంశాలు ఈ పరిస్థితిని మరింత తీవ్రతరం చేస్తాయి.



డాక్టర్ టి. వంశీధర్
కార్డియో వాస్క్యులార్ & థొరాసిక్ సర్జన్

లక్షణాలు

సాధారణంగా రక్తప్రవాహానికి చాలాపెద్ద హై-వే లాంటి ఇంత పెద్ద రక్తనాళాల్లో పేరుకునే రక్తపు ఉండలతో మొత్తానికి అడ్డంకి కలగదు కాబట్టి లక్షణాలేమీ బయటపడవు. అక్షణాలు బయటపడేనాటికి ఆ రక్తపు ఉండ చాలా పెద్దగా మారి అది ఓ చిరు-పక్షవాతానికి (మినీ-స్ట్రోక్‌కి) కారణమవుతుంది. అసలు భూకంపానికి ముందుగా కనిపించే చిన్న చిన్న భూకంపాల్లా (ట్రిమర్స్‌లా)... పెద్ద స్ట్రోక్ వచ్చే ముందర కనిపించే ఈ చిరుపక్షవాతాన్ని వైద్యపరిభాషలో 'ట్రాన్సియెంట్ ఇస్కిమిక్ ఎటాక్-టీఐఏ' అంటారు. (అయితే కొన్నిసార్లు ఇలాంటి చిన్న చిన్న స్ట్రోక్స్ ఏమీ రాకుండానే పెద్ద స్ట్రోక్ (తీవ్రమైన పక్షవాతం) కూడా వచ్చే అవకాశాలూ ఉంటాయి). ఈ టీఐఏ లక్షణాలివి...

● అకస్మాత్తుగా దేహంలోని ఒకవైపున లేదా ముఖంలో ఒక పక్క అచేతనం / బలహీనత కనిపించడం ● మాట్లాడటంలో ఇబ్బంది లేదా మాటలు ముద్దముద్దగా రావడం ● ఒక వైపు కనుచూపు మసకబారడం లేదా కనిపించకపోవడం ● దేహం బ్యాలెన్స్ కోల్పోవడం. తూలుతున్నట్లుగా నడవడం.

కెరోటిడ్ రక్తనాళాల్లో పూడిక నిర్ధారణ ఎలా...?

- ● కెరోటిడ్ డాప్లర్ పరీక్ష
- ● సీటీ యాంజియో పరీక్ష (సీటీఏ)
- ● మాగ్నెటిక్ రిజోనెన్స్ యాంజియోగ్రఫీ (ఎమ్మార్ఏ)
- ● మామూలుగా చేసే యాంజియోగ్రఫీ (సాధారణంగా ఏదైనా శస్త్రచికిత్సకూ లేదా స్టెంట్ వేసే ముందర చేసే సంప్రదాయ యాంజియోగ్రఫీ పరీక్ష ఇది)

చికిత్స

ఈ సమస్యకు చికిత్స అన్నది ఏ మేరకు కెరోటిడ్ రక్తనాళాల్లో పూడిక పేరుకుని మూసుకుపోయాయి (బ్లాక్స్ ఏర్పడ్డాయి) అనే అంశంపై ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు...

● కెరోటిడ్ రక్తనాళాలు సగం కంటే (50 శాతం కంటే) తక్కువగా మూసుకుపోతే స్టాటిన్స్, ఆస్పిరిన్, బీపీని నియంత్రించే మాత్రలు వాడాల్సి ఉంటుంది ● అవి మోస్తరుగా (అంటే 50 శాతం కంటే ఎక్కువ 69 శాతం కంటే తక్కువగా) పూడుకుపోతే లక్షణాలను బట్టి, వాళ్ల పూర్తిస్థాయి హెల్త్ ప్రొఫైల్‌ను బట్టి చికిత్స ఉంటుంది ● ఒకవేళ రక్తనాళాలు మూసుకుపోవడమన్నది 70 శాతం కంటే ఎక్కువగా (సివియర్‌గా) ఉంటే అప్పుడు లక్షణాలను బట్టి రెండు రకాల ప్రత్యామ్నాయాలను వైద్యులు ఎంచుకుంటారు. అవి...

● **కెరోటిడ్ ఎండార్టెక్టమీ (సీఈఏ)**

ఇదొక సర్జికల్ ప్రొసీజర్. ఇందులో వాస్క్యులార్ సర్జన్ పూడిక పేరుకున్న రక్తనాళాన్ని (ధమని – ఆర్టరీని) తెరచి, అందులో పేరుకుపోయిన కొవ్వు ముక్కల్ని (ప్లాక్‌ను) రక్తపు ఉండల్ని (క్లాట్స్‌ను) శుభ్రపరచుతారు. సాధారణంగా మత్తుమందు (జనరల్ అనస్థీషియా) ఇచ్చి చేసే ప్రక్రియ ఇది. చాలా ఎక్కువ పూడికతో రక్తనాళం పూడుకుపోయినప్పుడు ఇది మంచి ప్రత్యామ్నాయం. మరీ ముఖ్యంగా 75 ఏళ్లలోపు బాధితుల్లో ఇది బాగా మేలు చేస్తుంది. మిగతా చికిత్సలతో పోలిస్తే... ఈ ప్రక్రియ వల్ల పక్షవాతం ముప్పు దాదాపు సగానికి (50 శాతానికి) పైగా తగ్గుతుంది.

● **కెరోటిడ్ ఆర్టరీ స్టెంటింగ్ (సీఏఎస్)**

ఇది చాలా తక్కువ గాటుతో చేసే స్టెంటింగ్ ప్రక్రియ. ఇందులో గజ్జల్లో లేదా చేతి దగ్గర చిన్న సూది ద్వారా... ఓ క్యాథెటర్ (ట్యూబ్) ద్వారా ఓ మెష్ ఉన్న స్టెంట్‌ను రక్తనాళంలోకి పంపి రక్తంలోని అడ్డంకి దగ్గర రక్తప్రవాహం ఆగకుండా స్టెంట్ వేస్తారు. సర్జరీ కారణంగా (అంటే మెడ దగ్గర శస్త్రచికిత్స / రేడియేషన్ వల్ల) ముప్పు చాలా ఎక్కువగా పెరిగే బాధితుల్లో ఈ ప్రక్రియను అనుసరిస్తారు. ఇటీవల అందుబాటులోకి వస్తున్న సరికొత్త స్టెంట్లు, అధునాతనమైన ఎంబాలిక్ ప్రొటెక్షన్ ఉపకరణాలతో ఇవి చాలా సురక్షితమైనవి.

సాధారణంగా చెకప్ ఎప్పుడు అవసరమంటే...

- సాధారణంగా 50 ఏళ్లు పైబడిన వారిలో ఈ ముప్పు ఎక్కువగా ఉండే అవకాశముంది. అలా ముప్పునకు అవకాశమున్నవారు (ఉదాహరణకు అధిక రక్తపోటు, మధుమేహం, పొగతాగడం, రక్తంలో కొవ్వు మోతాదులు ఎక్కువగా ఉండటం వంటివి) డాక్టర్ సలహా మేరకు 'కెరొటిడ్ డాప్లార్' అనే ప్రత్యేక పరీక్షను తమ ఇతర రొటీన్ పరీక్షలతో పాటు చేయించుకోవాలి. సాధారణంగా డాక్టర్లు అవసరం లేకుండానే పరీక్షలు చేయించుకోవడాన్ని అంతగా సమర్థించరుగానీ...
- అప్పటికే గుండెజబ్బుల ముప్పు ఉన్నవారు
- చాలాకాలంగా పొగతాగే అలవాటున్నవారు లేదా చైన్‌స్మోకర్లు
- పెరిఫెరల్ ఆర్టరీ డిసీజ్ అనే రక్తనాళాల జబ్బు ఉన్నవారితో పాటు
- డాక్టర్లు స్టెతస్కోప్‌తో మెడ దగ్గర పరీక్షిస్తున్నప్పుడు కొంచెం అసాధారణమైన శబ్దాలు వినిపిస్తున్నప్పుడు (వైద్య పరిభాషలో వీటిని 'బ్రుయీ' అంటారు) ఈ కెరొటిడ్ డాప్లార్ పరీక్షల్ని డాక్టర్ సలహా మేరకు చేయించాల్సి రావచ్చు.

మనదేశంలో చాలామందిలో మామూలుగానే వైద్యపరమైన అంశాలపై అవగాహన తక్కువ. అందువల్ల వారిలో ఈ పరిజ్ఞానం పెరగడం వల్ల వేలాది మరణాలను లేదా పక్షవాతంతో అచేతనమయ్యే పరిస్థితులను నివారించవచ్చు.

అథెరోస్క్లెరోసిస్‌ను తీవ్రతరం చేసే అంశాలివి...

● అధిక రక్తపోటు (హైబీపీ) ● మధుమేహం (డయాబెటిస్) ● పొగతాగడం, మద్యం అలవాటు ● దేహంలో ఎల్‌డీఎల్ అనే చెడు కొలెస్ట్రాల్ మోతాదులు పెరగడం ● దేహానికి తగినంత శ్రమ / వ్యాయామం లేకపోవడం
● కుటుంబ ఆరోగ్య చరిత్రలో గుండెజబ్బులు / పక్షవాతం ముప్పు ఉండటం

చివరగా... మనదేశంలో ప్రతి ఏటా 18 లక్షల మంది పక్షవాతం బారిన పడుతున్నారు. అందులో మూడో వంతుమంది అంటే ఆరు లక్షల మంది దాని కారణంగానే ప్రాణాలు విడుస్తున్నారు. ఇందులో చాలావరకు నివారించదగ్గ మరణాలే... లేదా నివారించదగ్గ పక్షవాతాలే. తాను చేయించుకున్న కెరొటిడ్ స్కాన్ కారణంగా అతడు సేవ్ అయ్యాడు. కానీ అవగాహన లేకపోవడంతో అలాంటి రక్షణకు నోచుకోనివారెందరో! అందుకే మీ వయసు 45 దాటితే దయచేసి ఒకసారి మీ డాక్టర్‌తో సంప్రదించి, ఆయన సలహా మేరకు అవసరమైన పరీక్షలు చేయించుకోండి. అప్రమత్తంగా ఉండండి... ఆరోగ్యంగానూ ఉండండి.



అన్నీ... ఆరగింజరాదు

పండ్లతో పాటుగా పాటుగా వాటి గింజలు కూడా మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. చియా విత్తనాలు, పొద్దుతిరుగుడు, పుచ్చకాయ విత్తనాలు, వంటి మరెన్నో ఉన్నాయి. వీటిని తినడం ద్వారా శరీరానికి ఎన్నో రకాల పోషకాలు అందుతాయి. కానీ కొన్ని రకాల పండ్ల విత్తనాలను అస్సలు తినకూడదు. పొరపాటున తింటే ఆరోగ్యానికి ఎంతో హాని జరుగుతుంది. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం...

ఆపిల్ : రోజుకు ఒక ఆపిల్‌ను తినడం వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు రావని ఆరోగ్య నిపుణులు, డాక్టర్లు చెబుతుంటారు. ఆపిల్ మంచిదే అయినా.. ఆపిల్ గింజలు మాత్రం మన ఆరోగ్యానికి ఏ మాత్రం మంచివి కావు. ఎందుంటే వీటిలో సైనైడ్ ఉంటుంది. ఇది కడుపులోకి వెళ్లి విరేచనాలు, వికారం, కడుపు తిమ్మిరి వంటి సమస్యలు వస్తాయి. అంతేకాదు ఇది మరణానికి కూడా దారితీస్తుందని నిపుణులు చెబుతున్నారు.

చెర్రీ : మన శరీరానికి అవసరమైన ఎన్నో రకాల పోషకాలను అందిస్తాయి చెర్రీ పండ్లు. కానీ చెర్రీ గింజల్లో హానికరమైన సైనైడ్ సమ్మేళనం ఉంటుంది. వీటిని ఎక్కువ మొత్తంలో తినడం వల్ల ఆపిల్ తినడం వల్ల కలిగే నష్టాలే కలుగుతాయి.

ఆప్రికాట్ : ఆప్రికాట్ విత్తనాలలో విషపదార్థాలైన అమిగ్డాలన్, సైనోజెనిక్ గ్లైకోసైడ్లు ఉంటాయి. ఆప్రికాట్ విత్తనాలను తినడం వల్ల శరీరం బలహీనపడటమే కాదు.. ప్రాణాల మీదికి వస్తుంది. ఈ విత్తనాలు ఒక వ్యక్తిని కోమాలోకి తీసుకెళతాయి.

పీచ్ : పీచ్ విత్తనాల్లో అమిగ్డాలిన్, సైనోజెనిక్ గ్లైకోసైడ్లు ఉంటాయి. వీటిని తినడం వల్ల ఆప్రికాట్ విత్తనాల మాదిరిగానే లక్షణాలు కనిపిస్తాయి. దీనిని తినడం వల్ల పొత్తికడుపు నొప్పి, నెర్వస్ నెస్ సమస్య ఎక్కువగా ఉంటుంది.

పియర్ : విత్తనాల్లో ప్రాణాంతకమైన సైనైడ్ సమ్మేళనాలు ఉంటాయి. ఇవి వికారం, విరేచనాలు, పొత్తికడుపు నొప్పిని కలిగిస్తుంది. అలాగే చెమట, అలసట వంటి సమస్యలు కూడా వస్తాయి. ఇది కోమాకు కూడా దారి తీస్తుంది. ఇంకా బొప్పాయి గింజలు కూడా ఆరోగ్యానికి అంత మంచిది కాదని నిపుణులు చెబుతున్నారు.



హంపి, దివ్య తొలి గేమ్ డ్రా

- 41 ఎత్తుల్లో తొలి గేమ్ 'డ్రా'
- నేడు ఇద్దరి మధ్య రెండో గేమ్
- మహిళల ప్రపంచకప్ చెస్ ఫైనల్

బతూమి (జార్జియా): భారత్‌కు ఖాయమైన వరల్డ్ కప్ టైటిల్‌ను తమ పరం చేసుకునేందుకు తెలుగు తేజం కోనేరు హంపి, దివ్య దేశ్‌ముఖ్ తొలి గేమ్‌లో దీటుగా ఎత్తుకు పైఎత్తులు వేశారు. దాంతో ఈ పోరు సమంగా ముగిసింది. 'ఫిడే' మహిళల ప్రపంచకప్ నాకౌట్ చెస్ టోర్నమెంట్‌లో శనివారం జరిగిన తొలి గేమ్‌లో 41 ఎత్తుల తర్వాత ఫలితం వచ్చే అవకాశం లేకపోవడంతో ఇద్దరూ 'డ్రా'కు మొగ్గు చూపారు. ఈ పోరులో నల్ల పావులతో బరిలోకి దిగిన హంపికి ఓపెనింగ్ ఎత్తుగడలేవీ కలిసి రాలేదు. గేమ్‌ను మొదలుపెట్టిన వ్యూహం, వేసిన ఎత్తులు ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్‌ను కాస్త ఇరకాటంలో పెట్టాయి. దీంతో తెల్ల పావులతో ఆడుతున్న దివ్యకు అవి అదనపు బలాన్నిచ్చేలా చేశాయి. దీంతో 14వ ఎత్తు వరకు గేమ్ దివ్య నియంత్రణలోనే ఉంది. అయితే ఈ దశలో తేరుకున్న హంపి జాగ్రత్త పడింది. ఎత్తుగడ మార్చి పైఎత్తులతో గేమ్‌పై పట్టు పెంచుకుంది. దీంతో అక్కడి నుంచి ఆట పోటాపోటీగా సాగడంతో చివరకు డ్రా తప్పలేదు. ఇంటర్నేషనల్ మాస్టర్, 19 ఏళ్ల దివ్య ఒక దశలో వెటరన్ గ్రాండ్‌మాస్టర్‌కు చెమటలు పట్టించింది. ఈ టోర్నీలో ఇప్పటి వరకు ప్రయత్నించని డి4 గడి నుంచి ఓపెనింగ్ చేసిన దివ్య ఎత్తులు, చకచకా పావులు కదుపుతున్న తీరు ఆమె ఫైనల్ కోసం బాగా సన్నద్ధమైందనిపించింది. హంపిని ఒత్తిడికి గురి చేసేందుకు ఎత్తులకు పదునుపెట్టే క్రమంలో చాలా సమయం తీసుకుంది. మరో వైపు అనుభవజ్ఞురాలైన హంపి ఆరంభంలో ప్రత్యర్థి చురుకైన ఎత్తులకు ఏమాత్రం కంగారు పడకుండా తన గేమ్ ప్లాన్‌ను అమలు చేసింది. ఈ క్రమంలో ఆరంభంలో కాస్త ఇబ్బందులు ఎదురైనప్పటికీ ఒత్తిడికి గురి కాలేదు. గేమ్ మధ్యలో పట్టు చిక్కించుకున్న హంపి... దివ్య జోరును అడ్డుకుంది. ఈ సమయంలో దివ్య గెలుస్తానన్న ధీమాతో డ్రాకు అంగీకరించలేదు. చివరకు గేమ్ సాగే కొద్దీ ఫలితంపై ఆశలు లేకపోవడంతో దాదాపు మూడు గంటలపాటు జరిగిన ఈ గేమ్ 41వ ఎత్తుల్లో డ్రా అయ్యింది. ఫైనల్‌లో భాగంగా నేడు రెండో గేమ్ జరుగుతుంది. ఇందులో గెలిచినవారు ప్రపంచ విజేతగా నిలుస్తారు. ఒకవేళ ఫలితం రాకపోతే రేపు టైబ్రేక్ ద్వారా చాంపియన్‌ను తేలుస్తారు.

సెమీస్‌లో ఓడిన సాత్విక్ జోడీ

చాంగ్జౌ: భారత అగ్ర శ్రేణి బ్యాడ్మింటన్ జోడీ సాత్విక్ సాయిరాజ్ -చిరాగ్ షెట్టి చైనా ఓపెన్ సూపర్-1000 బ్యాడ్మింటన్ టోర్నమెంట్ సెమీ ఫైనల్లో నిష్క్రమించింది. శనివారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో సాత్విక్-చిరాగ్ జంట 13-21, 17-21తో మలేసియాకు చెందిన రెండో సీడ్ ఆరోన్ చియా-సో వుయి యిక్ ద్వయం చేతిలో పరాజయం చవిచూసింది. 2022 ప్రపంచ చాంపియన్ జోడీ ఆరోన్-సో వుయి మ్యాచ్ ఆరంభం నుంచే పట్టుదలగా ఆడటంతో భారత షట్లర్లకు పుంజుకునే అవకాశం లేకపోయింది. ఆసియా క్రీడల చాంపియన్ జోడీ అయిన సాత్విక్-చిరాగ్‌లకు మలేసియన్ జంట కొరకరాని కొయ్యగా మారింది. ఇప్పటివరకు 14 సార్లు ఈ రెండు జోడీలు పోటీపడగా ఏకంగా 11 సార్లు మలేసియన్ జంటే గెలుపొందింది. భారత జోడీ 3 సార్లు గెలిచింది. ఓవరాల్‌గా ఈ సీజన్‌లో భారత షట్లర్ల జోడీ నిలకడగా రాణిస్తోంది. ఇండియా ఓపెన్, సింగపూర్ ఓపెన్, మలేసియా ఓపెన్‌లలోనూ సాత్విక్-చిరాగ్ ద్వయం సెమీఫైనల్లోకి ప్రవేశించింది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

0/2 నుంచి 174/2 వరకు...

తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్‌కు ఏకంగా 311 పరుగుల ఆధిక్యం అప్పగించేశాం. లక్ష్యం నిర్దేశించడం సంగతి తర్వాత... ముందు ఈ లోటును ఎలా పూడ్చాలా అనే ఆందోళన... రెండో ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే రెండు వికెట్లు కోల్పోయి స్కోరు 0/2... మిగిలిన అరవైకి పైగా ఓవర్లను ఆడగలరా అనే సందేహం. నాలుగో రోజే కుప్పకూలి మ్యాచ్‌ను అప్పగించేస్తారేమో అనిపించింది. కానీ రాహుల్, గిల్ అసాధారణ రీతిలో గట్టిగా నిలబడ్డారు. ఆరంభంలో కాస్త తడబడ్డా ఏకాగ్రత చెదరకుండా రెండు సెషన్లు పట్టుదలగా ఆడారు. ఏకంగా 62.1 ఓవర్ల పాటు వికెట్ ఇవ్వకుండా రోజును ముగించారు. అయితే ప్రమాదం ఇంకా పూర్తిగా దాటిపోలేదు. మరో 137 పరుగులు వెనుకంజలో ఉన్న జట్టు ప్రస్తుతానికి మ్యాచ్‌ను రక్షించుకునేందుకు బాటలు వేసుకుంది. ఆపై ఎన్ని పరుగులు చేసి ఇంగ్లండ్‌కు సవాల్ విసరగలదా అనేది చూడాలి.

రాహుల్, గిల్ అసాధారణ పోరాటం

- మరో 137 పరుగులు వెనుకంజ
- ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 669
- బెన్ స్టోక్స్ సెంచరీ... 311 పరుగుల ఆధిక్యం


రాహుల్, గిల్

మాంచెస్టర్: ఇంగ్లండ్‌తో జరుగుతున్న నాలుగో టెస్టులో ఓటమి నుంచి తప్పించుకునే ప్రయత్నంలో ఉన్న భారత్ సురక్షిత స్థితికి చేరుతోంది. మ్యాచ్ నాలుగో రోజు శనివారం ఆట ముగిసే సమయానికి భారత్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 2 వికెట్ల నష్టానికి 174 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్ (210 బంతుల్లో 87; 8 ఫోర్లు), శుబ్‌మన్ గిల్ (167 బంతుల్లో 78 బ్యాటింగ్; 10 ఫోర్లు) క్రీజ్‌లో ఉన్నారు. అంతకు ముందు ఇంగ్లండ్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 669 పరుగులకు ఆలౌటైంది. బెన్ స్టోక్స్ (198 బంతుల్లో 141; 11 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీ పూర్తి చేసుకున్నాడు. రవీంద్ర జడేజాకు 4 వికెట్లు దక్కాయి.

22.1 ఓవర్లలో 125 పరుగులు...

నాలుగో రోజు ఇంగ్లండ్ మెరుపు బ్యాటింగ్‌తో భారీ ఆధిక్యాన్ని సొంతం చేసుకుంది. స్టోక్స్ చాలా కాలం తర్వాత చెలరేగిపోగా, బ్రైడన్ కార్స్ (54 బంతుల్లో 47; 3 ఫోర్లు 2 సిక్స్‌లు), డాసన్ (26) అండగా నిలిచారు. ఆట ఆరంభంలోనే డాసన్‌ను బుమ్రా బౌల్డ్ చేసినా... స్టోక్స్, కార్స్ భాగస్వామ్యంతో ఇంగ్లండ్ దూసుకుపోయింది. సిరాజ్ బౌలింగ్‌లో లెగ్ సైడ్ దిశగా కొట్టిన బౌండరీతో 164 బంతుల్లో స్టోక్స్ సెంచరీ పూర్తయింది. రెండేళ్ల తర్వాత, 35 ఇన్నింగ్స్‌లలో స్టోక్స్‌కు ఇది తొలి శతకం కావడం విశేషం. ఆ తర్వాత మరింత దూకుడుగా ఆడిన స్టోక్స్ తర్వాతి 34 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లతో 41 పరుగులు రాబట్టడం విశేషం. మరో ఎండ్‌లో కార్స్ కూడా భారత బౌలర్లపై ధాటిని


స్టోక్స్

చూపించాడు. తొమ్మిదో వికెట్‌కు స్టోక్స్, కార్స్ కేవలం 95 బంతుల్లోనే 97 పరుగులు జోడించడం విశేషం. ఎట్టకేలకు జడేజా బౌలింగ్‌లో మరో భారీ షాట్‌కు ప్రయత్నించి స్టోక్స్ వెనుదిరగ్గా... తన తర్వాతి ఓవర్లో కార్స్‌ను అవుట్ చేసి జడేజా ఇంగ్లండ్ ఇన్నింగ్స్ ముగించాడు. 2015 తర్వాత ఒకే ఇన్నింగ్స్‌లో నలుగురు భారత బౌలర్లు తలా 100కు పైగా పరుగులు ఇవ్వడం ఇదే తొలిసారి.

భారీ భాగస్వామ్యం...

భారత జట్టు ఇన్నింగ్స్ పేలవంగా మొదలైంది. వోక్స్ వేసిన తొలి ఓవర్లో స్కోరు బోర్డుపై 'సున్నా' పరుగులు ఉండగానే వరుస బంతుల్లో జైస్వాల్ (0), సాయి సుదర్శన్ (0) వెనుదిరిగారు. అయితే ఆ తర్వాత రాహుల్, గిల్ చక్కటి భాగస్వామ్యంతో జట్టును ఆదుకున్నారు. రెండో సెషన్‌లో ఆరంభంలో కొన్ని ఉత్కంఠ క్షణాలను ఎదుర్కొన్నా... ఆ తర్వాత వీరిద్దరు ఎలాంటి ఇబ్బంది లేకుండా, ప్రత్యర్థి బౌలర్లకు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా చూడచక్కటి షాట్లతో అలరించారు. 46 పరుగుల వద్ద గల్లీలో డాసన్ క్యాచ్ వదిలేయడంతో బతికిపోయిన గిల్ 77 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 26 ఓవర్ల రెండో సెషన్‌లో భారత్ ఒక్క వికెట్ కూడా కోల్పోలేదు. టీ విరామం తర్వాత కూడా గిల్, రాహుల్ ప్రత్యర్థికి ఎలాంటి అవకాశం ఇవ్వకుండా జాగ్రత్తగా ఆడారు. పరుగుల రాక కాస్త తగ్గినా ప్రమాదం కూడా ఏమీ కనిపించలేదు. ఒక దశలో వరుసగా 21.4 ఓవర్ల పాటు బౌండరీనే రాలేదు! 137 బంతుల్లో రాహుల్ హాఫ్ సెంచరీ పూర్తయింది. అయితే ఆ తర్వాత వీరిద్దరు స్వేచ్ఛగా ఆడారు. ఈ జోడీని విడదీసేందుకు ఇంగ్లండ్ బౌలర్లను మార్చి మార్చి ఎన్ని ప్రయత్నాలు చేసినా లాభం లేకపోయింది. అప్పుడప్పుడు కొన్ని చక్కటి బంతులు ఇబ్బంది పెట్టినట్లుగా అనిపించినా భారత్‌కు నష్టం జరగలేదు.

3 టెస్టుల్లో 7 వేలకు పైగా పరుగులు చేసి 200కు పైగా వికెట్లు పడగొట్టిన మూడో ఆటగాడిగా స్టోక్స్ నిలిచాడు. గతంలో గ్యారీ సోబర్స్, జాక్ కలిస్ మాత్రమే ఈ ఘనత సాధించారు.

5 ఒకే టెస్టులో సెంచరీ సాధించడంతో పాటు ఐదు వికెట్లు కూడా తీసిన ఐదో కెప్టెన్ స్టోక్స్. గతంలో అట్కిన్సన్, సోబర్స్, ముస్తాక్ మొహమ్మద్, ఇమ్రాన్ ఖాన్‌లకు మాత్రమే ఇది సాధ్యమైంది.

1 టెస్టుల్లో బుమ్రా ఒక ఇన్నింగ్స్‌లో 100కు పైగా పరుగులివ్వడం ఇదే మొదటి సారి. అతను తన కెరీర్‌లో 48వ టెస్టు ఆడుతున్నాడు.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్ 358; ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: క్రాలీ (సి) రాహుల్ (బి) జడేజా 84; డకెట్ (సి) (సబ్) జురేల్ (బి) కంబోజ్ 94; పోప్ (సి) రాహుల్ (బి) సుందర్ 71; రూట్ (స్టంప్డ్) (సబ్) జురేల్ (బి) జడేజా 150; బ్రూక్ (స్టంప్డ్) (సబ్) జురేల్ (బి) సుందర్ 3; స్టోక్స్ (సి) సుదర్శన్ (బి) జడేజా 141; స్మిత్ (సి) (సబ్) జురేల్ (బి) బుమ్రా 9; డాసన్ (బి) బుమ్రా 26; వోక్స్ (బి) సిరాజ్ 4; కార్స్ (సి) సిరాజ్ (బి) జడేజా 47; ఆర్చర్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 38; **మొత్తం (157.1 ఓవర్లలో ఆలౌట్) 669. వికెట్ల పతనం:** 1-166, 2-197, 3-341, 4-349, 5-499, 6-515, 7-528, 8-563, 9-658, 10-669. **బౌలింగ్:** బుమ్రా 33-5-112-2, కంబోజ్ 18-1-89-1, సిరాజ్ 30-4-140-1, శార్దుల్ 11-0-55-0, జడేజా 37.1-0-143-4, సుందర్ 28-4-107-2.

భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) రూట్ (బి) వోక్స్ 0; రాహుల్ (బ్యాటింగ్) 87; సుదర్శన్ (సి) బ్రూక్ (బి) వోక్స్ 0; గిల్ (బ్యాటింగ్) 78; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (63 ఓవర్లలో 2 వికెట్లకు) 174. వికెట్ల పతనం:** 1-0, 2-0. **బౌలింగ్:** వోక్స్ 15-3-48-2, ఆర్చర్ 11-2-40-0, కార్స్ 10-2-29-0, డాసన్ 22-8-36-0, రూట్ 5-1-17-0.

సాక్షి సినిమా

వైబ్ ఉంది బేబీ


● రితికా నాయక్, తేజ సజ్జా

తేజ సజ్జా హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'మిరాయ్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో రితికా నాయక్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. మనోజ్ మంచు, జగపతి బాబు, శ్రియ, జయరామ్ ఇతర పాత్రలు చేస్తున్నారు. టీజీ విశ్వప్రసాద్, కృతీ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం సెప్టెంబర్ 5న ప్రపంచ వ్యాప్తంగా 2డీ, 3డీ ఫార్మాట్లలో 8 భాషల్లో విడుదల కానుంది. గౌర హరి సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'వైబ్ ఉంది బేబీ...' అంటూ సాగే లిరికల్ వీడియో సాంగ్‌ని విడుదల చేసింది యూనిట్. 'ఓ పోరి దిల్‌దారు వయ్యారివే... నీ సూపు తల్వార్‌తో కొయ్యకే... గాడేమో నీకూ నాకూ రాసుంటడే... మన జోడీ ఒకటైతే మ్యాడ్ ఉంటదే... వైబ్ ఉంది బేబీ వైబ్ ఉందిలే...' అంటూ ఈ పాట సాగుతుంది. కృష్ణకాంత్ సాహిత్యం అందించిన ఈ సాంగ్‌ని అర్మాన్ మాలిక్ పాడగా, విజయ్ పోలాకి కొరియోగ్రఫీ చేశారు. ''ఈ పాటలో ప్రతి ఫ్రేమ్‌లో ఎనర్జీ, ఛార్మ్, డ్యాన్స్ స్టెప్స్‌తో అదరగొట్టాడు తేజ. విజువల్‌గా ఈ పాట నెక్ట్స్ లెవల్‌లో ఉంటుంది. తేజ-రితికాల కెమిస్ట్రీ, డ్యాన్స్ మూమెంట్స్ అలరిస్తాయి. ట్రెండీ టచ్‌తో పాటు చిన్న క్లాసికల్ హింట్స్‌తో ఉన్న ఈ పాట మాస్‌ని, క్లాస్‌ని కనెక్ట్ చేస్తోంది. ఈ చిత్రానికి కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించడంతో పాటు సినిమాటోగ్రఫీ, స్క్రీన్‌ప్లేను అందిస్తున్నారు'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

భవిష్యత్తు గురించి ఎక్కువ ఆలోచించను



\- శ్రుతీహాసన్

''కూలీ' చిత్రంలో నేను చేసిన పాత్ర వ్యక్తిగతంగా, ఒక అమ్మాయిగా నాకు బాగా కనెక్ట్ అయింది. నా పాత్రలో మంచి భావోద్వేగం ఉంది. అమ్మాయిలు నా పాత్రకి బాగా కనెక్ట్ అవుతారు. ఎంటర్‌టైన్‌మెంట్, అద్భుతమైన యాక్షన్, మంచి కథ, భావోద్వేగాలున్న ఈ సినిమాని ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారు'' అని శ్రుతీహాసన్ తెలిపారు. రజనీకాంత్ హీరోగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వం వహించిన చిత్రం 'కూలీ'. ఈ సినిమాలో నాగార్జున, ఉపేంద్ర, శ్రుతీహాసన్, ఆమిర్ ఖాన్, సత్యరాజ్, సౌబిన్ షాహిర్ కీలక పాత్రలు చేశారు. కళానిధి మారన్ నిర్మించిన ఈ సినిమా ఆగస్టు 14న రిలీజ్ కానుంది. డి. సురేష్‌బాబు, 'దిల్' రాజు, సునీల్ నారంగ్, భరత్ నారంగ్ యాజమాన్యంలోని ఏషియన్ మల్టీప్లెక్స్ సంస్థ తెలుగులో రిలీజ్ చేస్తోంది. ఈ సందర్భంగా శ్రుతీహాసన్ పంచుకున్న విశేషాలు.

● నేనో మ్యూజిక్ ఆల్బమ్ కోసం లోకేశ్ కనగరాజ్‌గారిని కలిశాను. ఆ ఆల్బమ్ వర్క్ జరుగుతున్నప్పుడు ఆయన సర్‌ప్రైజింగ్‌గా 'కూలీ'లోని నా పాత్ర గురించి చెప్పారు. ఆయన సినిమాలంటే డార్క్, గన్స్, యాక్షన్‌తో ముడిపడి ఉంటాయి. కానీ, 'కూలీ'లో ఆయన చెప్పిన స్ట్రాంగ్ ఉమన్ క్యారెక్టర్ నాకు నచ్చింది. ఈ చిత్రంలో సత్యరాజ్‌గారి అమ్మాయిగా కనిపిస్తాను. రజనీకాంత్, నాగార్జున, ఉపేంద్ర, ఆమిర్ ఖాన్... ఇలా చాలామంది స్టార్స్‌తో స్క్రీన్ షేర్ చేసుకోవడం మరచిపోలేని అనుభూతి. ఇంతమంది సూపర్ స్టార్స్‌తో ఒకే సినిమాలో పని చేసే అవకాశం ప్రతి ఆర్టిస్టుకి దొరకదు... నాకు దొరికింది. అందుకే 'కూలీ' నాకు చాలా ప్రత్యేకమైన సినిమా.

● నాన్నగారితో (కమల్‌హాసన్) ఆయనకు ఉన్న స్నేహం గురించి, అప్పటి వర్కింగ్ స్టైల్ గురించి 'కూలీ' సెట్స్‌లో చాలా విషయాలు నాతో షేర్ చేసుకున్నారు రజనీకాంత్‌గారు. ఆయనతో కలిసి పని చేయడం నా అదృష్టం. నాగార్జునగారు తొలిసారి విలన్ పాత్ర చేశారు. తెలుగు ప్రేక్షకులందరూ ఆయన పాత్ర చూసి, చాలా సర్‌ప్రైజ్ అవుతారు. ఆమిర్ ఖాన్‌గారితో పని చేయడం స్పెషల్ ఎక్స్‌పీరియన్స్. లోకేశ్ కనగరాజ్ క్లియర్ విజన్ ఉన్న డైరెక్టర్.

● 'కూలీ' సినిమా పూర్తిగా చూడలేదు. నా డబ్బింగ్ వెర్షన్‌తోపాటు ఇంకొన్ని పోర్షన్స్ చూశాను... చాలా అద్భుతంగా అనిపించింది. చిత్ర పరిశ్రమలో ఇన్నేళ్ల పాటు హీరోయిన్‌గా కొనసాగడానికి కారణం ప్రేక్షకుల ఆశీర్వాదమే అని భావిస్తున్నాను. నేను భవిష్యత్తు గురించి ఎక్కువ ఆలోచించలేదు... పనిని ఎంజాయ్ చేశాను. నాకు వచ్చిన ప్రాజెక్టుకి ఎంతవరకు న్యాయం చేయాలనే దాని మీదే నా దృష్టి ఉంటుంది. నాకు డ్రీమ్ రోల్స్ అంటూ ప్రత్యేకంగా ఏమీ లేవు. కానీ ఒక మ్యుజిషియన్ రోల్ చేయాలని ఉంది. ప్రస్తుతం తెలుగులోనూ కొన్ని కథలు విన్నాను... త్వరలోనే నా కొత్త సినిమా ప్రకటన ఉంటుంది.

ఎవరూ మనల్ని ఆపేదే లే

\- విజయ్ దేవరకొండ


● విజయ్ దేవరకొండ, భాగ్యశ్రీ బోర్సే, నాగవంశీ

''గత యాడాది నుండి 'కింగ్డమ్' సినిమా గురించి కానీ, రిలీజ్ గురించి కానీ ఆలోచిస్తాంటే నా తలకాయలో ఒక్కటే తిరుగుతాంది.. నా మనసులో గట్టిగా ఒక్కటే అనిపిస్తాంది. మన తిరుపతి ఏడు కొండల వెంకన్నసామి కానీ ఈ ఒక్కసారి నా పక్కన ఉండి నన్ను నడిపించినాడో.. శానా పెద్దోడినై పూడుస్తా సామి.. పోయి టాప్‌లో కూర్చుంటా'' అని విజయ్ దేవరకొండ చెప్పారు. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో విజయ్ దేవరకొండ, భాగ్యశ్రీ బోర్సే జోడీగా నటించిన చిత్రం 'కింగ్డమ్'. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమా ఈ నెల 31న రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో శనివారం తిరుపతిలో ఈ మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ రాయలసీమ యాసలో మాట్లాడుతూ- ''ఈతూరి నేరుగా మీకాడికే వచ్చినాము.. మీ అందర్నీ కలిసినాము. మీ అరుపులు, కేకలు వింటాంటే చానా సంతోషంగా అనిపిస్తాందబ్బా. ప్రతిసార్లా పాణం పెట్టి ఈ సినిమా కోసం గట్టిగా పనిచేసినా. ఈసారి నా సినిమాను బాగా చూసుకునేందుకు గౌతమ్ తిన్ననూరి, పాటెగాడు అనిరుధ్, ఎడిటర్ నవీన్ నూలి ఉన్నారు. మా నిర్మాత నాగవంశీ ఇంటర్వ్యూలు సంపినాడులే. మా భాగ్యశ్రీ పాప బాగా పనిసేసింది. ఇంకా అందరూ పాణం పెట్టి పనిసేశారు. ఇక మిగిలింది రెండే.. ఆ వెంకన్న సామి దయ.. మీ అందరి ఆశీస్సులు. ఈ రెండు నాతో పాటు ఉంటే ఎవరూ మనల్ని ఆపేదే లే'' అన్నారు.

బిజీ బిజీగా...


● సాయికుమార్

విలక్షణ నటుడు సాయి కుమార్ వరుస అవకాశాలతో బిజీ బిజీగా ఉన్నారు. నటుడిగానూ యాభై ఏళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకున్నారాయన. నేడు (జూలై 27) ఆయన 65వ పుట్టినరోజు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ- ''1975 జనవరి 9న 'దేవుడు చేసిన పెళ్లి' చిత్రంతో నటుడిగా అరంగేట్రం చేశాను. ఈ ఏడాదితో నటుడిగా 50 ఏళ్లు పూర్తి చేసుకున్నాను. ఇప్పటికీ చేతి నిండా ప్రాజెక్టులతో బిజీగా ఉండటం సంతోషంగా ఉంది. ప్రస్తుతం సాయిదుర్గా తేజ్ 'సంబరాల యేటిగట్టు', నాగశౌర్య 'బ్యాడ్ బాయ్ కార్తీక్', కిరణ్ అబ్బవరం 'కే ర్యాంప్', 'అల్లరి' నరేశ్ '12ఏ రైల్వే కాలనీ', 'ధర్మస్థల నియోజకవర్గం', 'రాజాది రాజా', కోన వెంకట్‌గారితో ఓ సినిమా, ఎస్వీ కృష్ణారెడ్డిగారితో ఓ చిత్రం, మా అబ్బాయి ఆదితో కలిసి 'ఇన్‌స్పెక్టర్ యుగంధర్' సినిమాలు చేస్తున్నాను. కన్నడలో 'చౌకీదార్', 'సత్య సన్నాఫ్ హరిశ్చంద్ర', శివ రాజ్‌కుమార్ గారి సినిమాలో నటిస్తున్నా. తమిళ్‌లో 'డీజిల్', విక్రమ్ ప్రభుతో ఓ చిత్రం చేస్తున్నాను. దేవా కట్టా 'మయసభ', క్రిష్ 'కన్యా శుల్కం' వంటి వెబ్ సిరీస్‌లలో నటిస్తున్నాను'' అని చెప్పారు.

అతడు వసూళ్లన్నీ మహేశ్‌బాబు ఫౌండేషన్‌కే!


● అన్వేష్, ప్రియాంక, మురళీమోహన్, జితేంద్ర

''అతడు' చిత్రానికి మొదట్లో డివైడ్ టాక్ వచ్చింది. కానీ, టీవీల్లో చూసిన తర్వాత ఆ సినిమా గొప్పదనాన్ని అందరూ తెలుసుకున్నారు. అందుకే ఈ రీ రిలీజ్‌కు క్రేజ్ ఏర్పడింది. మహేశ్‌బాబు, త్రివిక్రమ్ డేట్లు ఇస్తే 'అతడు' సీక్వెల్‌ను నిర్మిస్తాం'' అని మురళీమోహన్ తెలిపారు. మహేశ్‌బాబు, త్రిష జోడీగా త్రివిక్రమ్ దర్శకత్వం వహించిన చిత్రం 'అతడు'. జయభేరి ఆర్ట్స్ బ్యానర్‌పై మురళీమోహన్ నిర్మించిన ఈ చిత్రం 2005 ఆగస్టు 10న రిలీజైంది. ఆగస్టు 9న మహేశ్‌బాబు పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రాన్ని రీ రిలీజ్ చేయనున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ప్రెస్ మీట్‌లో మురళీమోహన్ మాట్లాడుతూ- ''ఈ సినిమాలో నాజర్‌గారు చేసిన పాత్రకి శోభన్‌బాబుగారిని అనుకుని, ఆయనకు బ్లాంక్ చెక్ పంపించా. 'నేను హీరోగానే గుర్తుండాలి కానీ ఇంకో పాత్రలో నన్ను గుర్తు పెట్టుకోకూడదు' అని ఆయన తిరస్కరించారు. నా సోదరుడు కిశోర్ కుమార్తె ప్రియాంక ఈ మూవీని టెక్నికల్‌గా అప్‌గ్రేడ్ చేసి రీ రిలీజ్ చేస్తున్నారు'' అని తెలిపారు. ''అతడు' రీ రిలీజ్ ద్వారా ఎంత డబ్బు వచ్చినా మహేశ్‌బాబు ఫౌండేషన్ కోసమే వాడతాం'' అన్నారు మహేశ్‌బాబు ఫౌండేషన్ ప్రతినిధి అన్వేష్. ''అతడు'ని థియేటర్లో చూస్తే పాత రోజులు మళ్లీ గుర్తుకొస్తాయి'' అని ప్రియాంక దుగ్గిరాల పేర్కొన్నారు. ''ఇప్పటివరకు రీ రిలీజ్ అయిన చిత్రాల కంటే 'అతడు' ఎక్కువ వసూళ్లు సాధిస్తుందని నమ్ముతున్నాను'' అన్నారు ఎక్సెల్ బ్యానర్ ప్రతినిధి జితేంద్ర గుండపనేని.

దేశభక్తితో చైనా పీస్


● హర్షిత, నిహాల్, సందీప్ కిషన్

''ఒక సినిమా తీసి, విడుదల చేయడమే పెద్ద విజయం. ఇక ప్రేక్షకులకు సినిమా నచ్చితే బోనస్ అని భావించాలి. మన ఆలోచనలను దేశం మొత్తం చెప్పడానికి బెస్ట్ ప్రాసెస్ సినిమానే. ఫేమస్ కావాలనుకుంటే రీల్స్ చేసి కూడా ఫేమస్ కావొచ్చు. 'చైనా పీస్'లో లైట్ కామెడీతో పాటు సీరియస్ కామెడీ కూడా ఉంది. టీజర్ చాలా బాగుంది... సినిమా కూడా బాగుంటుందని ఆశిస్తున్నాను'' అని హీరో సందీప్ కిషన్ అన్నారు. నిహాల్ కోదాటి, సూర్య శ్రీనివాస్ హీరోలుగా అక్కి విశ్వనాథ రెడ్డి దర్శకత్వం వహించిన చిత్రం 'చైనా పీస్'. మూన్ లైట్ డ్రీమ్స్ బ్యానర్‌లో రూపొందిన ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌కి సందీప్ కిషన్ అతిథిగా హాజరై, టీజర్‌ని విడుదల చేశారు. విశ్వనాథ రెడ్డి మాట్లాడుతూ- ''ఒక దేశభక్తి సినిమా తీసి 'చైనా పీస్' అనే టైటిల్ పెట్టడం ఓ సవాల్. అయితే అన్ని జాగ్రత్తలు తీసుకుని, ఈ సినిమా తీశాం'' అన్నారు. ''జగడం'తో పాటు దాదాపు 20 సినిమాల్లో బాలనటుడిగా చేశాను. ఓ వాణిజ్య సినిమాలో ఎన్ని అంశాలు ఉండాలో అన్నీ మా చిత్రంలో ఉన్నాయి'' అన్నారు నిహాల్ కోదాటి. ''మా సినిమా ప్రేక్షకులకు నచ్చుతుందనే నమ్మకం ఉంది'' అని సూర్య శ్రీనివాస్ చెప్పారు. నటీనటులు హర్షిత, దీక్షా పంత్, కమల్ కామరాజు మాట్లాడారు. ఈ చిత్రానికి కెమెరా: సురేష్ రగుతు, సంగీతం: కార్తీక్ రోడ్రిగ్జ్.

యుద్ధమే రానీ...


డార్లింగ్ కృష్ణ, మనీషా జంటగా శశాంక్ దర్శకత్వం వహించిన చిత్రం 'బ్రాట్'. మంజునాథ్ కండ్కూర్ నిర్మించారు. అర్జున్ జన్య సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'యుద్ధమే రానీ...' అంటూ సాగే పాట విడుదల వేడుకని హైదరాబాద్‌లో నిర్వహించారు. సనారె లిరిక్స్ రాసిన ఈ పాటని సిద్ శ్రీరామ్ పాడారు. ఈ సాంగ్‌ని నటుడు వీకే నరేశ్ విడుదల చేసి, మాట్లాడుతూ- ''మంజునాథ్ ప్రేక్షకుల పల్స్ తెలిసిన నిర్మాత. నాతో కన్నడలో సూపర్ హిట్ సినిమా చేశారు. చాలా రోజుల తర్వాత 'బ్రాట్'తో వస్తున్నారు. ఈ చిత్రం టీజర్ చాలా బాగుంది. ఈ సినిమా తెలుగులో పెద్ద విజయం సాధించాలి'' అన్నారు. శశాంక్ మాట్లాడుతూ- ''నాకు ఎప్పటి నుంచో తెలుగు సినిమా చేయాలనే ఆలోచన ఉండేది. ఇప్పుడు ఆ సమయం వచ్చింది. కథపై ఉన్న నమ్మకంతో 'బ్రాట్' సినిమాని ఐదు భాషల్లో రిలీజ్ చేస్తున్నాం'' అని తెలిపారు. ''నాకు ఎలాంటి సపోర్ట్ కావాలన్నా వీకే నరేశ్‌గారిని అడుగుతాను. తెలుగు ప్రేక్షకులు మా సినిమాకి పెద్ద విజయాన్ని ఇవ్వాలని కోరుకుంటున్నాను'' అన్నారు మంజునాథ్. ''సిద్ శ్రీరామ్ ఈ సాంగ్ పాడటం చాలా ఆనందాన్నిచ్చింది'' అని డార్లింగ్ కృష్ణ పేర్కొన్నారు. ''యాక్షన్ థ్రిల్లర్ మూవీ ఇది'' అని మనీషా తెలిపారు. ఈ వేడుకలో ఆడియో కో ఓనర్ శ్యామ్ చాబ్రియా, లిరిక్ రైటర్ సనారె మాట్లాడారు.


● వీకే నరేశ్, కృష్ణ, మనీషా

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



ఆర్యవైశ్య డైవర్స్ 42, 5'6" B.Com (బిజినెస్ నెలసరి ఆదాయం 2 లక్షలు) గల ఫిట్‌నెస్ వరునికి Any Caste దైవ గుణాలు కలిగిన అందమైన వధువు కావలెను. 8341742398 (డైరెక్ట్) [H-804900]

యాదవ/M.Tech, IIT / C.Govtt. Exq. ఇంజినీర్/ONGC / 1,35,000/-PM / 6' ఎత్తు/30 సంగల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8297439565 [HA-15507]

రజక/కట్నప్రసక్తి లేదు / BE / Govt. ఇంజినీర్/ ఎలక్ట్రికల్ Dept/1 Lakh. PM/ 5'10" ఎత్తు/29 సంగల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9550166072 [HA-15507]

కుమ్మరి/ M.Tech / C.Govt. టెక్నికల్ ఇంజినీర్ / DRDO / 90,000/-PM / 6' ఎత్తు /29 సంగల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9618008271 [HA-15507]

SC హిందూ మాదిగ/ B.Tech / C. Govt. సెక్షన్ ఇంజినీర్ / రైల్వే/80,000/-PM/ 5'11"ఎత్తు /29 సంగల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9966760501 [HA-15507]

ముదిరాజ్/M.Tech/Govt.Asst.ఇంజినీర్/RWS /60,000/-PM / 5'11" ఎత్తు / 28 సంగల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9618007652 [HA-15507]

రెడ్డి/కుల పట్టింపు లేదు/2వ పెళ్లి పిల్లలు లేరు/42yrs/5'10"/PG/3 Lakhs per Month. కోట్ల ఆస్తి ఉన్న వరుడికి వధువు కావలెను. Ph: 63035 96149 [HA-1641]

క్రిస్టియన్ మాల/ 29 / 5'10"/ B.Tech, MBA / SWE / 10 Lakhs PA / అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 8919759359 [HA-16235]

SC మాల & క్రిస్టియన్ /కట్న ప్రసక్తి లేదు/ M.Tech (సివిల్)/C.Govt. డిప్యూటీ మేనేజర్/ SBI/12 Lakhs PA/5'8" ఎత్తు/28 సంగల వరునికి వధువు కావలెను. Ph: 9676995093 [HA-16235]

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Contact : K.C. Reddy, Hyderabad. Ph : 9849321309 / 9347807015. Please Check my Whatsapp Status. Email: kcreddy43@gmail.com, Facebook.com / Subscribe Telegram Channel - kcreddymarriagebureau

వధువు కావలెను

Reddy/ IAS/Handsome Boy/1993/ 5'8"/Rich Family. * Cont: K.C. Reddy- Mar-Bureau-Pvt Ltd-Hyd. Ph: 9347807015/9849321309

Reddy/Business/B.Tech/MS/1991 / 5'11"/ 500Cr-/ 15L/ M-Rental income-Hyd. * Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309/9347807015

Reddy / MBA / Business / Hyd/ 1995 / 5'9"/ 250Cr /10L/M - Rental income. *Cont: K.C. Reddy. Hyd. Ph: 9347807015/9849321309

Reddy/B.Tech/MS/USA/1997/6'/400 Cr- *95/5'10"/ 240K / 100Cr. * Cont: K.C. Reddy-Mar-Bureau-Hyd. Ph: 9849321309/9347807015

Reddy/Business / B.Tech / MBA/ 1994 / 6'/ 400Cr / * Cont: K.C. Reddy- Mar-Bureau Pvt Ltd- Hyd- Cont : 9347807015/9849321309

Reddy/Catholic/Divorcee/B.Tech/ MBA/V.Handsome Boy/SWE-Hyd- Rich Family / 1987/ 5'11"/ * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015

Reddy/Business/Hyd/B.Tech/MS/ 1994/ 5'11"/ 200Cr/10L/M - Rental income. * Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309/9347807015

Reddy/MBBS / MD / 1995/5'10"/ Own Hospital-Hyd / 250Cr. * Cont: K.C.Reddy-Mar-Bureau-Hyd. Ph: 9849321309/9347807015

Reddy/Divorcee / B.Tech / MS/ Business -Hyd-1981/5'8"/ 1500 Cr. * Cont: K.C. Reddy - Mar-Bureau-Hyd. Ph: 9347807015/9849321309

Reddy/ Business / Industrialist / 1982 /5'8"/ 400Cr. * Cont: K.C. Reddy - Mar-Bureau-Hyd. Ph: 9849321309/9347807015

వరుడు కావలెను

Reddy/ MBBS /MD / Own Practice /1990/5'6"/200Cr (Political Family) 10L/M - Rental income. * Cont: K.C. Reddy-Hyd-Ph: 9347807015

Reddy/MBBS/MD Most Beautiful/ 1998/5'7"/ 100Cr. * Cont: K.C. Reddy-Mar-Bureau-Pvt Ltd-Hyd- Ph: 9849321309/ 9347807015

Reddy/B.Tech/MS / Most Beautiful Rich Family/Father Big Industrialist/ Hyd/2000/5'3"/. * Cont: K.C. Reddy-Hyd-Ph: 9849321309

Reddy / B.Tech / MBA / Working Hyd/1995/5'4"/ 25Cr. * Cont: K.C. Reddy-Mar-Burea-Pvt Ltd- Hyd- Ph: 9849321309/9347807015

Reddy/B.Tech/MBA/Own Business /1995/ 5'5"/ 4Cr/yr income / 100Cr. * Cont: K.C.Reddy-Mar-Bureau-Hyd- Ph: 9347807015/ 9849321309

Reddy/MBA / Most Beautiful/ 1997/5'4/10L/M- Rental income/ 150Cr. * Cont: K.C. Reddy-Hyd- Ph: 9849321309 /9347807015

Reddy/Catholic/B.Tech/MS/1993/ 5'3"/1000Cr. * Cont: K.C. Reddy- Mar- Bureau- Pvt- Ltd-Hyd-Ph: 9347807015/9849321309

Reddy/MS/ 1994 / 5'3"/ Royal Family-Hyd / 400Cr. * Cont: K.C. Reddy-Mar - Bureau - Hyd - Ph: 9849321309/9347807015

Reddy/ Divorcee/ MBBS/MD / Own Hospital-Hyd / 1986 / 5'6"/ 50Cr *93/5'8"/40Cr. * Cont: K.C. Reddy - Hyd-Ph:9347807015/ 9849321309

Reddy/Divorcee / USA-Green Card/ B.Tech/MS/ 1991/5'3"/ 140K/ 25Cr / Needs-India or USA alliance. * Cont: K.C. Reddy -Hyd-Ph: 9347807015

[D-576]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

D. V. Koti Reddy, 690, Road No : 3, Banjara Hills (TV - 9, Opp: Colony) (Near The Leela Hotel) Hyderabad. (Tuesday & Wednesday Holiday) Timings: 10 AM - 5 PM. www.avinashreddy.com + 91 98480 11818 , + 91 93933 11818

వధువు కావలెను

రెడ్డి 30, Business, MBA, 5' 7", Very Rich Family, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి 32, BE, MS, MBA, 5' 11", 36 L P/A, Hyd. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి 30, BE (IIIT), MS, 5' 10", Analyst, 30 L P/A, 20 Crores, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



రెడ్డి 28, BE, MS, 5' 8", Sr. SWE, 200 K, H1, USA, HandSome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి 29, BE (IIT), MS, 6', SWE, 140 K, 10 Crores, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి 29, MBBS, MD, 5' 10", Doctor, 70 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి 36, MS, 5' 10", Analyst, 20 L P/A, Hyderabad, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి 25, Business, BS, 5' 6", Hyderabad, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి 27, BE (NIT), MS, 5' 6", SWE, H1, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి 26, BE, 5' 8", SWE, 22 L P/A, Hyderabad, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి 28, BE, MS, 5' 5", SWE, 125 K, H1, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి 27, MSc, 5' 3", SME, 14.5 L P/A, Hyderabad, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి 29, MBBS, MD, 5' 4", Doctor, 25 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 31, 5' 6", Manager, 33 L P/A 10 Crores, Hyd, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

SC మాదిగ & క్రిస్టియన్ /కట్న ప్రసక్తి లేదు/ B.Tech/ C.Govt. కస్టమ్స్ ఆఫీసర్/ 18 Lakhs PA/5'8" ఎత్తు / 28 సంగల వరుడికి వధువు కావలెను. Ph: 9676995093 [HA-16235]

★

రెడ్డి/31/ 5'10", B.Tech, SWE/ Hyd, 12L PA, 20 Acres Land గల వెల్ సెటిల్డ్ వరునికి తగిన వధువు కావలెను. Ph: 9493878527 [HA-16239]

వరుడు కావలెను



రెడ్డి/విడో/కుల, మత ప్రసక్తి లేదు/A: 30, MBA, H: 5'3"/8Cr ప్రాపర్టీ గల అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం ఓకే) అన్ని వయస్సుల వారికి 1st / 2nd మ్యారేజెస్ మా వద్ద కలవు. 9515673252 [H-783632]

క్రిస్టియన్ మాదిగ/M.Tech/C.Govt. ప్రాజెక్ట్ ఇంజినీర్/BDL/65000/-PM/ 5'4" ఎత్తు/25 సంగల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9966760501 [HA-15507]

పద్మశాలి/B.Tech, NIT/C.Govt.ఆడిట్ ఆఫీసర్/AG ఆఫీస్/1 Lakh.PM/ 5'4" ఎత్తు/25 సంగల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8297439565 [HA-15507]

గౌడ/ M.Sc / C.Govt. స్టెనో గ్రాఫర్/ రైల్వే / 45000/-PM / 5'5"ఎత్తు/25 సంగల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618008271 [HA-15507]

క్రిస్టియన్ మాల/వెల్ సెటిల్డ్/B.Tech/ Govt.Jr.Asst/రెవెన్యూ Dept/55000/-PM/ 5'5" ఎత్తు/25 సంగల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9908222406 [HA-15507]

వడ్డెర/ఏకైక కుమార్తె/ M.Sc/ Agri/ Govt. AEO/ అగ్రికల్చర్ Dept/52000/-PM/ 5'5" ఎత్తు/25 సంగల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618007652 [HA-15507]

కుల పట్టింపు లేదు/2వ పెళ్లి పిల్లలు లేరు. 42yrs/5'4"/డిగ్రీ/గుడ్ జాబ్/వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ వధువుకి వరుడు కావలెను. Ph: 63035 96149 [HA-1641]

కాపు/ 28yrs /5'5" / బీ.టెక్ /జాబ్/ గుడ్ ఫ్యామిలీ/వెల్ సెటిల్‌గా ఉన్న వధువుకి వరుడు కావలెను. 2వ పెళ్లి అయినా ఓకే. Ph: 63035 96149 [HA-1641]

కమ్మ/ 25yrs /5'5" / B.Tech / సాఫ్ట్‌వేర్ జాబ్ / US అయినా ఓకే/కోట్ల ఆస్తి ఉన్న వధువుకి వరుడు కావలెను. Ph: 63035 96149 [HA-1641]

రెడ్డి/ గుడ్ లుకింగ్ / 26yrs / 5'5"/ బీ.టెక్/ సాఫ్ట్‌వేర్ జాబ్/కోట్ల ఆస్తి ఉన్న వధువుకి వరుడు కావలెను. NRI అయినా ఓకే. Ph: 9398494365 [HA-1641]

రెడ్డి/2nd మ్యారేజ్ : (కుల, ఆస్తి) పట్టింపు లేదు/33Y, B.Pharm/సొంత వ్యాపారం, మంచి ప్రాపర్టీస్ కలిగిన వధువుకి 1వ, 2వ వరుడు కావలెను (ఇల్లరికం) OK. అన్ని వయస్సుల వారికి సంబంధాలు కలవు Ph: 9030062353 [H-783632]

రెడ్డి/విడో/కుల, ఆస్తి ప్రసక్తి లేదు/Age: 35/ B.Com/ Own Business, బాగా స్థిరపడిన అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం అయినా OK) 1&2 అన్ని కులాల వారికి వివాహాలు చూడబడును. Ph: 7207510801 [H-783632]

బ్రాహ్మిన్స్/విడో/48y / Govt.Job vrs / 90K PM. ఫ్యామిలీ పెన్షన్/Own ప్లాట్స్ & హౌసెస్, రెంట్స్, Own సూపర్ మార్కెట్ 30L పొలాలు 6Lpm 20Cr ప్రాపర్టీ, ఫ్యామిలీతో వధువుకు వరుడు కావలెను/పిల్లలు ఉన్నా OK. 8106967428 [H-783632]

రెండో పెళ్లి/విడో/50y/Fair/ఆంధ్ర /Govt.జాబ్ / 1L PM/Own House(Rents), Lands, వెల్ సెటిల్ పిల్లలు లేని ఏ బాదరబందీలేని అందమైన వధువుకు FC/BC వరుడు కావలెను. Ph: 8519803423 [H-783632]

కుల పట్టింపు లేదు/విడో/50y/RTD Employee Own Business, ల్యాండ్స్ / సొంత ప్రాపర్టీ గల వధువుకి వరుడు కావలెను. సెల్ : 8125752940 [HA-34962]

వడ్డెర/B.Tech/ C.Govt.Asst. మేనేజర్ / ఆంధ్రా బ్యాంక్ / 55000/-PM / 5'4" ఎత్తు/ 25 సంగల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8341650195 [HA-16235]

రెడ్డి విడో 35y డిగ్రీ 8 ఎకరాల పొలం సొంత ఇల్లు కలిగి పిల్లలు లేని వధువుకు వరుడు కావలెను (ఆస్తి కుల పట్టింపు లేదు) మీ ఫోటోలు వాట్సాప్‌లో సెండ్ చేయండి. Ph: 9885492498 [HA-16235]

రెడ్డి/50y/విడో/5'4"/ Govt. లెక్చరర్/ 80,000/-PM / 2 సొంత ఇల్లు / కోచింగ్ సెంటర్/ 1 L/- PM ఆస్తి కుల పట్టింపులేని వధువుకు వరుడు కావలెను. 6281849287 [H-821202]

రెడ్డి/వైశ్య/Govt. Rtd పెన్షనర్/ 48/ రైల్వే/ సొంత అపార్ట్‌మెంట్స్/ఆంధ్రలో పొలాలు/రైస్ మిల్ /కోట్ల ప్రాపర్టీ గల వెల్ సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. కుల ఆస్తి ప్రసక్తి లేదు. 7095001526 [H-821202]

ఆస్తి కుల పట్టింపులేని అందమైన వధువుకి వరుడు కావలెను/విడో/ మార్బుల్స్, గ్రానైట్ బిజినెస్/1L/-PM / సొంత ఇల్లు / 49y / ఏ బాదరబందీలు లేవు. 7702995967 [H-821202]

CNB, Kamma Bride 55 yrs, Single, Settled. & Mala Christian Bride, PG ,43 yrs, govt job well Settled Wanted Suitable Grooms.ph:- 91214 44957 [B-823]

వేదికలు



కావ్య మ్యారేజ్ లింక్స్! 1వ, 2వ లేట్ మ్యారేజెస్ డైవర్సీస్, విడోస్, విడోయర్స్, పెన్షనర్లకు అన్ని కులములవారికి సంబంధములు త్వరగా చూపబడును (స్త్రీలకు ఫ్రీ). Ph: 7702526428 [H-821053]

నల్గొండలో మాదిగ వివాహ పరిచయ వేదిక ఆదివారం ఉ॥ 10.00 గం.ల నుండి సా॥ 6.00 గం.ల వరకు తేది : 10.8.2025 నిర్వహణ: స్వప్న వివాహ వేదిక సంస్థ : 9347046175 [H-821202]

శుభమస్తు మ్యారేజ్ బ్యూరో TM/ Est : 1995, గౌడ, ఈడిగ, శెట్టి బలిజ, 1st/ 2nd పెళ్లి/విడో సంబంధాలకై సంగ S.రాములు గౌడ్, లింగాల కాంప్లెక్స్, DSNR, Hyd. వ్యవస్థాపకురాలు: స్వర్గీయ S.శారదాగౌడ్, Ph: 8790680809 [H-821202]

★

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt., Doctors, MNC, Matches, Late & 2nd Matches కై సంప్రదించండి: 9704656103, 9533608887 (Whatsapp) [HA-1638]

క్లుప్తంగా...

చీరల ఉత్పత్తిని వేగవంతం చేయాలి: మంత్రి తుమ్మల



సాక్షి, హైదరాబాద్: ఇందిరా క్రాంతి మహిళా శక్తి పథకంలో భాగంగా స్వయం సహాయక సంఘాల మహిళలకు అందించే చీరల ఉత్పత్తిని వేగవంతం చేయాలని చేనేత, జౌళి శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. పలు ప్రభుత్వ శాఖలిచ్చిన ఆర్డర్ల ప్రకారం వస్త్రాలు, మహిళా శక్తి పథకం లబ్ధిదారుల చీరల ఉత్పత్తి ద్వారా నేత కార్మికులకు నిరంతరం పని కల్పిస్తున్నట్లు తెలిపారు. చేనేత, జౌళి శాఖ అమలు చేస్తున్న పథకాలపై మంత్రి తుమ్మల శనివారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లపై ఆదేశాలు జారీ చేశారు.

సింగూరు కాల్వల ఒప్పందం రద్దు

సాక్షి, హైదరాబాద్: సింగూరు జలాశయానికి ఎడమ, కుడి కాల్వలతో పాటు డిస్ట్రిబ్యూటరీల నిర్మాణం కోసం ఈపీసీ విధానంలో మహాలక్ష్మీ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ లిమిటెడ్‌తో 2006లో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని హైపవర్ కమిటీ నిర్ణయం తీసుకుంది. ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి కె.రామకృష్ణారావు అధ్యక్షతన శనివారం సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో న్యాయశాఖ కార్యదర్శి తిరుపతి, నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా పాల్గొన్నారు. ఒప్పందం తేదీ నుంచి 24 నెలల్లో ఈ పనులను పూర్తి చేయాల్సి ఉండగా, భూసేకరణ సమస్యలు, కోర్టు కేసులతో జాప్యం జరిగింది. రూ.58.99 కోట్లతో తొలుత కాంట్రాక్టర్‌కు అప్పగించగా, తర్వాత ప్రభుత్వం రూ.132.99 కోట్లకు అంచనా వ్యయాన్ని సవరించింది. గత 19 ఏళ్లలో 9సార్లు గడువు పొడిగించినా పనులు కాలేదు.

జీఆర్‌టీ జ్యువెల్లర్స్ 'ఆడి' అద్భుత ఆఫర్లు

సాక్షి, హైదరాబాద్: ఆడి సీజన్ సందర్భంగా అద్భుతమైన ఆఫర్లను అందిస్తున్నట్లు జీఆర్‌టీ జ్యువెల్లర్స్ తెలిపింది. ఏదైనా జీఆర్‌టీ షోరూంలో చేసే ప్రతి కొనుగోలుపై కస్టమర్లకు ప్రత్యేక బహుమతులు అందిస్తామంది. చిన్న నుంచి పెద్ద ఆభరణాల కొనుగోలుపై సర్‌ప్రైజ్ గిఫ్ట్ ఇస్తామని వెల్లడించింది. ఆఫర్‌లో భాగంగా బంగారు నాణేలు, బార్‌లు ఇస్తామని పేర్కొంది. ఈ ఆఫర్ ఆడి నెల మొత్తం అందుబాటులో ఉంటుందని తెలిపింది. ఈ సందర్భంగా జీఆర్‌టీ జ్యువెల్లర్స్ ఎండీ ఆనంద్ అనంతపద్మనాభన్ మాట్లాడుతూ 'బహుమతులను స్వీకరించడాన్ని ఎవరు ఇష్టపడరు? అందుకే ప్రతి ఆడి సీజన్‌లో బహుమతులు అందించడాన్ని సంప్రదాయంగా మార్చాలని నిర్ణయించాం'అని పేర్కొన్నారు.

అన్ని పనులూ మేమే చేయాలా?

ఉన్నది 34 మందే.. హౌసింగ్ బోర్డు ఉద్యోగుల వింత అవస్థ

- శనివారం ఓ లీజు స్థలం స్వాధీనానికి మూడొంతుల మంది సిబ్బంది హాజరు
- లీజు సిబ్బందితో వాదోపవాదం.. సహాయ ఎస్టేట్ ఆఫీసర్ గుండెపోటుతో మృతి
- తీవ్ర భయాందోళనల్లో అధికారులు.. సెలవుల్లో వెళ్లే యోచనలో కొందరు అధికారులు
- లీజు స్థలాలకు ప్రత్యేక విభాగం, సిబ్బంది ఉంటేనే పనిచేస్తామని అల్టిమేటం

Telangana Housing Board

సాక్షి, హైదరాబాద్: హౌసింగ్‌బోర్డు సొంత సిబ్బంది సంఖ్య 34 మంది.. ఆఫీసుల్లో వారే పనులు చేయాలి.. భూముల కబ్జాలను నిరోధించే డ్యూటీలూ వారివే.. లీజు గడువు ముగిసినా ఖాళీ చేయకుండా తిష్టవేసే వారిని ఖాళీ చేయించే విధులూ వారివే.. లీజు బకాయిల వసూలు 'బాధ్యతా'వారిదే.. ఈ పనులు చేయకుంటే క్రమశిక్షణ చర్యలను ఎదుర్కోవాల్సిందే.. ఇలా ఎన్నో పాత్రల్లో పనిచేయాల్సి రావటం ఇప్పుడు వారి 'ప్రాణం'మీదకు తెస్తోంది. ముందురోజు రాత్రి పదింటి వరకు ఆఫీసులో డ్యూటీ చేసి, ఉదయం ఆరింటికే ఓ లీజు స్థలాన్ని స్వాధీనం చేసుకోవటానికి వెళ్లిన బోర్డు సహాయ ఎస్టేట్ ఆఫీసర్.. అక్కడి వారితో జరిగిన వాదోపవాదాల మధ్య కుప్పకూలిపోయి ప్రాణాలు విడిచారు. ఈ ఘటన హౌసింగ్‌బోర్డు సిబ్బంది పరిస్థితిని కళ్లకు కడుతోంది. ఒకప్పుడు 800 మంది ఉద్యోగులతో కళకళలాడిన హౌసింగ్‌బోర్డు ఇప్పుడు 34 మంది సొంత సిబ్బంది, వారికి సహాయంగా ఉన్న కొందరు ఔట్‌సోర్సింగ్ సిబ్బందితో కాలం వెళ్లదీయాల్సి వస్తోంది.

లీజుదారుల ఆగడాలతోనే అసలు ఇబ్బంది

ఇళ్లను నిర్మించి ఇచ్చే ప్రధాన భూమిక నుంచి హౌసింగ్‌బోర్డు ఎప్పుడో వైదొలిగి.. ఉన్న భూములను వేలం రూపంలో అమ్ముకునేందుకు పరిమితమైన నేపథ్యంలో.. సిబ్బంది కొరత పెద్ద అడ్డుగా మారలేదు. కానీ, దాదాపు 100 ఎకరాల భూముల్లో ఉన్న లీజుదారుల ఆగడాలను ఎదుర్కొనే విషయంలో మాత్రం వారు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని పనిచేయాల్సి వస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా లీజుదారులు దాదాపు రూ.100 కోట్ల వరకు బోర్డుకు బకాయి ఉన్నారు. ఈ మొత్తం వసూలుతో పాటు, లీజు గడువు ముగిసిన వారి చెర నుంచి భూములను స్వాధీనం చేసుకునే విషయంలో మాత్రం సిబ్బంది దినదినగండంగా పనులు చేస్తున్నారు. శనివారం హైదరాబాద్‌లోని మెహిదీపట్నంలో లీజు స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు వెళ్లిన బృందంలోని సహాయ ఎస్టేట్ ఆఫీసర్ జగదీశ్వర రావు వాదోపవాదాలతో తీవ్ర ఒత్తిడికి లోనై గుండెపోటుతో మృతి చెందటం బోర్డు ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళనకు కారణమైంది. లీజు స్థలాలను ఖాళీ చేయించటం, లీజుల వసూలు తదితరాలకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయటంతోపాటు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించాల్సిందేనన్న డిమాండ్‌ను ప్రభుత్వం ముందుంచుతున్నారు. 'నాకు పెద్ద పోస్టుకు పదోన్నతి లభించిందన్న సంతోషం లేకుండాపోయింది. తీవ్ర ఒత్తిడి, భయాందోళనల మధ్య పని చేయాల్సి రావటం కష్టంగా మారింది. దీర్ఘకాలిక సెలవులో వెళ్లాలన్న యోచనలో ఉన్నాను'బోర్డు ఇంజినీరింగ్ విభాగ ఉన్నతాధికారి ఒకరు సన్నిహితులతో అంటున్న మాట. మిగతావారు కూడా ఇలాంటి యోచనలోనే ఉన్నారు.

ఏళ్లకేళ్లుగా నియామకాలు లేకనే....

గత ప్రభుత్వం హౌసింగ్‌బోర్డును దాదాపు మూసేసినంత పనిచేసింది. ఏళ్లుగా నియామకాలు లేవు. దీంతో కేవలం 34 మంది సిబ్బందే మిగిలారు. శనివారం మెహిదీపట్నంలో ఓ ఫంక్షన్ హాలును ఖాళీ చేయించే పని కోసం ఇతర జిల్లాల నుంచి కూడా సిబ్బందిని పిలిపించి దాదాపు 25 మంది వెళ్లాల్సి వచ్చింది. లీజుదారుల వైపు నుంచి బౌన్సర్లు రంగంలో ఉండటంతో వారిని ఎదిరించి స్థలాల్లోని భవనాలను సీజ్ చేయటం, ఖాళీ చేయించటం తమ వల్ల కావటం లేదని కొంతకాలంగా ఉద్యోగులు మొరపెట్టుకుంటున్నారు. కానీ, వారికి రక్షణగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఓ అధికారి చనిపోవటంతో తదుపరి ఇలాంటి కార్యాచరణకు తాము రంగంలో దిగమని ప్రభుత్వానికి తేల్చి చెప్పాలని మిగతా ఉద్యోగులు ఓ నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది. తమ రక్షణ కోసం చర్యలపై కోరినా, ఇలాంటి సాహసోపేత పనుల విషయంలో కాస్త తటపటాయించినా క్రమశిక్షణ చర్యలు తీసుకుంటున్నారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. అభియోగాలు నమోదు చేస్తే వాటిని సకాలంలో తొలగించే చర్యలు ఉండటం లేదని, వీటివల్ల పదోన్నతులు కోల్పోతున్నామని, రిటైర్ అయినా కూడా అభియోగాలు అలాగే ఉంచి పెన్షన్ రాకుండా చేస్తున్నారని కొందరు ఆరోపిస్తున్నారు.

మేడిగడ్డకు 3.41 లక్షల క్యూసెక్కుల వరద

- త్రివేణి సంగమం వద్ద పుష్కరఘాట్లను తాకిన నీరు

కాళేశ్వరం/కన్నాయిగూడెం/దోమలపెంట: మహారాష్ట్ర, తెలంగాణలో కురుస్తున్న వర్షాలతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని త్రివేణి సంగమం వద్ద ప్రాణహిత వరద తాకిడితో గోదావరికి ప్రవాహం పెరుగుతోంది. శనివారం పుష్కరఘాట్లను తాకుతూ నీటిమట్టం దిగువకు ప్రవహించింది. దీంతో కాళేశ్వరం వద్ద 8.700 మీటర్ల ఎత్తులో నీటిమట్టం ప్రవహిస్తోంది. దిగువన కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బరాజ్‌కి వరదనీరు చేరి 3.41 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో తరలిరాగా, మొత్తం 85 గేట్లు ఎత్తి అదేస్థాయిలో వరద నీటిని ఔట్‌ఫ్లో రూపంలో దిగువకు విడుదల చేస్తున్నారు. కాగా, మేడిగడ్డ బరాజ్ వంతెన మీదుగా భారీ వాహనాలు రాకుండా ఇరిగేషన్‌శాఖ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. వరద తాకిడి పెరిగిన నేపథ్యంలో మహారాష్ట్ర మీదుగా తెలంగాణలోకి బరాజ్‌పై వంతెన ద్వారా రాకుండా గేటును వెల్డింగ్ చేశారు.



కాళేశ్వరం పుష్కరఘాట్ తాకుతూ ప్రవహిస్తున్న వరద

సమ్మక్క సాగర్‌కు 5,28,450 క్యూసెక్కుల నీరు

ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం వద్ద ఉన్న సమ్మక్కసాగర్ బరాజ్‌లోకి భారీగా వరద నీరు చేరుతోంది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఎగువ ప్రాంతంలోని వాగులు, ఒర్రెలు, చెరువుల నుంచి గోదావరిలోకి వరదనీరు వస్తోంది. దీంతో మేడిగడ్డ, సరస్వతి బరాజ్ నుంచి వరదనీరు సమ్మక్క సాగర్ బరాజ్‌లోకి చేరుతోంది. శనివారం ఎగువ నుంచి 5,28,450 క్యూసెక్కుల నీరు వచ్చింది. దీంతో బరాజ్ వద్ద 59 గేట్లలో 44 గేట్లను ఎత్తి 5,65,100 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం బరాజ్ వద్ద నీటి మట్టం 83 మీటర్లకు 80.05 మీటర్లు కొనసాగుతోంది. బరాజ్‌త సామర్థ్యం 6.94 టీఎంసీలు కాగా ప్రస్తుతం 4.22 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

శ్రీశైలంకు కొనసాగుతున్న ప్రవాహం

జూరాల, సుంకేసుల నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు నీటి ప్రవాహం కొనసాగుతోంది. శనివారం రాత్రి 7 గంటలకు జూరాల స్పిల్‌వే ద్వారా 35,820 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ 34,286, సుంకేసుల నుంచి 31,928 మొత్తం 1,02,034 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. శ్రీశైలం ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తి స్పిల్‌వే ద్వారా 53,764 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎడమగట్టు భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 30,929 మొత్తం 66,244 క్యూసెక్కుల నీటిని అదనంగా సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 882.4 అడుగుల నీటిమట్టం వద్ద 201.1205 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ అత్యుత్తమంగా నిలవాలి

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



సాక్షి, హైదరాబాద్: దేశంలోనే అత్యుత్తమ శిక్షణ సంస్థగా డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ నిలవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆకాంక్షించారు. ఇందుకోసం ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. శనివారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల విభాగం గవర్నింగ్ బాడీ సబ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కమిటీ చైర్మన్ భట్టితో పాటు కమిటీ సభ్యులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎంసీహెచ్‌ఆర్‌డీ డైరెక్టర్ జనరల్ శాంతికుమారి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ 30 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ సంస్థకు చీఫ్ సెక్రటరీగా పనిచేసిన ఉన్నతాధికారి శాంతికుమారి అధిపతిగా ఉన్నారని, వారి సేవలను అధికారులు, సిబ్బంది వినియోగించుకోవాలని సూచించారు. సంస్థ స్వయం సమృద్ధి సాధించి, ఆర్థికంగా పురోగతి సాధించాలని, అప్పుడే ఆశించిన స్థాయిలో సంస్థ ఎదుగుతుందని అన్నారు.

మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ పరిపాలనలో దేశంలోనే మొట్టమొదట ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను పూర్తిస్థాయిలో ఉపయోగించిన రాష్ట్రంగా తెలంగాణ ఎదగాలని, అందుకు తగిన విధంగా ఉద్యోగులకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహకారంతో పనిచేయడంపై శిక్షణ పూర్తయిన తర్వాత ఉద్యోగులకు సర్టిఫికెట్ సైతం ఇవ్వాలన్నారు. న్యాక్ గుర్తింపు పొందడానికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లకు శిక్షణ ఇవ్వాలని, తద్వారా కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు సాధించేందుకు అవకాశం ఉంటుందని మంత్రులు అధికారులను ఆదేశించారు. ఇకనుంచి ప్రతి ఆరు నెలలకు ఒకసారి సబ్ కమిటీ సమావేశం అవుతుందని శ్రీధర్ బాబు చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న సాంకేతిక పరిజ్ఞానం, ఇతర అంశాల్లో మార్పులను దృష్టిలో పెట్టుకొని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ అధికారులు, సిబ్బందికి సైతం శిక్షణ ఇవ్వాలని మంత్రులు సూచించారు.

తెలంగాణలో కొత్త నాయకత్వం

- లీడర్ ఆకాశం నుంచి ఊడిపడడు
- నేర్చుకుంటూ, మార్చుకుంటూ ముందుకెళ్లేవారే నాయకులు: కవిత

సాక్షి, హైదరాబాద్/కుత్బుల్లాపూర్: తెలంగాణలో చురుకైన కొత్త నాయకత్వాన్ని తీర్చిదిద్దుతామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రకటించారు. కొత్త పంథాలో వెళ్తేనే సంస్థలకు మనుగడ ఉంటుందని, కాలానుగుణంగా తెలంగాణ జాగృతి కూడా తన పంథాను మార్చుకుంటుందని అన్నారు. జాగృతి ఆధ్వర్యంలో శనివారం మేడ్చల్ జిల్లా కొంపల్లిలోని ఓ ప్రైవేటు కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన 'లీడర్' రాజకీయ శిక్షణ కార్యక్రమాన్ని కవిత ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. లీడర్ అంటే కేవలం సర్పంచ్, ఎమ్మెల్యే, ఎంపీ, ముఖ్యమంత్రి పదవులు పొందడమే కాదన్నారు. లీడర్ ఆకాశం నుంచి ఊడిపడరని, ఎవరూ నాయకత్వ లక్షణాలతో పుట్టరని కవిత పేర్కొన్నారు. నేర్చుకుంటూ, తనను తాను మార్చుకుంటూ ముందుకెళ్లేవారే నాయకులు అవుతారన్నారు. మూస పద్ధతిలో కొనసాగేవాడు ఎప్పుడూ నాయకుడు కాడని అన్నారు. తోటివారి గోప్యత, మర్యాదను కాపాడకుండా నోటికి వచ్చింది మాట్లాడటమే ఇప్పుడు ట్రెండ్‌గా మారిపోయిందని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దృష్ట్యా తెలంగాణలో కొత్త నాయకత్వాన్ని తయారు చేయాలనేదే జాగృతి లక్ష్యమని స్పష్టం చేశారు. ఆగస్టు నుంచి అన్ని జిల్లాల్లో లీడర్ శిక్షణ తరగతులను నిర్వహిస్తామని వెల్లడించారు. తెలంగాణ జాతికి ఉన్న అద్భుతమైన సాంస్కృతిక నేపథ్యాన్ని పరిరక్షించడమే లక్ష్యంగా తెలంగాణ జాగృతి పనిచేస్తుందన్నారు. తెలంగాణకు నష్టం జరుగుతుంటే జాగృతి ఊరుకోబోదని, తెలంగాణకు నష్టం చేసే బనకచర్ల ప్రాజెక్టును ఆపి తీరుతామని కవిత స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా హైదరాబాద్‌లోని 150 డివిజన్లలో తెలంగాణ జాగృతిని బలోపేతం చేస్తామని కవిత ప్రకటించారు.



మాట్లాడుతున్న కవిత

ఆనకట్టకు 'కవరింగ్'!

ఆసిఫాబాద్ రూరల్: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ఆసిఫాబాద్ మండలంలోని అడ గ్రామంలోని అడ ప్రాజెక్టు ఆనకట్ట ఈసారీ ప్రమాదకర స్థితిలోనే ఉంది. 10.393 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం గల ఈ ప్రాజెక్టును 2011లో ప్రారంభించారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 5.516 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఆనకట్ట బీటలు వారడంతో మూడేళ్లుగా పాలిథిన్ కవర్ వేసి రక్షిస్తున్నారు. ఆనకట్ట ఎత్తు 45 మీటర్లు కాగా.. సుమారు 10 మీటర్ల లోతు వరకు బీటలు ఏర్పడ్డాయి. వర్షాకాలం కావడంతో ప్రాజెక్టులోకి నీరు చేరుతోంది. దీంతో ప్రమాదం సంభవించకుండా శుక్ర, శనివారాల్లో ఆనకట్టపై 70 మీటర్ల వరకు పాలిథిన్ కవర్ కప్పారు. ప్రాజెక్టు ఎస్‌ఈ కుమారస్వామి, ఈఈ గుణవంతరావు శనివారం ప్రాజెక్టు ఆనకట్టపై పాలిథిన్ కవర్ కప్పే పనుల్ని పర్యవేక్షించారు. బీటలు వారిన ఆనకట్ట మరమ్మతుల కోసం రూ.19 కోట్లతో ప్రతిపాదనలు పంపించామని చెప్పారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాకపోవడంతో రూ.36 లక్షలతో నాణ్యమైన పాలిథిన్ కవర్ ఏర్పాటు చేశామని తెలిపారు.



ఆనకట్టపై వేసిన కవర్‌ను పరిశీలిస్తున్న ఎస్‌ఈ, ఈఈ అధికారులు

క్లుప్తంగా...

ఆగస్టు 4 నుంచి పవిత్రోత్సవాలు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆగస్టు 4వ తేదీ నుంచి 6వ తేదీ వరకు పవిత్రోత్సవాలను నిర్వహించనున్నట్లు ఈవో వెంకట్రావ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. యాదగిరి క్షేత్రంతో పాటు అనుబంధ ఆలయమైన పాతగుట్టలో సైతం పవిత్రోత్సవాలను మూడు రోజులపాటు నిర్వహిస్తామని వెల్లడించారు. ఆ మూడు రోజులు ఆలయంలో నిత్య, శాశ్వత కల్యాణం, శ్రీసుదర్శన నారసింహ హోమం, లక్ష పుష్పార్చన, బ్రహ్మోత్సవం వంటి భక్తులచే జరిపించే పూజలను రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పట్టుబడి.. పరారీ

ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి రెప్పపాటులో పరారీ

కొత్తూరు: లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఒక పంచాయతీ కార్యదర్శి రెప్పపాటులో పరారయ్యాడు. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాలివి. రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం ఇన్ముల్‌నర్వ కార్యదర్శిగా పనిచేస్తున్న సురేందర్.. పంచాయతీ పరిధిలో ఇల్లు నిర్మించుకుంటున్న ఉక్లిచంద్ నుంచి రూ.లక్ష డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. ఈ 25న కార్యదర్శికి ఉక్లిచంద్ ఫోన్ చేసి.. డబ్బులు ఇచ్చేందుకు అంగీకరించాడు. శంషాబాద్ సమీపంలోని తొండుపల్లి వద్ద ఉన్న ఇండియానా హోటల్ వద్దకు రావాలని కార్యదర్శి సూచించాడు. ఈ మేరకు అతనికి రూ.50 వేలు ఇచ్చి, మిగతా మొత్తం త్వరలో ఇస్తానని ఉక్లిచంద్ చెబుతుండగానే ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. వెంటనే తేరుకున్న సురేందర్ వారినుంచి తప్పించుకుని నగదుతో పాటు తన కారులో ఉడాయించాడు. అతని ఇంటివద్ద కారుతో పాటు అందులోని రూ.50 వేలను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నా.. కార్యదర్శి పరారీలోనే ఉన్నాడు.

జలవనరుల గణన కోసం కమిటీలు

- రాష్ట్ర, జిల్లా స్థాయిలో స్టీరింగ్, సమన్వయ కమిటీలు
- కేంద్ర జలశక్తి శాఖ సూచనలతో ఏర్పాటు చేస్తూ ప్రణాళిక శాఖ ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని జలవనరుల గణన చేపట్టేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. భారత ప్రభుత్వ నిర్ణయం మేరకు రాష్ట్రంలోని జలవనరులను లెక్కగట్టేందుకు అవసరమైన రాష్ట్ర స్థాయి స్టీరింగ్, టెక్నికల్ సబ్ కమిటీ, జిల్లా స్థాయిలో స్టీరింగ్ కమిటీల ఏర్పాటు, మండల, గ్రామ స్థాయిలో నీటివనరుల గణన అధికారులను నియమిస్తూ కేంద్ర జలశక్తి శాఖ సూచనల మేరకు ప్రణాళిక శాఖ కార్యదర్శి జ్యోతిబుద్ధ ప్రకాశ్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం ప్రణాళిక శాఖ కార్యదర్శి చైర్మన్‌గా 20 మంది సభ్యులతో రాష్ట్ర స్థాయి స్టీరింగ్ కమిటీ, కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) ప్రాంతీయ చీఫ్ ఇంజనీర్ చైర్మన్‌గా ఆరుగురు సభ్యులతో సాంకేతిక సబ్‌కమిటీ, జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా 11మంది సభ్యులతో జిల్లా స్థాయి స్టీరింగ్ కమిటీలు ఏర్పాటు కానున్నాయి. రాష్ట్రంలో జరిగే ఏడవ చిన్న నీటి పారుదల గణన, రెండో జలవనరుల గణన కోసం జిల్లా కలెక్టర్లు జిల్లా గణన అధికారులుగా, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ అదనపు అధికారిగా, మున్సిపల్ కమిషనర్ పట్టణ ప్రాంతాల అధికారిగా, రాష్ట్ర స్థాయి స్టీరింగ్ కమిటీ ఎంపిక చేసే అధికారులు మండల, గ్రామ స్థాయి గణన అధికారులుగా ఉంటారు. ఈ ప్రక్రియకు ఇరిగేషన్ ఏఈఈ, ఎంపీఎస్‌వోలు సూపర్‌వైజర్లుగా వ్యవహరించనున్నారు.

1,000 పాఠశాలల్లో ప్రీప్రైమరీ

- ఇప్పటికే 210 పాఠశాలల్లో నిర్వహణకు సర్కారు సూచన
- తాజాగా మరో 790 స్కూళ్లు గుర్తింపు
- తరగతుల ఏర్పాటుకు సంబంధించిన మార్గదర్శకాలు జారీ
- నాలుగేళ్లు నిండిన చిన్నారులకు ప్రవేశం

సాక్షి, హైదరాబాద్

ప్రభుత్వ పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక (ప్రీ ప్రైమరీ) విద్య అమలుకు మార్గం సుగమమైంది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసింది. రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితారాణా శనివారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని 210 పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులను నిర్వహించాలని ఇప్పటికే సూచించగా.. తాజాగా మరో 790 పాఠశాలలను గుర్తిస్తూ వాటిల్లో ప్రీప్రైమరీ తరగతులు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆయా పాఠశాలల జాబితాను కూడా వెల్లడించింది. ప్రీ ప్రైమరీ అమలుకు ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.33 కోట్లు కేటాయించింది. తెలంగాణ విద్య, సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (టీజీఈడబ్ల్యూఐడీసీ)లో వినియోగించని నిధి నుంచి రూ.22.62 కోట్లు తీసుకోవాలని, మిగిలిన మొత్తాన్ని సమగ్రశిక్ష నుంచి విడుదల చేయాలని ఉత్తర్వుల్లో సూచించారు. కాగా ప్రీ ప్రైమరీ నిర్వహణ మార్గదర్శకాలను జిల్లా విద్యాశాఖ అధికారులకు పంపారు.



ఆహ్లాదపరిచే గది.. పోషకాహారం.. మధ్యాహ్న భోజనం ▶ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం.. నిర్దేశించిన పాఠశాలలో ప్రీ ప్రైమరీ కోసం ప్రత్యేకంగా తరగతి గది కేటాయించాలి. ఇది చిన్నారులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఇచ్చేలా ఉండాలి. అంగన్‌వాడీల్లో అందించే పోషకాలతో పాటు మధ్యాహ్న భోజనాన్ని కూడా అందించాలి.

- నాలుగేళ్లు నిండిన చిన్నారులను మాత్రమే ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో చేర్చుకోవాలి. అంటే వచ్చే విద్యా సంవత్సరం (2026–27)లో ఒకటో తరగతిలో చేరే పిల్లలకు మాత్రమే ప్రవేశం కల్పిస్తారు. ప్రీ ప్రైమరీలో చేరే విద్యార్థి వివరాలను యూడైస్‌లో రికార్డు చేస్తారు.

ఒక టీచర్.. ఒక ఆయా



- తరగతి నిర్వహణకు ప్రత్యేకంగా 18 ఏళ్ల నుంచి 40 ఏళ్ల మధ్య వయసున్న ఒక టీచర్, ఒక ఆయాను పూర్తి తాత్కాలిక పద్ధతిలో నియమించుకోవాలి. నోటిఫికేషన్ ద్వారా నియామకం చేపట్టాలి. వయో పరిమితి సడలింపు ప్రభుత్వ నిబంధనల ప్రకారం చేయాలి. టీచర్ కనీసం ఇంటర్మీడియెట్ పూర్తి చేసి ఉండాలి. ఆయా కనీసం ఏడో తరగతి చదివి ఉండాలి. ప్రీ ప్రైమరీ కోర్సు చేసిన వారికి, స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వాలి.
- తరగతి గదిలో ఇండోర్, అవుట్ డోర్ క్రీడా సామగ్రి ఏర్పాటు చేయాలి. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆమోదంతో వసతులు కల్పించాలి.
- ఎన్‌ఈపీ (నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ)–20కు అనుగుణంగా చర్యలు తీసుకోవాలి.
- రోజువారీ హాజరు స్వీకరించాలి. అంగన్‌వాడీల ద్వారా స్నాక్స్ పంపిణీ, మధ్యాహ్న భోజనం అమలు చేయాలి.



- జిల్లా స్థాయి కొనుగోలు కమిటీ ఆమోదంతోనే సరుకులు, వస్తువులు కొనుగోలు చేయాలి
- ఈ తరగతి నిర్వహణకు స్థానికులు, తల్లిదండ్రుల సలహాలను స్వీకరించాలి
- పాఠశాల ప్రధానోపాధ్యాయుడి ఆధ్వర్యంలో పర్యవేక్షణ ఉండాలి. రోజువారీ నిర్వహణ, పౌష్టికాహారం, ఆరోగ్యం, రక్షణ తదితరాలకు హెచ్ఎం బాధ్యత వహించాలి.
- ఈ తరగతుల నిర్వహణను రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖతో పాటు వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు సమన్వయం చేస్తారు.

భర్తవి కాకుండా ఇతరుల శుక్ర కణాలతో 'సృష్టి'!

- సికింద్రాబాద్‌లోని సృష్టి టెస్ట్‌ట్యూబ్ బేబీ సెంటర్ నిర్వాకం
- మగబిడ్డకు కేన్సర్ అని తేలడంతో దంపతులకు అనుమానం
- డాక్టరు సరైన సమాధానం ఇవ్వకపోవడంతో డీఎన్‌ఏ టెస్టు.. వెలుగు చూసిన మోసం
- వైద్యురాలిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్న పోలీసులు
- కేంద్రంలో వైద్య, పోలీసు, రెవెన్యూ అధికారుల తనిఖీలు
- హైదరాబాద్‌తో పాటు విజయవాడ, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో 'సృష్టి'సెంటర్లు


సృష్టి టెస్ట్‌ట్యూబ్ బేబీ సెంటర్

రాంగోపాల్‌పేట్ (హైదరాబాద్): పిల్లలు పుట్టలేదని సంతాన సాఫల్య కేంద్రానికి వెళ్లిన మహిళకు భర్త శుక్ర కణాలతో కాకుండా వేరే వ్యక్తి శుక్ర కణాలతో సంతానం కలిగించిన ఘటన సికింద్రాబాద్‌లో వెలుగులోకి వచ్చింది. ఇటీవల బాలుడి ఆరోగ్యంపై అనుమానంతో దంపతులు డీఎన్‌ఏ టెస్టు నిర్వహించగా ఈ విషయం బయటపడింది. దీంతో వారు రెజిమెంటల్ బజార్‌లోని సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌పై గోపాలపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం నుంచి ఉత్తర మండలం డీసీపీ రష్మీ పెరుమాళ్, సికింద్రాబాద్ ఆర్డీవో సాయిరాం, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకటితో పాటు క్లూస్ టీం, వైద్య బృందాలు సెంటర్‌లో తనిఖీలు చేపట్టారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. నగరానికి చెందిన ఓ జంట పెళ్లై ఏళ్లు గడుస్తున్నా పిల్లలు పుట్టక పోవడంతో రెండేళ్ల క్రితం సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ నిర్వహిస్తున్న డాక్టర్ నమ్రతను ఆశ్రయించారు. అక్కడ ఐవీఎఫ్ ప్రక్రియ అనంతరం వారికి మగబిడ్డ పుట్టాడు. అయితే ఇటీవల బాబు అనారోగ్యానికి గురికావడంతో వైద్యులను సంప్రదించారు. వివిధ రకాల పరీక్షల తర్వాత బాబుకు క్యాన్సర్ ఉందని తేలడంతో ఆ దంపతులు నిర్ఘాంతపోయారు. తమ తల్లిదండ్రులతో పాటు కుటుంబీకులు ఎవరికీ క్యాన్సర్ చరిత్ర లేకపోవడంతో, అనుమానం వచ్చి డాక్టర్ నమ్రతను గట్టిగా నిలదీశారు. ఆమె సరైన సమాధానం చెప్పకపోవడంతో బాబుకు డీఎన్‌ఏ టెస్టు లు చేయించగా.. ఆ దంపతుల డీఎన్‌ఏతో మ్యాచ్ కాలేదు. దీంతో డాక్టర్ నమ్రత తమను మోసం చేసిందని గ్రహించి పోలీసులను ఆశ్రయించారు. విషయం తెలిసి పరారీలో ఉన్న డాక్టర్ నమ్రతను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

లోతుగా దర్యాప్తు: డీసీపీ రష్మీ పెరుమాళ్

సృష్టి టెస్ట్‌ట్యూబ్ బేబీ సెంటర్‌లో అక్రమాలు జరుగుతున్నాయనే ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు డీసీపీ రష్మీ పెరుమాళ్ తెలిపారు. లోతైన దర్యాప్తు కోసం పోలీసులతో పాటు మెడికల్, రెవెన్యూ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. అంతర్రాష్ట్రాలకు సంబంధించిన అంశాలు కూడా ఇందులో ఉన్నట్లు తెలుస్తోందని, త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.

విశాఖ కేసులో లైసెన్సు రద్దు చేసినా..

డాక్టర్ నమ్రత హైదరాబాద్‌తో పాటు విజయవాడ, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో సంతాన సాఫల్య కేంద్రాలను నిర్వహిస్తున్నారు. పదేళ్ల క్రితం విశాఖపట్నంలో పేద మహిళలకు డబ్బు ఆశ చూపి సరోగసికి ఒప్పించి, పిల్లలు లేని వారి నుంచి లక్షల రూపాయలు వసూలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ కేసు అప్పట్లో సంచలనం సృష్టించింది. డాక్టర్ నమ్రతను పోలీసులు అరెస్టు చేయడంతో పాటు మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆమె లైసెన్సును రద్దు చేసినట్లు సమాచారం. దీంతో ప్రస్తుతం ఇక్కడ నడుస్తున్న టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌లో ఇతర డాక్టర్ల లైసెన్సుల ద్వారా వైద్యం అందిస్తున్నట్లు తెలిసింది. కాగా కేపీహెచ్‌బీలోని టెస్ట్‌ట్యూబ్ బేబీ సెంటర్‌లో కూడా ఇలాగే అక్రమ సరోగసీ కేసు నమోదైనట్లు సమాచారం.

విశాఖలో తాజాగా మేనేజర్ అరెస్టు

ప్రస్తుత కేసుకు సంబంధించి హైదరాబాద్ గోపాలపురం పోలీసులు విశాఖ జిల్లా పరిషత్ ప్రాంతంలో ఉన్న సృష్టి బేబీ సెంటర్‌లో తనిఖీలు చేపట్టారు. ఈ సెంటర్ ద్వారా ఇప్పటివరకు ఎంతమందికి ఐవీఎఫ్ చికిత్స అందించారన్న వివరాలపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. ఒక మహిళా మేనేజర్‌ను అదుపులోకి తీసుకుని హైదరాబాద్‌కు తరలిస్తున్నారు.

తేజేశ్వర్‌ను చంపడం ఎందుకు?

- ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోదామన్న తిరుమలరావు
- భర్తను చంపితేనే వస్తానన్న ఐశ్వర్య
- కస్టడీలోకి తీసుకొని ఏ-1, ఏ-2లను విచారించిన పోలీసులు

గద్వాల క్రైం: తెలుగు రాష్ట్రాల్లో పెను సంచలనం సృష్టించిన గద్వాలకు చెందిన ప్రైవేట్ సర్వేయర్ తేజేశ్వర్ హత్య కేసులో కోర్టు అనుమతితో శనివారం ఏ–1 తిరుమలరావు, ఏ–2 ఐశ్వర్య అలియాస్ సహస్రలను సీఐ శ్రీను కస్టడీలోకి తీసుకొని వేర్వేరుగా విచారించారు. విచారణ సందర్భంగా ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చినట్టు తెలిసింది. 'ఆషాఢమాసంలో పుట్టింటికి వస్తావు కదా.. అప్పుడు ఇద్దరం ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోదాం. ఈ హత్య చేయడం ఎందుకు అని తిరుమలరావు ఐశ్వర్యకు చెప్పగా, లేదులేదు...తేజేశ్వర్‌ను తుదముట్టిస్తేనే వస్తానని ఐశ్వర్య చెప్పడంతోనే సుపారీ గ్యాంగ్‌తో హత్యకు ప్రణాళిక రచించానని' తిరుమలరావు పోలీసులకు చెప్పినట్టు తెలిసింది. మరోవైపు ఐశ్వర్య మాత్రం తనకేమీ సంబంధం లేదని విచారణ అధికారి ముందు చెప్పినట్టు విశ్వసనీయ సమాచారం.

గ్లిజరిన్‌తో కపట నాటకం..: తేజేశ్వర్‌ను సుపారీ గ్యాంగ్‌తో హత్య చేయించిన విషయాన్ని జూలై 17న తిరుమలరావు వాట్సాప్ కాల్ ద్వారా ఐశ్వర్యకు చెప్పాడు. ఈ క్రమంలో తేజేశ్వర్ చనిపోయినట్టు అదే నెల 20న కుటుంబ సభ్యులకు తెలిసింది. ఐశ్వర్య భర్త చనిపోయినప్పుడు విలపించే క్రమంలో గ్లిజరిన్ కంట్లో వేసుకున్నట్టు విచారణ అధికారికి ఇచ్చిన వాంగ్మూలంలో స్పష్టం చేసినట్టు తెలిసింది. గ్లిజరిన్‌తోపాటు, హత్య చేసినప్పటి నుంచి తిరుమలరావు తప్పించుకునేందుకు వినియోగించిన కారును హైదరాబాద్‌లోని ఓ అపార్టుమెంట్ సమీపంలో పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు.

ఇద్దరూ కస్టడీలో ఉన్నారు: గద్వాల కోర్టు అనుమతితో రిమాండ్‌లో ఉన్న తిరుమలరావు, ఐశ్వర్యలను రెండు రోజుల విచారణకు కస్టడీలోకి తీసుకున్నామని సీఐ శ్రీను తెలిపారు. నిందితులను వివిధ అంశాలపై విచారించామన్నారు. త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తామని సీఐ పేర్కొన్నారు.

దేశీ కూరగాయల విత్తనోత్పత్తికి అడుగులు

నడుంబిగించిన ఉద్యాన విశ్వవిద్యాలయం

ఉద్యాన పరిశోధన స్థానాలు, కళాశాలల్లో విత్తనోత్పత్తి కోసం సాగు



సాక్షి, సిద్దిపేట: హైబ్రిడ్ కూరగాయల విత్తనాల హవా నేపథ్యంలో.. దేశీ కూరగాయల విత్తనాలు మార్కెట్‌లో అరుదుగా లభిస్తున్నాయి. సేంద్రియ, మిద్దె, పెరటి తోటల్లో మాత్రమే దేశీ రకాల విత్తనాలతోనే ఎక్కువగా సాగుచేస్తున్నారు. మార్కెట్‌లో ప్రస్తుతం నాణ్యమైన దేశీ రకాలకు చెందిన కూరగాయల విత్తనాల కొరత ఏర్పడింది. ఈ నేపథ్యంలో అధిక దిగుబడి, చీడల పీడల నుంచి రక్షణ పొందే దేశీ రకాల విత్తనోత్పత్తిని పెంపొందించేందుకు సిద్దిపేట జిల్లా ములుగులోని శ్రీ కొండాలక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన వర్సిటీ నడుంబిగించింది. రాష్ట్ర వ్యాప్తంగా కూరగాయల సాగు 3లక్షల ఎకరాల వరకు ఉంది. దేశీ కూరగాయల పంటల సాగు చేయాలని రైతులు మక్కువ చూపిస్తున్నా, నాణ్యమైన విత్తనాలు లభించక వెనుకడుగు వేస్తున్నారు. దీంతో వ్యవసాయ పరిశోధన స్థానాలు, కళాశాలల్లో విత్తనోత్పత్తిని ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. టమాట, వంకాయలో మూడు రకాలు, దోసకాయ, చిక్కుడు, తోటకూర, కందగడ్డ, ఎర్ర తోటకూర, కూర, రాములక్కాయ కూరగాయల విత్తనోత్పత్తి చేయనున్నారు.

దేశీ రకాల కూరగాయల సీడ్ ఉత్పత్తి

దేశీ రకాల కూరగాయల విత్తనోత్పత్తి చేసేందుకు విశ్వ విద్యాలయం ప్రత్యేక దృష్టి సారించింది. పరిశోధన స్థానాల్లో దేశీరకాల సీడ్‌లను ఉత్పత్తి చేసి వచ్చే సీజన్ నుంచి రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రణాళికలు రూపొందించాం. సేంద్రియ కూరగాయల సాగు చేసే రైతులకు దేశీ రకాల విత్తనాలు ఎంతో దోహదపడనున్నాయి. ఇటీవల అందరితో సమావేశం నిర్వహించాం.

– డాక్టర్ దండ రాజిరెడ్డి,
వీసీ శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం

ఆయుధాల అభివృద్ధిలో వేగం పెంచాలి

'సిందూర్ సౌగంధ్' వర్క్‌షాప్‌లో డీఆర్‌డీఓ చైర్మన్ కామత్



సాక్షి, హైదరాబాద్: పరీక్షల దశలో ఉన్న ఆయుధ వ్యవస్థలను వీలైనంత త్వరగా సైనిక దళాలకు అందుబాటులోకి తీసుకురావాలని శాస్త్రవేత్తలకు రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) చైర్మన్ డాక్టర్ సమీర్ వి కామత్ పిలుపునిచ్చారు. తక్షణమే స్పందించే, మరింత వేగంగా ప్రయాణించగల హైపర్‌సోనిక్ క్షిపణుల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని కోరారు. ఇటీవలి 'ఆపరేషన్ సిందూర్'లో ఉపయోగించిన ఆయుధ వ్యవస్థలపై శనివారం హైదరాబాద్ డీఆర్‌డీఓలో 'సిందూర్ సౌగంధ్' పేరిట నిర్వహించిన ఒక రోజు వర్క్‌షాప్‌లో కామత్ ప్రసంగించారు. దేశీయంగా అభివృద్ధి చేసిన ఆయుధ వ్యవస్థలు ఆపరేషన్ సిందూర్‌లో కీలక పాత్ర పోషించాయని తెలిపారు. హైదరాబాద్‌లోని మిస్సైల్ కాంప్లెక్స్‌లో అభివృద్ధి చేసిన దేశీయ హైటెక్ క్షిపణి వ్యవస్థలైన ఆకాశ్, బ్రహ్మోస్, ఎంఆర్ఎస్ఏఎం, యూఎల్‌పీజీఎం వంటివి ఆపరేషన్ సిందూర్‌లో కీలకపాత్ర పోషించాయని చెప్పారు. దేశ ప్రయోజనాల కోసం ఆయుధాల తయారీలో వంద శాతం స్వదేశీకరణ అవసరమని డీఆర్‌డీఎల్ మాజీ డైరెక్టర్ వీజే సుందరం అన్నారు. వర్క్‌షాప్ నిర్వహణ ఉద్దేశాన్ని డీఆర్‌డీఎల్ డైరెక్టర్ డాక్టర్ జీఏ శ్రీనివాసమూర్తి వివరించారు. వర్క్‌షాప్‌లో బ్రహ్మోస్ ఏరోస్పేస్ వ్యవస్థాపక ఎండీ, సీఈఓ డాక్టర్ శివతాను పిళ్లై, ఆకాశ్ ఆయుధ వ్యవస్థ ప్రాజెక్టు మాజీ డైరెక్టర్ డాక్టర్ ప్రహ్లాద్, డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ డాక్టర్ సతీశ్‌రెడ్డి ప్రసంగించారు.

'కమ్యుటేషన్'పై సర్కార్ తీరు సరైందే..

రూల్ 18పై పిటిషన్లను కొట్టివేసిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు కమ్యుటేషన్ విధానంలో ఒకేసారి ముందస్తుగా తీసుకున్న సొమ్మును పదిహేనేళ్ల పాటు వసూలు చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని హైకోర్టు సమర్థించింది. వేతన కమిషన్ సిఫారసు మేరకు సొమ్ము వసూలు వ్యవధిని నిర్ణయించారని స్పష్టం చేసింది. ఇదే విధానాన్ని కేంద్ర ప్రభుత్వం కూడా అనుసరిస్తోందన్న విషయాన్ని గుర్తు చేసింది. కమ్యూటెడ్ పెన్షన్ రూపంలో ఏకమొత్తంలో తీసుకున్న సొమ్ముకు.. అసలుతో పాటు వడ్డీని 11 ఏళ్ల 3 నెలల పాటు ప్రభుత్వం వసూలు చేస్తే సరిపోతుందన్న పిటిషనర్ల వాదనను తోసిపుచ్చింది. ఈ మేరకు దాఖలైన దాదాపు వంద పిటిషన్లను కొట్టివేసింది. రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు తమకు వచ్చే పెన్షన్ సొమ్ములో కమ్యుటేషన్ పెన్షన్ కింద ముందస్తుగా తీసుకున్న మొత్తాన్ని సర్కార్ 15ఏళ్ల పాటు వసూలు చేశాకే పూర్తిస్థాయి పెన్షన్ పునరుద్ధరణకు వీలు కల్పిస్తున్న తెలంగాణ సివిల్ పెన్షన్స్ (కమ్యుటేషన్) రూల్ 18ని సవాల్ చేస్తూ.. చందానగర్‌కు చెందిన అటవీ శాఖ మాజీ డిప్యూటీ కన్జర్వేటర్ ఆచార్యులుతో పాటు వందలాది మంది హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ శామ్‌కోషి, జస్టిస్ నర్సింగ్‌రావు ధర్మాసనం విచారణ చేపట్టింది. జీపీ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. పిటిషన్లను కొట్టివేసింది.

మేడిగడ్డపై సర్కారుకు ఇంజనీర్ల సంజాయిషీ

- షోకాజ్ నోటీసులకు సమాధానమిచ్చిన ఇంజనీర్లు
- వారిపై తదుపరి చర్యలు తీసుకోవాలా? వద్దా?
- త్వరలో నిర్ణయం తీసుకోనున్న ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: మేడిగడ్డ బరాజ్ కుంగిపోయిన ఘటనపై నీటిపారుదల శాఖకు చెందిన పలువురు ఇంజనీర్లు ప్రభుత్వానికి సంజాయిషీ ఇచ్చారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఇచ్చిన నివేదిక ఆధారంగా గత నెల 26న రాష్ట్ర నీటిపారుదల శాఖలోని 38 మంది ఇంజనీర్లు, మాజీ ఇంజనీర్లకు ఆ శాఖ ముఖ్యకార్యదర్శి షోకాజ్ నోటీసులు జారీ చేయగా, ఇద్దరు ముగ్గురు ఇంజనీర్లు మినహా అందరూ ప్రభుత్వానికి తమ సంజాయిషీని ఇచ్చుకున్నారు. మిగిలిన ఇంజనీర్లు సంజాయిషీ ఇచ్చుకోవడానికి మరికొంత గడువును కోరినట్టు అధికారవర్గాలు తెలిపాయి. 17 మంది ఇంజనీర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసి ప్రాసిక్యూట్ చేయాలని, 33 మంది ఇంజనీర్లపై అభియోగాలు నమోదు చేసి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, ఏడుగురు రిటైర్డ్ ఇంజనీర్లపై రివైజ్డ్ పెన్షన్‌రూల్స్ ప్రకారం జరిమానాలు విధించాలని గతంలో విజిలెన్స్ విభాగం సిఫారసు చేయగా, విజిలెన్స్ కమిషన్ సైతం ఆమోదించింది. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని కోరుతూ గత మార్చి 8న నీటిపారుదల శాఖకు కమిషన్ లేఖ రాసింది. మాజీ ఈఎన్‌సీలు సి.మురళీధర్, బి.నాగేంద్ర రావు, నల్లా వెంకటేశ్వర్లు, నరేందర్ రెడ్డి, సీఈలు/రిటైర్డ్ సీఈలు టి.శ్రీనివాస్, పీఏ వెంకటకృష్ణ, అజయ్‌కుమార్, కె.సుధాకర్ రెడ్డి, బి.వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ చంద్రశేఖర్, డైరెక్టర్ ఆఫ్ వర్క్స్ అకౌంట్స్ వి.ఫణిభూషణం, డిప్యూటీ సీఈ ఎండీ అబ్జుల్ ఖాన్, ఎస్ఈలు బి.వెంకటరమణా రెడ్డి, బస్వరాజ్, మాజీ ఈఈ సర్దార్ ఓంకార్ సింగ్, ఈఈలు సీహెచ్ తిరుపతి రావు, ఎం.రఘురామ్‌పై క్రిమినల్ కేసులు పెట్టాలని విజిలెన్స్ విభాగం సిఫారసు చేసింది. వీరితో సహా మొత్తం 38 మంది ఇంజనీర్ల నుంచి సంజాయిషీలు అందిన తర్వాత వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలి? అన్న అంశంపై త్వరలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిలు ఈ విషయంపై సమీక్ష నిర్వహించి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. విజిలెన్స్ నివేదిక వచ్చాకే మాజీ ఈఎన్సీలు సి.మురళీధర్, హరిరామ్‌లను అవినీతి నిరోధక విభాగం(ఏసీబీ) ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టు చేసింది. మేడిగడ్డ బరాజ్ నిర్మాణం, నిర్వహణలో అవకతవకలు, నిర్లక్ష్యం వంటి ఆరోపణలపై విజిలెన్స్ సిఫారసుల ఆధారంగా క్రిమినల్ కేసులతో పాటు శాఖాపరమైన చర్యలకు ప్రభుత్వం ఉపక్రమించే అవకాశాలున్నాయి.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.

రాముడు నడయాడిన రామగిరి ఖిల్లా


ఖిల్లాపై శిల్పాలు

- ఆహ్లాదకర వాతావరణం, వనమూలికలకు ప్రసిద్ధి
- శ్రావణమాసంలో పర్యాటకుల సందడి
- పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి చేయాలని విన్నపాలు


సీతారామచంద్ర సమేత ఆంజనేయ విగ్రహాలు

రామగిరి(మంథని): రాముడు నడయాడిన నేలగా రామగిరి ఖిల్లా పర్యాటకులను ఆకర్షిస్తోంది. ఒకప్పుడు నక్సలైట్లకు ఆవాసంగా ఉండేది. అలనాటి చారిత్రక కట్టడాలు, ఆయుర్వేద వనమూలికల భాండాగారంగా ప్రసిద్ధి చెందింది. విభిన్న జాతుల వృక్షాలతో.. ప్రకృతి ప్రేమికుల్ని ఆకట్టుకుంటోంది. అద్భుత కళాసంపదకు నిలయమైన రామగిరి ఖిల్లా.. పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం బేగంపేట గ్రామం నుంచి కల్వచర్ల గ్రామం వరకు విస్తరించి ఉంది. శ్రీరాముడు వనవాస సమయంలో ఇక్కడికి వచ్చి తపస్సు చేసి శివలింగం ప్రతిష్ఠించినట్లు కథనం ప్రచారంలో ఉంది. వనవాసం సమయంలో కొద్ది రోజులు కుటీరం ఏర్పరచుకొని సీతాలక్ష్మణులతో ఉన్నారని, ఖిల్లాపై సీతారామలక్ష్మణులు సంచరించినట్లు కొన్ని ఆనవాళ్లు ఇప్పటికీ దర్శనమిస్తాయి. ఖిల్లా బండరాతిపై శ్రీరాముని పాదాలు, సీతాదేవి స్నానమాచరించిన కొలనుతో పాటు ఆంజనేయుని విగ్రహాలు ఉన్నాయి. ఏటా శ్రావణమాసంలో కోటపై సీతాసమేత శ్రీరాముడు, హనుమాన్ విగ్రహాల ఊరేగింపు నిర్వహించి పూజలు చేస్తారు.

చూడాల్సిన ప్రదేశాలు

ఖిల్లాలో ఏడు కోట ప్రవేశ దర్వాజాలు, 15 ఎత్తయిన శత్రు సైన్యాన్ని పసిగట్టే బురుజులున్నాయి. మొదటి దర్వాజాకి కుడి వైపు వెళ్తే జలపాతం, రెండో దర్వాజా ప్రవేశంలో కుడివైపు గోడలపైన క్రీ.శ.1556 కాలం నాటి పది పంక్తులున్న తెలుగు శాసనం కనిపిస్తాయి. దర్వాజా ప్రవేశించిన తర్వాత ఎడమవైపు అద్భుతమైన పచ్చని కోట, 25 మీటర్ల పొడవున్న అతిపెద్ద ఫిరంగి, నాలుగో దర్వాజాపై అతిపెద్ద ఫిరంగితో పాటు ఏనుగుతో పోరాడుతున్న యోధుడి శిల్పం, రెండు తలల గరుత్మంతుడి శిల్పం ఉంటాయి. పదిహేను మీటర్ల పొడవున్న పిల్లల ఫిరంగి ఉంటుంది. ఆరో దర్వాజా నుంచి 21 మెట్లు ఎక్కితే కోటపై నుంచి మానేరువాగు వయ్యారాలతో పాటు ఖిల్లాపై వివిధ చారిత్రక స్థలాలైన సీతమ్మ స్నానమాడిన కొలను, పసరు బావులు, పసుపు, కుంకుమ భరణి, సవతుల బావులు, మాధవీ మండపం, రాముడు ప్రతిష్ఠించిన శివలింగాలు, హనుమంతుడి విగ్రహం, చరశాలలు, గజశాలలు, అశ్వశాలలు, రాజమందిరానికి రాతి నీటి గొట్టాలు, చివరగా సీతారాముల వారిని దర్శించుకోవచ్చు.

శ్రావణమాసంలో సందడి

ప్రతి శ్రావణమాసంలో రామగిరి ఖిల్లాపై పర్యాటకుల సందడి ఉంటుంది. ఈ దుర్గంపై నుంచి ప్రకృతి అందచందాలను తిలకిస్తూ పర్యాటకులు మైమరిచిపోతారు. ఆయుర్వేద వైద్యులు ఈ ఖిల్లాపై వనమూలికలను సేకరిస్తారు. పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దుతామని గతంలో ప్రభుత్వం రూ.5 కోట్లు కేటాయించింది. ప్రాచీన కళలకు నిలయమైన రామగిరిఖిల్లా అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వం మరిన్ని నిధులు కేటాయించి పనులు నిర్వహిస్తే పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి చెందుతుంది.

ఖిల్లాకు వెళ్లే దారి

పెద్దపల్లి జిల్లా కేంద్రం నుంచి మంథని ప్రధాన రహదారిలో సుమారు 20 కిలోమీటర్లు ప్రయాణించి బేగంపేట ఎక్స్‌రోడ్ (నాగెపల్లి) వద్ద దిగాలి. ఆటోద్వారా బేగంపేట గ్రామానికి చేరుకుని సుమారు 3 కిలోమీటర్లు కాలినడకన ఖిల్లాకు చేరుకోవచ్చు. ఖిల్లాకు ఉదయం 8 గంటల వరకు వెళ్తే.. సాయంత్రం 5 గంటల వరకు అన్ని ప్రదేశాలు చూడవచ్చు.


రామగిరి ఖిల్లా


పెద్దపల్లి జిల్లా రామగిరి మండల కేంద్రంలోని రామగిరి ఖిల్లా


ఖిల్లాపై హనుమాన్ ఆలయం


ఖిల్లాపై శివలింగం ఆనవాళ్లు


ఖిల్లాపై బురుజులు


ఫిరంగి


సీతమ్మ కొలను

ముసురులో మూగజీవాలు



అయిదు రోజులుగా ముసురు పెడుతుండడంతో మనుషులకే కాదు, మూగజీవాలకూ తిప్పలు తప్పట్లేదు. రోజంతా మేత కోసం తిరిగినా ముసురుతో వాటి ఆకలి తీరడం లేదు. సాయంకాలం వేళ పెద్దపల్లి జిల్లా దొంగతుర్తి గ్రామ శివారులో ఇంటిబాట పట్టిన గొర్రెల మందలివి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

ఉధృతంగా బొగత


కనువిందు చేస్తున్న బొగత జలపాతం

వాజేడు: ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని బొగత జలపాతం ఉధృతంగా ప్రవహిస్తూ కనువిందు చేస్తోంది. విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో ప్రమాద స్థాయిని దాటి ప్రవహిస్తోంది. కాగా, జలపాతం సందర్శనను శనివారం వరకు నిలిపివేసిన అధికారులు.. నిషేధాన్ని మరోమారు పొడిగించారు. వరదలు, వర్షాలు తగ్గే వరకు జలపాతం సందర్శన నిలిపివేత కొనసాగుతుందని ములుగు డీఎఫ్‌వో రాహుల్ కిషన్‌జాదవ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇంతకుముందు పూర్తిగా నిషేధించిన జలపాతాలను కూడా పర్యాటకులు సందర్శించవద్దని సూచించారు. నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవలసి వస్తుందని హెచ్చరించారు. బొగత జలపాతం సందర్శనను నిలిపివేసిన అధికారులు.. జాతీయ రహదారి నుంచి జలపాతానికి వెళ్లే దారికి అడ్డంగా బారికేడ్లను ఏర్పాటు చేశారు. సిబ్బందిని కాపలా ఉంచి ప్రధాన ద్వారానికి తాళం వేశారు.

మంత్రపురికి శ్రావణ శోభ


శ్రీమహాలక్ష్మి అమ్మవారు


గణపతి విగ్రహం

- నెలరోజులపాటు ఆధ్యాత్మిక సందడి
- టెంపుల్ టౌన్‌గా మంథని
- ప్రసిద్ధిగాంచిన మహాలక్ష్మి, హనుమాన్ ఆలయాలు
- ఉత్తర ముఖంలో మహాగణపతి.. ఆరు శివాలయాలు

మంథని: చుక్కల అమావాస్యతో ఆషాఢ మాసం వెళ్లిపోయి.. శ్రావణ మాసం మొదలైంది. నెలరోజుల పొలాల అమావాస్యతో శ్రావణ మాసం ముగుస్తుంది. ఈ నెల రోజుల పాటు ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరుస్తుంది. ప్రధానంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ప్రాచీన పుణ్యక్షేత్రాల్లో కాళేశ్వరం, మంథని క్షేత్రాలు అత్యంత ప్రసిద్ధి చెందాయి. శ్రావణ మాసంలో ప్రసిద్ధి గాంచిన మహాలక్ష్మి అమ్మవారి ఆలయంతోపాటు కన్యకాపరమేశ్వరి, లలితాదేవి, సరస్వతి అమ్మవారి ఆలయాలు కొలువై ఉన్నాయి. అలాగే 11 పురాతన హనుమాన్ దేవాలయాలతోపాటు నూతనంగా నిర్మించిన హనుమాన్ దేవాలయం.. దక్షిణ భారతదేశంలో ఎక్కడా లేనివిధంగా పశ్చిమ ద్వారం, పశ్చిమ ముఖం కలిగిన శివలింగం మంథనిలో మాత్రమే ఉన్నాయి. మరో ఐదు శివాలయాలూ ఇక్కడ నిత్యపూజలు అందుకుంటున్నాయి.

అభయమిస్తున్న మహాగణపతి

మంత్రపురిగా ప్రసిద్ధి చెందిన మంథని పట్టణానికి ఉత్తర ముఖంలోని మహాగణపతి ఆలయం భక్తులకు అభయమిస్తూ పూజలు అందుకుంటోంది. పూజల్లో ఆది దేవుడైన గణపతినే కొలుస్తారు. ఇక్కడ గణపతికి ప్రత్యేకంగా దేవాలయం ఉండడంతో శ్రావణ మాసంలో ప్రత్యేక పూజలు చేసి స్వామివారి అభయహస్తాన్ని భక్తులు పొందుతారు. శ్రావణ మాసంలో సోమవారం శివపార్వతులను, మంగళవారం మంగళగౌరీ వ్రతాలు, శుక్రవారం మహాలక్ష్మి అమ్మవారిని, శనివారం హనుమాన్ భక్తులు పూజిస్తారు. ఇందుకు తగ్గట్లు ఇక్కడ ఆలయాలు కొలువయ్యాయి.

సామూహిక కుంకుమ పూజలు ప్రత్యేకం

శ్రావణంలో మహిళలు తమ సౌభాగ్యం కోసం అమ్మవారిని కొలుస్తారు. నూతనంగా వివాహమైన జంటలు, కొత్త కోడళ్లతో అత్తగార్లు వ్రతాలు చేయిస్తారు. మంథనిలో ప్రసిద్ధి గాంచిన మహాలక్ష్మి అమ్మవారు కొలువయ్యారు. ఇక్కడ ఏటా సామూహిక కుంకుమ పూజలు పెద్దఎత్తున నిర్వహిస్తారు. మహాలక్ష్మి అమ్మవారి దేవాలయంతో పాటు కన్యకాపరమేశ్వరి, లలితాదేవి, సరస్వతీ అమ్మవారి దేవాలయాలు (గోదావరి తీరం, అయ్యప్ప దేవాలయం) ఉన్నాయి.

పశ్చిమ ముఖ శివలింగం

దక్షిణ భారతదేశంలో ఎక్కడా లేనివిధంగా పశ్చిమ ద్వారం, పశ్చిమ ముఖం కలిగిన శివలింగం మంథనిలో మాత్రమే ఉంది. భిక్షేశ్వరాలయంగా పిలిచే ఈ దేవాలయంలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు చేస్తారు. శ్రావణ మాసంలో శివపార్వతుల పూజలకు ప్రాధాన్యం ఉండడంతో శ్రావణ సోమవారం.. శివాలయాలను భక్తులు దర్శించి పూజలు చేస్తారు. శ్రీలేశ్వర- సిద్ధేశ్వర దేవాలయం, సురాబాండేశ్వరుడు, గౌతమేశ్వరుడు, ఓంకారేశ్వరుడు ఇక్కడ కొలువయ్యారు. ఇలా శ్రావణ మాసంలో నెలరోజుల పాటు భక్తులు భక్తిశ్రద్ధలతో దేవతామూర్తులను కొలిచేందుకు అనువుగా మంత్రపురి సిద్ధంగా ఉంది.


పశ్చిమ ముఖశివలింగం

వానందం!



బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణితో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. నాటిన విత్తనాలు, పంటలు ఎండుతున్నాయని వరుణదేవుని కోసం పూజలు చేసిన రైతులు.. కొద్దిరోజులుగా కురుస్తున్న వానలతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరో రెండు మూడు రోజులు వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ చేసిన హెచ్చరికలతో అధికారులు అప్రమత్తమయ్యారు. నష్టాల నివారణకు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో శనివారం పాదచారులు గొడుగులతో వెళ్తూ కనిపించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

వచ్చే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో డీలిమిటేషన్

- మాజీ ఎంపీ వినోద్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: వచ్చే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో డీలిమిటేషన్ జరుగుతుందని, కేంద్ర ప్రభుత్వం సీట్లు పెంచక తప్పదని మాజీ ఎంపీ వినోద్ కుమార్ అన్నారు. శనివారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఏపీ విభజన చట్టంలో సెక్షన్ 26లో పొందుపరిచిన విధంగా అసెంబ్లీ సీట్లు పెంచాలన్నారు. 2026లో జరగబోయే సెన్సెస్ తర్వాత మహిళా రిజర్వేషన్ అమల్లోకి వస్తుందని, దాని తర్వాత డీలిమిటేషన్ జరుగుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. జమ్మూకశ్మీర్‌లో రాష్ట్ర విభజన జరిగి కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించిన తదనంతరం జమ్మూకశ్మీర్‌లో సీట్లు పెంచారని తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో సీట్లు పెంచాలని కేసీఆర్, ఎంపీలందరం ప్రధాని నరేంద్ర మోదీని కలిశామని వినోద్ చెప్పారు. రాజ్యాంగ సవరణ చేసుకోకుండానే విభజన చట్టం సరిపోతుందని తాము ఎన్ని సార్లు చెప్పినా మోదీ ప్రభుత్వం దాన్ని పట్టించుకోలేదన్నారు.

కౌశిక్‌రెడ్డీ.. నోరు అదుపులో పెట్టుకో..

- శాట్ చైర్మన్ శివసేనారెడ్డి మండిపాటు

సాక్షి, హైదరాబాద్: పాడి కౌశిక్‌రెడ్డి రూపంలో కల్వకుంట్ల కుటుంబానికి కొత్త కుక్క దొరికిందని రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్) చైర్మన్ ఎస్.శివసేనారెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేసీఆర్ ఇంట్లో పడుకుని కొన్ని కుక్కలను రోడ్లపైకి వదులుతున్నారని, ఆ కుక్కలతో అడ్డగోలుగా మొరిగిస్తున్నారని మండిపడ్డారు. శనివారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో శివసేనారెడ్డి మాట్లాడుతూ కౌశిక్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడకపోతే సన్న బియ్యం తింటున్న రాష్ట్ర ప్రజలు ఆయన్ను ఉరికించి కొడతారని, ఎమ్మెల్యేలు, మంత్రులు ఆపినా ప్రజలు ఆగరని హెచ్చరించారు. ఫోన్ ట్యాపింగ్ చేసే కర్మ కాంగ్రెస్ పార్టీకి లేదని, హ్యాకర్లను పెట్టి ఫోన్ ట్యాపింగ్‌లు చేసింది కౌశిక్‌రెడ్డికి బిస్కెట్లు వేస్తున్న కేటీఆరేనని ఆరోపించారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సమున్నత అభివృద్ధి కోసం సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రివర్గం ఎలా పనిచేస్తుందో అందరికీ తెలుసునని శివసేనారెడ్డి వ్యాఖ్యానించారు.

కాగ్ నివేదికతో రేవంత్ సర్కార్ బండారం బట్టబయలు

- బీజేపీ అధికార ప్రతినిధి అమర్‌నాథ్

సాక్షి, హైదరాబాద్: వివిధ కేంద్ర పథకాల కింద రాష్ట్ర ప్రభుత్వ బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.2016 కోట్లను వినియోగించుకోవడంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం విఫలమైందని బీజేపీ అధికార ప్రతినిధి అమర్‌నాథ్ సారంగుల విమర్శించారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. తాజాగా రేవంత్ రెడ్డి ప్రభుత్వ బండారాన్ని కాగ్ త్రైమాసిక నివేదిక బట్టబయలు చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక వైఫల్యం, విపరీతమైన అవినీతి ఈ నివేదిక ఎత్తిచూపిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అసమర్థత వల్ల కేంద్ర పథకాల్లో రాష్ట్ర వాటా ఇవ్వనందువల్ల.. రాష్ట్ర ప్రభుత్వ ఖాతాల్లో రూ.2016 కోట్లు మూలుగుతున్నాయన్నారు. రేవంత్ రెడ్డి అవగాహనారాహిత్యం, పబ్లిక్ ఫైనాన్స్ వ్యవస్థ పనితీరు తెలియక.. కొన్ని పౌర సంస్కరణలు అమలు కాకపోవడంతో తెలంగాణకు రావాల్సిన దాదాపు రూ.40 వేల కోట్లు రాకుండా ఆగిపోతున్నాయన్నారు.

దళితుల ఆత్మాభిమానాన్ని వాడుకోకు..

- కేటీఆర్‌కు ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ హితవు



సాక్షి, హైదరాబాద్: దళితుల ఆత్మాభిమానాన్ని వాడుకుని రాజకీయం చేయడాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మానుకోవాలని ఏఐసీసీ కార్యదర్శి ఎస్.సంపత్‌కుమార్ హితవు పలికారు. ఆయన శనివారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో దళితుల అభ్యున్నతి, ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో జరిగిన అభివృద్ధిపై చర్చించేందుకు కేటీఆర్ సిద్ధమా? అని ప్రశ్నించారు. దళిత ముఖ్యమంత్రి, మూడెకరాల భూమి లాంటి వాగ్దానాలు తుంగలో తొక్కడంతో పాటు ఉప ముఖ్యమంత్రి రాజయ్యను.. ఉన్న పళంగా తొలగించి దళితులను అవమానపరిచారని ఆరోపించారు. ఇందిరమ్మ ఇచ్చిన అసైన్డ్ భూములను దళితుల నుంచి లాక్కున్న చరిత్ర బీఆర్ఎస్‌దన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్సీల వర్గీకరణ జరిగిందని చెప్పారు. రాష్ట్ర కేబినెట్‌లో నలుగురు మంత్రులున్నారని, సబ్‌ప్లాన్ కింద రూ.30 వేల కోట్లు కేటాయించారని చెప్పారు. ఇచ్చిన మాటకు కట్టుబడిన సీఎం రేవంత్ రాజ్యాంగంతో పాటు దళిత పరిరక్షుడన్నారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్లతో స్థానిక ఎన్నికలు

- మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ డిమాండ్


సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లను ఇతర వర్గాలు, మతస్తులకు కాకుండా బీసీలకే ఇవ్వాలని బీజేపీ నేత, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బీసీ రిజర్వేషన్లను అమలు చేస్తూ వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు జరిపించాలని డిమాండ్ చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ చెబుతున్న తెలంగాణ రోల్ మోడల్ కులగణన వివరాలను వెంటనే బహిర్గతం చేయాలన్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో పేర్కొన్నట్టుగా కాంట్రాక్టుల్లో 42 శాతం రిజర్వేషన్లు బీసీలకు కల్పించాలన్నారు. బీసీలు, ఈబీసీలకు కూడా 100 శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని నర్సయ్య డిమాండ్ చేశారు. ఆ విధంగా చేయని పక్షంలో ప్రతీ గ్రామం, మున్సిపాలిటీలో సీఎం రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీలకు ప్రజలు బీసీ, ఓబీసీ ద్రోహుల అవార్డులు ఇవ్వడం ఖాయమని హెచ్చరించారు. హిందూ వ్యతిరేకి రాహుల్ గాంధీ, ఓబీసీ వ్యతిరేకి రేవంత్ రెడ్డి కలసి బీసీ జపం చేస్తూనే ఒకరు దేశ విభజన కోసం, మరొకరు హిందూ విభజన కోసం కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు.

జలపాతాల పరవళ్లు



అల్లూరి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో రెండు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు జలపాతాలు పరవళ్లు తొక్కుతున్నాయి. భారీగా వరదనీరు చేరడంతో కొత్తపల్లి జలపాతం, గుర్రాయి, ఎగకంఠవరం వద్ద అక్కా చెల్లెల జలపాతం, కుంబిడిసింగి, వసమామిడి వద్ద జలపాతాలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. - జి.మాడుగుల

రాములోరి చెంత ప్రకృతి పులకింత



విజయనగరం జిల్లా రామతీర్థంలోని బోడికొండపైకి ఎక్కేవారికి ప్రకృతి అందాలు మైమరిపిస్తున్నాయి. ఓ వైపు దట్టమైన పొదలతో కూడిన కొండలు... మరోవైపు కనుచూపు మేర పచ్చని పొలాలు.. పుడమికి పచ్చబొట్టు పెట్టేలా ఉభాలకు సిద్ధంగా ఉన్న నారుమళ్లు.. కొత్త అనుభూతిని పంచుతున్నాయి. - సాక్షిఫొటోగ్రాఫర్, విజయనగరం

'పశ్చిమ'లో జలపాతాల సోయగం



ఉప్పరిల్ల సమీపంలో ఆకట్టుకుంటున్న జలపాతం



ముంజులూరు సమీపంలో ఉన్న ఏనుగుతోగు జలపాతం



పాపికొండల అభయారణ్యంలో ఉన్న జలతారు వాగు

గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పశ్చిమ గోదావరి జిల్లా ఏజెన్సీ ప్రాంతంలోని జలపాతాలు కనువిందు చేస్తున్నాయి. బుట్టాయగూడెం మండలం అటవీప్రాంతంలో ఉన్న ఉప్పరిల్ల జలపాతం, ముంజులూరు సమీపంలో ఉన్న ఏనుగుతోగు జలపాతం, పాపికొండల అభయారణ్యంలో ఉన్న జలతారు వాగు పొంగిపొర్లుతున్నాయి. - బుట్టాయగూడెం

క్లుప్తంగా...

కరెన్సీ నోటుపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాల్సిందే

ప్రధాని మోదీకి సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా పోస్ట్ కార్డ్

సాక్షి, న్యూఢిల్లీ: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫొటోను కరెన్సీ నోట్లపై ముద్రించాల్సిందేనని సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా డిమాండ్ చేశారు. ఈమేరకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి పోస్ట్ కార్డును పంపారు. 'కరెన్సీపై అంబేడ్కర్ సాధన సమితి' జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జేరిపోతుల పరశురామ్ శనివారం ఢిల్లీలో రాజాను కలిశారు. ఆరు నెలల వ్యవధిలో కరెన్సీపై అంబేడ్కర్ ఫొటోను ముద్రించాలనే డిమాండ్‌తో లక్ష పోస్టు కార్డులను ప్రధానికి రాస్తున్నట్లు పరుశురామ్ తెలిపారు. ఈ ఉద్యమానికి డి.రాజా మద్దతు పలికారు. ఆగస్టు 4న జరిగే సీపీఐ జాతీయ కమిటీ సమావేశంలో ఈ అంశంపై చర్చించి, తీర్మానించి రాజ్యసభకు పంపిస్తామని డి.రాజా తెలిపారు.

భక్తులతో కిటకిటలాడిన శ్రీవారి ఆలయం



ద్వారకాతిరుమల: ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలో శ్రీవారి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారికి ప్రీతికరమైనరోజు, అందులోనూ గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం తగ్గడంతో వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. దాంతో క్షేత్ర పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతం, అనివేటి మండపం, వైకుంఠం క్యూకాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కల్యాణకట్ట, ఉచిత ప్రసాద వితరణ క్యూలైన్లు, నిత్యాన్నదాన విభాగాలు భక్తులతో పోటెత్తాయి. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని వేదికపై ఎన్‌టీఆర్ జిల్లా, మునగపాడు గ్రామానికి చెందిన శ్రీ రామాంజనేయ భజన భక్త సమాజం సభ్యులు నిర్వహించిన భజనలు భక్తులను అలరించాయి. సాయంత్రం వరకు క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది.

పారిజాతగిరిలో మార్మోగిన గోవింద నామస్మరణ



జంగారెడ్డిగూడెం: ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలోని గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీ వేంకటేశ్వరస్వామి క్షేత్రం భక్తుల గోవింద నామ స్మరణలతో పులకించింది. దేవస్థానంలో పారిజాత గిరి కొండ చుట్టూ నిర్మించిన ప్రదక్షిణ మార్గాన్ని శ్రీశ్రీశ్రీ త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి విశేష భక్త జన సందోహం మధ్య శనివారం ప్రారంభించారు. భక్తులు పెద్ద ఎత్తున గిరి ప్రదక్షిణలో పాల్గొని స్వామివారిని దర్శించారు. ప్రధానార్చకులు నల్లూరి రవికుమారాచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఏర్పాట్లను అభివృద్ధి కమిటీ సహకారంతో ఆలయ ఈవో కలగర శ్రీనివాస్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్, గిరి ప్రదక్షిణ మార్గమునకు ఆర్థిక సహకారం అందజేసిన మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తదితర ప్రముఖులు పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు జెట్టి గురునాథరావు, పార్టీ మండల, పట్టణ నాయకులు, కార్యకర్తలు గిరిప్రదక్షిణ చేశారు.

అప్పు.. వడ్డీతో ముప్పు!



పేదలను పీడిస్తోన్న వ్యాపారులు

- ధర్మవరానికి చెందిన రమణ, భారతి దంపతులు వ్యక్తిగత అవసరం నిమిత్తం ఎర్రగుంటకు చెందిన రాజాతో రూ.6 లక్షలు అప్పుగా తీసుకున్నారు. ఇందుకుగాను రూ.100కు రూ.10 చొప్పున వడ్డీ చెల్లించాలని చెప్పడంతో... అప్పుడున్న అవసరం మేరకు రమణ ఒప్పుకున్నారు. ప్రతి నెలా వడ్డీ రూపంలోనే రూ.60 వేలు చెల్లించేవాడు. అయితే ఆర్థిక ఇబ్బందులతో మూడు నెలలుగా వడ్డీ చెల్లించలేకపోయాడు. దీంతో వడ్డీవ్యాపారి రాజా మనుషులను వెంట బెట్టుకుని వచ్చి రమణ, భారతి ఇంటికి వెళ్లి వారిపై దాడి చేశాడు. బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఇలాంటి ఘటనలు ధర్మవరంలో రోజూ కనీసం ఒకటైనా వెలుగుచూస్తోంది.
- హిందూపురానికి చెందిన రాజ తన అవసరాల నిమిత్తం రూ.10 వడ్డీతో రూ.10 లక్షలు అప్పు చేశాడు. వ్యాపారంలో నష్టం రావడంతో వడ్డీ సైతం చెల్లించలేకపోయాడు. దీంతో సదరు వడ్డీ వ్యాపారి ఇల్లు రాసివ్వాలని ఒత్తిడి చేశాడు. ఇల్లు తన పేరుపై లేదని రాజా చెప్పడంతో అతన్ని కిడ్నాప్ చేశాడు. దీంతో రాజా కుటుంబీకులు అప్పటికప్పుడు రూ.2 లక్షలు వడ్డీ వ్యాపారికి చెల్లించి రాజాను విడిపించాడు. ఈ ఘటన తర్వాత రాజా కుటుంబం హిందూపురం వదిలి వెళ్లిపోయింది.
- పుట్టపర్తిలోని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వద్ద ఓ వ్యక్తి తన వ్యాపారం నిమిత్తం అప్పులు చేశాడు. సకాలంలో రుణాలు చెల్లించలేక.. రుణదాతల ఒత్తిళ్లు తట్టుకోలేక ఇల్లు విక్రయించాలనుకున్నాడు. అయితే రుణదాతల్లోని కొందరు రూ.2.5 కోట్లకు ఆ ఇంటిని కొనేందుకు సిద్ధమయ్యారు. కానీ వారికి రావాల్సిన డబ్బుకు అధిక వడ్డీలు లెక్కగట్టి బలవంతంగా ఇంటిని ఆక్రమించాలని చూశారు. దీంతో సదరు వ్యాపారి అడ్డం తిరిగాడు. ప్రస్తుతం ఈ వివాదం కోర్టులో నడుస్తోంది.

- అవసరాన్ని బట్టి మారుతున్న వడ్డీ
- నూటికి వారానికే రూ.10 చొప్పున వసూలు
- ధర్మవరం, హిందూపురంలో తిష్టవేసిన మాఫియా
- సకాలంలో వడ్డీ చెల్లించని వారిపై భౌతిక దాడులు
- ఇళ్ల వద్దకు వెళ్లి బూతు పురాణాలు
- అవమానంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్న బాధితులు

సాక్షి, పుట్టపర్తి: మనిషి మానవత్వం మరచి 'మనీ'షిగా మారిపోయాడు. డబ్బుకోసం ఎంతకైనా దిగజారుతున్నాడు. కొందరైతే ఇతరుల అవసరాలతోనే వ్యాపారం చేస్తున్నారు. వడ్డీ వ్యాపారుల అవతారం ఎత్తి జనాన్ని జలగల్లా పీడిస్తున్నారు. ఇటీవల వడ్డీ వ్యాపారుల ఆగడాలు మరింత పెరిగిపోయాయి. అప్పుకోసం వచ్చిన వారి పరిస్థితిని బట్టి వడ్డీ నూటికి రూ.10 నుంచి రూ.30 వరకూ వెళ్లిపోతోంది. అత్యవసరంలో వడ్డీ గురించి ఆలోచించని జనం ఆ తర్వాత అసలుకు మించి వడ్డీలు చెల్లిస్తూ అల్లాడిపోతున్నారు. ఆ తర్వాత కళ్లుతెరిచి ప్రశ్నించినా... వడ్డీ వ్యాపారులు దాడులకు దిగుతున్నారు.

ఆత్మహత్యలకు తెగిస్తున్న బాధితులు

గతంలో ఎవరైనా అప్పు చేస్తే ఏడాది తర్వాత అసలు, వడ్డీ చెల్లించేవారు. అది కూడా నూటికి రూ.2 మించి ఉండేది కాదు.. కానీ ఇప్పుడు వడ్డీ వ్యాపారం చాలా మారిపోయింది. అప్పు కోసం వచ్చిన వారి అవసరాన్ని ఆసరాగా చేసుకుని వారానికే నూటికి రూ.10 నుంచి రూ.20 వరకూ వసూలు చేస్తున్నారు. ఈ లెక్కన లక్ష అప్పు తీసుకున్న వ్యక్తి వడ్డీ రూపంలోనే వారానికి రూ.10 వేలు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ వడ్డీ వ్యాపారం దందా సత్యసాయి జిల్లా కదిరి, హిందూపురం, పుట్టపర్తి, ధర్మవరంలో జోరుగా సాగుతున్నట్లు తెలుస్తోంది. ఒక్కవారం వడ్డీ చెల్లించపోయినా వడ్డీ వ్యాపారులు ఇళ్ల వద్దకు వచ్చి అవమానకరంగా మాట్లాడటం.. భౌతిక దాడులు చేయడం పరిపాటిగా మారిపోయింది. అంతేకాకుండా ఇల్లు, వాహనం, ఆస్తులు రాసిచ్చేయాలంటూ డిమాండ్ చేస్తున్నారు. దీంతో అప్పులు చెల్లించలేక.. ఆస్తులు అప్పజెప్పలేక బాధితులు అవమాన భారంతో ఆత్మహత్యలకు తెగిస్తున్నారు.

సిండికేటు మాఫియా

వడ్డీ వ్యాపారులు సిండికేటుగా మారి.. ఎంత శాతం వసూలు చేయాలనే దానిపై నిత్యం చర్చించుకుంటున్నట్లు తెలిసింది. అధిక వడ్డీ వసూలు చేయడంతో పాటు నిత్యం పట్టి పీడిస్తుండటం.. సకాలంలో వడ్డీ ఇవ్వకపోతే ఆస్తులు రాయించుకోవడం.. వాహనాలు తీసుకెళ్లడం.. బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టుకోవడం చేస్తున్నారు. ఎలాంటి ఆస్తులు లేనివారిపై దాడులకు దిగి.. బెదిరిస్తున్నారు. వారిని నియంత్రించాల్సిన వ్యవస్థ నిద్రావస్థలో ఉండటంతో వడ్డీ వ్యాపారుల దుర్మార్గానికి అంతేలేకుండా పోయింది.

పట్టించుకోని పోలీసులు

అధిక వడ్డీతో పేదలను పట్టి పీడిస్తున్న మాఫియాపై పదే పదే ఫిర్యాదులు అందినా.. పోలీసులు పట్టించుకోవడం లేదు. వడ్డీ వ్యాపారుల వద్ద నెల మామూళ్లు తీసుకుంటూ వారికి ఇబ్బందులు కలగకుండా చూస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అప్పు ప్రతి ఒక్కరికీ అవసరమే.. అయితే వడ్డీ ఎంత ఉండాలనే దానిపై పరిమితి లేకుండా పోయింది. పైగా నెలవారీ వడ్డీ స్థానంలో వారం వడ్డీ, రోజువారీ వడ్డీ ఇవ్వాలని బెదిరిస్తున్నా అడిగేవారు లేకుండా పోయారు.

కఠిన చర్యలు తీసుకుంటాం



రిజిష్టర్ చేసుకున్న దుకాణాల్లో మాత్రమే వడ్డీ వ్యాపారం జరగాలి. అవసరాల నిమిత్తం ప్రామిసరీ నోట్ల ద్వారా రూ.100కు నెలకు రూ.2 చొప్పున వడ్డీ చెల్లింపు విధానం మంచిదే. కానీ వారానికి నూటికి రూ.10 చొప్పున వడ్డీ వసూలు చేయడం చట్టరీత్యా నేరం. అప్పు చెల్లింపు విషయాల్లో దాడులకు తెగబడితే సహించేది లేదు. బాధితులు నిర్భయంగా ఫిర్యాదు చేయవచ్చు. అధిక వడ్డీలు వసూలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

- వి.రత్న, సత్యసాయి జిల్లా ఎస్పీ

విద్యార్థులకు నీటిమోత




గిద్దలూరు రూరల్: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలపై పర్యవేక్షణ పూర్తిగా కరువైంది. ప్రకాశం జిల్లా గిద్దలూరు పట్టణంలోని రాజానగర్‌లోని సెయింట్‌పాల్స్ ప్రైమరీ ఎయిడెడ్ స్కూల్‌లోని ఉపాధ్యాయులు విద్యార్థులను శనివారం మినరల్ వాటర్ కోసం విద్యార్థులకు బిందె ఇచ్చి బయటకు పంపారు. దీంతో ఒక విద్యార్థి మోయలేక మరో విద్యార్థిని తోడుగా తెచ్చుకున్నాడు. అలా ఒకరి తరువాత ఒకరు వంతుల ప్రకారం మోసుకుంటూ పాఠశాలకు తీసుకెళ్లారు. అక్కడి ఉపాధ్యాయులు ముగ్గురు ఉండగా ఎప్పుడూ ఇద్దరే ఉంటున్నారని, ఒకరు బయట ఎక్కువగా తిరుగుతుంటారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థుల దగ్గర ఉండాల్సి ఉండగా.. వారు మాత్రం తినేందుకు ఇళ్లకు వెళుతున్నారు.

కారు కాలువలో పడి విద్యార్థి మృతి

అమర్తలూరు (వేమూరు) : కారు అదుపు తప్పి కాలువలో పడిన ఘటనలో జుపూడి పవన్ (18) అనే విద్యార్థి మృతి చెందాడు. ఆరుగురు గాయపడ్డారు. ఎస్.ఐ రవితేజ కథనం మేరకు విజయవాడలో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చదువుతున్న ఏడుగురు విద్యార్థులు శనివారం అద్దెకు తీసుకున్న కారులో ఒంగోలులోని జూపూడి పవన్ ఇంటికి వెళ్లారు. తిరిగి బాపట్ల బీచ్ చూసుకుని విజయవాడ బయల్దేరారు. ఈ క్రమంలో గుంటూరు జిల్లా అమర్తలూరు మండలం ప్యాపర్రు, యలవర్రు రోడ్డు వద్దకువచ్చేసరికి కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టి కాలువలో పడి పోయింది. కారులో ఉన్న విద్యార్థులు అద్దాలు పగలు కొట్టుకొని బయటకు వచ్చారు. అప్పటికి కారులో పవన్ మృతి చెందాడు. మిగిలిన ఆరుగురికి గాయాలయ్యాయి. వీరంతా విజయవాడ నగరానికి చెందిన విద్యార్థులని ఎస్ఐ తెలిపారు. పవన్ తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

అధికారంలో ఉన్నాం... తమకు ఎదురు లేదనుకున్నాడో ఏమో ఓ పచ్చ నేత బరితెగించాడు.ప్రభుత్వ భూమిని కొట్టేసేందుకు పన్నాగం పన్నాడు. సెంటు, రెండు సెంట్లు కాదు ఏకంగా రూ. 5 కోట్లకు పైగా విలువ చేసే 3.80 ఎకరాలను కబ్జా చేసేందుకు యత్నించాడు. మొన్నటిదాకా ఎలాంటి అనుమతులు లేకుండా, ఎమ్మెల్యే పరిటాల సునీత కుటుంబ సభ్యుల పేరు చెప్పుకుంటూ ఎర్రమట్టిని యథేచ్ఛగా తరలించి 'క్యాష్' చేసుకున్న ఈయన... తాజాగా ప్రభుత్వ భూమిపై కన్నేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

ప్రభుత్వ భూమిపై పచ్చగద్ద



జగనన్నకాలనీకి కేటాయించిన భూమిని అక్రమంగా చదును చేసిన దృశ్యం

- రూ. 5 కోట్లకు పైగా విలువ చేసే ప్రభుత్వ భూమిపై టీడీపీ నేత కన్ను
- గత ప్రభుత్వంలో జగనన్న కాలనీకి కేటాయించిన భూమి కబ్జాకు యత్నం
- నాలుగు రోజుల క్రితం ట్రాక్టర్‌తో దున్నుతుండగా అధికారుల అడ్డగింత
- భూమిలోకి అడుగుపెడితే క్రిమినల్ కేసు నమోదు చేస్తామని హెచ్చరిక

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కృష్ణంరెడ్డిపల్లి గ్రామ సమీపంలోని కందుకూరు పొలం 90-3 సర్వే నంబరులో 3.86 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. గతంలో తహసీల్దార్ కార్యాలయంలో పని చేసిన ఓ అధికారి తన బినామీ పేరుతో 3.86 ఎకరాలకు నకిలీ 'మిల్ట్రీ' పట్టా తయారు చేయించి రికార్డుల్లోకి ఎక్కించాడు. ఎవరి పేరుమీద పట్టా ఉందో ఆ వ్యక్తి ఇప్పటిదాకా తహసీల్దార్ కార్యాలయానికి కానీ, ఈ భూమివైపు కానీ తొంగిచూడలేదు. దీంతో పట్టా రద్దుకు గత ప్రభుత్వంలో సిఫార్సు చేశారు. అలాగే, కృష్ణంరెడ్డిపల్లికి చెందిన పేదలకు ఇంటి పట్టాల కోసం ఈ భూమిలో ఎకరన్నర భూమిని 'జగనన్న కాలనీ'కి కేటాయించారు. 48 మంది లబ్ధిదారులకు ప్లాట్లు కేటాయించేలా స్కెచ్ కూడా తయారు చేశారు. లబ్ధిదారులను ఎంపిక చేసి పట్టాలు తయారు చేసే క్రమంలో ఎన్నికలు రావడంతో ప్రక్రియ ఆగిపోయింది.



కృష్ణంరెడ్డిపల్లి సమీపంలో చదును చేస్తున్న భూమిని అడ్డుకుని విచారిస్తున్న తహసీల్దార్

కూటమి ప్రభుత్వంలో పచ్చ నేత కన్ను..

ప్రభుత్వం మారగానే కృష్ణంరెడ్డిపల్లికి చెందిన ఓ చోటా నేత ఈ భూమిపై కన్నేసి కబ్జా చేసేందుకు పూనుకున్నాడు. నాలుగు రోజుల క్రితం ట్రాక్టర్‌తో దున్ని చదునుచేసేందుకు వెళ్లాడు. ట్రాక్టర్‌తో అర ఎకరా వరకు దున్నాడు. ఇంతలో సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు వెళ్లి అడ్డుకున్నారు. భూమి తమదేనంటూ పచ్చ నేత బుకాయించే ప్రయత్నం చేశాడు. అధికారులు తిరగబడడంతో మెత్తబడ్డాడు. ఇది పూర్తిగా ప్రభుత్వ భూమి, ఎవరైనా అక్రమంగా ప్రవేశిస్తే సీరియస్‌గా పరిగణిస్తామని హెచ్చరించారు.

కుప్పలుగా నకిలీ పట్టాలు..

గతంలో కొందరు రెవెన్యూ అధికారులు కాసులకు కక్కుర్తి పడి 'మిల్ట్రీ' పట్టాల పేరుతో పెద్ద ఎత్తున దందా చేశారు. 'మిల్ట్రీ' పట్టాల పంపిణీలో కనీస నిబంధనలు పాటించలేదు. ఎవరో ఒకరిమీద.. అదికూడా పదేళ్ల కిందటే మిల్ట్రీ పట్టా పుట్టించి వాటిని రికార్డుల్లోకి ఎక్కించేందుకు కొందరు బాగా సహకరించారు.పదేళ్లు పూర్తికావడంతో వారి నుంచి మరొకరు కొనుగోలు చేసినట్లు రిజిస్ట్రేషన్ చేయించుకుని అమ్మకాలకు తెర తీశారు. ఈ ముసుగులో కోట్లాది రూపాయలు కొల్లగొట్టారు. అనంతపురం రూరల్ మండలం కురుగుంట, ఉప్పరపల్లి, కందుకూరు, కొడిమి, ఎ.నారాయణపురం సర్వే నంబర్లలో నకిలీ పట్టాదారులు ఎక్కువగా ఉన్నారు. మాజీ సైనికులకు ప్రభుత్వ భూమి కేటాయించాలంటే ముందుగా సైనిక సంక్షేమశాఖ నుంచి పేర్లు కలెక్టర్‌కు సిఫార్సు చేయాలి. కలెక్టర్ పరిశీలించి సంబంధిత మండలాల తహసీల్దార్లను ఆదేశిస్తారు. వారు తమ పరిధిలో ప్రభుత్వ భూములను గుర్తించి తిరిగి కలెక్టర్‌కు.. అక్కడి నుంచి సైనిక సంక్షేమశాఖ అధికారులకు పంపుతారు. ఆ తర్వాత కలెక్టర్ ఆదేశాల మేరకు భూములను అర్హులైన మాజీ సైనికులకు 'అసైన్డ్' చేస్తారు. అయితే ఈ ప్రక్రియ ఎక్కడా లేకుండానే కొందరు ఘనులు పట్టాలిచ్చారు. 'మిల్ట్రీ' పట్టా భూములపై లోతుగా విచారణ జరిపితే అక్రమాలు కోకొల్లలుగా వెలుగులోకి వస్తాయని స్వయంగా రెవెన్యూ అధికారులు చెబుతుండడం గమనార్హం.

ఉరవకొండలో బరితెగింపు

ఉరవకొండ: అధికార అండ చూసుకుని తమ్ముళ్లు బరి తెగిస్తున్నారు. ఖాళీ జాగా కనిపిస్తే చాలు పాగా వేస్తున్నారు. ఉరవకొండ పట్టణంలో రూ.లక్షలు విలువ చేసే 20 సెంట్ల ప్రభుత్వ భూమిలో రాత్రికే రాత్రే జేసీబీల సాయంతో చదును చేసి పసుపు రంగు రాళ్లు పాతడం చర్చనీయాంశంగా మారింది. వివరాలు.. ఉరవకొండ శివరామిరెడ్డి కాలనీలోని సర్వే నం. 552లో 2023లో పేదలకు పట్టాలు ఇచ్చారు. ఇంకా కొంత స్థలం ఖాళీగా ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చాక స్థానిక టీడీపీ నాయకులు ఈ స్థలంపై కన్నేశారు. నకిలీ పట్టాలు సృష్టించుకుని ఇటీవల అందులోకి చొరబడ్డారు. హద్దుల రాళ్లు పాతి వాటికి పసుపు రంగు కొట్టారు. గతంలో ఉరవకొండ పట్టణానికి చెందిన ఓ ప్రయివేట్ సర్వేయర్ సాయంతో నకిలీ పట్టాలు సృష్టించినట్లు తెలుస్తోంది. గతంలో శివరామిరెడ్డి కాలనీలోనే సదరు సర్వేయర్ అనేక నకిలీ పట్టాలు తయారు చేసి లక్షలాది రూపాయలు దోచుకున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంపై రెవెన్యూ అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది.



ప్రభుత్వ భూమిని చదును చేసి పసుపు రాళ్లు పాతిన టీడీపీ నేతలు

ఆయనకు ఏమాత్రం సంబంధం లేదు

కృష్ణంరెడ్డిపల్లి సమీపంలో 90-3 సర్వే నంబరులోని ప్రభుత్వ భూమిని చదును చేస్తున్నారనే సమాచారంతో వెళ్లి పరిశీలించాం. అది పూర్తిగా ప్రభుత్వ భూమే. చదును చేస్తున్న వ్యక్తికి, ఆ భూమికి ఏమాత్రం సంబంధం లేదు. వెంటనే ట్రాక్టర్ తీసుకుని భూమిలో నుంచి బయటకు పంపించాం. ఫారం-1,2 నోటీసులు జారీ చేశాం. మళ్లీ భూమిలో కనిపిస్తే ట్రాక్టర్‌ను సీజ్ చేయడంతో పాటు వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయిస్తాం.

- మోహన్‌కుమార్, తహసీల్దార్, అనంతపురం రూరల్ మండలం


ప్రభాస్


ఎన్టీఆర్

దేశ సరిహద్దుల్లో సైనికుల్లా, దేశంలో గూఢచారులుగా, ప్రభుత్వ నిఘా సంస్థల ప్రతినిధులుగా... ఇలా దేశం కోసం అహర్నిశలూ కష్టపడుతున్నవారు చాలామంది ఉన్నారు. ఇటీవల భారత ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' ఘటన ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ తరుణంలో దేశభక్తిని చాటే కొన్ని సినిమాలు ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమౌతున్నాయి. ఇలా 'మేరా భారత్ మహాన్' అంటూ దేశభక్తిని చాటి చెప్పేలా కొందరు హీరోలు చేస్తున్న సినిమాలపై ఓ లుక్ వేద్దాం.

మేరా భారత్ మహాన్

● దేశభక్తి నేపథ్యంలో సినిమాలు చేస్తున్న స్టార్ హీరోలు

ప్రభాస్ ఫౌజీ

వెండితెరపై ప్రభాస్ తొలిసారిగా సైనికుడిగా కనిపించనున్నారు. ప్రభాస్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో ఓ సినిమా రానున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి 'ఫౌజీ' అనే టైటిల్‌ను అనుకుంటున్నారట. ఈ సినిమా మిలటరీ వార్ బ్యాక్‌డ్రాప్‌లో ఉంటుందని, ఇందులో ప్రభాస్ సైనికుడిగా కనిపిస్తారని తెలిసింది. అలాగే కొంత లవ్‌స్టోరీ కూడా ఉంటుంది. అయితే ఈ సినిమాలోని వార్ సన్నివేశాల్లో ప్రభాస్ ఇంటెన్స్ యాక్షన్ సీక్వెన్స్‌లు సూపర్‌గా ఉంటాయని, ఈ సన్నివేశాల కోసం ప్రభాస్ కొత్తగా మేకోవర్ అయ్యారని సమాచారం. ఇమాన్వీ ఇస్మాయిల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో మిథున్ చక్రవర్తి, జయప్రద, అనుపమ్ ఖేర్ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. 2026 ద్వితీయార్ధంలో ఈ సినిమా రిలీజ్ అయ్యే అవకాశం ఉంది.

డ్రాగన్‌లో దేశభక్తి

హీరో ఎన్టీఆర్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో 'డ్రాగన్' అనే చిత్రం రూపొందుతోంది. ఇది ఓ పీరియాడికల్ యాక్షన్ గ్యాంగ్‌స్టర్ డ్రామా అనే ప్రచారం సాగింది. కానీ ఇటీవల జరిగిన ఈ సినిమా చిత్రీకరణలో వందేమాతరం అంటూ వందలమంది జూనియర్ ఆర్టిస్టులు చెబుతుంటే, ఓ భారీ పాటను చిత్రీకరించారట. 'వందేమాతరం' అంటూ సాగే ఈ పాట స్క్రీన్‌పై కనిపించే సమయంలో సూపర్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఇచ్చారట ఈ చిత్రం మ్యూజిక్ డైరెక్టర్ రవి బస్రూర్. దీంతో ఈ 'డ్రాగన్' సినిమాలో కొన్ని దేశభక్తి అంశాలకు చెందిన సన్నివేశాలు కూడా ఉన్నాయని తెలుస్తోంది. రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో మలయాళ నటుడు టోవినో థామస్ విలన్‌గా నటిస్తారనే ప్రచారం సాగుతోంది. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ సినిమా 2026 జూన్ 25న విడుదల కానుంది.

బ్యాటిల్ ఆఫ్ గాల్వాన్

'టైగర్ జిందా హై, ఏక్తా టైగర్, టైగర్ 3' వంటి స్పై యాక్షన్ సినిమాల్లో 'రా' (రీసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్) ఆఫీసర్‌గా నటించి, మెప్పించారు సల్మాన్ ఖాన్. తాజాగా 'బ్యాటిల్ ఆఫ్ గాల్వాన్' సినిమాలో సల్మాన్ ఖాన్ ఆర్మీ ఆఫీసర్ పాత్రలో నటించనున్నారు. 2020లో గాల్వాన్ లోయలో భారత్–చైనా సైనికుల మధ్య జరిగిన యుద్ధం, నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కనుంది. ఈ మూవీలో చిత్రాంగదా సింగ్ మరో లీడ్ రోల్ చేయనున్నారు. సల్మాన్ ఖాన్ ఫిలింస్ బ్యానర్‌పై అపూర్వ లఖియా దర్శకత్వం వహించనున్న ఈ సినిమా చిత్రీకరణ వచ్చే నెల మొదటి వారంలో ప్రారంభం కానుంది. ప్రస్తుతం తాను పోషించే ఆర్మీ ఆఫీసర్ పాత్ర కోసం సల్మాన్ ఖాన్ ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నారు. డైలీ కసరత్తులు చేస్తున్నారు. ఇక ఈ 'బ్యాటిల్ ఆఫ్ గాల్వాన్' సినిమా కోసం లడఖ్‌లో ఓ భారీ షూటింగ్ షెడ్యూల్ ప్లాన్ చేశామని, గడ్డకట్టే చలిలో అక్కడ ఏడెనిమిది రోజులు లోయలో షూటింగ్ చేస్తామని, ఈ షెడ్యూల్‌ను తలచుకుంటే తనకు భయంగా ఉందని, కానీ తాను సిద్ధమౌతున్నానని సల్మాన్ ఖాన్ ఇటీవల ఈ 'బ్యాటిల్ ఆఫ్ గాల్వాన్' సినిమా ప్రయాణం గురించి చెప్పారు. వీలైనంత త్వరగా ఈ సినిమా షూటింగ్‌ను పూర్తి చేసి, వచ్చే గణతంత్ర దినోత్సవం సందర్భంగా రిలీజ్ చేయాలని సల్మాన్ ఖాన్ భావిస్తున్నారట. ఒకవేళ ఇది కుదరకపోతే వచ్చే రంజాన్‌కు విడుదల చేయాలని సల్మాన్ ఆలోచిస్తున్నారని బాలీవుడ్ సమాచారం.

భజరంగీ భాయిజాన్ 2: పది సంవత్సరాల క్రితం సల్మాన్ ఖాన్ నటించిన 'భజరంగీ భాయిజాన్' సినిమా మంచి ఎమోషనల్ థ్రిల్లర్‌గా విజయం సాధించింది. విజయేంద్ర ప్రసాద్ ఈ సినిమాకు కథ అందించగా, కబీర్ ఖాన్ దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో కొన్ని దేశభక్తి అంశాలు కూడా ఉన్నాయి. కాగా 'భజరంగీ భాయిజాన్' సినిమాకు సీక్వెల్ తీసే ఆలోచనలో ఉన్నామని, వచ్చే ఏడాది ఈ సీక్వెల్ సెట్స్ పైకి వెళ్లే అవకాశాలు ఉన్నాయని ఇటీవల ఓ సందర్భంలో కబీర్ ఖాన్ పేర్కొన్నారు. కరీనా కపూర్ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో హర్షాలీ మల్హోత్రా, నవాజుద్దీన్ సిద్ధిఖీ ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు.

మేజర్ షైతాన్ సింగ్

భారతదేశ సైనికుల వీరత్వాన్ని, ధైర్యాన్ని మరోసారి సిల్వర్ స్క్రీన్‌పై చూపించేందుకు రెడీ అయ్యారు బాలీవుడ్ దర్శక–నటుడు ఫర్హాన్ అక్తర్. 1962లో ఇండియా–చైనాల మధ్య యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో 'రెజాంగ్ లా' పోరాట ఘట్టం ముఖ్యమైనదిగా చెప్పుకుంటారు. ఈ ఘటన ప్రధానాంశంగా బాలీవుడ్‌లో రూపొందుతున్న చిత్రం '120 బహాదుర్'. ఈ సినిమాలో ఇండియా–చైనా యుద్ధానికి నాయకత్వం వహించిన మేజర్ షైతాన్ సింగ్‌గా ఫర్హాన్ అక్తర్ నటిస్తున్నారు. రజనీష్ ఘాయ్ ఈ సినిమాకు దర్శకుడు. గత ఏడాది సెప్టెంబరులో ఈ సినిమాను ప్రకటించారు. "1962లో జరిగిన ఇండియా–చైనా వార్‌లో ముఖ్యమైనదిగా గుర్తింపు పొందిన 'రెజాంగ్ లా' యుద్ధాన్ని ఈ '120 బహాదుర్' చిత్రంలో ఆడియన్స్ చూడబోతున్నారు. ఇది మన సైనికుల వీరత్వం, ధైర్యాన్ని చాటి చెప్పే మరో కథ" అని పేర్కొన్నారు ఫర్హాన్ అక్తర్. ఈ సినిమాను ఈ ఏడాది నవంబరు 21న రిలీజ్ చేయనున్నట్లుగా గతంలో మేకర్స్ ప్రకటించారు.


ఫర్హాన్ అక్తర్


సల్మాన్ ఖాన్

సైనికుడి వాగ్దానం

సన్నీ డియోల్ హీరోగా నటించిన వార్ డ్రామా 'బోర్డర్ (1997)'. 1971లో జరిగిన ఇండియా–పాకిస్తాన్ యుద్ధం నేపథ్యంలో రూపొందిన ఈ సినిమాకు సీక్వెల్‌గా 'బోర్డర్ 2' రానుంది. 'బోర్డర్' సినిమాలో హీరోగా నటించిన సన్నీ డియోల్ ఈ 'బోర్డర్ 2'లోనూ హీరోగా నటిస్తున్నారు. వరుణ్ ధావన్, అహాన్ శెట్టి, దిల్జీత్ సింగ్ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. భారతీయ సైనికుల వీరత్వం, ధైర్య సాహసాల నేపథ్యంలో ఈ సినిమా రూపొందుతోంది. భూషణ్ కుమార్, క్రిషణ్ కుమార్, జేపీ దత్తా, నిధి దత్తా ఈ సినిమాను నిర్మిస్తుండగా, అనురాగ్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. నార్త్ ఇండియాలోని ప్రముఖ లొకేషన్స్‌తో పాటు కశ్మీర్‌లోనూ ఈ సినిమాను చిత్రీకరిస్తున్నారు. "ఒక సైనికుడు తన వాగ్దానాన్ని నెరవేర్చుకోవడం కోసం 27 ఏళ్ల తర్వాత తిరిగి వస్తున్నాడు. ఇండియన్ సినిమా చరిత్రలోనే ఓ పెద్ద వార్ ఫిల్మ్ ఇది" అని చిత్రయూనిట్ ఈ 'బోర్డర్ 2' సినిమా గురించి ఓ సందర్భంలో పేర్కొంది. వచ్చే గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ సినిమాను జనవరి 23న రిలీజ్ చేయనున్నట్లుగా గతంలో చిత్రయూనిట్ ప్రకటించింది.


నిఖిల్


సన్నీ డియోల్

ఆపరేషన్ ఖుక్రీ

పాతిక సంవత్సరాల క్రితం వెస్ట్ ఆఫ్రికాలోని సియోర్రా లియోన్‌లో జరిగిన ఆపరేషన్ ఖుక్రీ సంఘటన ఆధారంగా ఓ సినిమా రానుంది. యునైటెడ్ నేషన్స్ (ఐక్య రాజ్యసమితి) పీస్ కీపింగ్ మిషన్స్‌లో భాగంగా వెస్ట్ ఆఫ్రికాకు వెళ్లిన 233 మంది భారత సైనికులు, అక్కడి రెబల్స్ ట్రాప్‌లో చిక్కుకుని, 75 రోజుల పాటు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సైనికుల రెస్క్యూ ఆపరేషన్‌ను రాజ్‌పాల్ పునియా సక్సెస్‌ఫుల్‌గా లీడ్ చేశారు. ఈ సంఘటనల నేపథ్యంలో చోటు చేసుకున్న పరిస్థితులు, రాజ్‌పాల్ సాహసోపేతమైన నిర్ణయాలు వంటి అంశాల ఆధారంగా 'ఆపరేషన్ ఖుక్రీ' అనే సినిమా రానుంది. 'ఆపరేషన్ ఖుక్రీ: ద అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ ది ఇండియన్ ఆర్మీస్ బ్రేవెస్ట్ పీస్ కీపింగ్ మిషన్ అబ్రాడ్' అనే పుస్తకం ఆధారంగా ఈ సినిమా రానుంది. మేజర్ జనరల్ రాజ్‌పాల్ పునియా, దామిని పునియా ఈ పుస్తకాన్ని రాయగా, ఈ బుక్ హక్కులను రాహుల్ మిత్రా ఫిల్మ్స్, రణ్‌దీప్ హుడా ఫిల్మ్స్ సంస్థలు దక్కించుకున్నాయి. ఈ పుస్తకం ఆధారంగా 'ఆపరేషన్ ఖుక్రీ' రానుంది. ఈ సినిమాలో మేజర్ రాజ్‌పాల్ పునియాగా రణ్‌దీప్ హుడా నటిస్తారు. అతి త్వరలోనే ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభం కానుంది.

స్వాతంత్ర్యానికి పూర్వం...

భారతదేశానికి స్వాతంత్ర్యం రాక ముందు, లండన్‌లో ఉన్న భారత మేధావులు కొందరు తరచూ సమావేశం అయ్యేవారు. ఈ సమావేశంలో భారతదేశానికి స్వాతంత్ర్యం రావాలంటే ఏం చేయాలి? అనే వ్యూహ రచనలు, ప్రణాళికలను సిద్ధం చేసేవారు. ఈ సంఘటనల ఆధారంగా రూపొందుతున్న సినిమా 'ది ఇండియా హౌస్'. 1905 నేపథ్యంలో సాగే ఈ సినిమాలో నిఖిల్ హీరోగా నటిస్తుండగా, సయీ మంజ్రేకర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. అనుపమ్ ఖేర్ ఓ కీలక పాత్ర చేస్తున్నారు. రామ్ చరణ్ సమర్పణలో అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, వి మెగా పిక్చర్స్ సంస్థలు ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. ఆల్రెడీ ఈ సినిమా చిత్రీకరణ మొదలైంది. ఇటీవల ఈ సినిమా సెట్స్‌లో చిన్న ప్రమాదం జరగడంతో చిత్రీకరణకు తాత్కాలిక బ్రేక్ పడింది. అతి త్వరలోనే ఈ సినిమా షూటింగ్ ఊపందుకోనుంది. 2026 చివర్లో 'ది ఇండియా హౌస్' సినిమా విడుదలయ్యే అవకాశం ఉంది.


రణ్‌దీప్ హుడా

ఆపరేషన్ సిందూర్

పహల్గాం ఉగ్రదాడికి వ్యతిరేకంగా మన దేశం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' ఘటన దేశ వ్యాప్తంగా సంచలనమైంది. ఈ ఘటన ఆధారంగా సినిమాలు తీసేందుకు కొందరు బాలీవుడ్ దర్శక–నిర్మాతలు ఆసక్తి చూపిస్తున్నారని, కొంతమంది కొన్ని టైటిల్స్‌ను రిజిస్టర్ చేయించారనే టాక్ బాలీవుడ్‌లో వినిపిస్తోంది. ఆల్రెడీ ఉత్తమ్ నితిన్ ఓ సినిమాను ప్రకటించారు. కానీ 'ఆపరేషన్ సిందూర్' ఘటన జరుగుతున్నప్పుడే ఆయన సినిమాను ప్రకటించడంతో కాస్త వివాదాస్పదమైంది. మరి... ఉత్తమ్ తాను ప్రకటించిన సినిమాను సెట్స్‌పైకి తీసుకు వెళ్తారా? లేదా అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది.

ఇలా దేశభక్తి నేపథ్యంలో మరికొన్ని సినిమాలు ఉన్నాయి.

– ముసిమి శివాంజనేయులు


అడివి శేష్

గూఢచారుల నేపథ్యంలో ప్రేక్షకుల ముందుకు రానున్న సినిమాల సంఖ్య కూడా కాస్త ఎక్కువగానే ఉంది. ఎన్టీఆర్, హృతిక్ రోషన్ హీరోలుగా అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో రూపొందిన స్పై యాక్షన్ డ్రామా సినిమా 'వార్ 2'. ఈ చిత్రంలో కియారా అద్వానీ మరో కీలక పాత్రలో నటించారు. ఆదిత్యా చోప్రా నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 14న రిలీజ్ కానుంది. ఇక 'వార్ 2'తో పాటు 'యశ్ రాజ్ ఫిలింస్ స్పై యూనివర్స్'లో భాగంగా రూపొందిన మరో చిత్రం 'ఆల్ఫా'. శివ్ రావైల్ ఈ సినిమాకు దర్శకత్వం వహించగా ఆలియా భట్, శర్వారీ ఈ సినిమాలో స్పై పాత్రలు చేశారు. ఈ చిత్రం డిసెంబరులో విడుదల కానుంది. ఇక కార్తీ హీరోగా నటించిన లేటెస్ట్ స్పై డ్రామా 'సర్దార్ 2'. పీఎస్ మిత్రన్ డైరెక్ట్ చేసిన ఈ సినిమాలో కార్తీ ద్విపాత్రాభినయం చేశారు. ఎస్. లక్ష్మణ్ కుమార్ నిర్మించిన ఈ సినిమా ఈ ఏడాదే రిలీజ్ కానుంది. అలాగే మన తెలుగులో అడివి శేష్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'గూఢచారి 2'. ఎస్. విజయ్ డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమాలో బాలీవుడ్ నటీనటులు వామికా, ఇమ్రాన్ హష్మి ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది విడుదల కానుంది. ఇలా దేశభక్తిని చాటుకునే స్పై బ్యాక్‌డ్రాప్ నేపథ్యంలో రానున్న సినిమాలు మరికొన్ని ఉన్నాయి.


శార్వరి, ఆలియా

మ్యూజిక్ ఆన్


మహేశ్‌బాబు

హీరో మహేశ్‌బాబు, దర్శకుడు రాజమౌళి కాంబినేషన్‌లో అంతర్జాతీయ స్థాయిలో ఓ భారీ బడ్జెట్ చిత్రం తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణకు స్మాల్ బ్రేక్ ఇచ్చింది యూనిట్. ఈ గ్యాప్‌లో ఈ సినిమాకు సంబంధించిన మ్యూజిక్ వర్క్స్‌పై ఫోకస్ పెట్టారట రాజమౌళి అండ్ టీమ్. ఈ చిత్రం మ్యూజిక్ డైరెక్టర్ కీరవాణితో కలిసి ఈ సినిమాలోని పాటలు, ఆర్ఆర్ ఎలా ఉండాలన్న విషయాలపై చర్చలు జరుపుతున్నారట రాజమౌళి. ఈ చర్చలు ఓ కొలిక్కి వస్తే ఈ సినిమా మ్యూజిక్ వర్క్స్‌ను పూర్తి స్థాయిలో ప్రారంభిస్తారట కీరవాణి. ఈ ఫారెస్ట్ అడ్వెంచరస్ యాక్షన్ మూవీలో ప్రియాంకా చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. మాధవన్ మరో కీలక పాత్రలో నటిస్తారని, ఈ సినిమా కథ కథనం, భారతీయ ఇతిహాసం రామాయణం ఆధారంగా ఉంటాయనే టాక్ వినిపిస్తోంది. ఇక ఈ సినిమా నెక్ట్స్ షెడ్యూల్ చిత్రీకరణ వచ్చే నెలలోనే ప్రారంభం అవుతుంది. ఈ సంగతి ఇలా ఉంచితే... ఆగస్టు 9న మహేశ్‌బాబు బర్త్ డే. ఈ సందర్భంగా ఈ సినిమాకు సంబంధించిన అప్‌డేట్ ఏదైనా వస్తే బాగుంటుందని మహేశ్‌బాబు ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. మరి... మహేశ్ బాబు ఫ్యాన్స్ ఆశ నెరవేరుతుందా? లెట్స్ వెయిట్ అండ్ సీ.


సమంత

నో చీట్ డే

ఆరోగ్యంగా ఉండటం కోసం బోలెడన్ని ఆహార నియమాలు పాటిస్తుంటారు స్టార్స్. అయితే వారంలో ఒక రోజు 'చీట్ డే' అని పెట్టుకుంటారు. ఆ రోజు మాత్రం ఆయిలీ ఫుడ్, ఐస్ క్రీమ్స్, స్వీట్స్... ఇలా అన్నీ ఫుల్లుగా లాగించేస్తారు. అయితే సమంత మాత్రం 'నో చీట్ డే' అంటున్నారు. వారం మొత్తం ఒకే డైట్‌ని ఫాలో అవుతానని పేర్కొన్నారామె. కాగా మయోసైటిస్ వ్యాధి బారిన పడిన తర్వాత సమంత ఆహారం విషయంలో మరింత స్ట్రిక్ట్‌గా ఉంటున్నారు. 'యాంటీ ఇన్‌ఫ్లమేటరీ డైట్'ని ఫాలో అవుతున్నారామె. అంటే... తన శరీరానికి సరిపడేవి, సరిపడనవి ఏవో తెలుసుకుని, అందుకు తగ్గట్టుగా తన డైట్‌ని ప్లాన్ చేసుకున్నారు. అయితే ప్రతి రోజూ ఒకే రకమైన ఆహారం ప్లాన్ చేసుకుంటారట. రోజువారీ ఆహారంలో ధాన్యాలు, మొలకలు, బెర్రీ, కోల్డ్ ప్రెస్ ఆయిల్స్, నెయ్యి, బ్రోకలీ, కాలీఫ్లవర్ వంటివి తీసుకుంటానని పేర్కొన్నారీ బ్యూటీ. "వారంలో ఒకరోజు చీట్ డే అంటూ రొటీన్ డైట్‌ని దూరం పెట్టడం నాకు ఇష్టం ఉండదు. అందుకే ప్రతిరోజూ ఒకేలా తింటాను" అని సమంత అంటున్నారు.

బిజినెస్ రీల్

ఆరమ్ ప్రాప్‌టెక్ చేతికి ప్రాప్ టైగర్

రూ.86.45 కోట్లతో కొనుగోలు

న్యూఢిల్లీ: హౌసింగ్ బ్రోకరేజీ సంస్థ 'ప్రాప్‌టైగర్'ను కొనుగోలు చేస్తున్నట్లు ఆరమ్ ప్రాప్‌టెక్ లిమిటెడ్ ప్రకటించింది. రూ.86.45 కోట్ల విలువ మేర షేర్లను జారీ చేయడం ద్వారా ఆస్ట్రేలియాకు చెందిన ఆర్‌ఈఏ గ్రూప్ నుంచి ప్రాప్‌టైగర్‌ను సొంతం చేసుకుంటున్నట్లు తెలిపింది. ఇందులో భాగంగా ఆర్‌ఈఏ ఇండియాకు ప్రిఫరెన్షియల్ షేర్లను జారీ చేయనున్నట్లు స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు వెల్లడించింది. ప్రాప్‌టైగర్ మార్కెటింగ్ సర్వీసెస్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ 100 శాతం షేర్లను కొనుగోలు చేసేందుకు కంపెనీ బోర్డు ఆమోదం తెలిపినట్లు పేర్కొంది. ఒక్కోటీ రూ.5 ముఖ విలువ కలిగిన 42,42,537 షేర్లను ఆర్‌ఈఏ ఇండియాకు జారీ చేయనున్నట్లు వెల్లడించింది. షేర్ల జారీ అనంతరం ఆరమ్ ప్రాప్‌టెక్‌లో ఆర్‌ఈఏ ఇండియాకు 5.54 శాతం వాటా లభించనుంది. ప్రాప్‌టైగర్ నిర్వహణలో రియల్ ఎస్టేట్ ప్రకటనల పోర్టల్ అయిన హౌసింగ్ డాట్ కామ్ ఉండడం గమనార్హం. 2023–24లో హౌసింగ్ డాట్ కామ్ ఆదాయం రూ.101 కోట్లుగా ఉంది. ఆరమ్ ప్రాప్‌టెక్ రియల్ ఎస్టేట్ రంగానికి సాఫ్ట్‌వేర్, టెక్నాలజీ పరిష్కారాలను అందిస్తుంటుంది.

రూ. 353 కోట్ల ఐపీవోకి నెఫ్రోప్లస్

సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: నెఫ్రోప్లస్ బ్రాండ్ పేరిట డయాలసిస్ సేవలందించే హైదరాబాదీ సంస్థ నెఫ్రోకేర్ హెల్త్ సర్వీసెస్ తాజాగా పబ్లిక్ ఇష్యూకి (ఐపీవో) రానుంది. ఇందుకు సంబంధించిన ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి సమర్పించింది. దీని ప్రకారం ఐపీవో ద్వారా కంపెనీ రూ. 353.4 కోట్లు సమీకరించనుంది. ప్రమోటర్లు, ప్రస్తుత షేర్‌హోల్డర్లు, ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) రూపంలో 1.27 కోట్ల షేర్లను విక్రయించనున్నారు. ప్రీ-ఐపీవో ప్లేస్‌మెంట్ ద్వారా నెఫ్రోప్లస్ రూ. 70.6 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. ఇన్వెస్ట్‌కార్ప్ ప్రైవేట్ ఈక్విటీ ఫండ్ టూ, ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ మొదలైనవి కంపెనీ ప్రమోటర్లుగా ఉన్నాయి. ఇష్యూ ద్వారా సమీకరించిన నిధుల్లో రూ. 129.1 కోట్లను దేశీయంగా కొత్తగా డయాలసిస్ క్లినిక్‌లను ప్రారంభించేందుకు, రూ. 136 కోట్లను రుణాల చెల్లింపునకు, మిగతా మొత్తాన్ని ఇతరత్రా కార్పొరేట్ అవసరాలకు కంపెనీ వినియోగించుకోనుంది. 2009లో ఏర్పాటైన నెఫ్రోప్లస్‌కి దేశవ్యాప్తంగా 269 నగరాల్లో 447 క్లినిక్‌లు ఉన్నాయి. ఫిలిప్పీన్స్, ఉజ్బెకిస్తాన్, నేపాల్‌తో పాటు ఇటీవలే సౌదీ అరేబియా ద్వారా మధ్యప్రాచ్య మార్కెట్లోకి కూడా విస్తరించింది. 2025 మార్చి 31 నాటికి కంపెనీ వద్ద 5,000 పైగా డయాలసిస్ మెషిన్లు ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో రూ. 755.8 కోట్ల ఆదాయం, రూ. 67 కోట్ల లాభం ఆర్జించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

27-7-2025

విశాఖ	465-00
చిత్తూరు	503-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	455-00
విజయవాడ	475-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	425-00
వరంగల్	427-00
రిటైల్ ధర	4.85

కోటక్ మహీంద్రా బ్యాంక్ లాభం రూ. 3,282 కోట్లు

- క్యూ1లో 7 శాతం క్షీణత
- పెరిగిన ప్రొవిజనింగ్



ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ప్రైవేట్ రంగ కోటక్ మహీంద్రా బ్యాంక్ నికర లాభం స్టాండెలోన్ ప్రాతిపదికన లాభం రూ. 3,282 కోట్లకు పరిమితమైంది. గత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో నమోదైన రూ. 3,520 కోట్లతో పోలిస్తే 7 శాతం క్షీణించింది. రిజర్వ్ బ్యాంక్ కీలక పాలసీ రేట్లను తగ్గించడం, ఫీజు ఆదాయాల వృద్ధి నెమ్మదించడం, ప్రొవిజనింగ్ పెరగడం వంటి అంశాలు ఇందుకు కారణం. వార్షికంగా చూస్తే మొండి బాకీలకు ప్రొవిజనింగ్ 109 శాతం ఎగిసి రూ. 1,208 కోట్లకు చేరింది. ఇక నికర వడ్డీ ఆదాయం 6 శాతం పెరిగి రూ. 7,259 కోట్లకు చేరగా, నికర వడ్డీ మార్జిన్ (నిమ్) 4.65 శాతంగా నమోదైంది. మరోవైపు, కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన బ్యాంక్ లాభం స్వల్పంగా 1 శాతం వృద్ధితో రూ. 4,472 కోట్లకు చేరింది. జనరల్ ఇన్సూరెన్స్ విభాగం విక్రయానికి సంబంధించి రూ. 3,000 కోట్లు కూడా జత కావడంతో గత క్యూ1లో లాభం రూ. 7,448 కోట్లుగా నమోదైంది. తాజాగా నిర్వహణలోని మొత్తం ఆస్తుల పరిమాణం (ఏయూఎం) 18 శాతం పెరిగి రూ. 6,36,311 కోట్ల నుంచి రూ. 7,50,143 కోట్లకు పెరిగింది. స్థూల ఆర్థిక పరిస్థితులు ప్రతికూలంగా ఉండటంతో రిటైల్ కమర్షియల్ వాహన రుణాల పోర్ట్‌ఫోలియోలో ఒత్తిడి నెలకొన్నట్లు బ్యాంకు తెలిపింది.

స్వల్పంగా పెరిగిన మొండిబాకీలు ..

సమీక్షాకాలంలో అసెట్ క్వాలిటీ స్వల్పంగా క్షీణించింది. స్థూల నిరర్థక ఆస్తుల పరిమాణం (జీఎన్‌పీఏ) 1.39 శాతం నుంచి 1.48 శాతానికి పెరిగింది. నికర ఎన్‌పీఏలు స్థిరంగా 0.34 శాతంగా నమోదయ్యాయి. అటు కరెంట్ అకౌంట్ సేవింగ్స్ అకౌంట్ (కాసా) నిష్పత్తి 43.4 శాతం నుంచి 40.9 శాతానికి తగ్గింది. సగటున మొత్తం డిపాజిట్లు 13 శాతం వృద్ధితో రూ. 4,35,603 కోట్ల నుంచి రూ. 4,91,998 కోట్లకు, రుణాలు 14 శాతం పెరిగి రూ. 4,44,823 కోట్లకు చేరాయి. కరెంట్ డిపాజిట్లు 9 శాతం పెరిగి రూ. 62,200 కోట్ల నుంచి రూ. 67,809 కోట్లకు, సేవింగ్స్ డిపాజిట్లు 2 శాతం వృద్ధితో రూ. 1,22,105 కోట్ల నుంచి రూ. 1,24,186 కోట్లకు, టర్మ్ డిపాజిట్లు రూ. 2,1,298 కోట్ల నుంచి 19 శాతం వృద్ధితో రూ. 3,00,003 కోట్లకు చేరాయి. స్లిప్పేజీలు రూ. 1,318 కోట్ల నుంచి రూ. 1,812 కోట్లకు పెరిగాయి.

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ లాభం 32% డౌన్

జూన్ క్వార్టర్‌లో రూ. 463 కోట్లు



ముంబై: ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో (ఏప్రిల్–జూన్) రూ. 463 కోట్ల నికర లాభం ప్రకటించింది. గత క్యూ1లో నమోదైన రూ. 681 కోట్లతో పోలిస్తే ఏకంగా 32.07 శాతం క్షీణించింది. సమీక్షాకాలంలో అసెట్ క్వాలిటీ సైతం నెమ్మదించింది. స్థూల నిరర్థక ఆస్తుల (జీఎన్‌పీఏ) పరిమాణం 1.87 శాతం నుంచి 1.97 శాతానికి పెరిగింది. రూ. 4,433.5 కోట్ల నుంచి రూ. 4,867.5 కోట్లకు చేరింది. అలాగే నికర ఎన్‌పీఏలు శాతాలవారీగా 0.53 శాతం నుంచి 0.53 శాతానికి, రూ. 1,230 కోట్ల నుంచి రూ. 1,346 కోట్లకు పెరిగాయి.

వడ్డీ ఆదాయం 5 శాతం అప్..

సమీక్షాకాలంలో నికర వడ్డీ ఆదాయం రూ. 4,695 కోట్ల నుంచి రూ. 4,933 కోట్లకు పెరిగింది. నికర వడ్డీ మార్జిన్ త్రైమాసికాలవారీగా 24 బేసిస్ పాయింట్లు క్షీణించి 5.71 శాతం నుంచి 5.95 శాతానికి తగ్గింది. రిజర్వ్ బ్యాంక్ కీలక వడ్డీ రేట్ల కోత ప్రభావం ఇందుకు కారణమని బ్యాంకు తెలిపింది. క్యూ1లో కస్టమర్ల డిపాజిట్లు 25.5 శాతం పెరిగినట్లు బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ వి. వైద్యనాథన్ తెలిపారు. అసెట్ క్వాలిటీ విషయానికొస్తే సూక్ష్మరుణాల విభాగం మినహా అన్ని వ్యాపారాలు మెరుగ్గా రాణించినట్లు వివరించారు. అర్హులైన రుణగ్రహీతలకు, రెపో రేట్ల తగ్గింపు ప్రయోజనాలను బదలాయించడం వల్ల మార్జిన్లు తగ్గినట్లు వైద్యనాథన్ చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థం నుంచి మార్జిన్లు మెరుగుపడొచ్చని వివరించారు.

మాల్స్‌లో రిటైల్ లీజింగ్ డౌన్

- హైదరాబాద్‌లో 22 శాతం తక్కువ
- ఎనిమిది నగరాల్లో 6 శాతం తగ్గుదల
- జూన్ క్వార్టర్‌లో నమోదు
- కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ నివేదిక



న్యూఢిల్లీ: హైదరాబాద్ సహా దేశవ్యాప్తంగా ఎనిమిది ప్రముఖ నగరాల్లో షాపింగ్ మాల్స్, ప్రధాన వీధుల్లోని రిటైల్ స్పేస్ (వ్యాపార సముదాయాలు) లీజింగ్ జూన్ త్రైమాసికంలో బలహీనపడింది. ఏప్రిల్–జూన్ కాలంలో ఎనిమిది నగరాల్లో రిటైల్ స్పేస్ లీజింగ్ 2.24 మిలియన్ చదరపు అడుగులుగా (ఎస్ఎఫ్‌టీ) నమోదైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో లీజింగ్ 2.39 మిలియన్ ఎస్ఎఫ్‌టీగా ఉండడం గమనార్హం. మొత్తం లీజింగ్‌లో 45% మేర, 1.01 మిలియన్ ఎస్ఎఫ్‌టీ షాపింగ్ మాల్స్‌కు సంబంధించి ఉంది. ప్రధాన మార్గాల్లో (వీధుల వెంట) రిటైల్ స్పేస్ లీజింగ్ 55% వాటాతో 1.23 మిలియన్ ఎస్ఎఫ్‌టీగా ఉండడం గమనార్హం.

- హైదరాబాద్‌లో రిటైల్ స్పేస్ లీజింగ్ 0.76 మిలియన్ ఎస్ఎఫ్‌టీకి పరిమితమైంది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో లీజింగ్ 0.98 మిలియన్ ఎస్ఎఫ్‌టీతో పోల్చి చూస్తే 22 శాతం తగ్గింది.
- బెంగళూరులోనూ లీజింగ్ క్రితం ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చి చూసినప్పుడు 44% తగ్గి 0.18 మిలియన్ ఎస్ఎఫ్‌టీకి పరిమితమైంది.
- ఢిల్లీ ఎన్‌సీఆర్ మార్కెట్లో 41 శాతం క్షీణతతో 0.3 మిలియన్ ఎస్ఎఫ్‌టీగా నమోదైంది.
- అత్యధికంగా అహ్మదాబాద్ మార్కెట్లో రిటైల్ స్పేస్ లీజింగ్ 63 శాతం తగ్గిపోయింది. 0.04 మిలియన్ ఎస్ఎఫ్‌టీకి పరిమితమైంది.
- కోల్‌కతాలో లీజింగ్ 23 శాతం తగ్గి 0.05 మిలియన్ ఎస్ఎఫ్‌టీగా ఉంది.
- చెన్నై నగరంలో మాత్రం 0.16 మిలియన్ ఎస్ఎఫ్‌టీకి లీజింగ్ పెరిగింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లీజింగ్ 0.10 మిలియన్ ఎస్ఎఫ్‌టీగానే ఉంది.
- ముంబైలో లీజింగ్ డిమాండ్ రెట్టింపై 0.20 మిలియన్ ఎస్ఎఫ్‌టీ నుంచి 0.52 మిలియన్ ఎస్ఎఫ్‌టీకి చేరింది.
- పుణెలో రెండింతలు వృద్ధి చెందింది. 0.09 నుంచి 0.23 మిలియన్ ఎస్ఎఫ్‌టీకి లీజింగ్ పరిమాణం పెరిగింది.

ఆశావహ అంచనా

ప్రీమియం షాపింగ్ మాల్స్‌లో ఖాళీలు తగ్గుముఖం పట్టినట్టు కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ రీసెర్చ్ హెడ్ సువిశేష్ వాల్సన్ తెలిపారు. ''భవిష్యత్తు కాలానికి ఆశావహంగానే ఉన్నాం. 4 మిలియన్ చదరపు అడుగులు మేర గ్రేడ్-ఏ రిటైల్ స్పేస్ అదనంగా ఈ ఏడాది ద్వితీయ 6 నెలల్లో అందుబాటులోకి రానుంది. ముఖ్యంగా హైదరాబాద్, ముంబై, ఢిల్లీ ఎన్‌సీఆర్ మార్కెట్లో కొత్త సరఫరా ఉంటుంది''అని తమ అంచనాలను వెల్లడించారు.

బలమైన వాణిజ్య భాగస్వామ్యాలు అవసరం

- వీటితో భారత్‌కు వ్యూహాత్మక అవకాశాలు
- ఆర్‌బీఐ బులెటిన్ విడుదల



ముంబై: బలమైన వాణిజ్య భాగస్వామ్యాలు భారత్‌కు వ్యూహాత్మక అవకాశాలను తీసుకొస్తాయని.. అంతర్జాతీయంగా విలువ ఆధారిత సరఫరా వ్యవస్థతో అనుసంధానతను పెంచుకోవచ్చని ఆర్‌బీఐ బులెటిన్ పేర్కొంది. వాణిజ్య విధానపరమైన అనిశ్చితులు నెలకొన్నప్పటికీ జూన్–జూలై నెలల్లో ఆర్థిక కార్యకలాపాలు బలంగా కొనసాగినట్టు తెలిపింది. సమగ్ర ఆర్థిక, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై భారత్‌-యూకే గురువారం సంతకం చేయనుండడం గమనార్హం. అమెరికాతోనూ ఈ దిశగా చర్చలు నిర్వహిస్తుండడం తెలిసిందే. ఆర్థిక వ్యవస్థ ప్రస్తుత పరిస్థితిపై బుధవారం ఆర్‌బీఐ బులెటిన్ విడుదలైంది. వాణిజ్య విధానపరమైన అనిశ్చితుల కారణంగా జూన్ నుంచి జూలైలో ఇప్పటి వరకు అంతర్జాతీయంగా స్థూల ఆర్థిక వాతావరణం అస్థిరంగా ఉన్నట్టు తెలిపింది. ''ఈ కాలంలో దేశీ ఆర్థిక కార్యకలాపాలు బలంగా కొనసాగాయి. ఖరీఫ్ సాగు పరిస్థితులు మెరుగుపడడం, సేవల రంగంలో బలమైన పనితీరు, పారిశ్రామిక పనితీరులో మోస్తరు వృద్ధి మద్దతుగా నిలిచాయి''అని బులెటిన్ వివరించింది. అమెరికాతో ఆగస్ట్ 1కి ముందుగానే వాణిజ్య ఒప్పందం కోసం తీవ్రమైన చర్చలు నడుస్తున్నాయంటూ.. అమెరికా వాణిజ్య విధానాలు, అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావాలను పరిశీలించాల్సి ఉందని పేర్కొంది. సగటు వాణిజ్య టారిఫ్‌లు 1930ల తర్వాత ఎన్నడూలేని స్థాయిలకు చేరుకోవచ్చని అంచనా వేసింది. ఇతర రంగాలపైనా అదనంగా కొత్త టారిఫ్‌లు విధించే రిస్క్ లేకపోలేదని తెలిపింది. ఈ అనిశ్చితులు అంతర్జాతీయ ఆర్థిక వృద్ధికి విఘాతం కలిగించొచ్చని అభిప్రాయపడింది. వ్యవస్థలో తగినంత లిక్విడిటీ ఉండడం రేట్ల కోత బదిలీకి వీలు కల్పిస్తుందని.. విదేశీ మారకం నిల్వలు సమృద్ధిగా ఉండడం, విదేశీ మారకం రుణభారం మోస్తరుగా ఉండడాన్ని సానుకూలతలుగా పేర్కొంది.

చమురు ధరల పెరుగుదల ద్రవ్యోల్బణానికి ఆజ్యం

చమురు ధరలు 10% పెరిగితే రిటైల్ ద్రవ్యోల్బణం 0.20% అధికమవుతుందని ఆర్‌బీఐ అంచనా వేసింది. ప్రత్యామ్నాయ ఇంధనాలను ప్రోత్సహించడం ద్వారా దిగుమతులపై ఆధారపడడాన్ని తగ్గించేందుకు విధానపరమైన చర్యలకు ఆర్‌బీఐ ఉద్యోగులు విడుదల చేసిన అధ్యయన పత్రం పిలుపునిచ్చింది. ఈ భారం వినియోగదారులపై అధికంగా పడకుండా ఎక్సైజ్ సుంకాలను తగ్గించే వెసులుబాటు ప్రభుత్వానికి ఉన్నట్టు తెలిపింది.

హైదరాబాద్‌కు ఐసీఐసీఐ లాంబార్డ్ 'డిజాస్టర్ రికవరీ' మార్పు

న్యూఢిల్లీ: బీమా రంగ సంస్థ ఐసీఐసీఐ లాంబార్డ్ తమ డిజాస్టర్ రికవరీ మౌలిక సదుపాయాలను అమెజాన్ వెబ్ సర్వీసెస్ సహకారంతో ఆసియా–పసిఫిక్ (ముంబై) నుంచి ఆసియా పసిఫిక్ (హైదరాబాద్) రీజియన్‌కు అప్‌గ్రేడ్ చేసినట్లు వెల్లడించింది. నిర్వహణపరమైన రిస్కులను సమర్థంగా ఎదుర్కొంటూ, కస్టమర్లకు నిరాటంకంగా సేవలు అందించేందుకు ఇది సహాయపడగలదని పేర్కొంది. టెక్నాలజీపరమైన అంతరాయాలు, అంతర్జాతీయంగా ఐటీ పరిశ్రమలో రిస్కులు పెరుగుతున్న నేపథ్యంలో డౌన్‌టైమ్‌ను గణనీయంగా తగ్గించడంపై మరింతగా దృష్టి పెడుతున్నట్లు సంస్థ తెలిపింది.

ఎలక్ట్రానిక్స్ విడిభాగాల స్కీమ్ కింద రూ. 16 వేల కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలు



న్యూఢిల్లీ: ఎలక్ట్రానిక్స్ విడిభాగాల తయారీ స్కీమ్ (ఈసీఎంఎస్) కింద రూ. 16,000 కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలు కేంద్రానికి అందినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అనుమతుల ప్రక్రియ ఇప్పటికే మొదలైందని, షార్ట్‌లిస్ట్ చేసిన ప్రాజెక్టుల పేర్లను సెప్టెంబర్‌లో ప్రకటించే అవకాశం ఉందని పేర్కొన్నాయి. దేశ, విదేశ కంపెనీల నుంచి ఈ స్కీముకు మంచి స్పందన లభించినట్లు వివరించాయి. రూ. 22,805 కోట్ల ఈసీఎంఎస్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం మే 1న దరఖాస్తులు ఆహ్వానించింది. ఎలక్ట్రానిక్ విడిభాగాల డిమాండ్‌కు తగ్గట్లుగా దేశీయంగా సరఫరాను పెంచేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని రూపొందించింది. టాటా ఎలక్ట్రానిక్స్, డిక్సన్ టెక్నాలజీస్, ఫాక్స్‌కాన్‌లాంటి సంస్థలు దీనిపై ఆసక్తి కనపర్చినట్లు సమాచారం. విడిభాగాల సెగ్మెంట్లో 2030 నాటికి ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి 500 బిలియన్ డాలర్లకు చేరనుండగా, డిమాండ్-సరఫరా మధ్య వ్యత్యాసం 248 బిలియన్ డాలర్లకు (సుమారు రూ. 21 లక్షల కోట్లు) చేరుతుందని ఎలక్ట్రానిక్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అంచనా వేస్తోంది. దేశీయంగా ఉత్పత్తిని పెంచేందుకు తగు చర్యలు తీసుకోకపోతే ఈ కొరతను అధిగమించేందుకు దిగుమతులపై ఆధారపడాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేసింది.

ఎస్‌బీఐ కార్డ్స్ బలహీనం

6 % తగ్గిన లాభం

న్యూఢిల్లీ: ఎస్‌బీఐ కార్డ్స్ అండ్ పేమెంట్ సర్వీసెస్ జూన్ త్రైమాసికంలో మిశ్రమ పనితీరు చూపించింది. రూ.556 కోట్ల లాభాన్ని కంపెనీ ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.594 కోట్లతో పోల్చి చూస్తే 6% తగ్గింది. ఆదాయం మాత్రం ఇదే కాలంలో 12% పెరిగి రూ.5,035 కోట్లకు చేరింది. కంపెనీ ఆస్తుల పరిమాణం ఇదే కాలంలో రూ.65,546 కోట్ల నుంచి రూ.66,009 కోట్లకు చేరింది. స్థూల ఎన్‌పీఏలు ఎలాంటి మార్పు లేకుండా 3.07 శాతంగా ఉన్నాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో ఎన్‌పీఏలు 3.06 శాతంగా ఉండడం గమనార్హం. నికర ఎన్‌పీఏలు 1.11% నుంచి 1.42 శాతానికి పెరిగాయి.

ఎన్‌డీటీవీకి పెరిగిన నష్టాలు

జూన్ త్రైమాసికంలో రూ.70కోట్లు

న్యూఢిల్లీ: ఎన్‌డీటీవీకి జూన్ త్రైమాసికంలో నష్టాలు పెరిగాయి. రూ.70 కోట్ల కన్సాలిడేటెడ్ నష్టాన్ని కంపెనీ ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో నష్టం రూ.47 కోట్లుగానే ఉంది. ఆదాయం మాత్రం 14 శాతానికి పైగా పెరిగి రూ.108 కోట్లకు చేరింది. వ్యూహాత్మక పెట్టుబడులు, ఆవిష్కరణలపై దృష్టి సారించడం మెరుగైన పనితీరుకు దారితీసినట్టు కంపెనీ ప్రకటించింది. మొత్తం వ్యయాలు 26% పెరిగి రూ.183 కోట్లకు చేరాయి. జూన్ త్రైమాసికంలో కొత్తగా ఎన్‌డీటీవీ మరాఠీ, ఎన్‌డీటీవీ ఇండియా క్రియేటర్స్ మంచ్ ఛానళ్లను ప్రారంభించింది. ఈ చర్యలు ఎన్‌డీటీవీ మల్టీ ప్లాట్‌ఫామ్ మీడియా సంస్థగా మారేందుకు సహకరిస్తాయని పేర్కొంది.

మహీంద్రా లైఫ్‌స్పేస్ లాభం హైజంప్

క్యూ1లో రూ. 51 కోట్లు

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికంలో రియల్టీ రంగ కంపెనీ మహీంద్రా లైఫ్‌స్పేస్ డెవలపర్స్ ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం దాదాపు 4 రెట్లు జంప్‌చేసి రూ. 51 కోట్లను అధిగమించింది. అనుకోని లాభాలు ఇందుకు దోహదపడ్డాయి. గతేడాది(2024–25) ఇదే కాలంలో కేవలం రూ. 13 కోట్లు ఆర్జించింది. అయితే మొత్తం ఆదాయం భారీగా క్షీణించి రూ. 41 కోట్లకు పరిమితమైంది. గత క్యూ1లో రూ. 207 కోట్ల టర్నోవర్ సాధించింది. కాగా.. మహీంద్రా ఇండస్ట్రియల్ పార్క్ ఎన్‌సీడీల ఒప్పందాన్ని సవరించడంతో రూ. 24.5 కోట్లు, మహీంద్రా వరల్డ్ సిటీ జైపూర్.. రెండువైపులా అంగీకరించిన ధరలో ఎన్‌సీడీలను రిడీమ్ చేయడంతో రూ. 18.7 కోట్లు అనూహ్యంగా లభించినట్లు మహీంద్రా లైఫ్‌స్పేస్ వెల్లడించింది.

ఓరియంట్ ఎలక్ట్రిక్ లాభం రూ.22 కోట్లు



న్యూఢిల్లీ: ఓరియంట్ ఎలక్ట్రిక్ జూన్‌తో అంతమైన త్రైమాసికంలో బలమైన పనితీరు నమోదు చేసింది. లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 22 శాతం పెరిగి రూ.17.52 కోట్లుగా నమోదైంది. ఆదాయం 2 శాతం పెరిగి రూ.769 కోట్లకు చేరింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.14.34 కోట్లు, ఆదాయం రూ.755 కోట్ల చొప్పున నమోదయ్యాయి. ఎలక్ట్రికల్ కన్స్యూమర్ విభాగం ఆదాయం ఫ్లాట్‌గా రూ.545 కోట్లుగా ఉంది. లైటింగ్, స్విచ్‌గేర్ల విభాగంలో ఆదాయం 7% పెరిగి రూ.224 కోట్లుగా ఉంది.

రెయిన్‌బో చిల్డ్రన్స్ మెడికేర్ లాభం రూ. 54 కోట్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో రెయిన్‌బో చిల్డ్రన్స్ మెడికేర్ నికర లాభం రూ. 54 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం క్యూ1లో నమోదైన రూ. 40 కోట్లతో పోలిస్తే 35 శాతం పెరిగింది. ఆదాయం రూ. 330 కోట్లతో పోలిస్తే రూ. 353 కోట్లకు పెరిగింది. రాజమండ్రి, బెంగళూరు, కోయంబత్తూర్, ఎన్‌సీఆర్ (నేషనల్ క్యాపిటల్ రీజియన్)లో కొత్త ఆస్పత్రుల పనులు కొనసాగుతున్నాయని సంస్థ తెలిపింది. క్లినికల్, నిర్వహణ సామర్థ్యాలను మెరుగుపర్చుకోవడం, కొత్త ఆస్పత్రులను నిర్దిష్ట వ్యవధిలో ప్రారంభించడం మొదలైన అంశాలపై మరింతగా దృష్టి పెడుతున్నట్లు సంస్థ సీఎండీ రమేశ్ కంచర్ల తెలిపారు. అర్హత కలిగిన ఉద్యోగులకు ఎసాప్ 2025 స్కీము కింద 1.40 లక్షల స్టాక్ ఆప్షన్లను కేటాయించేందుకు బోర్డు నిర్ణయించింది.

ప్రీమియర్ ఎనర్జీస్ లాభం రూ. 307 కోట్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రీమియర్ ఎనర్జీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ. 307 కోట్ల నికర లాభం ప్రకటించింది. క్రితం క్యూ1లో ఇది రూ. 198 కోట్లు. సమీక్షాకాలంలో ఆదాయం రూ. 1,657 కోట్ల నుంచి రూ. 1,821 కోట్లకు పెరిగింది. రూ. 1 ముఖ విలువ చేసే ఒక్కో షేరుపై 25 శాతం మేర (0.25 పైసా) మధ్యంతర డివిడెండ్ ఇవ్వాలని బోర్డు నిర్ణయించింది. ఇందుకోసం ఆగస్టు 2 రికార్డు తేదీగా ఉంటుంది. అలాగే ఎసాప్ స్కీమ్ 2021 కింద ఒక్కో షేరుపై రూ. 20.29 ప్రీమియంనకు 22.20 లక్షల షేర్లను పీఈఎల్ ఎసాప్ ట్రస్టుకు కేటాయించనున్నట్లు సంస్థ తెలిపింది.

ఆటో మొబైల్... ఎగుమతులు ఆకర్షణీయం

జూన్ క్వార్టర్‌లో 14,57,461 యూనిట్లు



న్యూఢిల్లీ: ఆటోమొబైల్ ఎగుమతులు జూన్ త్రైమాసికంలో ఆకర్షణీయంగా నమోదయ్యాయి. క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 22 శాతం పెరిగాయి. మొత్తం 14,57,461 యూనిట్లు ఎగుమతి అయినట్టు ఆటోమొబైల్ తయారీదారుల సమాఖ్య (సియామ్) ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఎగుమతులు 11,92,566 యూనిట్లుగా ఉన్నాయి. ప్రధానంగా ప్యాసింజర్ వాహనాలు, ద్విచక్ర, వాణిజ్య వాహన ఎగుమతులు అధికంగా జరిగాయి. ప్యాసింజర్ వాహన ఎగుమతులు 2,04,330 యూనిట్లుగా ఉన్నాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో ఎగుమతులు 1,80,483 యూనిట్లతో పోల్చి చూస్తే 13 శాతం పెరిగాయి. మారుతి సుజుకీ 96,181 యూనిట్ల ప్యాసింజర్ వాహనాలను క్యూ1లో ఎగుమతి చేసింది. క్రితం ఏడాది ఇదే కాలంలోని ఎగుమతులు 69,962 యూనిట్ల కంటే 37 శాతం ఎక్కువ. గత నాలుగేళ్ల నుంచి ప్యాసింజర్ వాహన ఎగుమతుల్లో మారుతి సుజుకీ అగ్రస్థానంలో ఉంటున్నట్టు సంస్థ సీఈవో (కార్పొరేట్ అఫైర్స్) రాహుల్ భారతి తెలిపారు. క్యూ1లో తమ వాటా 47 శాతానికి చేరుకున్నట్టు చెప్పారు. మారుతి తర్వాత హ్యుందాయ్ మోటార్ ఇండియా అత్యధికంగా 48,140 యూనిట్ల వాహనాలను ఎగుమతి చేసింది. క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 13 శాతం అధికం. ద్విచక్ర వాహన ఎగుమతులు 11,36,942 యూనిట్లుగా ఉన్నాయి. క్రితం ఆర్థిక సంవత్సరం క్యూ1లో ద్విచక్ర వాహన ఎగుమతులు 9,23,148 యూనిట్ల కంటే 23 శాతం పెరిగాయి. వాణిజ్య వాహన ఎగుమతులు సైతం 23 శాతం పెరిగి 19,427 యనిట్లుగా ఉన్నాయి. త్రిచక్ర వాహన అమ్మకాలు 34 శాతం పెరిగి 95,796 యూనిట్లకు చేరాయి.

క్రిప్టో సర్వీసులకు హ్యాకర్ల రిస్కులు

- 2025లో ఇప్పటివరకు 2.17 బిలియన్ డాలర్ల చోరీ
- చెయినాలిసిస్ నివేదిక



న్యూఢిల్లీ: డిజిటల్ కరెన్సీ ప్రపంచంలో సైబర్ ముప్పులు భారీగా పెరుగుతున్నాయి. గత వారం జరిగిన కాయిన్‌డీసీఎక్స్ హ్యాక్‌లో పోయిన 44 మిలియన్ డాలర్లు సహా క్రిప్టోకరెన్సీ సర్వీసుల కార్యకలాపాలకు సంబంధించి ఈ ఏడాది (2025లో) ఇప్పటివరకు 2.17 బిలియన్ డాలర్ల మేర చోరీలు నమోదయ్యాయి. బ్లాక్‌చెయిన్ అనలిటిక్స్ ప్లాట్‌ఫాం చెయినాలిసిస్ 2025 నివేదిక ప్రకారం గతేడాది మొత్తంతో పోలిస్తే ఈ ఏడాది చోరీలు మరింతగా పెరిగాయి. 2022 మొత్తం సంవత్సరంలో చోరీకి గురైన దానికన్నా, 2025 జూన్ ఆఖరు నాటికి 17 శాతం ఎక్కువ మొత్తాన్ని హ్యాకర్లు దొంగిలించారు. 1.5 బిలియన్ డాలర్ల బైబిట్ హ్యాక్ అనేది క్రిప్టో చరిత్రలోనే ఏకైక భారీ హ్యాక్‌గా నిల్చింది. అంతేగాకుండా ఈ ఏడాది క్రిప్టోసర్వీసుల్లో చోరీకి గురైన మొత్తంలో ఈ కేసు వాటా దాదాపు 69 శాతం ఉంటుంది. ఇక మిగతా వాటిలో సెటస్ ప్రొటోకాల్ ఈ ఏడాది మే నెలలో 200–260 మిలియన్ డాలర్ల మేర నష్టపోగా, జూలైలో బిగ్‌వన్ సంస్థ 27 మిలియన్ డాలర్లు పోగొట్టుకుంది.

ఈ ఏడాది ఇప్పటివరకు అమెరికా, జర్మనీ, రష్యా, కెనడా, జపాన్, ఇండొనేషియా, దక్షిణ కొరియాల్లో హ్యాకింగ్ బాధితులు అత్యధికంగా ఉన్నారు. ప్రాంతీయంగా చూస్తే తూర్పు యూరప్, మధ్యప్రాచ్యం–ఉత్తర ఆఫ్రికా, సీఎస్ఏవో (సెంట్రల్, సదరన్ ఆసియా, ఓషియానియా)లో బాధితుల సంఖ్య గతేడాది ప్రథమార్ధంతో పోలిస్తే ఈ ఏడాది ప్రథమార్ధంలో మరింతగా పెరిగింది. వ్యక్తిగత వాలెట్లను టార్గెట్ చేసే వారికన్నా క్రిప్టోసర్వీసులను హ్యాక్ చేసే వారు మరింత అధునాతనమైన టెక్నాలజీని ఉపయోగిస్తున్నారు. గతేడాది క్రిప్టో ఎక్స్ఛేంజ్ వజీర్‌ఎక్స్ కూడా 230 మిలియన్ డాలర్ల మేర హ్యాకింగ్‌కి గురైంది.

టిమ్ డేవిడ్ రికార్డు సెంచరీ


టిమ్ డేవిడ్

37 బంతుల్లో 6 ఫోర్లు, 11 సిక్స్‌లతో 102 నాటౌట్

- వెస్టిండీస్‌తో మూడో టి20లో ఆస్ట్రేలియా ఘన విజయం
- 215 పరుగుల లక్ష్యాన్ని 16.1 ఓవర్లలోనే ఛేదించిన కంగారూలు
- 3–0తో సిరీస్ కైవసం

బసెటెర్ (సెయింట్ కిట్స్): మిడిలార్డర్ బ్యాటర్ టిమ్ డేవిడ్ (37 బంతుల్లో 102 నాటౌట్; 6 ఫోర్లు, 11 సిక్స్‌లు) రికార్డు సెంచరీతో చెలరేగడంతో వెస్టిండీస్‌తో జరిగిన మూడో టి20లో ఆస్ట్రేలియా ఘన విజయం సాధించింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా జరిగిన మూడో మ్యాచ్‌లో ఆసీస్ 6 వికెట్ల తేడాతో విండీస్‌ను చిత్తు చేసింది. తద్వారా మరో రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే 3–0తో సిరీస్ కైవసం చేసుకుంది. భారీ లక్ష్యఛేదనలో డేవిడ్ చెలరేగిపోయాడు. విండీస్ బౌలర్లను ఊచకోత కోస్తూ 37 బంతుల్లోనే శతకం పూర్తి చేసుకున్నాడు. ఆస్ట్రేలియా తరఫున టి20ల్లో ఇదే వేగవంతమైన శతకం కాగా... జోష్ ఇన్‌గ్లిస్ (43 బంతుల్లో) రెండో స్థానంలో ఉన్నాడు. ఓవరాల్‌గా ఐసీసీ సభ్య దేశాల ఆటగాళ్లలో ఇది మూడో వేగవంతమైన సెంచరీ. భారత మాజీ కెప్టెన్ రోహిత్‌శర్మ, దక్షిణాఫ్రికా ప్లేయర్ డేవిడ్ మిల్లర్ గతంలో 35 బంతుల్లో శతకాలు నమోదు చేశారు. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 214 పరుగులు చేసింది. కెప్టెన్ షై హోప్ (57 బంతుల్లో 102 నాటౌట్; 8 ఫోర్లు, 6 సిక్స్‌లు) సెంచరీతో కదం తొక్కగా... మరో ఓపెనర్ బ్రాండన్ కింగ్ (36 బంతుల్లో 62; 3 ఫోర్లు, 6 సిక్స్‌లు) మెరుపులు మెరిపించాడు. ఈ క్రమంలో క్రిస్ గేల్ అనంతరం మూడు ఫార్మాట్లలో సెంచరీలు చేసిన రెండో విండీస్ ప్లేయర్‌గా హోప్ నిలిచాడు. వీరిద్దరి జోరు చూస్తే విండీస్ జట్టు మరింత భారీ స్కోరు చేయడం ఖాయమే అనిపించినా... ఆఖర్లో కంగారూ బౌలర్లు కరీబియన్ల జోరును అడ్డుకున్నారు.


హోప్

ఎలీస్, జాంపా, ఓవెన్ తలా ఒక వికెట్ పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో ఆస్ట్రేలియా 16.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 215 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' టిమ్ డేవిడ్ అజేయ సెంచరీతో ఇన్నింగ్స్‌కు వెన్నెముకలా నిలవగా... మిచెల్ ఓవెన్ (16 బంతుల్లో 36 నాటౌట్; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), కెప్టెన్ మిచెల్ మార్ష్ (22; 5 ఫోర్లు), మ్యాక్స్‌వెల్ (20; 3 ఫోర్లు, 1 సిక్స్), ఇన్‌గ్లిస్ (15; 2 ఫోర్లు, 1 సిక్స్) తలా కొన్ని పరుగులు చేయడంతో మరో 23 బంతులు మిగిలుండగానే ఆసీస్ గెలుపొందింది. విండీస్ బౌలర్లలో షెఫర్డ్ 2 వికెట్లు పడగొట్టాడు.

37 సెంచరీ చేసేందుకు టిమ్ డేవిడ్ తీసుకున్న బంతులు. ఆస్ట్రేలియా తరఫున ఇదే వేగవంతమైన శతకం. జోష్ ఇన్‌గ్లిస్ (43 బంతుల్లో; స్కాట్లాండ్‌పై) రికార్డును డేవిడ్ సవరించాడు.

2 మూడు ఫార్మాట్లలో సెంచరీలు చేసిన రెండో వెస్టిండీస్ ప్లేయర్‌గా హోప్ నిలిచాడు. క్రిస్ గేల్ గతంలో ఈ ఫీట్ నమోదు చేశాడు.

సత్యన్ జోడీకి టైటిల్



- రన్నరప్‌గా ఆకుల శ్రీజ
- డబ్ల్యూటీటీ కంటెండర్ టోర్నీ

లాగోస్ (నైజీరియా): వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) కంటెండర్ టోర్నమెంట్‌లో... భారత ప్యాడ్లర్లు సత్యన్ జ్ఞానశేఖరన్–ఆకాశ్ పాల్ టైటిల్ దక్కించుకున్నారు. తెలంగాణ ప్లేయర్ ఆకుల శ్రీజ ఫైనల్లో మహిళల సింగిల్స్ పరాజయం పాలై రన్నరప్‌తో సరిపెట్టుకుంది. శనివారం పురుషుల డబుల్స్ ఫైనల్లో సత్యన్–ఆకాశ్ జోడీ 3–0 (11–9, 11–4, 11–9)తో లియో నోడ్రెస్ట్–జులెస్ రోలాండ్ (ఫ్రాన్స్) ద్వయంపై విజయం సాధించింది. పూర్తి ఏకపక్షంగా సాగిన తుది పోరు కేవలం 22 నిమిషాల్లో ముగియగా... భారత ప్యాడ్లర్లు సంపూర్ణ ఆధిపత్యం కనబర్చారు. మ్యాచ్ ఆరంభం నుంచి జోరు కనబర్చిన భారత జోడీ తమ సర్వీస్‌లో 19 పాయింట్లు సాధించడంతో పాటు... ప్రత్యర్థి సర్వీస్‌లో 14 పాయింట్లు రాబట్టి మ్యాచ్‌ను ముగించింది. ఇక మహిళల సింగిల్స్ ఫైనల్లో శ్రీజ 1–4 (7–11, 3–11, 4–11, 11–9, 11–13)తో రెండో సీడ్ హొనొకా హషిమోటో (జపాన్) చేతిలో ఓడింది. 48 నిమిషాల పాటు సాగిన పోరులో తొలి మూడు గేమ్‌ల్లో పెద్దగా ప్రభావం చూపలేక వెనుకబడి పోయిన శ్రీజ ఆ తర్వాత పుంజుకొంది. నాలుగో గేమ్‌లో హోరాహోరీగా పోరాడి విజయం సాధించిన శ్రీజ... ఐదో గేమ్‌ను టై బ్రేక్‌కు తీసుకెళ్లింది. అయితే కీలక సమయాల్లో ఆధిక్యం కనబర్చిన జపాన్ ప్యాడ్లర్ ఒత్తిడి పెంచి విజయం సాధించింది.

తన్వీ, వెన్నెలకు కాంస్యాలు





సోలో (ఇండోనేసియా): భారత రైజింగ్ షట్లర్లు వెన్నెల కలగొట్ల, తన్వీ శర్మలు ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకాలతోనే సరిపెట్టుకున్నారు. అండర్–19 మహిళల సింగిల్స్‌లో సెమీఫైనల్స్‌కు చేరడం ద్వారానే కనీసం కాంస్య పతకాలు ఖాయం చేసుకున్న వీళ్లిద్దరికి శనివారం సెమీఫైనల్లో చుక్కెదురైంది. తెలుగమ్మాయి వెన్నెల 15–21, 18–21తో చైనాకు చెందిన లియూ సి యా చేతిలో పోరాడి ఓడింది. 37 నిమిషాల పాటు జరిగిన ఈ పోరులో రెండో గేమ్‌ను చేజిక్కించుకునేందుకు వెన్నెల చెమటోడ్చింది. 15–20తో ఇక మ్యాచ్ ఓడిపోయి స్థితిలో ఉన్నప్పటికీ ఏమాత్రం నిరాశచెందకుండా వరుసగా మూడు పాయింట్లను సాధించి రేసులో నిలిచింది. కానీ చైనా ప్రత్యర్థి ఈ దశలో మరింత జాగ్రత్త పడటంతో గెలిచేందుకు అవసరమైన పాయింట్ సాధించి ముందంజ వేసింది. మరో మ్యాచ్‌లో తన్వీ శర్మ 13–21, 14–21తో ఎనిమిదో సీడ్ యిన్ యి కింగ్ (చైనా) ధాటికి నిలువలేకపోయింది. తొలి గేమ్‌ను కోల్పోయిన పంజాబీ షట్లర్ ఒక దశలో రెండో గేమ్‌ను దూకుడుగా మొదలుపెట్టింది. 6–1 ఆధిక్యంతో జోరుపెంచింది. కానీ వరుస తప్పిదాలతో పాయింట్లను కోల్పోయి 8–8 వద్ద సమం కాగా అక్కడి నుంచి పట్టు కోల్పోయింది. గత నెల యూఎస్ ఓపెన్ సూపర్–300 టోర్నీలో రన్నరప్‌గా నిలిచిన తన్వీ వరుసగా ఈ టోర్నీలో కాంస్యం గెలుపొందడం విశేషం. మొత్తం మీద ఈ జూనియర్ ఆసియా టోర్నీలో 13 ఏళ్ల పతక నిరీక్షణకు వెన్నెల, తన్వీ కాంస్యాలతో తెరదించారు. చివరిసారిగా భారత్ 2012లో స్వర్ణం గెలుచుకుంది. పీవీ సింధు ఆ ఏడాది విజేతగా నిలిచింది.

సెప్టెంబర్ 14న భారత్, పాకిస్తాన్ మ్యాచ్!

- యూఏఈ వేదికగా ఆసియాకప్
- సెప్టెంబర్ 9 నుంచి మ్యాచ్‌లు

కరాచీ: ఆసియాకప్ పురుషుల క్రికెట్ టోర్నమెంట్ ఈ ఏడాది సెప్టెంబర్ 9 నుంచి 28 వరకు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో నిర్వహించనున్నట్లు ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) చైర్మన్ మొహసిన్ నఖ్వీ ప్రకటించారు. త్వరలోనే టోర్నీకి సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను విడుదల చేయనున్నట్లు శనివారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. కాగా... ప్రణాళిక ప్రకారం భారత్, పాకిస్తాన్ మధ్య సెప్టెంబర్ 14న గ్రూప్ దశ మ్యాచ్, 21న 'సూపర్ ఫోర్' మ్యాచ్‌లు జరిగే అవకాశం ఉంది. ఈ టోర్నీలో మొత్తం 19 మ్యాచ్‌లు జరగనుండగా... దుబాయ్, అబుదాబిలో మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. యూఏఈ, ఒమాన్, పాకిస్తాన్‌తో కలిసి భారత్ గ్రూప్ 'ఎ' నుంచి బరిలోకి దిగనుండగా... శ్రీలంక, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్, హాంకాంగ్ గ్రూప్ 'బి'లో పోటీపడనున్నాయి. 'ఈ ఏడాది ఏసీసీ పురుషుల ఆసియాకప్ పోటీలు



యూఏఈలో నిర్వహిస్తాం. సెప్టెంబర్ 9 నుంచి 28 మధ్య మ్యాచ్‌లు జరుగుతాయి. పూర్తి షెడ్యూల్ త్వరలోనే విడుదలవుతుంది' అని నఖ్వీ పేర్కొన్నారు. ఇటీవల జరిగిన ఏసీసీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయించినట్లు సమాచారం. ఈ టోర్నీకి భారత్ ఆతిథ్యమిస్తుండగా... సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో భారత్, పాకిస్తాన్ కేవలం తటస్థ వేదికల్లోనే తలపడాలని నిర్ణయించుకున్న నేపథ్యంలో మ్యాచ్‌లను యూఏఈలో నిర్వహించనున్నారు. ప్రసారదారులతో ఏసీసీ కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్తాన్ ఒకే గ్రూప్ నుంచి పోటీపడనున్నాయి. దీంతో గ్రూప్ స్థాయిలో, 'సూపర్ ఫోర్' దశతో పాటు ఫైనల్లో ఇరు జట్లు పోటీపడే అవకాశాలున్నాయి. వచ్చే ఏడాది భారత్, శ్రీలంక వేదికగా ఐసీసీ టి20 ప్రపంచకప్ జరగనుండటంతో... ఆసియాకప్‌ను అదే ఫార్మాట్‌లో నిర్వహించాలని నిర్ణయించారు.



నోరిస్‌కు పోల్

బెల్జియం గ్రాండ్‌ప్రి

స్పా–ఫ్రాంకోర్‌చాంప్స్ (బెల్జియం): ఫార్ములావన్ బెల్జియం గ్రాండ్‌ప్రి క్వాలిఫయింగ్ టోర్నీలో మెక్‌లారెన్ డ్రైవర్ లాండో నోరిస్ పోల్ పొజిషన్ దక్కించుకున్నాడు. శనివారం జరిగిన క్వాలిఫయింగ్ రేసులో నోరిస్ 1 నిమిషం 40.562 సెకన్లలో ల్యాప్‌ను పూర్తిచేసి అగ్రస్థానం దక్కించుకున్నాడు. ఆదివారం జరగనున్న ప్రధాన రేసును నోరిస్ పోల్ పొజిషన్ నుంచి ప్రారంభించనున్నాడు. 2012లో జెన్సన్ బటన్ తర్వాత బెల్జియం గ్రాండ్‌ప్రిలో పోల్ పొజిషన్ దక్కించుకున్న తొలి మెక్‌లారెన్ డ్రైవర్‌గా నోరిస్ నిలిచాడు. మెక్‌లారెన్‌కే చెందిన ఆస్కార్ పియాస్ట్రి 1 నిమిషం 40.647 సెకన్లలో ల్యాప్‌ను ముగించి రెండో స్థానం దక్కించుకోగా... ఫెరారీ డ్రైవర్ లెక్‌లెర్క్ 1 నిమిషం 40.903 సెకన్లతో మూడో స్థానంలో నిలిచాడు. నాలుగుసార్లు ప్రపంచ చాంపియన్, రెడ్‌బుల్ డ్రైవర్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్ (1 నిమిషం 40.903 సెకన్లు) నాలుగో స్థానంలో నిలవగా... ఏడుసార్లు ప్రపంచ చాంపియన్, ఫెరారీ డ్రైవర్ లూయిస్ హామిల్టన్ (1 నిమిషం 41.939 సెకన్లు) 16వ స్థానానికి పరిమితమయ్యాడు. అంతకుముందు జరిగిన స్ప్రింట్ రేస్‌లో రెడ్‌బుల్ డ్రైవర్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్ విజేతగా నిలిచాడు. 24 రేసుల తాజా సీజన్‌లో ఇప్పటి వరకు 12 రేసులు ముగియగా... డ్రైవర్స్ చాంపియన్‌షిప్‌లో పియాస్ట్రి 241 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా... నోరిస్ 232 పాయింట్లతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. డిఫెండింగ్ చాంపియన్ వెర్‌స్టాపెన్ 173 పాయింట్లతో మూడో స్థానంలో ఉన్నాడు.

సెమీస్‌లో ఓడిన నగాల్

న్యూఢిల్లీ: ఈ సీజన్‌లో తొలిసారి ఓ చాలెంజర్ స్థాయి టెన్నిస్ టోర్నీలో ఫైనల్ చేరాలనుకున్న భారత స్టార్ సుమిత్ నగాల్ ఆశలకు సెమీస్‌లోనే చుక్కెదురైంది. టాంపెర్ ఓపెన్ టెన్నిస్ టోర్నీలో శనివారం జరిగిన సెమీఫైనల్లో ప్రపంచ 306 ర్యాంక్ ఆటగాడు నగాల్ 5–7, 2–6తో 363వ ర్యాంకర్ సష గ్వెమర్డ్ వేయెన్‌బర్గ్ చేతిలో కంగు తిన్నాడు. తొలిసెట్‌లో పోరాడిన సుమిత్ 5–5తో ప్రత్యర్థిని నిలువరించాడు. ఈ దశలో సర్వీస్‌ను నిలబెట్టుకున్న వేయెన్‌బర్గ్ వెంటనే ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసి సెట్ కైవసం చేసుకున్నాడు. రెండో సెట్‌లో నగాల్ పోరాటపటిమ కనబరచకపోవడంతో సులువుగానే సెట్‌ను, మ్యాచ్‌ను గెలిచాడు.

జాదవ్‌కు స్వర్ణం పర్నీత్‌కు రజతం

పాయింట్ తేడాతో పర్నీత్‌కు 'పసిడి' దూరం ● ప్రపంచ వర్సిటీ క్రీడలు



రినె–రుర్ ఎసెన్ (జర్మనీ): ప్రపంచ యూనివర్సిటీ క్రీడల్లో భారత ఆర్చర్ సాహిల్ జాదవ్ స్వర్ణంపై పెట్టిన గురి కుదిరింది. పురుషుల వ్యక్తిగత కాంపౌండ్ విభాగంలో అతను బంగారు పతకం సాధించాడు. అయితే మహిళల కాంపౌండ్‌లో పర్నీత్ కౌర్‌కు తృటిలో పసిడి పతకం చేజారింది. ఆర్చర్లు ఐదు పతకాలతో ఈ పోటీలను ముగించారు. మిగతా మూడు పతకాలు టీమ్ ఈవెంట్‌లో వచ్చాయి. మిక్స్‌డ్ టీమ్ స్వర్ణం, పురుషుల టీమ్ రజతం, మహిళల టీమ్ కాంస్యం గెలుచుకుంది. ఒలింపిక్ క్రీడ అయిన రికర్వ్‌లో మాత్రం భారత ఆర్చర్లు నిరాశపరిచారు. పురుషుల కాంపౌండ్ టైటిల్ పోరులో సాహిల్ జాదవ్ గురి అదిరింది. మొత్తం 15 బాణాలను సంధించగా... ఇందులో ఏకంగా 14 షాట్లు కచ్చితత్వంతో లక్ష్యాన్ని చేరాయి. దీంతో పదికి పది పాయింట్లు లభించగా, ఆఖరి బాణం 9 పాయింట్లు తెచ్చింది. దీంతో



జాదవ్ 149–148 స్కోరుతో అజయ్ స్కాట్ (బ్రిటన్)పై గెలిచి బంగారం అందుకున్నాడు. అంతకుముందు భారతీయుల మధ్యే జరిగిన సెమీస్‌లో సాహిల్ 148–148తో కుశాల్ దలాల్‌తో సమంగా నిలిచాడు. అయితే షూటాఫ్‌లో సాహిల్ జాదవ్ మెరుగైన స్థితిలో ఉండటంతో ఫైనల్ చేరాడు. మహిళల కాంపౌండ్‌లో ఆసియా క్రీడల టీమ్‌ఈవెంట్ స్వర్ణ పతక విజేత అయిన పర్నీత్ కౌర్ దాదాపు స్వర్ణంపైనే గురిపెట్టింది. కానీ ఆఖరి మెట్టుపై అనూహ్యంగా ఒత్తిడికి గురై తృటిలో పసిడి పట్టలేకపోయింది. చివరకు పాయింట్ తేడాతో బంగారాన్ని దూరం చేసుకున్న పర్నీత్ రజతంతో సరిపెట్టుకుంది. ఫైనల్లో ఆమె 146–147 స్కోరుతో మూన్ యూన్ (దక్షిణ కొరియా) చేతిలో ఓడింది. అంతకుముందు క్వాలిఫికేషన్ రౌండ్‌లో టాపర్‌గా నిలిచింది. సెమీస్‌లో 145–144తో ఐదో సీడ్ కిమ్ సూయెన్ (దక్షిణ కొరియా)ను కంగుతినిపించింది.

కివీస్‌దే ముక్కోణపు టోర్నీ



ముక్కోణపు టి20 టోర్నమెంట్ ట్రోఫీ దక్కించుకోవాలంటే దక్షిణాఫ్రికా జట్టుకు 18 బంతుల్లో 37 పరుగులు కావాలి. అలాంటి దశలో... డెవాల్డ్ బ్రేవిస్ మూడు సిక్స్‌లతో విజృంభించడంతో సఫారీ సమీకరణం 6 బంతుల్లో 7 పరుగులకు చేరింది. ఇంకేముంది దక్షిణాఫ్రికా విజయం ఖాయమే అనుకుంటే... ఆఖర్లో కివీస్ బౌలర్ మ్యాట్ హెన్రీ అద్భుతం చేశాడు. జోరుమీదున్న బ్రేవిస్, హెన్రీలను అవుట్ చేసి న్యూజిలాండ్‌కు ట్రోఫీ కట్టబెట్టాడు. దీంతో సఫారీలకు నిరాశ తప్పలేదు.

- ఫైనల్లో దక్షిణాఫ్రికాపై ఉత్కంఠ విజయం
- కివీస్‌ను గెలిపించిన మ్యాట్ హెన్రీ

హరారే: ముక్కోణపు టి20 టోర్నమెంట్‌లో న్యూజిలాండ్ విజేతగా నిలిచింది. శనివారం చివరి బంతి వరకు హోరాహోరీగా సాగిన ఫైనల్లో న్యూజిలాండ్ 3 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాపై విజయం సాధించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 180 పరుగులు చేసింది. డెవాన్ కాన్వే (31 బంతుల్లో 47; 6 ఫోర్లు, 1 సిక్స్), రచిన్ రవీంద్ర (27 బంతుల్లో 47; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), టిమ్ సీఫెర్ట్ (30; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో ఎంగిడి 2 వికెట్లు పడగొట్టాడు. అనంతరం లక్ష్యఛేదనలో దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 177 పరుగులకు పరిమితం అయింది. డ్రె ప్రిటోరియస్ (35 బంతుల్లో 51; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధశతకంతో రాణించగా... రీజా హెండ్రిక్స్ (37; 4 సిక్స్‌లు), డెవాల్డ్ బ్రేవిస్ (16 బంతుల్లో 31; 1 ఫోర్, 3 సిక్స్‌లు) మెరుపులు మెరిపించారు. బంతి బంతికి సమీకరణాలు మారుతూ దక్షిణాఫ్రికా విజయం ఖాయమే అనుకుంటున్న సమయంలో హెన్రీ అద్భుతంగా బౌలింగ్ చేసి న్యూజిలాండ్‌ను ఒంటిచేత్తో గెలిపించాడు. అప్పటి వరకు ధాటిగా ఆడిన సఫారీ బ్యాటర్లు ఆఖర్లో ఒత్తిడికి చిత్తై ట్రోఫీని కివీస్‌కు కట్టబెట్టారు. జింబాబ్వే, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ మధ్య జరిగిన ఈ టోర్నీలో న్యూజిలాండ్ ఒక్క మ్యాచ్‌లోనూ ఓడిపోకుండా ట్రోఫీ కైవసం చేసుకుంది. మ్యాట్ హెన్రీకి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు దక్కాయి.

సాక్షి ప్లస్
ఆదివారం । 27-7-2025



ఎర్రనివన్నీ సర్వీసు నుంచి తొలగించిన బస్సులు.
ముంబైలోని ఓ డిపోలో చెట్లు, పొదలు అల్లుకుపోయి కన్పిస్తున్నాయిలా



కార్గిల్ డే సందర్భంగా శనివారం నేషనల్ వార్ మెమోరియల్ వద్ద
పుష్పగుచ్ఛముంచుతున్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్, చిత్రంలో సీడీఎస్ జనరల్ చౌహాన్, త్రివిధ దళాధిపతులు

మూడో రోజూ కొనసాగిన ఘర్షణలు

సురిన్(థాయ్‌లాండ్): థాయ్‌లాండ్, కాంబోడియాల మధ్య సరిహద్దుల్లో ప్రారంభమైన ఘర్షణలు శనివారంతో మూడో రోజుకు చేరుకున్నాయి. కాల్పుల ఘటనల్లో ఇరు పక్షాలకు చెందిన కనీసం 33 మంది చనిపోగా, 1.68 లక్షల మంది నిరాశ్రయులయ్యారు. కాల్పుల విరమణకు రావాలంటూ ఇరుదేశాలపై అంతర్జాతీయంగా ఒత్తిళ్లు పెరుగుతున్నాయి. సరిహద్దు వివాదాస్పద ప్రాంతంలో గురువారం మందుపాతర పేలి ఐదుగురు థాయ్ సైనికులు చనిపోవడం ఘర్షణలకు ఆజ్యం పోసింది. శనివారం ఘర్షణలు మరిన్ని ప్రాంతాలకు విస్తరించింది. ఇరు పక్షాలు రాకెట్లు, శతఘ్నులతో కాల్పులకు దిగాయి. ఎఫ్–16 యుద్ధ విమానాలను, డ్రోన్లను దాడులకు వినియోగించినట్లు థాయ్ ప్రభుత్వం ప్రకటించుకుంది. ఇరు దేశాలు తమ రాయబారులను వెనక్కి పిలిపించుకున్నాయి. థాయ్‌లాండ్ ఈశాన్య ప్రాంతంలోని కాంబోడియా సరిహద్దును మూసివేసింది.

థాయ్‌లాండ్-కాంబోడియా పరస్పర ఆరోపణలు
- 33కు చేరిన మరణాల సంఖ్య..
- నిరాశ్రయులైన 1.68 లక్షల మంది
- కాల్పుల విరమణకు ఒత్తిళ్లు

మీరంటే మీరే..

సరిహద్దుల్లోని తమ పుర్సత్ ప్రావిన్స్‌లోని పలు ప్రాంతాలపైకి థాయ్ సైన్యం శనివారం ఉదయం శతఘ్ని కాల్పులకు దిగిందని కాంబోడియా రక్షణ శాఖ తెలిపింది. అదేవిధంగా, తమ కోహ్ కాంగ్ ప్రావిన్స్ తీర ప్రాంతాల్లోకి థాయ్ నేవీ పడవలు ప్రవేశించాయంది. ఆ దేశం రెచ్చగొట్టేలా దురాక్రమణ చర్యలకు పాల్పడుతోందని ఆరోపించింది. థాయ్ కాల్పుల్లో ఇప్పటి వరకు చనిపోయిన వారిలో ఏడుగురు పౌరులు కాగా నలుగురు సైనికులు ఉన్నారంది. కాంబోడియాలోని పౌర నివాసాలను తాము లక్ష్యంగా చేసుకున్నామంటూ చేస్తున్న ఆరోపణలను థాయ్ ప్రభుత్వం ఖండించింది. కాంబోడియా ఆర్మీ పౌరులను రక్షణ కవచాలుగా వాడుకుంటూ నివాస ప్రాంతాల్లో ఆయుధాలను మోహరిస్తోందని ఆరోపించింది. ట్రాట్ ప్రావిన్స్‌లోకి ప్రవేశించేందుకు కాంబోడియా ఆర్మీ చేసిన ప్రయత్నాన్ని తిప్పికొట్టామంది.

పౌరులకు భారత ఎంబసీ అడ్వైజరీ

థాయ్‌లాండ్‌తో జరుగుతున్న ఘర్షణల నేపథ్యంలో కాంబోడియాకు వచ్చే భారత పౌరులు అప్రమత్తంగా ఉండాలని నాంఫెన్‌లోని భారత రాయబార కార్యాలయం పేర్కొంది. ముఖ్యంగా కాంబోడియా సరిహద్దు ప్రాంతాల వైపు రావద్దని కోరింది. ఈ మేరకు శనివారం అడ్వైజరీ జారీ చేసింది. అత్యవసర సాయం కావాల్సిన వారు +855 92881676 నంబర్‌కు లేక cons.phnompenh@mea.gov.in. మెయిల్ ద్వారా సంప్రదించాలని కోరింది. ఇదే విషయమై శుక్రవారం థాయ్‌లాండ్‌లోని భారత ఎంబసీ కూడా అడ్వైజరీ జారీ చేయడం తెల్సిందే.

ఆసియాన్ చొరవను కోరిన మండలి

థాయ్‌లాండ్ – కాంబోడియా ఉద్రిక్తతలపై హ్యూమన్ రైట్స్ వాచ్ ఆందోళన వ్యక్తం చేసింది. పౌరులు, ముఖ్యంగా చిన్నారులకు హాని తలపెట్టేలా వ్యవహరించవద్దని కోరింది. సరిహద్దులు సమీపంలోని 852స్కూళ్లతోపాటు ఏడు ఆస్పత్రులను థాయ్ ప్రభుత్వం ముందు జాగ్రత్తగా మూసివేసిందని తెలిపింది. శనివారం మరో 12 మంది చనిపోయినట్లు కాంబోడియా తెలిపింది. దీంతో, ఆ దేశంలో మరణాల సంఖ్య 13కు చేరుకుంది. థాయ్‌లాండ్ సైతం మరణాల సంఖ్య 20కి చేరినట్లు ప్రకటించింది. వీరిలో అత్యధికులు పౌరులేనని పేర్కొంది. శుక్రవారం అత్యవసరంగా సమావేశమైన ఐరాస భద్రతా మండలి రెండు దేశాలు కాల్పుల విరమణను ప్రకటించేలా చొరవ తీసుకోవాలంటూ ఆగ్నేయాసియా దేశాల సమాఖ్య ఆసియాన్‌ను కోరుతూ తీర్మానం చేసింది. ఆసియాన్ అధ్యక్ష స్థానంలో ఉన్న మలేసియా దీనిపై స్పందించింది. రెండు దేశాలతో చర్చలు జరిపి, ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పే బాధ్యతను రక్షణ మంత్రికి అప్పగించినట్లు మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం తెలిపారు. రెండు దేశాల మధ్య ఉన్న 800 కిలోమీటర్ల పొడవైన సరిహద్దుల్లోని కొన్ని ప్రాంతాల విషయంలో దశాబ్దాలుగా విభేదాలు కొనసాగుతున్నాయి.

'కార్గిల్' అమరవీరులకు రాష్ట్రపతి, ప్రధాని నివాళులు

దేశవ్యాప్తంగా కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమాలు

న్యూఢిల్లీ: కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ తదితర ప్రముఖులు శనివారం కార్గిల్ అమర వీరులకు నివాళులర్పించారు. 1999 జూలై 26న కార్గిల్ యుద్ధం ముగిసిన సంగతి తెలిసిందే. భారత్‌లోకి చొరబడిన పాకిస్తాన్ సైన్యాన్ని మన సైన్యం చిత్తుచిత్తుగా ఓడించింది. ఈ నేపథ్యంలో ప్రతిఏటా జూలై 26న కార్గిల్ విజయ్ దివస్ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. జమ్మూకశ్మీర్‌లోని ద్రాస్ సెక్టార్ సహా దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. కార్గిల్ అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. మన జవాన్ల అసాధారణ ధైర్య సాహసాలకు కార్గిల్ యుద్ధం ఒక నిదర్శనమని రాష్ట్రపతి ముర్ము పేర్కొన్నారు. వారి అంకితభావం, త్యాగాలు దేశ ప్రజలకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తూనే ఉంటాయని స్పష్టంచేశారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఒక సందేశం విడుదల చేశారు. ప్రధాని మోదీ స్పందిస్తూ... దేశాన్ని కాపాడేందుకు మన సైనికులు ఎన్నో త్యాగాలు చేశారని కొనియాడారు. అసమాన ధైర్యసాహసాలు ప్రదర్శించారని తెలిపారు. వారు చిరస్మరణీయులు అని పేర్కొన్నారు. మన సైనిక దళాల చిత్తశుద్ధి, అంకితభావం వల్లే కార్గిల్ యుద్ధంలో విజయం లభించిందని రాజ్‌నాథ్ సింగ్ శ్లాఘించారు. వారికి మనం ఎప్పటికీ రుణపడి ఉంటామని ఉద్ఘాటించారు.

రిటైర్‌మెంట్ తర్వాత ప్రభుత్వ పదవులు వద్దు

- కన్సల్టేషన్, ఆర్బిట్రేషన్ బాధ్యతలు నిర్వర్తిస్తా
- సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ వెల్లడి

అమరావతి: పదవీ విరమణ తర్వాత ప్రభుత్వ కొలువులు ఆశించబోనని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ స్పష్టంచేశారు. ప్రభుత్వ పదవులు తనకు ఇష్టం లేదన్నారు. రిటైర్‌మెంట్ తర్వాత కన్సల్టెంట్‌గా, మధ్యవర్తిగా ప్రజలకు తన వంతు సేవలందిస్తానని చెప్పారు. మహారాష్ట్రలోని అమరావతిలో జిల్లా, సెషన్స్ కోర్టు ప్రాంగణంలో టి.ఆర్.గిల్డా స్మారక ఈ–లైబ్రరీని శనివారం జస్టిస్ గవాయ్ ప్రారంభించారు. ఈ ఏడాది నవంబర్ 23న తాను పదవీ విరమణ చేయబోతున్నానని వెల్లడించారు. ప్రభుత్వ పదవులేవీ స్వీకరించబోనంటూ గతంలోనూ పలుమార్లు స్పష్టంచేశానని పేర్కొన్నారు. కన్సల్టేషన్, ఆర్బిట్రేషన్ బాధ్యతలు నిర్వర్తిస్తానని వివరించారు. జస్టిస్ బి.ఆర్.గవాయ్ శుక్రవారం సొంత గ్రామం అమరావతి జిల్లాలోని దారాపూర్‌లో తన తండ్రి, దివంగత గవర్నర్ ఆర్.ఎస్.గవాయ్ స్మారకం వద్ద నివాళులర్పించారు. అలాగే గ్రామ ముఖ ద్వారం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

దేశవ్యాప్తంగా పెరిగిన పంటల సాగు

సాక్షి, న్యూఢిల్లీ: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో దేశవ్యాప్తంగా పంటల సాగులో గణనీయ పెరుగుదల నమోదైనట్లు కేంద్ర వ్యవసాయ శాఖ ప్రకటించింది. గత ఏడాది పంటల సాగుతో పోలిస్తే ఈసారి సాగు విస్తీర్ణం 4.5 శాతం మేర పెరిగినట్లు ప్రకటించింది. దేశవ్యాప్తంగా సరాసరి పంటల సాగు విస్తీర్ణం 10.96 కోట్ల హెక్టార్లు కాగా, ఈ ఏడాది ఇప్పటివరకు 7.15 కోట్ల హెక్టార్లలో సాగు పూర్తయిందని పేర్కొంది. గత ఏడాది విస్తీర్ణం 6.80 కోట్ల హెక్టార్లతో పోలిస్తే, ఇది 35 లక్షల హెక్టార్ల మేర అధికమని వెల్లడించింది. సాధారణంగా వరి సాగు విస్తీర్ణం 4.03 కోట్ల హెక్టార్లు కాగా, ఇప్పటికే 1.77 కోట్ల హెక్టార్లలో సాగు పూర్తయిందని కేంద్ర వ్యవసాయ శాఖ తెలియజేసింది. గత ఏడాదితో ఇదే సమయంతో పోలిస్తే ఇది 12 శాతం అధికమని స్పష్టంచేసింది. పప్పుధాన్యాల సాగు గత ఏడాది 80 లక్షలుగా ఉండగా, ఈ ఏడాది 82 లక్షల హెక్టార్లకు చేరినట్లు స్పష్టంచేసింది.

25 మంది పాలస్తీనియన్ల మృతి

కొనసాగుతున్న ఇజ్రాయెల్ దాడులు, కాల్పులు

మరణం అంచున గాజా చిన్నారులు • ఐరాస తీవ్ర ఆందోళన

డెయిర్ అల్ బలాహ్: గాజాలో ఇజ్రాయెల్ వైమానిక దాడులు, సైన్యం కాల్పులు యథాప్రకారం కొనసాగుతున్నాయి. ఆహార పంపిణీ కేంద్రాల వద్ద జరిగిన కాల్పులు, వైమానికదాడుల్లో మరో 25 మంది పాలస్తీనియన్లు చనిపోయారు. వీరిలో అత్యధికులు జికిమ్ సరిహద్దు పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన ఆహార ట్రక్కుల వద్ద ఎదురుచూస్తున్న వారేనని షిఫా ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. 'శుక్రవారం సాయంత్రం జికిమ్ సమీపంలో వాహనాల లైట్ల వెలుతురు కనిపించగానే ఆహార ట్రక్కులని భావించి పెద్ద సంఖ్యలో జనం అటుగా పరుగు తీశారు. దగ్గరికొచ్చాక చూడగా అవి మిలటరీ ట్యాంకులు.. జనంపైకి ఆర్మీ యథేచ్ఛగా కాల్పులకు దిగింది' అని ప్రత్యక్ష సాక్షి షరీఫ్ అబూ ఐషా చెప్పారు. మృతుల్లో ఎనిమిది మంది సంతానం కలిగిన తన మామ కూడా ఉన్నాడన్నారు. గాజా సిటీలోని ఓ అపార్టుమెంట్ భవనంపై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడిలో ఓ చిన్నారి సహా మరో నలుగురు ప్రాణాలు కోల్పోయారు.

చిన్నారులకు సాయం అందాలి

గాజాలో చిన్నారులు ఆకలి చావులకు గురవుతున్నారని ఐరాస ఆందోళన వ్యక్తం చేసింది. సరైన ఆహారం లేక చనిపోయే పాలస్తీనియన్ల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని తెలిపింది. ఇజ్రాయెల్ విరామం లేకుండా కొనసాగిస్తున్న దాడుల కారణంగా ఆహార ట్రక్కులు కూడా ఆ ప్రాంతంలోకి వెళ్లడం వీలుకావడం లేదని ఐరాస పేర్కొంది. గత వారం రోజుల వ్యవధిలో 250కి పైగా ట్రక్కుల ఆహారాన్ని గాజాలోకి అనుమతించామని ఇజ్రాయెల్ చెబుతోంది. అయితే, మార్చితో ముగిసిన కాల్పుల విరమణ సమయంలో గాజాలోకి నిత్యం 600 ట్రక్కుల ఆహారం అందేదని ఐరాస గుర్తు చేసింది. అమెరికా, ఇజ్రాయెల్ సారథ్యంలో మేలో ఆహార పంపిణీ కేంద్రాలు మొదలవ్వగా ఇక్కడికి చేరుకునే అన్నార్తులపైనా ఇజ్రాయెల్ ఆర్మీ కాల్పులకు తెగబడుతోంది. ఇలా ఆహారం కోసం వచ్చి వెయ్యి మందికిపైగా పాలస్తీనియన్లు ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఈ నేపథ్యంలో జోర్డాన్ చేసిన వినతికి ఇజ్రాయెల్ అంగీకరించింది. దీని ప్రకారం, పాలు, ఆహారం తదితర మిశ్రమం ప్యాకెట్లను గాజా వాసులకు విమానాల్లోంచి జోర్డాన్ జారవిడువనుంది. మరోవైపు, వైద్య సాయం అవసరమయ్యే చిన్నారులను గాజా నుంచి తరలించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని బ్రిటన్ ప్రధాని స్టార్మర్ తెలిపారు. అయితే, విమానాల నుంచి ఆహార ప్యాకెట్లు జార విడవడం ఖరీదైన, ఫలితమివ్వని వ్యవహారంగా ఐరాస పాలస్తీనా శరణార్థి విభాగం చీఫ్ ఫిలిప్ తెలిపారు. దీనివల్ల ఆకలి చావులు ఆగవని హెచ్చరించారు.

ప్రత్యామ్నాయం చూస్తున్నాం

ఇజ్రాయెల్, హమాస్ మధ్య కాల్పుల విరమణపై ఖతార్‌లో జరుగుతున్న చర్చలు ముందుకు సాగడం లేదు. ఈ సమయంలో కాల్పుల విరమణకు బదులుగా తాము ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ శనివారం పేర్కొన్నారు. చర్చలు వచ్చే వారం తిరిగి మొదలవుతాయని హమాస్ ప్రతినిధి ఒకరు వెల్లడించారు. కాల్పుల విరమణ చర్చలకు అమెరికాతో పాటు మధ్యవర్తిత్వం వహిస్తున్న ఖతార్, ఈజిప్టులు సైతం ప్రస్తుత స్తబ్దత తాత్కాలికమేనని పేర్కొన్నాయి. తిరిగి చర్చలు మొదలవుతాయని తెలిపాయి. ఎప్పుడో వెల్లడించలేదు.

కరెన్సీ నోటుపై అంబేడ్కర్ ఫొటో

ప్రధాని మోదీకి సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా లేఖ

సాక్షి, న్యూఢిల్లీ: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫొటోను కరెన్సీ నోట్లపై ముద్రించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు. 'కరెన్సీపై అంబేడ్కర్ సాధన సమితి' జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జేరిపోతుల పరశురామ్ శనివారం ఢిల్లీలో డి.రాజాను కలిశారు. ఆరు నెలల వ్యవధిలో కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ ఫొటోను ముద్రించాలన్న డిమాండ్‌తో లక్ష పోస్టు కార్డులను ప్రధాని మోదీకి రాస్తున్నట్లు జేరిపోతుల పరుశురామ్ తెలిపారు. లక్ష పోస్టు కార్డుల ఉద్యమానికి డి.రాజా మద్దతు పలికారు. ఆగస్టు 4న జరిగే సీపీఐ జాతీయ కమిటీ సమావేశంలో ఈ అంశంపై చర్చించి, తీర్మానం చేసి రాజ్యసభకు పంపిస్తామని తెలిపారు.

స్కూలు పైకప్పు పెచ్చులు ఊడిపడి.. నలుగురు చిన్నారులకు గాయాలు

హాపూర్: మరో ప్రభుత్వ పాఠశాలలో ప్రమాదం చోటుచేసుకుంది. యూపీలోని హాపూర్ జిల్లాలో శుక్రవారం పైకప్పు పెచ్చులు ఊడి మీదపడి నలుగురు చిన్నారులు గాయపడ్డారు. భమేదా గ్రామంలోని పాఠశాల తరగతి గదిలో విద్యార్థులుండగానే పెద్ద శబ్దంతో పైకప్పు నుంచి ప్లాస్టర్ పెచ్చులు ఊడి వారిపై పడ్డాయి. దీంతో, విద్యార్థులు భయంతో కేకలు వేస్తూ పరుగులు తీశారు. స్థానికులు వచ్చి వారిని కాపాడారు. పోలీసులు అక్కడికి చేరుకుని శిథిలాలను అక్కడి నుంచి తొలగించారు. గాయపడిన విద్యార్థులను ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులైన నలుగురు చిన్నారులకు ఎలాంటి ప్రమాదం లేదని వైద్య సిబ్బంది ప్రకటించారు.

రాజ్యాంగాన్ని పట్టించుకోకుండా నీచ రాజకీయాలు

కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ ధ్వజం

న్యూఢిల్లీ: రాజ్యసభలో జస్టిస్ యశ్వంత్ వర్మపైప్రతిపక్షంఅభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టకుండా కేంద్ర ప్రభుత్వం అడ్డు తగులుతోందంటూ కాంగ్రెస్ పార్టీ మండిపడింది. రాజ్యాంగ నియమాలను తుంగలో తొక్కుతూ దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతోందని ధ్వజమెత్తింది. కాంగ్రెస్ సీనియర్ ప్రతినిధి అభిషేక్ సింఘ్వి శనివారం మీడియాతో మాట్లాడారు. న్యాయవ్యవస్థను జవాబుదారీగా చేసే విషయంలో జస్టిస్ వర్మ విషయంలో ఒకలా, అలహాబాద్ హైకోర్టు జస్టిస్ శేఖర్ యాదవ్ విషయంలో మరోలా వ్యవహరిస్తూ ద్వంద ప్రమాణాలను పాటిస్తోందంటూ ఆయన మండిపడ్డారు.జస్టిస్ వర్మ, జస్టిస్ యాదవ్‌ల పట్ల పక్షపాత ధోరణితో వ్యవహరించడంపై కాంగ్రెస్ తీవ్ర ఆందోళన చెందుతోందన్నారు. సిట్టింగ్ జడ్జి యాదవ్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ పార్టీ సిద్ధాంతాలను వల్లెవేసినట్లుగా ఉన్నప్పటికీ కేంద్రం మౌనంగా ఉండటమేంటని సింఘ్వి ప్రశ్నించారు. న్యాయవ్యవస్థ స్వతంత్రత, న్యాయ వ్యవస్థ జవాబుదారీతనం, అవినీతి వ్యతిరేక పోరాటం వంటి అంశాల్లో బీజేపీ చెప్పేదొకటి చేసేదొకటి అని విమర్శించారు. ఉపరాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ ఆకస్మికంగా రాజీనామా చేయడంపై సింఘ్వి.. ఏదో కాస్తంత స్వతంత్రంగా వ్యవహరించడమే తప్ప, ఆయన ఏ తప్పూ చేయలేదన్నారు.

21న జరిగిందిదే..: సింఘ్వి

ఈ నెల 21వ తేదీన పార్లమెంట్‌లో చోటుచేసుకున్న పరిణామాలను సింఘ్వి గుర్తు చేశారు. 'జస్టిస్ వర్మకు వ్యతిరేకంగా కాంగ్రెస్ తదితర పార్టీలు రాజ్యసభకు నోటీసిచ్చాయి. ఈ నోటీసుపై 63 మంది సభ్యుల సంతకాలున్నాయి. లోక్‌సభలోనూ పార్టీలకతీతంగా ఇచ్చిన అభిశంసన నోటీసుపై 152 మంది సభ్యుల సంతకాలున్నాయి. ఇలాంటి సమయంలో నిబంధనల ప్రకారం ఉమ్మడి కమిటీని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఇందులో భాగంగానే అప్పటి చైర్మన్ ధన్‌ఖడ్... మంత్రి మేఘ్వాల్‌ను లోక్‌సభలోనూ తీర్మానం ప్రవేశపెట్టారా అని అడగ్గా ఆయన అవునని సమాధానమిచ్చారు. ఆ తర్వాతే ధన్‌ఖడ్ తదుపరి చర్యలకు ఉపక్రమించారు. వాస్తవమిలా ఉంటే, శుక్రవారం న్యాయ మంత్రి రిజిజు మాత్రం రాజ్యసభలో ఎలాంటి తీర్మానం ప్రవేశపెట్టలేదంటూ ప్రకటన చేశారు. తన సొంత వాదనను వినిపించే అవకాశముండదని భయపడుతున్నందునే ప్రభుత్వం ఈ డ్రామా అంతా ఆడుతోంది' అని సింఘ్వి విమర్శించారు.ఎవరు ముందుగా ప్రకటించాలి, ఎవరు ముందుగా మాట్లాడాలి అనే విషయాలపైనే ప్రభుత్వం దృష్టంతా ఉందని చెప్పారు. రాజ్యసభ కంటే లోక్‌సభే మిన్న అన్నట్లుగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించడాన్ని ఆయన తప్పుబట్టారు.

మణిపూర్‌లో ఆయుధాలు స్వాధీనం

ఇంఫాల్: మణిపూర్‌లోని ఐదు జిల్లాల పరిధిలో భద్రతా బలగాలు చేపట్టిన సోదాల్లో భారీగా ఆయుధాలు లభ్యమయ్యాయి. విశ్వసనీయ సమాచారం మేరకు బలగాలు ఇంఫాల్ ఈస్ట్, ఇంఫాల్ వెస్ట్, థౌబల్, కక్చింగ్, బిష్ణుపూర్ జిల్లాల్లో ఏకకాలంలో చేపట్టిన ఈ ఆపరేషన్‌లో మణిపూర్ పోలీసులతో పాటు సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, ఆర్మీ, అస్సాం రైఫిల్స్ బలగాలు పాల్గొన్నాయి. ఈ దాడుల్లో ఏకే రైఫిళ్లు 3, ఎం16 రైఫిల్ 1, ఇన్సాస్ రైఫిళ్లు 5, ఎస్ఎల్ఆర్‌లు 4, పిస్టళ్లు 20, .303 రైఫిళ్లు 7 తదితర 90 ఆయుధాలతో పాటు, 21 గ్రెనేడ్లు, ఆరు మందుపాతరలు తదితర 728 పేలుడు పదార్థాలు లభ్యమయ్యాయి. సంఘ విద్రోహ శక్తులు పోలీసు స్టేషన్ల నుంచి వివిధ రకాలైన 6 వేల ఆయుధాలను ఎత్తుకుపోగా రాష్ట్రపతి పాలన విధించాక ఇప్పటి వరకు 3 వేల ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని ఐజీపీ కబీబ్ తెలిపారు. రాష్ట్రంలో కుకీలు, మైతేయి తెగల మధ్య 2023 నుంచి కొనసాగుతున్న హింసాకాండలో కనీసం 260మంది ప్రాణాలు కోల్పోవడం తెల్సిందే.

ఇరాన్‌లో అగంతకుల దాడి.. ఆరుగురు మృతి

దుబాయ్: ఇరాన్‌లోని సిస్తాన్ ప్రావిన్స్‌లో గుర్తు తెలియని సాయుధులు పాల్పడిన దాడిలో ఆరుగురు చనిపోగా, 20 మంది వరకు గాయపడ్డారు. ఈ ప్రావిన్స్ రాజధాని జహెదాన్‌లోని కోర్టు భవనంలో శనివారం ముగ్గురు సాయుధులు మొదటగా గ్రెనేడ్ విసిరి, కాల్పులకు తెగబడ్డారు. రంగంలోకి దిగిన భద్రతా బలగాలు దుండగులు ముగ్గురినీ కాల్చి చంపాయని అధికార టీవీ ప్రకటించింది. మృతుల వివరాలను వెల్లడించలేదు. సైన్యానికి అనుకూలమని భావించే తస్నీమ్ వార్తా సంస్థ మాత్రం..వారు జైష్ అల్-అదిల్ సంస్థకు చెందిన మిలిటెంట్లని తెలిపింది.

మీకు మద్దతిస్తున్నందుకు విచారిస్తున్నా

నితీశ్ సర్కారుపై చిరాగ్ పాశ్వాన్ ధ్వజం

పట్నా/గయా: బిహార్‌లో శాంతి భద్రతల పరిస్థితిపై ఎన్డీయే భాగస్వామ్య పక్షం ఎల్‌జేపీ(రాం విలాస్) చీఫ్, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. యథేచ్ఛగా కొనసాగుతున్న నేరాలను ఆపలేని నితీశ్ ప్రభుత్వానికి మద్దతిస్తున్నందుకు ఆయన విచారం వ్యక్తం చేశారు. నేరాలను అడ్డుకోవడంలో విఫలమైన సర్కారు వాటిని దాచేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఆయన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో కలకలం రేపాయి. శనివారం గయాలో జరిగిన పార్టీ ర్యాలీలో ప్రసంగం సందర్భంగా జిల్లాలో చోటుచేసుకున్న గ్యాంగ్ రేప్ ఘటనను ప్రస్తావిస్తూ పైవ్యాఖ్యలు చేశారు. ఈ ఘటనకు కారకులైన వారిని అరెస్ట్ చేసినప్పటికీ, ఇటువంటి ఘోరాలను నివారించడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమయిందన్నారు. హత్యలు, దోపిడీలు, కిడ్నాప్‌లు, అత్యాచారాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయన్నారు. పోలీసు యంత్రాంగం నేరగాళ్లకు దాసోహమంటోందని విమర్శించారు. అదేవిధంగా, తనను బాంబులతో చంపేందుకు కుట్ర జరుగుతోందంటూ మరోమారు చిరాగ్ ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో పరిస్థితి ప్రమాదకరంగా తయారైందని, ప్రభుత్వం మేలుకోవాల్సిన సమయమొచ్చిందని తెలిపారు.

రాష్ట్ర రాజకీయాల్లోకి వస్తా: ఎన్నికలయ్యాక ఏర్పాటయ్యే కొత్త ప్రభుత్వం 'బిహార్ ఫస్ట్–బిహారీ ఫస్ట్'లక్ష్యంతో పనిచేస్తుందని, నేరగాళ్లను కటకటాల్లోకి నెడుతుందని హామీ ఇచ్చారు. అభివృద్ధి చెందిన రాష్ట్రాలతో సమానంగా బిహార్ ఉండాలన్నదే తన లక్ష్యమన్నారు. ఇప్పటికే మూడు పర్యాయాలు ఎంపీగా పనిచేసినందుకు ఢిల్లీలో ఉంటే తన లక్ష్యం నెరవేరదని తెలుసుకున్నానని చెప్పారు. అందుకే, కేంద్ర రాజకీయాలను వదిలి రాష్ట్రానికి రావాలనుకుంటున్నానని, ఈ విషయంలో తుది నిర్ణయం పార్టీయే తీసుకుంటుందని చిరాగ్ తెలిపారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీ నూటికి నూరు శాతం ఫలితాలను సాధించిందని, అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇదే ఒరవడిని కొనసాగించాలని భావిస్తున్నామన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో స్వయంగా పోటీ చేస్తానంటూ ప్రకటించిన చిరాగ్..తనకు సీఎం కుర్చీపై ఎటువంటి మోజు లేదని ఇప్పటికే చెప్పారు. ప్రతిపక్ష ఆర్జేడీపైనా ఆయన విరుచుకుపడ్డారు. ఆ పార్టీ నేరగాళ్లను పోషిస్తూ విభజన రాజకీయాలకు పాల్పడుతోందన్నారు. ముస్లింల ఓట్లు తమవేనంటూ ఆర్జేడీ గొప్పగా చెప్పుకుంటోందని, తమ పార్టీకి కూడా సొంత ఓటు బ్యాంకు ఉందని చిరాగ్ అన్నారు. బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికార ఎన్డీయేలో విభేదాలు ముదురుతున్నాయనేందుకు చిరాగ్ వ్యాఖ్యలను ఉదాహరణగా చెబుతున్నారు.

గూగుల్‌ను అనుసరిస్తూ నేరుగా మురుగుకాలువలోకి

ముంబై: సాఫీగా రోడ్డు ప్రయాణం సాగేలా దారి చూపాల్సిన గూగుల్స్ మ్యాప్స్ యాప్ ఒక్కోసారి ప్రయాణికులను కాలువల్లోకి, చిట్టడవుల చెంతకు చేరుస్తోంది. అలాంటి మరో ఘటనకు మహారాష్ట్ర వేదికైంది. గూగుల్ మ్యాప్స్‌ను అనుసరిస్తూ ఒక మహిళ కారులో వంతెన మీదుగా ప్రయాణించాల్సిందిపోయి పక్కనే ఉన్న మురుగుకాలువలోకి నేరుగా పడిపోయింది. నవీ ముంబైలోని బేలాపూర్‌లో ఒక ఆడీ కారు కాలువలో పడిన ఈ ఉదంతం శుక్రవారం అర్ధరాత్రిదాటాక ఒంటి గంటకు జరిగింది. శుక్రవారం రాత్రి మహిళ ఒంటరిగా ఆడీ కారులో నవీ ముంబైలోని ఉల్వే ప్రాంతానికి బయల్దేరారు. బేలాపూర్ వద్ద ఎదురుగా వంతెనను దాటాల్సి ఉండగా గూగుల్ మ్యాప్స్ మాత్రం పక్కకు వెళ్లాలని తప్పుడు సూచన చేసింది. ఆమె మరో ఆలోచన చేయకుండా యాప్ చెప్పిన దారిలోనే కారును ముందుకు పోనిచ్చారు. హఠాత్తుగా దారి కాస్త మురుగుకాల్వగా మారింది. బేలాపూర్ పెద్ద కాల్వలో కారు పడిపోవడంతో ఆమె కాపాడండంటూ హాహాకారాలు మొదలెట్టారు. స్థానికుల సమాచారంతో మెరైన్‌సెక్యూరిటీ బృంద సభ్యులు రంగంలోకి దిగి పడవలో వెళ్లి ఆమెను కాపాడారు.

ఎన్‌సీఈఆర్‌టీ ప్రత్యేక పాఠంగా 'ఆపరేషన్ సిందూర్'

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌పై విద్యార్థులకు ఉపయోగకరంగా ఉండేలా ప్రత్యేక పాఠం తయారు చేయాలని ఎన్‌సీఈఆర్‌టీ భావిస్తోంది. ఇందులో మన దేశ భద్రతా వ్యూహం, సంబంధిత వివిధ విభాగాలు, శాఖల స్పందన, దౌత్యపరమైన స్పందన వంటివి ఉంటాయి. ఈ స్పెషల్ క్లాస్‌రూం మాడ్యూల్ 8 నుంచి 10 పేజీల వరకు ఉంటుంది. ఇది రెండు భాగాలుగా ఉంటుంది. మొదటి భాగంలో 3 నుంచి 8వ తరగతి చదివే విద్యార్థులకు, రెండో భాగాన్ని 9 నుంచి 12వ తరగతుల విద్యార్థులకు ఉద్దేశించనుంది. ఆపరేషన్ సిందూర్‌పై సోమవారం నుంచి లోక్‌సభ వారంపాటు చర్చించనుండటం తెల్సిందే.

మన ఐటీ పార్కు.. బెంగళూరు, హైదరాబాద్‌కు వెళ్లిపోతోంది

అజిత్ పవార్ వ్యాఖ్యలు వైరల్

పుణె: పుణెలోని హింజెవాడి ఐటీ పార్కు బెంగళూరు, హైదరాబాద్‌కు వెళ్లిపోతోందంటూ మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ ఆగ్రహంతో చేసిన వ్యాఖ్యల వీడియో కలకలం రేపుతోంది. పింప్రి చించ్‌వాడీలోని హింజెవాడీలో శనివారం ఉదయ 6 గంటలకే ఆయన చేరుకున్నారు. స్థానిక ఇబ్బందులను ఆయన అడిగి తెల్సుకున్నారు. డ్యాములు కడుతుండటంతో ఆలయాలు మునిగిపోతున్నాయని సర్పంచి గణేశ్ జంభూల్కర్ తెలపగా తీవ్రంగా స్పందించారు. 'మనం నాశనమవుతున్నాం. హింజెవాడిలోని ఐటీ పార్కు మొత్తం మహారాష్ట్రను విడిచి బెంగళూరుకు, హైదరాబాద్‌లకు తరలిపోతోంది. ఇవేమీ మీరు పట్టించుకోరా?' అంటూ వ్యాఖ్యానించారు. హింజెవాడీ ఐటీ పార్కులో 800కు పైగా బడా టెక్, వ్యాపార సంస్థలున్నాయి.

ఎదురు కాల్పుల్లో ముగ్గురు నక్సల్స్ మృతి

గుమ్లా: జార్ఖండ్‌లోని గుమ్లా జిల్లాలో శనివారం పోలీసులతో జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు చనిపోయారు. సీపీఐ(మావోయిస్టు)నుంచి విడిపోయిన జార్ఖండ్ జన ముక్తి పరిషత్(జేజేఎంపీ) మావోయిస్టులు సంచరిస్తున్నారన్న నిఘా వర్గాల సమాచారంతో భద్రతా బలగాలు ఘాఘ్రా పోలీస్‌స్టేషన్ పరిధిలోని లావాదాగ్ ప్రాంతాన్ని చుట్టుముట్టాయి. ఈ సందర్భంగా ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఘటనలో చనిపోయిన ముగ్గురిలో ఒకరిని ఘాఘ్రాలోని బెలగాడకు చెందిన దిలీప్ లోహ్రా(32)గా గుర్తించారు. ఘటనా స్థలి నుంచి ఒక ఏకే–47, రెండు ఇన్సాస్ రైఫిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కాల్పులు జరుపుతూ తప్పించుకున్న ఇద్దరు మావోయిస్టుల కోసం గాలింపు కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు.

స్థానిక సంస్థలు మండల పరిషత్

01 బల్వంత్‌రాయ్ మెహతా కమిటీ సూచనల మేరకు ఆంధ్రప్రదేశ్‌లో రెండో అంచె లేదా మధ్యస్థ స్థాయి అంచెగా పంచాయతీ సమితిని ఏర్పాటు చేశారు.

02 1986లో పంచాయతీ సమితి వ్యవస్థను రద్దు చేసి, వాటి స్థానంలో మండల పరిషత్ వ్యవస్థను ప్రవేశపెట్టారు. ఈ మండల పరిషత్ వ్యవస్థ 1987 నుంచి అమల్లోకి వచ్చింది.

03 అంతకుముందున్న పంచాయతీ సమితులనే మండల పరిషత్తులుగా తక్కువ వైశాల్యంతో విడగొట్టారు.

04 73వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీ వ్యవస్థకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించారు.

05 73వ రాజ్యాంగ సవరణకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1994లో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టాన్ని రూపొందించింది.

06 1986లో రూపొందించిన మండల పరిషత్ చట్టంలోని నియమాలే తర్వాతి సవరణలు చేయనంత వరకు వర్తిస్తాయి.

మండల పంచాయతీని ఒక్కో రాష్ట్రంలో ఒక్కో పేరుతో పిలుస్తున్నారు. గుజరాత్, కర్ణాటకల్లో 'తాలూకా పంచాయతీ' అని, మధ్యప్రదేశ్‌లో 'జన్‌పథ్ పంచాయతీ', తమిళనాడులో 'పంచాయతీ సంఘ్', అరుణాచల్‌ప్రదేశ్‌లో 'అంచల్ కమిటీ', ఉత్తరప్రదేశ్‌లో 'క్షేత్ర పంచాయతీ', ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో 'మండల పరిషత్' అని వ్యవహరిస్తున్నారు.

నిర్మాణం

మధ్య స్థాయిలో గల స్థానిక సంస్థే 'మండల పరిషత్'. ఇది స్థానిక సంస్థలకు సంబంధించి జనాభా, భౌగోళిక ప్రాతిపదికన విభజించిన భాగం. సాధారణంగా పరిపాలనా సౌలభ్యం కోసం జిల్లాను మండలాలుగా విభజిస్తారు. అవి రెవెన్యూ పరంగా ఉంటాయి. కాబట్టి వాటిని రెవెన్యూ మండలాలు అంటారు. జిల్లాల్లో రెవెన్యూ మండల సరిహద్దులు, మండల పరిషత్ సరిహద్దులు ఒకే విధంగా ఉంటాయి. అయితే నగరాల్లో మాత్రం రెవెన్యూ మండలాల సంఖ్యకు, మండల పరిషత్‌ల సంఖ్యకు సంబంధం ఉండదు. నగరాల్లో రెవెన్యూ మండలాలు ఉంటాయి. కానీ, మండల పరిషత్తులు ఉండకపోవచ్చు.

మండల పరిషత్‌లో సభ్యులు

- మండల పరిషత్ సభ్యులు
- కో–ఆప్టెడ్ సభ్యులు
- హోదా రీత్యా సభ్యులు
- శాశ్వత ఆహ్వానితులు
- ప్రత్యేక ఆహ్వానితులు
- మండల పరిషత్ అధ్యక్షుడు/ఉపాధ్యక్షుడు



- మండల పరిషత్ అభివృద్ధి అధికారి
- మండల మహాసభ

ఎంపీటీసీ

మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల సభ్యు(ఎంపీటీసీ)లను నేరుగా ఓటర్లు ఐదేళ్ల వ్యవధికి ఎన్నుకుంటారు. వీరి ఎన్నిక పార్టీ పరంగా జరుగుతుంది. సుమారు 3 వేల నుంచి 4 వేల జనాభా కలిగిన ప్రాంతాలను ఎంపీటీసీ స్థానాలుగా ఏర్పాటు చేస్తారు. ఒక మండలంలో కనిష్ఠంగా 7 ఎంపీటీసీ స్థానాల నుంచి గరిష్ఠంగా 23 స్థానాల వరకు ఉంటాయి.

- **కో- ఆప్టెడ్ సభ్యులు:** మైనారిటీ వర్గానికి చెందిన ఒక సభ్యుడిని తమకున్న ఎంపీటీసీ స్థానాలను బట్టి ఆయా పార్టీలు కో–ఆప్టెడ్ సభ్యుడిగా ఎన్నుకుంటాయి.
- **హోదా రీత్యా సభ్యులు:** సంబంధిత మండలంలో పూర్తిగా లేదా పాక్షికంగా తమ నియోజకవర్గ పరిధి విస్తరించి ఉన్న విధానసభ సభ్యుడు, లోక్‌సభ సభ్యుడు, ఆ మండలంలో ఓటరుగా నమోదైన రాజ్యసభ సభ్యుడు హోదా రీత్యా మండల పరిషత్‌లో సభ్యులుగా ఉంటారు. వీరికి మండలాధ్యక్షుడు, ఉప మండలాధ్యక్షుడి ఎన్నికల్లో ఓటు వేసే అధికారం ఉండదు.
- **శాశ్వత ఆహ్వానితులు:** పై సభ్యులే కాకుండా మండల పరిషత్ సమావేశాలకు శాశ్వత ఆహ్వానితులుగా కింద పేర్కొన్నవారు హాజరవుతారు. వీరికి ఎలాంటి ఓటింగ్ హక్కులు ఉండవు.
  - జిల్లా కలెక్టర్
  - మండల పరిషత్ పరిధిలోని గ్రామ పంచాయతీ సర్పంచులు
  - జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు
  - జిల్లా పరిషత్ చైర్మన్
  - జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్
- **ప్రత్యేక ఆహ్వానితులు:** సంబంధిత మండల పరిషత్తులోని ఏదైనా రంగంలో విశేష అనుభవం ఉన్న వ్యక్తులను మండల పరిషత్ అధ్యక్షుడితో సంప్రదించి ప్రత్యేక ఆహ్వానితులుగా పిలవొచ్చు.

మండల పరిషత్ అధ్యక్ష/ఉపాధ్యక్షులు

మండల పరిషత్‌కు అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఉంటారు. ఎంపీటీసీ సభ్యులు పార్టీ ప్రాతిపదికపై వీరిని ఎన్నుకుంటారు. వీరి పదవీ కాలం ఐదేళ్లు.

- **తొలగింపు, రాజీనామా:** అవిశ్వాస తీర్మానం ద్వారా మండలాధ్యక్షుడిని, ఉప మండలాధ్యక్షుడిని తొలగించవచ్చు. అవిశ్వాస తీర్మానం నోటీసుపై మొత్తం సభ్యుల్లో 50 శాతం సభ్యులు సంతకాలు చేసి ఆ నోటీసును సంబంధిత రెవెన్యూ డివిజన్ అధికారికి ఇవ్వాలి. మొత్తం సభ్యుల్లో మూడింట రెండు వంతులకు తగ్గని మెజారిటీతో తీర్మానాన్ని ఆమోదిస్తే వారు తొలగింపునకు గురవుతారు. ఈ ప్రక్రియలో ఎన్నికైన సభ్యులు (ఎంపీటీసీలు) మాత్రమే పాల్గొంటారు. అయితే ఎన్నికైన మొదటి నాలుగేళ్లలో అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించేందుకు అవకాశం లేదు. రాష్ట్ర ప్రభుత్వం కూడా వీరిని అధికార దుర్వినియోగం, అవినీతి కారణాలపై తొలగించవచ్చు.
- మండల పరిషత్ అధ్యక్షుడు తన రాజీనామా పత్రాన్ని మండల పరిషత్‌కు సమర్పిస్తారు. అలా కాని పక్షంలో జిల్లా పంచాయతీ కార్యనిర్వహణ అధికారికి సమర్పిస్తారు.

ఎంపీడీవో - అధికార విధులు

మండల పరిషత్ ముఖ్య కార్య నిర్వహణాధికారే మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో). వీరిని రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుంది. గ్రూప్–1 సర్వీసుకు చెంది ఉంటారు.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ పాలిటీ

చట్టపరమైన విధులు

- మండల పరిషత్ సమావేశాల ఏర్పాటు, అజెండా తయారుచేయడం.
- మండల పరిషత్ చేసిన తీర్మానాలను అమలు చేయడం. దీంతో పాటు మండలాల్లో జరిగే వివిధ అభివృద్ధి కార్యక్రమాలను పర్యవేక్షిస్తారు.
- గత సమావేశం నుంచి 90 రోజుల్లోపు మరొక సమావేశం ఏర్పాటు చేయకపోతే ఎంపీడీవోపై క్రమశిక్షణ చర్య తీసుకుంటారు.
- మండల పరిషత్ సమావేశానికి హాజరై చర్చలో పాల్గొనవచ్చు. ఓటు వేయడానికి, తీర్మానాలను ప్రతిపాదించడానికి హక్కు లేదు. మండల పరిషత్‌కు బడ్జెట్‌ను తయారుచేసి జిల్లా పరిషత్ ఆమోదానికి పంపాలి.
- మండల పరిషత్ పరిపాలన నివేదికను తయారుచేసి మండల పరిషత్ ఆమోదానికి పంపుతారు.

పరిపాలనాధికారాలు

మండల పరిషత్‌లో పనిచేసే సిబ్బందిపై పరిపాలనా నియంత్రణ ఉంటుంది. నెలకు కనీసం 2 పర్యాయాలు గ్రామాల్లో బస చేయాలి. అలాగే నెలకు 16 రోజులు మండల పర్యటన చేయాలి. షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డ్ తెగలు, బీసీ హాస్టళ్లను తనిఖీ చేసే అధికారం ఉంటుంది.

విద్యా సంబంధిత అధికారాలు

- మండల పరిషత్ పాఠశాలలకు సెక్రటరీ, కరస్పాండెంట్‌గా ఉంటారు. మండల విద్యా కమిటీకి వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. మండల పరిధిలోని టీచర్ల బదిలీల్లో మెంబర్‌గా వ్యవహరిస్తారు.
- గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తారు.
- మండలంలో జరిగే గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు అన్నీ ఎంపీడీవో పర్యవేక్షణ, నియంత్రణలో ఉంటాయి.

మండల మహాసభ

మండల పరిషత్‌కు మండల మహాసభ సలహాపూర్వక అంగంగా వ్యవహరిస్తుంది. మండల పరిషత్తు పరిధిలో గ్రామ పంచాయితీ సర్పంచ్‌లు, మండల పరిషత్తు సభ్యులు ఉంటారు. దీని సమావేశాలకు మండల పరిషత్ అధ్యక్షుడు అధ్యక్షత వహిస్తారు. మండల మహాసభ.. మండల పరిషత్తుకు సంబంధించిన వార్షిక బడ్జెట్, ఆడిట్ నివేదిక, గత సంవత్సర వార్షిక బడ్జెట్, గత ఏడాది వార్షిక పరిపాలనా నివేదిక మొదలైన అంశాలను చర్చిస్తుంది. మండల పరిషత్తుకు, గ్రామాల మధ్య వారధిగా జిల్లా పరిషత్తు పనిచేస్తుంది.

మండల పరిషత్తు అధికార విధులు

- సమాజ అభివృద్ధికి సంబంధించిన అన్ని కార్యక్రమాలను మండల పరిషత్ అమలు చేస్తుంది.
- వ్యవసాయ రంగంలో అధికోత్పత్తిని సాధించేందుకు రైతులకు నాణ్యమైన విత్తనాల సరఫరా, గొట్టపు బావుల తవ్వకం, రుణ సదుపాయాలు, ఎరువుల పంపిణీ వంటి చర్యలు చేపడుతుంది.
- గ్రామీణ వైద్యశాలలు, తాగునీటి సౌకర్యాలను కల్పిస్తుంది.
- ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్య, కుటీర పరిశ్రమలు, మహిళా, శిశు సంక్షేమం, సాంఘిక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుంది.

ఆదాయ మార్గాలు

మండల పరిషత్‌కు కింది పద్ధతుల్లో ఆదాయం సమకూరుతుంది.

- రాష్ట్ర ప్రభుత్వ భూమి శిస్తు, పన్నుల్లో వాటా
- రిజిస్ట్రేషన్ శాఖ ఆస్తి బదిలీలపై వేసే 2 శాతం సర్‌చార్జీలను గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్‌లకు 3:1:1 నిష్పత్తిలో పంపిణీ చేస్తారు.
- లఘు ఖనిజాలపై కొంత సీనరేజ్ రుసుం పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్తులకు 25:50:25 నిష్పత్తిలో పంపిణీ అవుతుంది. అలాగే, ఇసుకపై వచ్చే సీనరేజ్ రుసుంను కూడా పై నిష్పత్తిలోనే పంపిణీ చేస్తారు.
- వినోదపు పన్నులో 90% శాతాన్ని గ్రామ పంచాయతీ, మండలాలకు 60:40 నిష్పత్తిలో కేటాయిస్తారు.
- సామాజిక అభివృద్ధి గ్రాంట్లు
- గ్రామ పంచాయతీలకు లెవీ ద్వారా వచ్చే వసూళ్లు.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే నిధులు.
- అఖిల భారత సంస్థలు విడుదల చేసే సహాయక గ్రాంట్లు

విద్య, ఉద్యోగ సమాచారం

ఆర్‌బీఐ, చండీగఢ్‌లో మెడికల్ కన్సల్టెంట్ పోస్టులు

చండీగఢ్‌లోని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఒప్పంద ప్రాతిపదికన బ్యాంక్స్ మెడికల్ కన్సల్టెంట్(బీఎంసీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్, పీజీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** డాక్యుమెంట్ వెరిఫికేషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును మెయిన్ ఆఫీస్ బిల్డింగ్ డిస్పెన్సరీ, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెంట్రల్ విస్టా, సెక్టార్–17, చండీగఢ్ –160017 చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 06.08.2025.
» **వెబ్‌సైట్:** https://rbi.org.in

ఇంటెలిజెన్స్ బ్యూరోలో 3,717 పోస్టులు

ఇంటెలిజెన్స్ బ్యూరో(ఐబీ) అసిస్టెంట్ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ గ్రేడ్–2/ఎగ్జిక్యూటివ్ పోస్టులకు గ్రూప్–సి(నాన్ గెజిటెడ్, నాన్ మినిస్టీరియల్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 3,717.
» **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి ఉండాలి.
» **వయసు:** 10.08.2025 నాటికి 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.44,900 నుంచి రూ.1,42,400+ఇతర అలవెన్సులు.
» **ఎంపిక విధానం:** టైర్–1, టైర్–2, ఇంటర్వ్యూలో వచ్చిన మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.

పరీక్ష విధానం

» **టైర్–1:** మొత్తం 100 మార్కులకు ఆబ్జెక్టివ్ విధానంలో పరీక్ష ఉంటుంది. కరెంట్ అఫైర్స్, జనరల్ స్టడీస్, న్యూమరికల్ ఆప్టిట్యూడ్, లాజికల్ రీజనింగ్, ఇంగ్లిష సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు వస్తాయి. నెగిటివ్ మార్కింగ్ ఉంటుంది. పరీక్ష సమయం 60 నిమిషాలు.
» **టైర్–2:** మొత్తం 50 మార్కులకు డిస్క్రిప్టివ్ విధానంలో ఎస్సె(20 మార్కులు), ఇంగ్లిష్ కాంప్రహెన్షన్(10 మార్కులు), రెండు లాంగ్ ఆన్సర్ టైప్ ప్రశ్నలకు 10 మార్కుల చొప్పున (20 మార్కుల)కు పరీక్ష ఉంటుంది. పరీక్ష సమయం 60 నిమిషాలు.
» **టైర్–3:** ఇంటర్వ్యూ 100 మార్కులకు నిర్వహిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఫీజు చెల్లించడానికి చివరితేది:** 12.08.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**10.08.2025
» **వెబ్‌సైట్:** https://cdn.digialm.com

ఎముకల్లో ఫాస్ఫరస్ ఏ రూపంలో ఉంటుంది?

ఎముకల్లోని ఫాస్ఫరస్ గాలిలో మండి కాంతిని వెదజల్లుతుంది. ఈ దృగ్విషయాన్ని 'ఫాస్ఫారిసెన్స్' అంటారు. శ్మశానాల్లో రాత్రిపూట దెయ్యాలుగా భ్రమపడే మంటలకు కారణమిదే. గాలిలో మండే స్వభావం ఉండటం వల్ల దీన్ని నీటిలో నిల్వ చేస్తారు. దీనికి వెల్లుల్లి వాసన ఉంటుంది. ఇది విష పదార్థం.



టెట్/డీఎస్సీ ప్రత్యేకం
రసాయన శాస్త్రం

ఫాస్ఫరస్

ఆవర్తన పట్టికలో నైట్రోజన్ కుటుంబం (Vవ గ్రూప్)లోని రెండో మూలకం ఫాస్ఫరస్ (భాస్వరం). ఇది చతుర్ పరమాణుక అణువు. ఫాస్ఫరస్ అత్యంత చురుకైన మూలకం. ఎముకల దృఢత్వానికి కాల్షియంతో పాటు ఫాస్ఫరస్ కూడా అత్యంత ప్రధానమైనది. ఎముకలో 50 శాతం వరకు కాల్షియం ఫాస్ఫేట్ ఉంటుంది. ఫాస్ఫరస్ రంగు లేని మైనం లాంటి మెత్తని ఘన పదార్థం. దీనికి గాలిలో మండే స్వభావం ఉంటుంది.

ఒక మూలకం ఒకటి కంటే ఎక్కువ భౌతిక రూపాల్లో లభించడాన్నే 'రూపాంతరత (Allotropy)' అంటారు. ఫాస్ఫరస్‌కు ఎర్ర భాస్వరం, తెల్ల (పసుపు) భాస్వరం, ఎరుపు (స్కార్లెట్) భాస్వరం, నల్ల భాస్వరం, ఊదారంగు భాస్వరం అనేవి రూపాంతరాలు. వీటిలో ఎర్ర, తెల్ల భాస్వరాలు ప్రధానమైనవి. ఈ రూపాంతరాలన్నింటికీ ఒకే రసాయన ధర్మాలుంటాయి. కానీ, వేర్వేరు భౌతిక ధర్మాలుంటాయి. వీటిలో తెల్ల భాస్వరం విషపూరితం, గాలిలో మండుతుంది. దీనికి వెల్లుల్లి వాసన ఉంటుంది. ఎర్ర భాస్వరం గాలిలో మండదు, విష రహితం, వాసన లేనిది.

ఉపయోగాలు:

- తెల్ల భాస్వరాన్ని ఎలుకలను చంపడానికి, బాంబులు, పేలుడు పదార్థాల తయారీలో, అగ్గిపెట్టెల పరిశ్రమలో ఉపయోగిస్తారు.
- ఫాస్ఫర్ బ్రాంజ్ అనేది రాగి (కాపర్), తగరం (టిన్), ఫాస్ఫరస్‌ల మిశ్రమం.
- ఫాస్ఫరస్ విరివిగా ఉపయోగపడే పరిశ్రమల్లో అగ్గిపెట్టెల పరిశ్రమ ఒకటి. సురక్షితమైన అగ్గిపుల్ల (Safety Matches) తలలో పొటాషియం క్లోరేట్, ఆంటిమొనీసల్ఫైడ్, బంకమన్ను ఉంటుంది. అగ్గిపెట్టె పక్కభాగంలో ఎర్ర భాస్వరం, ఆంటిమొనీ సల్ఫైడ్‌తోపాటు గరుకుదనం కోసం గాజుపొడి ఉంటుంది. అగ్గిపుల్ల గీసినప్పుడు, పెట్టె పక్క భాగంలో ఉండే ఎర్ర భాస్వరం మండి అగ్గిపుల్ల చివరన ఉన్న ఆంటిమొనీ సల్ఫైడ్‌ను మండిస్తుంది. కావలసిన ఆక్సిజన్ 'పొటాషియం క్లోరేట్' నుంచి లభిస్తుంది.
- ఫాస్ఫీన్, ఫాస్ఫారికామ్లాల తయారీలో ఫాస్ఫరస్‌ను ఉపయోగిస్తారు.
- ఫాస్ఫారికామ్లాన్ని పులుపు లాంటి ఒక రకమైన రుచి కోసం శీతల పానీయాల్లో కలుపుతారు.
- ఫాస్ఫరస్ సమ్మేళనమైన 'ఫాస్ఫీన్'ను 'హోల్మె సంకేతాల్లో' (Holme's Signals) ఉపయోగిస్తారు. నావికులు కాల్షియం కార్బైడ్, కాల్షియం ఫాస్ఫైడ్ ఉన్న డబ్బాలకు రంధ్రాలు చేసి సముద్రంలోకి విసిరేస్తారు. ఆ సమ్మేళనాలు నీటితో చర్య జరపడం వల్ల విడుదలయ్యే ఎసిటలీన్, ఫాస్ఫీన్ వాయువులు మండి సంకేతాలుగా పని చేస్తాయి.

మాదిరి ప్రశ్నలు

1. ఒక మూలకం ఒకటి కంటే ఎక్కువ భౌతిక రూపాల్లో ఉండటాన్ని ఏమంటారు?
   1) రూపాంతరత
   2) విద్రావణీయత
   3) స్ఫటికీకరణం
   4) అంశికీకరణం
2. కిందివాటిలో ఫాస్ఫరస్ రూపాంతరం కానిది ఏది?
   1) తెల్ల ఫాస్ఫరస్ 2) ఎర్ర ఫాస్ఫరస్
   3) నల్ల ఫాస్ఫరస్ 4) ఫాస్ఫీన్
3. అగ్గిపుల్లల తయారీలో ఉపయోగించే ఫాస్ఫరస్ ఏది?
   1) తెల్ల ఫాస్ఫరస్ 2) నల్ల ఫాస్ఫరస్
   3) ఎర్ర ఫాస్ఫరస్ 4) పచ్చ ఫాస్ఫరస్
4. ఎలుకలను చంపడానికి ఉపయోగించే పదార్థం ఏది?
   1) ఎర్ర భాస్వరం 2) తెల్ల భాస్వరం
   3) నల్ల భాస్వరం 4) పచ్చ భాస్వరం
5. చీకట్లో భాస్వరం (ఫాస్ఫరస్)ను ఉంచితే నెమ్మదిగా గాలిలో మండి మెరుస్తుంది. ఈ ప్రక్రియను ఏమంటారు?
   1) ఫ్లోరోసెన్స్ 2) ఫాస్ఫారిసెన్స్
   3) ప్లాస్టిసెన్స్ 4) ఉత్పతనం
6. భాస్వరాన్ని ఎందులో నిల్వ ఉంచుతారు?
   1) గాలి 2) కిరోసిన్
   3) నీరు 4) క్లోరోఫాం
7. కిందివాటిలో చీకట్లో మెరిసే పదార్థం ఏది?
   1) నైట్రోజన్ 2) ఫాస్ఫరస్
   3) సిలికాన్ 4) కార్బన్
8. కిందివాటిలో బాహ్యాణుక స్వభావం కలిగినది ఏది?
   1) పచ్చ భాస్వరం 2) ఎర్ర భాస్వరం
   3) స్కార్లెట్ భాస్వరం
   4) నైట్రోజన్
9. వెల్లుల్లి వాసన కలిగిన మూలకం ఏది?
   1) కార్బన్ 2) సల్ఫర్
   3) సోడియం 4) ఫాస్ఫరస్
10. ఫాస్ఫరస్ సంబంధ పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల దవడ ఎముకలు నశిస్తాయి. ఈ వ్యాధిని ఏమంటారు?
   1) ఫాసీజా 2) ఫ్లోరోసిస్
   3) ఫాస్ఫారిసెస్ 4) కీలోసిస్
11. పొగల తెరల (Smoke Screen)లో ఉపయోగించే సమ్మేళనం ఏది?
   1) ఫాస్ఫారికామ్లం
   2) సల్ఫ్యూరికామ్లం
   3) ఫాస్ఫీన్ 4) అమ్మోనియా
12. శీతల పానీయాల్లో వాడే ఆమ్లం ఏది?
   1) హైడ్రోక్లోరికామ్లం
   2) ఫాస్ఫారికామ్లం
   3) నైట్రికామ్లం
   4) సల్ఫ్యూరికామ్లం
13. నావికులు సముద్రంలో వారి ఉనికిని తెలపడానికి ఉపయోగించే 'హోల్మె సంకేతాల్లో' వాడే సమ్మేళనం ఏది?
   1) కాల్షియం సల్ఫేట్
   2) కాల్షియం ఫాస్ఫేట్
   3) కాల్షియం ఫాస్ఫైడ్
   4) ఫాస్ఫరస్ పెంటాక్సైడ్
14. కిందివాటిలో అగ్గిపెట్టె పక్క భాగంలో ఉండని పదార్థం ఏది?
   1) ఎర్ర భాస్వరం
   2) ఆంటిమొని సల్ఫైడ్
   3) గాజుపొడి
   4) పొటాషియం క్లోరేట్
15. కిందివాటిలో ఫాస్ఫరస్ లభించే పదార్థం ఏది?
   1) గుడ్డు సొన 2) ఎముక మజ్జ
   3) మెదడు 4) పైవన్నీ
16. అగ్గిపెట్టెల పరిశ్రమల్లో ప్రధానంగా వాడే మూలకం ఏది?
   1) తెల్ల భాస్వరం 2) ఎర్ర భాస్వరం
   3) నల్ల భాస్వరం
   4) స్కార్లెట్ భాస్వరం
17. అగ్గిపుల్లను గీసినప్పుడు జరిగే ప్రక్రియ?
   1) పెట్టె పక్క భాగంలోని ఎర్ర భాస్వరం మండుతుంది
   2) అగ్గిపుల్ల చివరలోని ఆంటిమొనీ సల్ఫైడ్‌ను మండిస్తుంది
   3) కావలసిన ఆక్సిజన్‌ను పొటాషియం క్లోరేట్ అందిస్తుంది
   4) పైవన్నీ
18. అగ్గిపుల్ల తలభాగం పొటాషియం క్లోరేట్, ఏ పదార్థ మిశ్రమంతో పూత పూసి ఉంటుంది? *(గ్రూప్–2, 2012)*
   1) అల్యూమినియం ట్రై క్లోరైడ్
   2) ఆంటిమొనీ ట్రై సల్ఫైడ్
   3) బిస్మత్ నైట్రేట్
   4) అల్యూమినియం ఫాస్ఫేట్
19. ఫాస్ఫరస్ పెంటాక్సైడ్ (P_2O_5) నీటిలో కరిగి ఏర్పరిచే ఆమ్లం ఏది?
   1) ఫాస్ఫారికామ్లం
   2) పైరో ఫాస్ఫారికామ్లం
   3) ఫాస్ఫరస్ ఆమ్లం
   4) మెటా ఫాస్ఫారికామ్లం
20. ఎలుకలను చంపడానికి ఉపయోగించే విష పదార్థం ఏది?
   1) జింక్ ఫాస్ఫేట్
   2) కాల్షియం ఫాస్ఫేట్
   3) జింక్ ఫాస్ఫైడ్
   4) కాల్షియం ఫాస్ఫైడ్
21. వ్యవసాయంలో ఉపయోగించే ఏ రసాయనాల్లో నైట్రోజన్, భాస్వరం, పొటాషియం ఎక్కువగా ఉంటాయి?
   1) ఎరువులు 2) పురుగు మందులు
   3) హెర్బిసైడ్‌లు 4) ఏదీకాదు
22. సూపర్ ఫాస్ఫేట్ ఆఫ్ లైమ్ అనేది ఒక..?
   1) నత్రజని ఎరువు
   2) ఫాస్ఫాటిక్ ఎరువు
   3) పొటాషియం ఎరువు
   4) కాల్షియం ఎరువు
23. ఎముకల్లో ఫాస్ఫరస్ ఏ రూపంలో ఉంటుంది?
   1) కాల్షియం ఫాస్ఫైడ్
   2) కాల్షియం ఫాస్ఫేట్
   3) కాల్షియం ఫాస్ఫైట్
   4) సోడియం ఫాస్ఫేట్
24. కిందివాటిలో రసాయన ఎరువుల్లో ఉండని మూలకం ఏది? *(గ్రూప్–2, 2008)*
   1) నైట్రోజన్ (N)
   2) ఫాస్ఫరస్ (P)
   3) పొటాషియం (K)
   4) క్లోరిన్ (Cl)
25. బేకింగ్ పరిశ్రమల్లో బేకింగ్ పౌడర్‌తోపాటు, పిండిని గుల్లగా చేయడానికి ఉపయోగించే పదార్థం ఏది?
   1) ఫాస్ఫారికామ్లం
   2) కాల్షియం డై హైడ్రోజన్ ఫాస్ఫేట్
   3) కాల్షియం ఫాస్ఫేట్
   4) కాల్షియం ఫాస్ఫైడ్
26. పంటి 'ఎనామిల్'లో ఉండే పదార్థం ఏది?
   1) కాల్షియం హైడ్రాక్సీ ఎపటైట్
   2) కాల్షియం డై హైడ్రోజన్ ఫాస్ఫేట్
   3) కాల్షియం ఫ్లోరైడ్
   4) ఏదీకాదు
27. మానవ శరీరంలో కాల్షియం తర్వాత అత్యధికంగా ఉండే ఖనిజం ఏది?
   1) సల్ఫర్ 2) ఫాస్ఫరస్
   3) సిలికాన్ 4) సెలినియం
28. మానవ శరీరంలో ఫాస్ఫరస్ ఏ భాగంలో ఉంటుంది?
   1) ఎముకలు 2) దంతాలు
   3) కణజాలం 4) పైవన్నీ
29. శరీరంలో విటమిన్ 'బి' సమర్థ వినియోగానికి అవసరమైన మూలకం ఏది?
   1) ఫాస్ఫరస్ 2) సెలినియం
   3) ఐరన్ 4) మెగ్నీషియం
30. పళ్లపై గారను తొలగించి వాటిని తెల్లగా చేయడానికి ఉపయోగించే ఆమ్లం ఏది?
   1) హైడ్రోక్లోరికామ్లం
   2) నైట్రికామ్లం
   3) సల్ఫ్యూరికామ్లం
   4) ఫాస్ఫారికామ్లం
31. వాంతిని అరికట్టే ఔషధాల తయారీలో ఉపయోగించే ఆమ్లం ఏది?
   1) ఫాస్ఫారికామ్లం
   2) నైట్రికామ్లం 3) కార్బోనికామ్లం
   4) ఎసిటికామ్లం

సమాధానాలు

1) 1; 2) 4; 3) 3; 4) 2; 5) 2; 6) 3; 7) 2; 8) 2; 9) 4; 10) 1; 11) 3; 12) 2; 13) 3; 14) 4; 15) 4; 16) 2; 17) 4; 18) 2; 19) 1; 20) 3; 21) 1; 22) 2; 23) 2; 24) 4; 25) 2; 26) 1; 27) 2; 28) 4; 29) 1; 30) 4 31) 1.

నానో మిషన్ ప్రధాన లక్ష్యం ఏమిటి?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

సైన్స్ అండ్ టెక్నాలజీ

టెక్నాలజీ మిషన్

ప్రాంతాలు, సామాజిక వర్గాలకు అతీతంగా టెక్నాలజీ అభివృద్ధి ఫలాలను దేశంలోని ప్రజలందరికీ వేగంగా అందించాలనే లక్ష్యంతో రూపొందించిన కార్యక్రమమే Technology Mission. భారత ప్రభుత్వం 1986లో తొలిసారి టెక్నాలజీ మిషన్ విధానాన్ని రూపొందించి అమలు చేసింది. తర్వాత కాలంలో ఎదురైన సవాళ్లను దృష్టిలో పెట్టుకొని ఎప్పటికప్పుడు టెక్నాలజీ మిషన్‌లో కొత్త లక్ష్యాలను చేర్చుతోంది.

టెక్నాలజీ మిషన్ ప్రధాన లక్ష్యాలు

- ఆహార ధాన్యాలు, పప్పు దినుసులు, నూనె గింజల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించడం. దిగుమతులను తగ్గించేందుకు చర్యలు. అధిక దిగుబడి ఇచ్చే వంగడాలను వృద్ధి చేయడం ద్వారా ఫలాలు, కూరగాయలు, పుష్పాల ఉత్పత్తిని పెంచి ఉద్యానవన రంగాన్ని అభివృద్ధి చేయడం.
- జమ్ము- కశ్మీర్, ఈశాన్య రాష్ట్రాల్లో నిరుద్యోగ సమస్యను అధిగమించడానికి ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించడం. అత్యాధునిక ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్ టెక్నాలజీ (ICT) ద్వారా దేశవ్యాప్తంగా ఉన్నత, సాంకేతిక విద్యా ప్రమాణాలను పెంపొందించడం.
- గ్రామీణ ప్రాంతాల్లో కనీస మౌలిక సదుపాయాలైన.. తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య సేవలు, రోడ్ల నిర్మాణం వంటి వాటిని అభివృద్ధి పరచడం.
- దేశవ్యాప్తంగా 85% అక్షరాస్యత సాధన.
- ప్రాథమిక వైద్య కేంద్రాలు, వైద్య వాలంటీర్లు, మొబైల్ మెడికల్ యూనిట్స్, టీకాలు, శిశు వైద్యం వంటి వాటిని గ్రామీణ ప్రాంతాలకు త్వరితగతిన విస్తరించి గ్రామీణ ప్రాంత ఆరోగ్య భద్రతను పెంపొందించడం.
- శీతోష్ణస్థితి మార్పుల వల్ల తలెత్తే వ్యవసాయ, తాగునీటి, ఆరోగ్య రంగ సవాళ్లను దృష్టిలో పెట్టుకొని వాటికి అనుగుణంగా కార్యక్రమాలను అమలు చేయడం.
- శక్తి భద్రతను సాధించే దిశలో పునర్వినియోగ శక్తి వనరులను; ముఖ్యంగా సౌర శక్తిని అభివృద్ధి చేయడం, శక్తి సామర్థ్యాన్ని పెంపొందించడం.
- నానో టెక్నాలజీపై పరిశోధనలను ప్రోత్సహిస్తూ ఆరోగ్య, నిర్మాణ, శక్తి రంగాల్లో అత్యాధునిక పరికరాలను అందుబాటులోకి తీసుకురావడం.

జాతీయ సైన్స్ విధానం

శాస్త్ర, సాంకేతిక రంగాల పురోగతి ద్వారానే దేశ సామాజిక, ఆర్థిక ప్రగతి సాధ్యమవుతుంది. భావి భారత్‌కు సైన్స్, టెక్నాలజీలు మూల స్తంభాల వంటివని తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పేర్కొన్నారు. ఇందులో భాగంగా స్వాతంత్ర్యానంతరం ఈ రంగంలో అనేక కార్యక్రమాలను అమలు చేయడంతోపాటు జాతీయ సైన్స్ విధానాన్ని విడుదల చేశారు.

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో త్వరితగతిన అభివృద్ధి సాధించేందుకు ఒక జాతీయ విధానం అవసరం . దీన్ని గుర్తించిన నాటి కేంద్ర ప్రభుత్వం 1958లో తొలిసారి జాతీయ సైన్స్ తీర్మానాన్ని ప్రకటించింది. ఆ తర్వాత అవసరాలు, ఎదురైన సవాళ్ల దృష్ట్యా ఈ విధానంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. ఫలితంగా ప్రభుత్వం 1983, 2003ల్లో నూతన టెక్నాలజీ పాలసీ స్టేట్‌మెంట్‌లను ప్రకటించింది. దేశంలో సైన్స్, టెక్నాలజీలను ప్రోత్సహించడంలో నవీకరణ ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకొని 2013లో Science & Technology, Innovation (STI) విధానాన్ని తీసుకొచ్చింది.

లక్ష్య సాధన-ప్రభుత్వ చర్యలు

1958 నాటి సైన్స్ విధాన తీర్మానంలో శాస్త్ర సాంకేతిక రంగం, మానవ వనరులు, సహజ వనరుల అభివృద్ధి కోసం ఒక జాతీయ విధానం అవసరమని గుర్తించారు. ఇందులో భాగంగా ప్రభుత్వం సైన్స్ విద్యను ప్రోత్సహించడం, ఉన్నత ప్రమాణాలు కలిగిన శాస్త్రవేత్తలు, పరిశోధకులను అందుబాటులోకి తీసుకురావడం, స్త్రీ పురుషులను సమానంగా ప్రోత్సహించడం, వ్యవసాయ సంరక్షణ, మానవ వనరుల శిక్షణ వంటి లక్ష్యాలను ప్రభుత్వం నిర్దేశించుకుంది. వీటి సాధనకు వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో పెట్టుబడులను పెంచింది.

పారిశ్రామిక రంగ అభివృద్ధి ద్వారా దేశ వ్యాప్తంగా ఉద్యోగ అవకాశాలు లభించినా బలహీన వర్గాల్లో నిరుద్యోగ సమస్య కూడా పెరిగింది. హరిత విప్లవం ద్వారా ఆహార భద్రత పెరిగింది. అయితే దాన్ని వర్షాధార ప్రాంతాల్లో విస్తరించకపోవడం వల్ల కరువు తీవ్రత అధికమైంది. శక్తి డిమాండ్లను ముందుగా అంచనా వేయడంలో కూడా ఆలస్యం జరిగింది. కానీ, పునర్వినియోగ వనరుల ప్రాధాన్యతను ప్రభుత్వం గుర్తించింది.

ఈ రకమైన సవాళ్లను అధిగమించడం, పర్యావరణాన్ని పరిరక్షించడంతోపాటు సంప్రదాయ విజ్ఞానాన్ని, దేశీయ టెక్నాలజీని అభివృద్ధి చేసే లక్ష్యంతో ప్రభుత్వం 1983లో సరికొత్త టెక్నాలజీ పాలసీ స్టేట్‌మెంట్‌ను విడుదల చేసింది. ఇందులో భాగంగా తక్కువ పెట్టుబడితో అధిక అభివృద్ధికి తోడ్పడే టెక్నాలజీ రూపకల్పన, పర్యావరణ పరిరక్షణ, సంప్రదాయ నైపుణ్య ప్రోత్సాహం, పునర్వినియోగ శక్తి వనరుల అభివృద్ధి వంటి లక్ష్యాల సాధనకు అనేక కార్యక్రమాలను నిర్వహించింది. ఇన్‌శాట్, ఐఆర్ఎస్ వ్యవస్థల అభివృద్ధి, కరువు నివారణ కార్యక్రమాల అమలు, పర్యావరణ పరిరక్షణ చట్ట రూపకల్పన వంటి వివిధ చర్యలను చేపట్టింది.

జాతీయ సైన్స్ విధానం-2003

సైన్స్ అండ్ టెక్నాలజీ అభివృద్ధి ద్వారా ఆహార భద్రత పెరిగినప్పటికీ పోషణ భద్రత ఆశించినంతగా సాధించకలేకపోయాం. శీతోష్ణస్థితి మార్పు సమస్యలు పెరిగి విపత్తులు పెరిగాయి. మేధోసంపత్తి హక్కుల ప్రాధాన్యతను కూడా దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం 2003లో కొత్త సైన్స్ విధానాన్ని విడుదల చేసింది. ఆయా అంశాలను అంతర్జాతీయ స్థాయిలో ప్రోత్సహిస్తే మినహా దేశీయ టెక్నాలజీ డిమాండ్‌ను చేరుకోలేమన్న భావన ఉంది. దీన్నే 2013లో సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్



విధానానికి ప్రేరణగా చెప్పవచ్చు. 2020 నాటికి ప్రపంచ శాస్త్ర, సాంకేతిక రంగాల్లో తొలి ఐదు దేశాల సరసన భారత్‌ను నిలబెట్టడం, దేశ జీడీపీలో పరిశోధనల అభివృద్ధి వ్యయాన్ని 2 శాతానికి పెంచడం, ఐదేళ్లలో దేశంలోని శాస్త్రవేత్తలను 66 శాతానికి పెంచడం వంటివి 2013 STI విధాన ప్రధాన లక్ష్యాలు.

Nano Science & Technology Mission (Nano Mission)

దేశ సామాజిక, ఆర్థిక ప్రయోజనాల్లో భాగంగా నానో టెక్నాలజీ అభివృద్ధిని ప్రోత్సహించే లక్ష్యంతో 2007 మేలో కేంద్ర ప్రభుత్వం Nano-Science & Technology Missionను ప్రారంభించింది. సీఎన్ఆర్ రావు అధ్యక్షుడిగా ఉన్న నానో మిషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఈ మిషన్ అమలవుతోంది. ఇందులో భాగంగా సలహాదారు సంస్థలైన Nano Science Advisory Technology Advisory Group (NSAG), Nano Applications and Technology Advisory Group (NATAG)లు టెక్నికల్ కార్యక్రమాలను అమలు చేస్తాయి.

నానో మిషన్ - ప్రధాన లక్ష్యాలు

- పదార్థాన్ని ప్రాథమిక స్థాయిలో అర్థం చేసుకొని నానోమీటర్ స్థాయిలో దాన్ని వినియోగించేందుకు కృషి చేయడం.
- నానో టెక్నాలజీ అభివృద్ధికి కావాల్సిన Transmission Electron Microscope (TEM), Scanning Probe Microscope (SPM), Optimal Tweezer వంటి పరికరాలను అభివృద్ధి చేయడం.
- నానో టెక్నాలజీ అభివృద్ధికి పబ్లిక్-ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం.
- ఈ రంగంలో నిష్ణాతులైన మానవ వనరులను అందుబాటులోకి తేవడంతోపాటు నానో క్రిస్టల్స్, నానో ట్యూబ్స్ అభివృద్ధికి కృషి చేయడం.

నిర్వహించిన కార్యక్రమాలు

అమెరికా, జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ, రష్యా, జపాన్ వంటి దేశాలతో నానో టెక్నాలజీ అభివృద్ధికి ఉద్దేశించిన సహకార కార్యక్రమాలను ప్రారంభించారు.

చెన్నైలో Nano Functional Material Technology Centre (NFMTC) ఏర్పాటు చేశారు. సెరామిక్స్ ఉత్పాదనలో అవసరమయ్యే నానో క్రిస్టలైన్ ఆక్సైడ్ పౌడర్స్, కార్బన్ నానో ట్యూబ్స్‌ను అభివృద్ధి చేశారు.

టైర్ ఇంజనీరింగ్‌లో ఉపయోగపడే హై పర్ఫార్మెన్స్ రబ్బరు నానో కాంపోజిట్స్ అభివృద్ధి. మొహాలి, హైదరాబాద్, బెంగళూరు, కోల్‌కతాల్లో Institute of Nano Science and Technologyలను ఏర్పాటు చేశారు.

సైన్స్ విధానం (2003) - వ్యూహాలు

దేశంలోని శాస్త్రవేత్తలు, పరిశోధకులను సైన్స్ అండ్ టెక్నాలజీ రంగ అభివృద్ధికి ఉద్దేశించిన ప్రణాళికల్లో భాగస్వాములను చేయడం. ముఖ్యంగా సామాజిక, ఆర్థిక ప్రగతికి ఉద్దేశించిన సైన్స్ విధానాలు కార్యక్రమాల రూపకల్పనలో దేశంలోని ప్రధాన పరిశోధనా సంస్థలు, కేంద్రాలను తప్పనిసరిగా భాగస్వామ్యం చేయాలి. వివిధ ప్రాంతాల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేసేలా కార్యక్రమాలను రూపొందించాలి. విశ్వవిద్యాలయాలు, R&D యూనిట్‌లు, అన్ని S&T వ్యవస్థలకు పూర్తి స్థాయి స్వయం ప్రతిపత్తిని కల్పించి వాటిని బలోపేతం చేయాలి. సైన్స్ అండ్ టెక్నాలజీ వ్యవస్థ అభివృద్ధికి మారుతున్న అవసరాలకు అనుగుణంగా తగిన మార్పులను ఎప్పటికప్పుడు తీసుకురావాలి. సైన్స్ ఆధారిత మంత్రిత్వ శాఖలు, విభాగాలన్నింటినీ సైంటిస్టులు, టెక్నాలజిస్టుల ఆధ్వర్యంలో నడిచే విధంగా చూడాలి. వీటితోపాటు సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఉన్నత స్థాయి సాంకేతిక సలహా కమిటీలను ఏర్పాటు చేయాలి. ఉన్నత విద్య, S&T అభివృద్ధికి బడ్జెట్‌లో అధిక కేటాయింపులు ఉండాలి. GDPలో 2% మేర S&T రంగంలో పెట్టుబడులను పెంచాలి. అదే విధంగా పారిశ్రామిక రంగం కూడా R&D విభాగంపై పెట్టుబడులను పెంచాల్సిన అవసరం ఉంది. ఈ రకమైన చర్యల ద్వారా దేశ సామాజిక, ఆర్థిక అభివృద్ధి లక్ష్యాలను చేరుకోవచ్చు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశవ్యాప్తంగా డిజిటల్ అక్షరాస్యతను సాధించే లక్ష్యంతో 2014 ఆగస్టు 21న జాతీయ డిజిటల్ లిటరసీ మిషన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి డిజిటల్ సాక్షరత అభియాన్ (DISHA) అని నామకరణం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ అక్షరాస్యతను విస్తరించడంతోపాటు సమాచార సాంకేతికత ద్వారా గ్రామీణుల్లో సాధికారత సాధించడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యం. ఇందులో భాగంగా అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, రేషన్ డీలర్లతో పాటు సుమారు 52.5 లక్షల మందికి ఐటీ శిక్షణ అందించనున్నారు.

దేశంలోని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఈ మిషన్ అమల్లో ఉంటుంది. జనాభా ప్రాతిపదికన రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను 3 విభాగాలుగా విభజించి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. 14 నుంచి 60 ఏళ్లలోపు డిజిటల్ నిరక్షరాస్యులు అంతా ఈ కార్యక్రమం కింద శిక్షణ పొందవచ్చు. డిజిటల్ లిటరసీ మిషన్‌లో అందించే ఐటీ శిక్షణకు ఉద్దేశించిన ట్రైనింగ్ మెటీరియల్‌ను నాస్కామ్ ఫౌండేషన్ అభివృద్ధి చేసింది. Basics of Digital Literacy కరిక్యులంను ఏడు మాడ్యుల్స్‌గా విభజించారు. అవి..

1. పవర్ ఇన్ యువర్ హ్యాండ్స్
2. ఇంటర్నెట్
3. ఇ-మెయిల్ అండ్ సోషల్ మీడియా
4. ఉపయోగిత సమాచారం
5. ప్రభుత్వం
6. ఈ- కామర్స్
7. ఐటీ సెక్యూరిటీ

ఈ కార్యక్రమానికి ఇంటెల్, మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి సంస్థల నుంచి సహకారం లభించింది. కాగ్నిజెంట్ టెక్నాలజీ వంటి సంస్థలకు చెందిన వాలంటీర్లు.. ట్రైనింగ్ కంటెంట్‌ను స్థానిక భాషల్లోకి అనువదించడంలో కీలకపాత్రను పోషించారు.

What does CAMPA Stand for?



పోటీ పరీక్షల ప్రత్యేకం

Banking Awareness

1. Recently, the Union Finance Ministry launched India Aspiration Fund (IAF) to boost start-ups in India. Who will be the partner and co-investor in the IAF?
a) LIC b) SIDBI
c) NABARD d) RBI
e) SEBI
2. State Bank of India on 18 August 2015 launched a mobile wallet app, SBI Buddy, in collaboration with Accenture and ?
a) Visa b) Paytm
c) Paypal d) Mastercard
e) Maestro
3. In context with banking, a Certificate of Deposit is ___
a) Money Market Instrument
b) Negotiable Instrument
c) Transferable instrument
d) All of above e) None
4. The maturity of Treasury Bills in India is always less than ____
a) 91 Days b) 182 Days
c) 365 Days d) 730 Days
e) 425 Days
5. Which of the following is/are salient features of Treasury Bills?
a) They have zero default risk
b) They are highly liquid
c) No tax is deducted at source
d) All of above
e) None of these
6. Who has been appointed as CMD of India Trade Promotion Organisation (ITPO)?
a) R J Mishra b) L K Jha
c) Pradeep Kharola d) Anil Goswami
e) None of these
7. Which one of the following is an example for Long Term Investment Option?
a) Fixed deposit
b) Money market
c) Public provident fund
d) Saving accounts
e) None of these
8. Which of the following is not the quantitative tool of the Reserve Bank of India (RBI)?
a) OMO b) Reserve ratios
c) Rationing of credit
d) Statutory Pre-emption
e) None of these
9. In which year, Insurance Regulatory and Development Authority (IRDA) was constituted?
a) 1999 b) 1998 c) 1997
d) 1996 e) 1992
10. Which Insurance policy gives holder the benefits of both Insurance and Investment?
a) Term Insurance Policies
b) Money-back Policies
c) Unit-linked Investment Policies
d) Pension Policies
e) None of these
11. Which of the following banks has been declared by Reserve Bank of India (RBI) as Domestic Systemically Important Banks (D- SIBs)?
a) HDFC and ICICI
b) ICICI and SBI
c) SBI and HDFC
d) PNB and SBI
e) HDFC and SBI
12. Recently, the Government of India (GoI) launched e-payment module to deposit compensatory levies into CAMPA Funds. What does CAMPA Stand for?
a) Compensatory Affordable Fund Management and Planning Authority
b) Compensatory Affectable Fund Management and Planning Authority
c) Compensatory Affectation Fund Management and Planning Authority
d) Compensatory Afforestation Fund Management and Planning Authority
e) None of these
13. Which of the following banks recently launched "Smart Vault" digital locker facility?
a) SBI b) HDFC c) PNB
d) NABARD e) ICICI
14. Union Government has recently notified the merger of commodities market regulator Forward Markets Commission (FMC) with?
a) SEBI b) IDBI c) NABARD
d) All of the above
e) None of the above
15. Which of the following is used by RBI for sterilization of the Capital Inflows?
a) Base Rate System
b) CRAR Obligations
c) Open Market Operations
d) Credit Authorization Scheme
e) None of these
16. In India, Infrastructure Debt Fund can be established as a Trust or a company. Which of the following regulated the Infrastructure Debt Fund set up as a trust?
a) SEBI b) RBI c) IRDA
d) Ministry of Corporate Affairs
e) IFCI
17. How do we label the risk of collapse of an entire financial system or entire market?
a) Seismic Risk
b) Systemic Risk
c) Systematic Risk
d) Market Risk e) None of these
18. How many parties primarily involved in a Promissory Note?
a) Two b) Three c) Four
d) Five e) six
19. Which Union Ministry launched the Smart National Common Mobility Card (NCMC), recently?
a) Ministry of Railways
b) Ministry of Home Affairs
c) Ministry of Foreign Affairs
d) Ministry of Urban Development
e) None of these
20. Which of the following banks launched the "IndPay" mobile app service recently?
a) Indian Bank b) Dena Bank
c) Punjab National Bank
d) Karnataka Bank e) Axis Bank
21. What is the minimum net owned fund (NOF) mandatory for a Infrastructure Finance Company (IFC) in India?
a) Rs. 200 Crore
b) Rs. 300 Crore
c) Rs. 500 Crore
d) Rs. 100 Crore
e) Rs. 400 Crore
22. When two or more distinct insurance policies combined into a single contract, it is known as
a) CMO b) Package Policy
c) Mortgage Insurance
d) Micro Insurance
e) None of these
23. When a promissory note or bill of exchange has been dishonoured by non-acceptance or non-payment, the holder may, within a reasonable time, cause such dishonour to be noted and certified by ___
a) Notary b) Magistrate
c) Collector of that region
d) All true e) None of these
24. For what purpose, a web-based Portal "Vidya Lakshmi" has been launched by Union Government?
a) Direct subsidy for farmers
b) Women Empowerment
c) Home loans
d) Educational Loans
e) None o f these
25. The National Payments Corporation of India (NPCI) has announced the nationwide e-payment literacy workshop. Who among the following is the present chairman of the NPCI?
a) Jyotsna Suri
b) umit Mazumder
c) M Balachandran
d) All of the above
e) None of these
26. What is sold and purchased during Open Market Operations by RBI?
a) Government Securities
b) Commercial Papers
c) Certificates of Deposits
d) Global Depository Receipts
e) None of these
27. Which of the following is not a type of mutual fund?
a) Open-ended scheme
b) Closed-ended scheme
c) Long forward scheme
d) Exchange-traded funds
e) None of these
28. Headquarters of State Bank of Mysore is located at?
a) Hyderabad b) New Delhi
c) Mumbai d) Bangalore
e) Karnataka
29. RBI takes "Prompt Corrective Action" when a bank is faced to?
a) Market Risk b) Credit Risk
c) Liquidity Risk
d) Low Capital Adequacy
e) None of these
30. Which of the following bank's head office is not located in New Delhi?
a) Punjab National bank
b) Punjab and Sind bank
c) Bank of India
d) Bharatiya Mahila Bank
e) None of these

KEY

1) a; 2) d; 3) d; 4) c; 5) d;
6) c; 7) c; 8) c; 9) a; 10) c;
11) b; 12) d; 13) b; 14) a; 15) c;
16) a; 17) b; 18) a; 19) d; 20) a;
21) b; 22) b; 23) a; 24) d; 25) c;
26) a; 27) c; 28) d; 29) d; 30) c.

Non-Banking Financial Company (NBFC)

A Non-Banking Financial Company (NBFC) is a company

a) Registered under the Companies Act. 1956,

b) Its principal business is lending, investments in various types of shares/stocks/bonds /debentures/securities, leasing, hire-purchase, insurance business, chit business

c) Its principal business is receiving deposits under any scheme or arrangement in one lump sum or in installments.

However, a Non-Banking Financial Company does not include any institution whose principal business is agricultural activity, industrial activity, trading activity or sale/-purchase/construction of immovable property. (Section 45 I (c) of the RBI Act, 1934) .

One key aspect to be kept in view is that the financial activity of l-oans/advances as stated in 45 I (c), should be for activity other than its own. In the absence of this provision, all companies would have been NBFCs.

NBFCs whose asset size is of Rs.100 cr or more as per last audited balance sheet are considered as systemically important NBFCs.

The rationale for such classification is that the activities of such NBFCs will have a bearing on the financial stability in our country.

The Reserve Bank of India regulates and supervises Non-Banking Financial Companies which are into the business of (i) lending (ii) acquisition of shares, stocks, bonds, etc., or (iii) financial leasing or hire purchase.

The Reserve Bank has been given the powers under the RBI Act 1934 to register, lay down policy, issue directions, inspect, regulate, supervise and exercise surveillance over NBFCs that meet the 50-50 criteria of principal business.

The Reserve Bank can penalize NBFCs for violating the provisions of the RBI Act or the directions or orders issued by RBI under RBI Act. The penal action can also result in RBI cancelling the Certificate of Registration issued to the NBFC, or prohibiting them from accepting deposits and alienating their assets or filing a winding up petition.

RBI tightened Tier 1 capital requirements and said NBFCs would need to hold capital levels of at least of Rs 1 crore ($162,668) by the end of March 2016 and Rs 2 crore by March-end 2017 to avoid losing their right to operate.

The country's apex bank also said only certain investment-grade NBFCs would be allowed to take deposits, saying the firms would have until the end-March 2016 to acquire a credit rating. RBI capped deposit-taking at 1.5 times the size of a firm's minimum capital - down from four times previously.

NBFCs lend and make investments and hence their activities are akin to that of banks; however there are a few differences as given below:

i. NBFC cannot accept demand deposits;

ii. NBFCs do not form part of the payment and settlement system and cannot issue cheques drawn on itself;

iii. deposit insurance facility of Deposit Insurance and Credit Guarantee Corporation is not available to depositors of NBFCs, unlike in case of banks.